ప్రపంచ సాహిత్యం-20

మౌలానా జలాలుద్దీన్ రూమి



# మస్నవి

(అలౌకిక ద్విపదలు - మొదటి భాగం)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-20

## మౌలానా జలాలుద్దీన్ రూమి

# మస్నవి-1

# 'అలౌకిక ద్విపదలు'

డాక్టర్ లంకా శివరామప్రసాద్

మౌలానా జలాలుద్దీన్ రూమి

# మస్నవి-1

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

February 2015

All rights reserved

Copyright @ 2015
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

**E-book: www.kinige.com**

Price : ₹ **200 $ 4**

Cover Design &
Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

*In the name of God the compassionate, the merciful*

***This book is presented to...***

ఈ రచనకు ఆధార గ్రంథం

**The Mathnavi of Maulana Jalaloddin-i-Rumi**

**జలాల్ అల్-దిన్ మహమ్మద్ బాల్ఖి**

Jalal al-Din Muhammad Balkhi

**Mathnavi/Manavi/Mathnawi/Masnavi/Masnavi-1**

**అలౌకిక ద్విపదలు**

(Rhyming couplets of profound spiritual meaning)

*Translated & Edited by:*

**Prof. Reynold A. Nicholson**

**Dr. Saim Kayadibi**

# ప్రస్తావన

నేను జూన్, 2014 సంవత్సరంలో టర్కీ వెళ్లాను. ఇస్తాంబుల్ చూసాక, కప్పడోకియాలోని దేవతల చిమ్నీలు, భూగర్భ నగరాల్ని దర్శించి పాముక్కలే (పత్తికొండ)కు వెళ్లే దారిలో టర్కీ ధాన్యాగారమైన పవిత్ర నగరం 'కోన్యా' (Konya) పట్టణంలో మెల్వానా (మౌలానా) జలాలుద్దీన్ రూమీ (1207-1273) నివసించిన ప్రాంతాన్ని చేరుకున్నాను. అతడి అనుయాయులను (Dancing Dervishes) - గుండ్రంగా తిరుగుతూ భగవంతుని ప్రార్థించేవారు - అంటారు.

జలాలుద్దీన్ రూమి 30 సెప్టెంబరు 1207 నాడు బాల్క్ (ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్)లో జన్మించినాడు. అతడి పూర్తిపేరు మహమ్మదు జలాలుద్దీన్. ఖుదా వెండిగర్ (దేవుని సర్వవ్యాపకతను బోధించేవాడు); మౌలానా-మెల్వానా (గురువు); రూమి (రోమన్ ప్రాంతం వాడు) - అనేవి ఇతర పేర్లు.

తల్లి (ముమైన్ ఖాటూన్), తండ్రి (బహాయుద్దీన్ వాలాద్) ఇద్దరూ జ్ఞానులుగా ప్రసిద్ధికెక్కినారు. అతడి తండ్రిని సుల్తాన్-ఉల్-ఉలామా Sultan of Scholars అని పిలిచేవారు. మౌలానా భార్య గౌహర్ ఖాతూన్. ఇద్దరు కుమారులు బహయెద్దిన్ మహమ్మద్, అల్లాడిన్ మహమ్మదు.

1229లో కరామన్ నుంచి కొన్యాకు చేరుకుని 17 డిశంబరు 1273లో కన్నుమూసిన మౌలానా ముఖ్య రచనలు- మస్నవి, దివాని కబీర్, ఫిహి-మా-ఫిహి, మజాలిస్-ఐ-సబా; మక్తుబత్ (ఉత్తరాలు)-మకతిబ్.

దాదాపు 25000 ద్విపదలు (50,000 పంక్తులు)న్న ఈ కావ్యం- మస్నవి- ఆరు సంపుటాలుగా ఉండి- సూఫీ సాధువులకు దేవుని ప్రేమలో ఎలా ఐక్యం చెందాలనే ఆధ్యాత్మిక సిద్ధాంతాన్ని ఎంతో అందంగా బోధిస్తుంది. రూమి చెబుతుంటే హసమ్ అల్-దిన్ చలాబి గ్రంథస్థం చేసాడు.

మొదటి రెండు పుస్తకాలు (సంపుటాలు)- దైహిక బంధాల గురించి, మూడు, నాలుగు పుస్తకాలు- జ్ఞానం గురించి; అయిదు, ఆరు పుస్తకాలు దేవునిలో ఐక్యమయ్యే మార్గాల గురించి వివరిస్తాయి.

ఈ ఆరు పుస్తకాలను తెలుగులోకి అనువదించి సృజనలోకం తెలుగు సాహిత్యలోకానికి సవినయంగా సమర్పిస్తున్నది.

**- డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# అలౌకిక ద్విపదలు
## (మథ్నవి, మస్నవి)

ఈ పుస్తకం మన పవిత్ర మతవృక్షపు వేళ్ల కొసలకు చేరుకుని అంతర్గత నిబిడ ధర్మరహస్యాలను నిర్దుష్టంగా చెబుతుంది. ఈ సత్యాన్వేషణలో దైవశాస్త్రాన్ని దైవమార్గాన్ని, దైవ దర్శనాన్ని మనం ఖచ్చితంగా పొందగలం.

ఉదయసంధ్యా కాంతులకన్నా ప్రకాశవంతంగా వెలిగే దీపమిది. అనేక జలధారలు, ఫలపుష్పభరిత వృక్షాలు, మొక్కలు, తీవెలున్న హృదయపు స్వర్గ ఉద్యానవనమిది. దైవమార్గాన పురోగమిస్తున్న యాత్రికులకు ఉత్తేజాన్నిచ్చే సల్సాబిల్ (Salsabil) జలధారలా ఈ పుస్తకం (మథ్నవి) ఓ సుందర, మార్మిక, మజిలీ. సన్మార్గులకు స్వచ్ఛమైన జలాలున్న ఈజిప్టు నైలునదిలా సహయాత్రికుని వంటిది. అపనమ్మకస్తులకు, ఫారో చక్రవర్తి అనుచరులకు ఇది దుర్గమ మార్గం. ఇది దుఃఖ ప్రక్షాళనం, వ్యాధి పీడితులకు ఔషధం, పవిత్రగ్రంథ వ్యాఖ్యానం, పలు నిధినిక్షేప మందసం, మనోవ్యాకుల నివారణం, మహా పండిత హస్తనిర్మితం. పవిత్రులే తాకగలిగిన జ్ఞానగ్రంథం. దైవదృక్కులచే పరివేష్ఠితమైన ఈ పుస్తకాన్ని అసత్యవాదులు ఏ మూలనుంచీ కూడా స్పృశించలేరు. అత్యంత దయాశీలి, కరుణామయుడు అయిన భగవానుడే దీని సంరక్షకుడు. ఈ పుస్తకానికున్న అనేక పేర్లకు అతడే రక్ష.

మథ్నవి (మస్నవి) అనే నామాన్ని ఈ గ్రంథానికివ్వడంలో ఉద్దేశం– ఒక్క మెతుకును పట్టిచూచి అన్నం వుడికిందో లేదో చెప్పగలిగినట్లు, ఒక్క పుక్కెడు జలాన్ని రుచిచూసి సరస్సు నీటి లక్షణాన్ని వ్యాఖ్యానించినట్లు, పిడికెడు గోధుమల్ని చేతబట్టి ధాన్యపు రాశి వాసిని అంచనా వేసినట్లు– ఈ 'అలౌకిక ద్విపదలు' (మస్నవి) భగవానుడు మనకు కరుణతో ప్రసాదించిన దైవ జ్ఞానసంపదను దర్శించి తరించడానికి ఉపయోగపడుతుందని మాత్రమే!

అత్యున్నతుడైన ఆ భగవానుని కరుణాదృష్టిని సదా కాంక్షించే ఈ సేవకుడు– బాల్ఖి ప్రాంతపు అల్–హుసేన్ కుమారుడు మహమ్మదు కుమారుడు మహమ్మదు– దేవునికి వినమ్రంగా సమర్పిస్తున్న కానుక ఈ పుస్తకం. ఈ అలౌకిక ద్విపదలలో అనేక వింత వింత కథల్ని, చాటువుల్ని, పెద్దల నీతి వాక్యాల్ని

ఇమిడ్చి జ్ఞానులు, యోగులు నడిచిన పవిత్ర మార్గాన్ని సత్యాన్వేషణలో, ఆధ్యాత్మికానంద మార్గావలంబులైన యాత్రికులకు సుందరవనాన్ని కొలది పదాల్లో, విస్తృత అర్థాన్ని నిమిడ్చి ఇస్తున్నాను. నాకీ జ్ఞానాన్ని అందించి, అన్ని కాలాలందునా నా హృదయంలో నివసించి నాకు తోడునీడగా ఉండిన గురువు మిత్రుడు షేఖ్ (Shaykh)–దైవసేవికుడు, మానవతావాది. దేవునిచే ఎన్నిక చేయబడిన జ్ఞాని, దైవ రహస్య నిధి ప్రాంతానికి తాళంచెవి ఇవ్వబడినవాడు. నిగూఢ జ్ఞాన నిక్షేప నిధులకు ‘ధర్మకర్త, సత్యధర్మ పరిరక్షణా ఖడ్గధారి, అల్–హసన్ కుమారుడు మహమ్మద్ కుమారుడు హసన్–ఇబిన్ అఖి తుర్క్ – సిద్ధిఖ్ వంశోద్భవుడు – ఉర్మియా నివాసి – దేవుడు ఈ వంశాన్ని అనుగ్రహించును గాక! ‘సాయంకాలం నేను కుర్దు (Kurd)ను, ఉదయం అరబ్బును (Arab) అని పలికిన ఈ ధీమతిని భగవానుడు ఆశీర్వదించును గాక!

సూర్యకిరణాచ్ఛాదిత వంశ ప్రతిష్ఠ, తారలే చిన్నబోయిన వంశకీర్తి కలిగిన, అఖండ భోగభాగ్యాలతో విలసిల్లుతూ, అత్యున్నతుడైన దేవునికి అత్యంత విధేయులైన ఈ కుటుంబ కీర్తి కాంతులు తారా సూర్యులున్నంత వరకు ప్రకాశించును గాక! దైవసృష్టిలోని అన్ని జీవులూ, ప్రజలూ సుఖశాంతుల నుండెదరు గాక!

ఆమెన్! ఓ జగన్నిర్మాణప్రభూ! ఈ ప్రార్థనను అంగీకరించుము. అందరినీ కూడిన ఈ స్తోత్రాన్ని స్వీకరించుము. దేవుడు అందరినీ ఆశీర్వదించును గాక! అందరిని, అన్నిటినీ సృష్టించిన ఆ భగవానుడు తన సృష్టిలో అత్యంత విలువైన, ప్రసిద్ధుడైన, ఉన్నతుడైన, సచ్ఛరిత్రుడైన మహమ్మదును ఆశీర్వదించును గాక!

✣✣✣✣✣

**అత్యంత దయాశీలి, కరుణామయుడైన దేవుని స్మరిస్తూ**

**In the name of God the compassionate, the merciful**

# వెదురు కలం

## (Reed - రెల్లు, వెదురు, వేణువు)

ఎడబాటు గురించి తడబడుతూ పలుకుతున్నదా వెదురు కలం
–"తల్లి పొదనుంచి నన్ను వేరుచేసిన క్షణమే నాలో మొదలైన కలకలం
మారినదొక దుఃఖగీతమై కదిలించెను మానవహృదయం
ఎడబాటు, విరహ బాధను నే వినిపించేందుకు ఆసరా అది ఈ ఉదయం

నేను నా దుఃఖ గీతికలను వినిపించినప్పుడల్లా
ఎన్నో గొంతుకలు నిట్టూరుస్తూ వంతపాడేవి
వాళ్ల దృష్టిలో నేను హితుడిని, అంతేవాసిని, అంతే
కాని వారెవరూ నా రహస్య వేదనను శోధించరైరి.

నా మాటలు మార్మికమైనవేమీ కావు
ఆ కాంతిని గ్రహించని కళ్లూ చెవులవి.
దేహం నుంచి ఆత్మ, ఆత్మ నుంచి దేహం ముసుగుతెరతో వేరు చేయబడలేదు.
కాని ఆత్మను దర్శించడానికి ఎవరికీ అనుమతి ఇవ్వబడలేదు"–

ఆ వెదురు కలపు ధ్వని అగ్ని జ్వాలాధుని. అది చిరుగాలికాదు.
అగ్నిజ్వాల కాలేనివాడు, శూన్యుడుగా మిగిలిపోతాడు.
వెదురులో ఉన్నది ప్రేమజ్వాల, మధువులో ఉన్నది ప్రేమ భావం.
ఎడబాటుతో ఉన్న వ్యక్తి నేస్తమీ వెదురు కలం.
ఆ వెదురు కలపు గొంతు మన హృదయాలను దూసుకుపోయే అస్త్రం
వెదురులాంటి విషాన్ని, విరుగుడును ఎవరైనా చూసారా?
సానుభూతిపరుడిని, విరహప్రేమికుడిని ఎక్కడైనా కలిసారా?
(వెదురుకలం - Reed - రెల్లు, వెదురు; Pen=కలం)

వేణువు చెప్పే వెతలదారి రక్తపుమడుగు
ప్రేమికుల ఉద్వేగాల పదముద్రలే ప్రతి అడుగు.
ఇంద్రియాతీతులకు రహస్యం విప్పబడ్తుంది.
వీనులకు అసంఖ్యాకులున్నా, నాలుకకు ఒక్కరూ దొరకరు.

అకాలపు దినాల్లో కాలే దుఃఖంతో రోజులు చేస్తాయి సహవాసం
ఆరోజులు పోతేపోనీ! నీకన్నా పవిత్రుడెవడు?
చేప కానివాడికి నీళ్లు దొరుకుతాయి
చేతకాని వాడికి రోజులు భారంగా గడుస్తాయి.

పచ్చికాయకు పక్వస్థితి తెలియదు.
అందుకే నా మాటలుంటాయి సంక్షిప్తంగా! వీడ్కోలు.

కుమారా! సంకెళ్లను ఛేదించి విముక్తుడివికా!
వెండి బంగారాలకింకెన్నాళ్లు చేస్తావు వెట్టిచాకిరీ!
కుండలోకి సముద్రాన్ని కుమ్మరిస్తే ఎంత పడ్తుంది? ఒక్కరోజుకు సరిపడా!
సంతృప్తిలేని నేత్రమీ ఘటం. ఎప్పటికీ నిండదు.
తృప్తి చెందినాకే ముత్యపు చిప్ప ముత్యాలతో నిండుతుంది.
మహత్తరమైన ప్రేమ చేసిన చినుగు వస్త్రం ధరించినవాడు,
స్వార్థం, అసంతృప్తి భావనల నుంచి విడుదలౌతాడు.
ఓ ప్రేమా! నీకు జయమగుగాక! మా రుగ్మతల నిర్మూలించే వైద్యుడివి.
మా గర్వభేషజ నాశనివి. ప్లాటో, గాలెన్‌లా మా నేస్తానివి.

ప్రేమను ధరించిన దేహం ఆకాశాన విహరించగలుగుతుంది.
పర్వతాలు నృత్యం చేస్తూ పరవశిస్తాయి.
సినాయి పర్వతశిఖరపు ప్రేమాస్వాదనను అవలోకించి
మూసా ప్రవక్త (Moses) వివశుడైనాడు ఆనందంతో!

నా పెదవులతో శృతి కలిపిన వారితో
వెదురు కలంలా, వేణువులా నేను చెప్పవలసిందంతా చెబుతాను.

కాని, నా వారి నుంచి వేరుచేయబడి, పరదేశినైనపుడు
వంద పాటలున్నా పాడలేని మూగవాడినౌతాను.

గులాబీలు వాడి, తోట ఎండిపోయాక
కోయిలలు, నైటింగేలు పక్షుల పాటలుండవు.
అందరిచే ప్రేమించబడేవాడు ఆ సర్వోన్నతుడు. అతడు జీవితం.
ప్రేమికుడొక మేలిముసుగు తెర. ఓ నిర్జీవ ఘటం.
ప్రేమ విడనాడితే అతడొక రెక్కలు తెగిన విహంగం.
నా ముందు వెనకలా దేవుని కాంతి లేనపుడు
ఈ మెలకువతో నాకేమి ప్రయోజనం?
ధూళి తొలగించని అద్దంలో కనిపిస్తుందా ప్రతిబింబం?
మిత్రులారా! మన అంతఃస్థితిని తెలిపే ఈ కథను విందాం!

## రాజుగారి ప్రేమకథ

అనగా అనగా ఒక రాజ్యం. రాజర్షి ఒకడు రాజు ఆ దేశానికి ,
సభికులతో కలిసి ఓనాడు వెళ్లాడు నగర సందర్శనానికి.
రాజవీధిలో ఓ లావణ్యవతి దోచింది రాజుగారి మతి.
పంజరంలో పక్షిలా అతడి మనసు గిలగిలలాడిన పరిస్థితి.

రాజు తలుచుకుంటే డబ్బుకు కొదవా! కొనేశాడు ఆమెను వెంటనే
తనకు నచ్చినట్లుగా మలుచుకుంటున్నపుడే, జబ్బు పడిందామె.

*ఒకానొక కష్టజీవికి గాడిదుండేది, కాని జీను లేదు.*
*జీను దొరికిందని సంబరపడేసరికి, గాడిదను ఎత్తుకుపోయింది తోడేలు.*
*కుండ ఉన్నవాడికి నీళ్లు దొరకవు. నీళ్లు కనబడేసరికి కుండ పగిలినట్లు.*

రాజు తన దేశ వైద్యులందరినీ సమావేశపరచాడు.

–'మా ఇద్దరి ప్రాణాలూ ఇప్పుడు మీ చేతుల్లో ఉన్నాయి.
నా జీవితం లెఖ్ఖలోకి రాదు. కాని ఆమె నా ప్రాణానికి ప్రాణం.
నేను గాయపడి బాధతో ఉన్నాను. ఆమె నా ప్రాణౌషధం.
ఆమెను స్వస్థపరచండి. నాకున్న ముత్యాలు, పగడాలు బహుమతి పొందండి"

వాళ్లన్నారు– “మా శక్తియుక్తులన్నీ కేంద్రీకరిస్తాం.
మాలో ప్రతి ఒక్కడూ ప్రజల నాడి తెలిసినవాడే,
ప్రతి బాధకూ నివారణ, నెమ్మదీ ఇవ్వగలిగినవాడే!”–
అహంకారం, గర్వం వాళ్ల కళ్లకు పొరలు కమ్మింది.

వాళ్లు ‘దేవుడి కృపతో’ అన్నమాట అనలేదు.
అందుకే దేవుడు వాళ్ల బలహీనతను ఎరుకపరచాడు.
మనస్ఫూర్తిగా దేవుని నమ్మిన వాళ్ల మాట ఫలిస్తుంది.
పరమాత్మతో ఆత్మను సంలీనం చేసిన కాంతి కనిపిస్తుంది.

వాళ్లు ఎన్ని వైద్యాలు చేసినా అన్ని వికటించాయి.
అందాల బాలిక శిరోజాలంత సన్నగా చిక్కిపోయింది.
రాజుగారి కన్నుల నుండి రక్తాశ్రువులు నదిలా ప్రవహించాయి.
వైద్యుల మందులు రుగ్మతను అధికం చేసాయి.
ఆక్సిమెల్‌తో కామెర్లు పెరిగాయి.
ఆల్మండ్ నూనెతో చర్మం పగిలింది.
నీళ్లు నాఫ్తాలా వేడి తగిలి మండినాయి.

వైద్యులపై నమ్మకం సడలింది రాజుకు.
ఒట్టికాళ్లతో పరిగెత్తాడు మసీదుకు.
మోకరిల్లి ప్రార్థిస్తున్న రాజు కన్నీళ్లతో తడిచింది తివాచి.
దైవ ప్రార్థనతో కలిగిన పారవశ్యంతో రాజు అన్నాడు–

“సమస్త లోకాధినేతా! ప్రపంచ సామ్రాజ్యాన్ని కానుకగా ఇవ్వగలవాడవు.
నీకు నా మనసులో నిగూఢమైన కోర్కెను ఎలా నివేదించగలను?
ఆపద్బాంధవా! మరల మేము దారి తప్పినాము.
అయితే నీవన్నావు– ‘నాకు నీ కోరిక తెలియును.
దానిని నీవు ప్రత్యక్ష కార్యాచరణలో ప్రకటించుము’–
మనసులోతుల నుండి ఎలుగెత్తి పలికిననాడు
సర్వసంపదల సముద్రం ఉప్పొంగి పొంగును”–

అతడలా ప్రార్థిస్తూనే ఒరిగినాడు నిద్రలోకి,
కలలో కనిపించెనొక పవిత్రమూర్తి వృద్ధుడిగా!
“ఆశీస్సులు! రాజా! నీ ప్రార్థనలు అంగీకరించబడినవి.
రేపు ఉదయాన నా తరపున రాగలడు ఓ వ్యక్తి నీవద్దకు.
అతడు భిషగ్వరుడు. నీతిమంతుడు. శాస్త్రకోవిదుడు.
హస్తవాసి గలవాడు. దైవశక్తిసంపన్నుడు ఆ వైద్యుడు”

మరుసటి రోజు ఉదయాన్నే రాజసభలోకి వచ్చాడో వ్యక్తి
ఛాయావృత సూర్యుడిలా, నూతన చంద్రుడిలా
సన్నని ప్రకాశవంతమైన తీగెలా, అద్భుతంలా–
ఆ అద్భుత ప్రకాశవంతమైన రూపం మాయా? శూన్యమా?
ఆ శూన్యమే ప్రపంచాన్ని నడిపే ప్రకాశమా?
ఈ శాంతీ, యుద్ధాలూ, గర్వాలూ అవమానాలూ మాయకాదా?
అయితే సాధుసంతులను, దైవవనంలోని చంద్రముఖులను
కట్టిపడేసే అద్భుత మాయ అదీ ఇదీ ఒకటేనా?
వచ్చిన అపరిచిత వ్యక్తి వదనంలో ఆ అద్భుత మాయాశోభ–
గమనించిన రాజు సింహాసనం దిగి వెళ్లి ఆహ్వానించాడా అతిథిని.
ఇద్దరూ సముద్రంలో ఈదగల గజ ఈతగాళ్లే!
సూత్రంతో బంధింపబడని ఆత్మలు కలిసిన వాళ్లు.
రాజు అన్నాడు– ‘అర్థమయ్యింది. నేను ప్రేమిస్తున్నది నిన్ను, ఆమెను కాదు.
కార్యం నుంచి మరొక కార్యం సంభవించినట్లు సంఘటన
నీవు నాకు మహమ్మదువు. నేను ఉమర్ లాంటి సేవకుడిని!’

## క్రమశిక్షణా రాహిత్యపు దుష్ఫలితాలు

ఆత్మ నియంత్రణలేనివాడు దైవకృపను కోల్పోతాడు.
క్రమశిక్షణలేని వ్యక్తి తనను, తన చుట్టూ ప్రపంచాన్ని తగలబెడ్తాడు.

ఏ శ్రమా లేకుండా వడ్డించిన విస్తరి స్వర్గం నుండి వస్తున్నపుడు
అవిధేయతతో మోసెస్ ప్రజల్లో కొందరరిచారు– ‘వెల్లుల్లి, చిక్కుళ్లేవని?’

వారికి స్వర్గం నుండి వచ్చే రొట్టె, దినుసులు ఆగిపోయాయి.
అందుకే మనకు కొడవలి, గొడ్డలితో శ్రమ తప్పనిసరి అయ్యింది.

జీసస్ దేవునితో ఒడంబడిక చేసిన తరువాత
మరల స్వర్గపు వస్తువులు మనకు లభించసాగాయి.
ఎప్పుడైతే కొందరు అహంకారపూరితులై, ముష్టివాళ్లలా
దేవుడిచ్చిన ఆహారాన్ని లాక్కుని ఆరగించబోయారో
అప్పుడే మరలా కథ మొదటికి వచ్చింది.

దేవుడి దయ ఈ భూమిలో కలకాలం ఉంటుందని జీసస్ ప్రకటించినా
దైవధిక్కారులకు, ఆశబోతులకు, కృతఘ్నులకు, అనుమానస్తులకు,
దైవ ప్రసాదం దగ్గర ముష్టిమొహం పెట్టేవాళ్లకు
స్వర్గలోకపు దయావాకిలి తలుపులు తెరవబడవు.
కరుణలేని చోట వాన కురవదు.
కామపీడితులున్నచోట వ్యాధులు విస్తృతంగా విస్తరిస్తాయి.
నిర్లక్ష్యం, అహంకారాలే నీ దుఃఖానికి, పతనానికి కారణాలు.

స్నేహమార్గంలో విశృంఖలంగా చరించేవాడు
బందిపోటు దొంగ కన్నా క్రూరుడు, వాడు మనిషి కాడు.
క్రమశిక్షణ వలన ఆకాశం కాంతివంతమైనది.
క్రమశిక్షణతో దేవదూతలు స్వచ్ఛమై పవిత్రులైనారు.
నిర్లక్ష్యం వలన సూర్యుడికి గ్రహణం పట్టింది.
అవిధేయత వలన అజాజిల్ దూతకు స్వర్గచ్యుతి కలిగింది.

## రాజు కలలో కనిపించిన అతిథి వైద్యుడు

అతిథిని సాదరంగా కౌగిలించుకుని ఆహ్వానించాడు రాజు.
హృదయాన్ని, ఆత్మను ఇముడ్చుకున్న దేహపు స్పర్శ అది.
అతిథి హస్తాల్ని, కనుబొమల్ని ముద్దాడి కుశలం అడిగాడు.
–ఇన్నాళ్టికి నా ఓర్పుకు తగిన ఫలితం లభించింది.

కష్టాలను దూరం చేసే దేవుడు పంపిన కానుకా!
ఆనందానికి బీగం ఓర్పులోనే ఉన్నదా!
అన్ని ప్రశ్నలకూ సమాధానం లభించే వదనం కలవాడా!
వ్యాఖ్యానం లేకుండానే చిక్కుముడులు విప్పగలిగినవాడా!
మా ఎదలోతుల్ని తడిమి, అడుసులో దిగబడిన మాకు చేయూత నిస్తావు.

ఓ ఎన్నిక చేయబడినవాడా! నీకు స్వాగతం!
నీవు అదృశ్యమైతే విధి మమ్మల్ని వినాశనంలోకి నెడ్తుంది.
నీవు ప్రజా రక్షకుడివి. నిన్ను నమ్మిన వారికి నరకభయం లేదు.

## రాజు–అతిథి–యువతి

అతిథిదేవా! వైద్యాచార్యా! అంతఃపురానికి స్వాగతం.
ఈమె నాకిష్టురాలు! మాయదారి రోగానబడ్డ దురదృష్టవంతురాలు"

అతిథివైద్యుడు చిక్కి శల్యమైన యువతిని పరీక్షించాడు.
ఆమెకిచ్చిన ఔషధాలు రుగ్మతను అధికం చేసాయి.
వైద్యులు ఆమె అంతర్గతస్థితిని సరిగా అంచనా వేయలేదు.
నేను దేవుని ప్రార్థించి వ్యాధి రహస్యాన్ని అర్థం చేసుకుంటాను.

అతడు ఆమె బాధను గ్రహించాడు. రహస్యం కనుక్కున్నాడు.
రాజుకు చెప్పలేదు. ఎందుకంటే అది పైత్య ప్రకోపం కాదు.
పొగవాసనను బట్టి ఎండుకట్టె ఏ వృక్షానిదో చెప్పవచ్చును.
ఆమె హృదయం గాయపడింది. అది దైహిక రుగ్మత కాదు.
హృదయ వేదనను మించిన వ్యాధిలేదు.
ప్రేమ బాధించినంతగా హృదయాన్నేదీ గాయపరచలేదు.
ప్రేమవ్యాధి ప్రత్యేకమైనది. దైవసృష్టిలోని వింతల్లో వింతైనది.
ఈ లోకం నుంచైనా, స్వర్గం నుంచైనా సరే ప్రేమ మనల్ని
సుదూర తీరాలకు తీసుకునిపోతుంది.
ప్రేమపై నాలుక చేసే వ్యాఖ్యానాలు స్పష్టంగా ఉండవచ్చు,

కాని నాలుక వ్యాఖ్యానం చేయని ప్రేమ మరింత స్పష్టం, స్వచ్ఛం.
కాగితంపై గలగల కదిలే కలం, ప్రేమ ఊసెత్తేసరికే కళవళపడ్తుంది.
ప్రేమను వివరించే తెలివి ఊబిలో దిగబడ్డ గార్దభం.
ప్రేమ, ప్రేమతత్వాన్ని వివరించే ప్రేమ గాలిలో ఎగిరే విహంగం
సూర్యుడిని వర్ణించగలిగినది సూర్యుడే!
కావాలంటే తల తిప్పకుండా సూర్యుడి వేపు చూస్తూ చెప్పు!
నీడ అతడి చిహ్నం, ఆత్మకాంతి ప్రసరిస్తాడు ప్రతిక్షణం.
చీకట్లో ముచ్చట్లలా నీడ నిద్రను తెప్పిస్తుంది.
సూర్యోదయం కాగానే చంద్రుడి నిష్క్రమణం మొదలౌతుంది.
ఈ ప్రపంచంలో సూర్యుడిని మించిన వింత లేదు.
శాశ్వతుడైన ఆత్మా సూర్యుడికి నిన్నటి దినం లేదు.
సూర్యుడొక్కడే అయినా మరొక సూర్యుడిని ఊహించగలం.
బాహ్యాంతర లోకాల్లో ఆత్మాసూర్యుడి లాంటివాడు మరొకడు లేడు.
సారాంశానికే స్థలం లేని చోట అసలు వస్తువునెలా ఊహించగలం?
షంషుద్దీన్ పేరు వినగానే నాలుగవ స్వర్గపు సూర్యుడు మొహం చాటు చేసుకోలేదా!
అతడి పెరెలాగూ నా పెదాలను చేరింది కనుక
అతడి ఔన్నత్యాన్ని పలుమార్లు పొగడుతాను నేను.
ఇప్పుడు నా ఆత్మ (షంషుద్దీన్–మతసూరీడు), నా అంగీని పెరికివేసాడు.
అతడు జోసెఫ్ అంగీ పరిమళాన్ని ఆఘ్రాణించాడు.
అతడన్నాడు– 'ఇన్నాళ్ల సాహచర్యపు ఆనందాల్ని గణించు.
భూ, స్వర్గలోకాల ఆనందపు నవ్వులను గమనించు.
మేధస్సు, ఆత్మ, నయనాల శక్తి నూరింతలు అధికంకానీ!'

నేనన్నాను– "నాపై మరిన్ని కార్యాలు మోపవద్దు.
నానుండి నేను తరలిపోయాను. నా ఆందోళనలు
మొద్దుబారి, పొగిడే శక్తి సన్నగిల్లింది.
మెలకువ రానివ్యక్తి నాకన్ని విషయాలు వివరించాడు.
పొగడ్త, తెగడ్తలకతడు కడు దూరం.

ఏ విధంగానూ అతడితో తూగలేని నేనాతడినేమని వర్ణించగలను?
ఈ ఎడబాటు, ఈ హృదయ రుధిర వర్ణనను
మరో సమయం వరకు వాయిదా వేయరాదా!”–

అతడన్నాడు– “నేనాకలితో ఉన్నాను. ఆహారము ఇవ్వ
త్వరపడు. కాలమనేది పదునైన ఖడ్గప్రహారం.
‘సూఫీ’ వర్తమాన కాలపుత్రుడు. ఓ సహచరుడా!
‘రేపు’ అనేది ఈ బాటలో లేని పదము కదా!
నీవు ‘సూఫి’ (Sufi)వి కాదా! పైకం చెల్లించకుంటే
చేతిలో ఉన్నది శూన్యమవుతుంది సుమా!”–

నేనన్నాను– “స్నేహితుడి రహస్యం రహస్యంగానే ఉండాలి.
అదే కదా కథలోని రహస్యం.
ఇతరుల సంభాషణల్లో ప్రేమికుల రహస్యం బట్టబయలువుతుంది”.

అతడన్నాడు– “విశ్వాసంతో నిజాన్ని వెల్లడించు.
ముసుగు తెరలను తొలగించి సత్యాన్ని నగ్నంగా ప్రకటించు.
అందరూ ప్రేమించే అతడి సన్నిధిలో నిద్రించేప్పుడు అంగీ అవసరం లేదు.

నేనన్నాను– “నీ దృష్టిలో అతడు ఆచ్ఛాదనారహితంగా
కనిపించినపుడు నీవుండవు, నీ నడుము, వక్షరూపాలుండవు.
కోరుకో వరాన్ని, అయితే క్రమ పద్ధతిలో!
గడ్డిపరకను పర్వతానికి ఆధారంగా ఉంచలేవు.
ప్రపంచాన్ని కాంతివంతం చేసే సూర్యుడు
కాసింత ముందుకు వస్తే ఈ ప్రపంచం కాలి మసైపోతుంది.
కోరి కష్టాల్ని, రక్తపాతాల్ని తెచ్చుకోకు.
తబ్రిజ్ (Tabriz) సూర్యుడి గురించిక తర్కించకు.
అంతంలేని చిత్రమిది. వెళ్లు! ఈ కథకు ముగింపు పలుకు!

# అతిథి యువతి

అతడన్నాడు– "రాజా! అందరినీ పంపివేయిక్కడ్నుంచి
నేనా యువతితో ఏకాంతంలో సంభాషించాలి!
ఎవ్వరూ ఇక్కడ ఉండరాదు. నేనూ, ఆమె తప్ప"
అందరూ వెళ్లిపోయాక అతడడిగాడా యువతిని
– "నీదే ఊరు? ఒక్కోసారి ప్రాంతాన్ని బట్టి వైద్యనిదానం మారుతుంది.
ఘనత వహించిన నీ తల్లిదండ్రులెవరు? నీకత్యంత ఇష్టులెవరు?"

ఆమె హస్తాన్ని గ్రహించి, నాడిని పరీక్షిస్తూ అనేక ప్రశ్నలడిగాడు
ఎవరి పాదానికైనా ముల్లు గుచ్చుకుని బాధతో విలవిలలాడ్తుంటే
వైద్యుడు తన మోకాలిపై ఆ పాదాన్నుంచి చిన్న సూదితో
ముల్లు ఎక్కడుందో తెలుసుకో ప్రయత్నిస్తాడు.
ఇంకా దొరక్కపోతే తన పెదాల తడితో గాయాన్ని తడుపుతాడు.
కాలిలోని ముల్లు తీయడమే ఇంత కష్టమైతే
హృదయ శల్యాన్ని తీయడమింకెంత కష్టం?
ప్రతి ఒక్కరూ హృదయ శల్యాన్ని గుర్తించగలిగితే
దుఃఖానిది పైచేయి ఎట్లా అవుతుంది?

ఒక కొంటెవాడు గాడిద తోకలో ముల్లుగుచ్చాడు
ఎంత ప్రయత్నించినా అందక, బాధ భరించలేక, గాడిద గంతులేయసాగింది.
గంతులేసిన కొద్దీ ముల్లు మరింత గట్టిగా గుచ్చుకోసాగింది.
ముల్లు తీయాలంటే నేర్పు అవసరం.
గాడిదకా నేర్పు లేదు. తన్నుతూ, అరుస్తూ ఆ ప్రదేశాన్ని చిందర వందర చేసింది.
వైద్యుడు బుద్ధిశాలి. సున్నితంగా పరీక్షిస్తూ కనుక్కున్నాడు ముల్లున్నచోటు.
నెమ్మదిగా ఆరాతీసాడు ఆమె స్నేహితుల గురించి,
ఆమె నెమ్మదిగా తన ఊరి సంగతుల్ని బయటపెట్టింది.
ఆమె మాటల్ని వింటూ అతడు నాడీ పరీక్ష చేస్తూనే ఉన్నాడు.
ఎవరి నామోచ్చారణతో ఆమె నాడి ప్రజ్వలిస్తుందో

హృదయస్పందన ఎక్కువవుతుందో అతడే ఆ రుగ్మతకు కారకుడు.
ఆ విషయం వైద్యుడికి తెలుసు.
ఆమె స్వంత ఊరు గురించి వివరంగా చెప్పింది. పెద్ద మార్పులేదు.

"నీకింకా ఏ ఊరంటే ఇష్టం?" అడిగాడతడు.
ఆమె చాలా ఊళ్లపేర్లు, వివరాలు చెప్పింది.
ఆమె నాడీస్పందనలో, వదన వర్ణంలో కించిత్తు మార్పులేదు.
సమర్‌ఖండ్ ప్రస్తావన వచ్చేసరికి ఏదో పెనుమార్పు.
నాడీ స్పందన అధికమై, వదనాన ఎరుపు తెలుపు వర్ణాల అలలు.
అవును. ఆమె సమర్‌ఖండ్‌లోని స్వర్ణకారుడ్ని ప్రేమించింది.
వైద్యుడు రోగ నిదానం చేయగలిగాడు. ఆమెతో అన్నాడు–

"నీ బాధకు కారణం నాకు తెలిసింది. నయం చేసే మంత్రముంది.
అదిసరే, సమర్‌ఖండ్ స్వర్ణకారుడుండేది ఏ ప్రాంతంలో?"

ఆమె పలికింది– "సర–ఇ–పుల్ వంతెన వద్ద, ఘటఫర్ వీధిలో"–

అతడన్నాడు– "భయంలేదు. నెర్రెలు పడ్డ మైదానంపై వాన కురిసింది.
నీవిక చింతించనవసరం లేదు. నూరు తండ్రులకు సమానం నేను.
రాజు ప్రశ్నించినా సరే నీవీ రహస్యాన్నింకెవరికి చెప్పకు.
నీ హృదయం రహస్యానికి సమాధైనప్పుడు నీ కోరిక మరింత త్వరగా తీరుతుంది.

ప్రవక్త ప్రవచించాడు– "ఎవరైతే తన అంతర్గత ఆలోచనను
నిగూఢంగా దాచుకుంటారో వారి కోరిక తప్పక నెరవేర్తుంది"
నేలలో దాగున్న విత్తనాలే, ఆకుపచ్చని పూలతోట రహస్యం.
వెండి బంగారాల గనుల్లో దాగుండడం వల్లనే వాటికంత విలువ!–
వైద్యుని ప్రశాంత వాక్యాలు ఆ యువతికి సాంత్వన నిచ్చాయి.
నిజమైన వాగ్దానాలు హృదయాన్ని బాధారహితం చేస్తాయి.
అబద్ధపు మాటలు అల్లకల్లోలాన్ని సృష్టిస్తాయి.
గొప్పవారి భాషణం నాణ్యమైన నాణెము.
అల్పుల మాటలు అనర్థదాయకం, ఆత్మవినాశకరం.

# అతిథి వైద్యుడు – రాజు

యువతి దగ్గర సెలవు తీసుకుని వెళ్లాడు వైద్యుడు రాజు దగ్గరకు.
–'సమర్‌ఖండ్ స్వర్ణకారుడినిక్కడకు రప్పించు, ప్రభూ!
అతిథి మర్యాదలతో, స్వర్ణంతో అతడినాహ్వానించు!
రాజు నీతివంతులైన ఇద్దరు రాయబారుల్ని పంపాడు.
ఆ స్వర్ణకారుడు సొగసుకాడు, విలాస పురుషుడు
అతడిని సమీపించి వారిలా విన్నవించారు.

–"ఘనతవహించిన స్వర్ణకారుడివి నీవు.
నీ కీర్తి వాడవాడలా అగరు పరిమళంలా వ్యాపించింది.
మా మహరాజు నీ ఖ్యాతి విన్నవాడై
తన అంతఃపుర స్త్రీలకు ఆభరణాల నిమిత్తం
మమ్మల్నిక్కడకు పంపినాడు. ఇవిగో, ఇవి నీకే!
ఉచిత వస్త్రాలు, స్వర్ణ రజత కానుకలు.
మాతో వచ్చి మరింత విలువైన సంపదలను పొందగలవు"–

ఖరీదైన వస్త్రాలు, కానుకలు చూడగానే కళ్లు బైర్లుకమ్మాయి.
తన ఇల్లూ పిల్లల్ని, ఊరూ వాడా వదలి అతడు వారిననుసరించాడు.
రాజు తన ప్రాణాలకెసరు పెడ్తున్నాడని ఆ మూర్ఖుడికేం తెలుసు?
అరబిక్ అశ్వంపై ఆనందంగా స్వారీ చేస్తున్నాడతడు.
తాను ధరించిన ఉడుపులపై రక్తపు ఛాయలున్నాయని తెలియనివాడు.

ఓ మతిమాలినవాడా! నిన్ను నూరడుగులు దురదృష్టమార్గంపై
నడిపించిన పేరాశ ఎటువంటిది? విధి నిర్ణయమటువంటిది.
మృత్యుదూత అజాజిల్ చూపించే ఎండమావులు కాదా అవి?
ఆ స్వర్ణాలూ, రజతాలూ, మేలిమి వస్త్రాలూ, ఉన్నత పదవులూ!

స్వర్ణకారుడు రాగానే వైద్యుడాతడిని సగౌరవంగా రాజు వద్దకు తీసుకునివెళ్లాడు.
తిరాజ్ దీపం వేపు రెక్కల పురుగులా అతడిని సున్నితంగా నడిపించారు.

అత్యంత గౌరవ మర్యాదలనిస్తూ రాజు అతడిని స్వర్ణనిధి రక్షకుడిగా నియమించాడు.
వైద్యుడన్నాడు– "రాజా! మన అతిథికి ఆ యువతిని కానుకగా ఇవ్వు!
ఇద్దరూ ఒకటయితే, ఆ సమాగజలం ఉద్వేగాగ్నిని చల్లార్చగలదు.
విరహాగ్నితో సతమతమవుతున్న ఆ జంటకు వివాహం చేసాడు రాజు.
ఆరు నెలలు ఆరుక్షణాల్లా గడిచాయి. ఆ యువతి ఆరోగ్యం చక్కబడింది.
స్వర్ణకారుడికి ఓ రసాయన కషాయం ఇవ్వబడింది.
జబ్బుపడిన అతడి వికారరూపాన్ని చూసి జడుసుకున్నదా యువతి.
గుంటలు పడ్డ కళ్లు, పీక్కుపోయిన దవడలు, కురూపిలా అతడు.
మందు మహాత్మ్యమో ఏమో, ఆమె హృదయంలో అతడు లేడు.
వారిరువురి మధ్య ఉన్నది ఆకర్షణ. అది ప్రేమ కాదు.
అతడామెను ప్రేమించలేదు. అతడి అందమే అతడికి శత్రువు.
అతడి కంటినుండి రక్తాశ్రువులు స్రవించాయి. తన రూపమే తన వైరి.
నెమలి పింఛము నెమలికి మృత్యువు.
రాజుల సంపదలే వారికి శత్రువులు, మరణ శాసనాలు.

అతడన్నాడు– "నేను కస్తూరి జింకను. నా సుగంధమే నా మృత్యువు.
ఉన్ని చర్మం కోసం చంపబడిన నక్కను నేను.
దంతం కోసం మావటిచే గాయపడిన ఏనుగును.
నా నిజతత్త్వం కాకుండా నా అందాన్ని సాకుగా నన్ను చంపితే
నా రక్తం ప్రతీకారం తీర్చుకుంటుందని నా హంతకుడికి తెలుసా?
ఇవ్వాళ నామీద, రేపు అతడిపై; ఈ రక్తం వృథా కాబోదు.
గోడ నీడ ఎంత పొడుగైనా, చివరకు నీడ గోడను చేరక తప్పదు.
ఈ ప్రపంచమొక పర్వతం. మన కేక ప్రతిధ్వనించే మనలను చేరాల్సిందే!"
ఆ మాటలని అతడు మరి మాటలాడలేదు.

మరణించిన అతడు మట్టిలో కలిసిపోయాడు.
ఆ యువతి ప్రేమ, బాధా రెండూ వర్జింపబడ్డాయి.
మరణించినవారిపై ప్రేమ ఎక్కువకాలం ఉండదు.
ఎందుకంటే మృతులు ఇంకెప్పుడూ మరలిరారు గనుక.

బతికున్నవాళ్ల ప్రేమ తాజాగా, జీవంతో కళకళలాడుతూ ఉంటుంది.
అందుకే శాశ్వత జీవనుడి ప్రేమను అభిలషించు.
జీవన మధువును పెంపొందించే వాడి ననుసరించు.
పేరు ప్రఖ్యాతులున్న ప్రవక్తలు ఆరాధించిన అతడి ప్రేమను కోరుకో!
అక్కడ మనకు ప్రవేశము లేదనుకోకు! కరుణామయుని వాకిలి తెరిచే ఉంటుంది.

## స్వర్ణకారుని మరణ రహస్యం

వైద్యుని చేతిలో స్వర్ణకారుని మరణం
ఏదో ఆశతోనో భయం వల్లనో సంభవించలేదు.
అది రాజుకు మేలు చేయాలని కాదు
దైవాజ్ఞచే ఉత్తేజితుడైన వైద్యుడు లిఖించిన మరణశాసనం.
బాలుని గొంతు కోసిన ఖదీర్‌ను సామాన్యులర్థం చేసుకోలేరు.
దైవాజ్ఞ పాలనా విధానం ఏ రూపంలో ఉన్నా అంతరార్థం ముఖ్యం.
ఆత్మను బతికించేవాడి చర్య సమర్థనీయం.
దైవప్రతినిధి హస్తం దైవ హస్తమే!
ఇస్మాయెల్‌లా శిరసు వంచు.
పిడిబాకు గుండెపైకి దూసుకువస్తుంటే చిరునవ్వుతో సిద్ధంకా!
భగవానుని సన్నిధిలో ఉన్న పవిత్రాత్మ మహమ్మదులా
నీ ఆత్మ చిరునవ్వుతో ఊర్ధ్వలోకానికి పయనిస్తుంది.
నీతివంతులు ఖేదిస్తున్నప్పుడే ప్రేమికులు ఆనందపాత్రను ఖాళీ చేస్తారు.
కామపీడితుడైన రాజు రక్తపాతం జరపలేదు.
మరి, స్వర్ణకారుని హత్య దురాలోచనా ఫలితం కాదా?
రాజు, అతడికి సహకరించినవారు నేరస్తులు కాదా?
ఈ చర్య వెండి నుంచి చెత్తను తొలగించే ప్రక్రియ.
మంచీ చెడుల మిశ్రమం నుంచి మంచిని వేరుచేయడం.
స్వర్ణాన్ని జ్వలింపచేసి పైకి పొంగిన వ్యర్థాన్ని తొలగించడం.
అది దైవశాసనం కనుకే అతడు శునకంగా గాక రాజుగా జన్మించాడు.
అతడు కుట్ర, కుయుక్తులు, కామం వలన దూషితుడు కాలేదు.

చెడు పొరను కప్పుకున్న మంచిని అతడు చేసినాడు.
ఖదీర్ పడవను సముద్రంలోకి నెట్టడంలో వంద ఒప్పులున్నవి.
మోసెస్ పనులను సమర్థించింది ఖదీర్ ఉదాహరణతోనే.
అందుకే రెక్కలు లేకుండా ఎగరవద్దనేది.
రాజు చర్య హర్షింపదగిన ఎర్రగులాబి. దానిని రక్తపాతమనవద్దు
అతడు కార్యకారణాన్ని గ్రహించినాడు. అంతేకాని ఉన్మత్తుడు కాడు.
అతడు మరో ముస్లిం వ్యక్తి రక్తం చిందించడాన్ని నేను హర్షిస్తే
నేను మత విరోధినై చరిస్తున్నంత పాపం.
క్రూరుడిని పొగిడితే అత్యున్నత స్వర్గ శిఖరాలు అలల్లా కంపిస్తాయి.
విశ్వాసి కూడా దుష్కర్మ చేయ సాహసిస్తాడు.
ఆ రాజు నీతిమంతుడు. ప్రజలచే దేవునిచే ఎన్నిక చేయబడినవాడు.
అటువంటి రాజు చేతిలో మరణించినవాడు అదృష్టాన్ని పొందుతాడు.
ఆ హింసలో స్వర్ణకారుడికి మేలు ఒనగూడనున్నదని రాజుకు తెలుసు.
లేకుంటే అత్యంత కరుణామయుడు హింసకు అనుమతెలా ఇస్తాడు?
క్షురకుని కత్తి చూసి బాలుడు భయపడినా తల్లి నవ్వుతుంది.
ఆ దయామయుడు అర్థ జీవితానికి మారు నూరు జీవితాలననుగ్రహిస్తాడు.
అది నీ ఊహకందేది కాదు.
అతడి పోకడలను నీ దృక్కోణంలో చూడకు.
సత్యానికి దూరంగా జరిగిపోకు.
ఆలోచించు!

## మాటలు నేర్చిన చిలుక - వ్యాపారస్తుడు

కూరగాయలు, దినుసులమ్మే ఓ వ్యాపారస్తుడి దగ్గర
చక్కగా మాటలు నేర్చిన చిలుక ఒకటి ఉండింది.
యజమాని లేనప్పుడు అది తన పంజరం ఊయలపై కూర్చుని
కొనుగోలుదార్లతో మాట్లాడుతూ కాపలా కాస్తూండేది.
మనుషుల మాటలు, చిలుకల పాటలు తెలిసిన చిలుక అది.
ఒకరోజు అది ఎగిరినప్పుడు కాలు తగిలి గులాబి అత్తరు ఒలికింది.

ఈలోగా యజమాని వచ్చి యథాస్థానంలో ఆసీనుడయ్యాడు.
అప్పుడతడి దృష్టి అత్తరు ఒలికిన బట్టలపై, బల్లపై పడింది.
చిలుకపై చిరాకుపడి దాని నెత్తిమీద ఒకటిచ్చాడు.
ఈకలు రాలిపోగా దానికి బట్టతల ఏర్పడింది.
కోపంతో చిలుక కొన్నాళ్లు మాట్లాడ్డం మానేసింది.
ఆగ్రహం తగ్గిన యజమానిలో పశ్చాత్తాపం మొదలైంది.
–"అయ్యో ఎంత పని చేసాను. నా అదృష్ట సూర్యుడిని మబ్బులు కమ్మినాయి.
ఆరోజున నా చేతికి వాతమొచ్చినా బాగుండేది.
పలుకులు నేర్చిన చిలుకను కొట్టి పాపం చేసాను"–
అని దుఃఖిస్తూ అతగాడు అటు వచ్చిన దైవభక్తులకు (డెర్విష్‌లు)
తన చిలుకకు మాటలు వచ్చేలా చేయమని పదేపదే ప్రార్థించసాగాడు.
మూడు రాత్రులూ, మూడు పగళ్లూ ఆ నిరాశలోనే గడిచాయి.
మాట్లాడ్తుందేమోనన్న ఆశతో ఆ చిలుకకు రకరకాల వింతలు చూపించాడు.

బోర్లించిన చెంబులా తళతళలాడ్తున్న గుండుతో
ఓ డెర్విష్ సాధువు అటుగా రావడం చూసింది చిలుక.
వెంటనే గోలగోలగా అరిచింది– "ఓ మిత్రమా! మొత్తం గుండు కొట్టారు నీకు!
ఎంత నూనె వొలకబోసావేమిటి నీవు? నిజం చెప్పు"–

దారినపోయేవాళ్లంతా దాన్ని చూసి పగలబడి నవ్వారు.
చిలుక, సాధువును తనతో సమానంగా చూస్తున్నందుకు!
పవిత్రమూర్తులను అంచనా వేయడానికి నీ శక్తి చాలదు.
సింహము, క్షీరము పర్షియన్ రాతలో ఒకేరకంగా ఉంటాయి.
లోకుల తీరే అంత. కుతుబ్‌కు కుహనాగాళ్లకు తేడా తెలుసుకోరు.
సాధువులను సామాన్యులను ఒక్కగాట కడ్తారు.
నిద్రాహారాలు అందరికీ సమానమే అని నిర్ధారించబోతారు.
వ్యక్తుల మధ్య వ్యత్యాసాన్ని గమనించలేని అంధులు వాళ్లు.
జంబు కీటకాలు ఒకే గాలి, నీరు, ఆహారాన్ని గ్రహిస్తాయి.
కందిరీగ నుంచి ముల్లు, తేనెటీగ నుంచి మధువు ప్రాప్తిస్తాయి.

జింకలు రెండు రకాలు ఒకే గడ్డి, నీరు సేవిస్తాయి.
ఒకటి పేడనిస్తే మరొకటి కస్తూరినిస్తుంది.
రెల్లుగడ్డి రెండు రకాలు ఒకే నేలపై నీటిపై ఆధారపడతాయి.
ఒకటి చెత్తనిస్తే ఇంకొకటి చక్కెరనిస్తుంది.
ఇటువంటిది వందల వేల ఉదాహరణలు
నీ డెబ్బైఏళ్ళ ప్రయాణంలో గమనిస్తావు.
ఒకడి నుంచి అశుద్ధం, మరొకడి నుంచి దైవకాంతి.
ఒకడి నుంచి అసూయాద్వేషాలు, అతడి నుంచి దైవప్రేమ.
ఒకడు చౌడునేల, ఒకడు రేగడి మట్టి.
ఒకడు రాక్షసుడు, క్రూరమృగం; అతడు దేవదూత
నీళ్లు చూడటానికి ఒకేరకంగా ఉన్నా రుచిలో తేడా లేదా!
ఆత్మజ్ఞానికే తెలుస్తుంది మనుషుల్లోని అసలు బేధం.
మాయకు మహత్తుకు తేడా ఇంద్రజాలికుడికి ప్రవక్తకున్నదే!
అజ్ఞాని దృష్టిలో రెండూ కనికట్టు విద్యలే!
మోసెస్ కాలంలో ఫారో ఆస్థాన ఇంద్రజాలికులు చేసిందదే!
ఒకరిది దైవాశీస్సులు పొందినది. వాళ్లది మామూలు మంత్రదండం
దేవుని కరుణకు పాత్రులౌతుందీ చర్య. దైవశాపానికి గురౌతుందా కార్యం.
అవిశ్వాసులది కోతి మనసు. వారి హృదయం కంకర పెళుసు.
మనిషి ఏం చేస్తే అలా చేస్తుంది కోతి.
గొడవ పడేవాడికి నిజమెలా తెలుస్తుంది?
దైవాజ్ఞానుసారం అతడు నడిస్తే, మనసు కోతి ఆడించినట్లు ఇతడు.
ఆత్మవంచనాపరుడు ఆత్మార్పణ చేసుకోడు.
తగాదా పడడానికే ప్రార్థనలో పాల్గొంటాడు.
ప్రార్థనలో, ఉపవాసంలో, తీర్థయాత్రలో, దానధర్మాలలో
జయాపజయాలలో ఇరువురూ పాల్గొంటారు, కాని
అంతిమ విజయం విశ్వాసులదే. అవిశ్వాసులకు మిగిలేది ఓటమే.
ఇద్దరూ ఆడేది ఒకే ఆట అయినా ఇద్దరి మధ్య అనంతదూరం.
వాళ్ల పేర్లని బట్టి వారి వారి స్థానాలను చేరుకుంటారు.

విశ్వాసీ అని పిలిస్తే అతడి ఆత్మ విశేషంగా ఆనందిస్తుంది.
అవిశ్వాసి ఆత్మ క్రోధంతో ఉడికిపోతుంది.
సన్మార్గాన చరించే విశ్వాసి గౌరవింపబడతాడు.
ఆత్మవంచనాపరుడు తన వికృత చేష్టలతో అసహ్యించబడ్తాడు.
మిమ్‌వావ్, మిమ్‌నన్ పదాలు గౌరవానివ్వవు.
ముమిన్ అనేది విశ్వాసికి పర్యాయపదం మాత్రమే.
విశ్వాసిని 'అవిశ్వాసీ' అని పిలిస్తే అది తేలుకాటంత బాధాకరం
ఆ పదం నరకలోక జనితం కనుకే అది నరకవాసనాభరితం.
ఆ దుర్గంధం అక్షర జనితం కాదు. సముద్రపునీటి ఉప్పదనం పాత్రది కాదు.
అక్షరాలే పాత్ర. అర్థమే జలం.
ఉప్పు, మంచినీటి సముద్రాల మధ్య గోడను దాటితే తెలుస్తుంది నిజం.
రెండూ ఒక్కచోటనే పుట్టి వాటి వాటి స్థానాలకు చేరుకుంటాయి.
పరశువేదితో అసలైన బంగారాన్ని కనిపెట్టినట్లు జ్ఞాని వ్యవహరిస్తాడు.
ఆత్మలో పరశువేది నిక్షిప్తింపబడినవాడు
సత్యాసత్య విచక్షణా పరుడౌతాడు.
నోటిలో దుమ్ము పడ్డప్పుడు సజీవి ఉమ్మేసి విముక్తుడౌతాడు.
రాశిగా ఉన్న ఆహారంలో రవ్వంత చెత్త ఉన్నా
జీవించి ఉన్నవాడు దానిని శోధించి మరీ తీసివేస్తాడు.
ప్రాపంచిక జ్ఞానం ప్రపంచానికి నిచ్చెన; మత ధర్మ జ్ఞానం స్వర్గానికి నిచ్చెన
వెనుకటి ఆరోగ్యాన్ని వైద్యుడి నుంచి, తదుపరి ఆరోగ్యాన్ని మనల్ని
ప్రేమించేవారి నుంచి ఆశిస్తాము.
మొదటిది దేహారోగ్యం నుంచి, రెండవది దేహశిథిలాల
నుంచి లభ్యమవుతాయి.
ఆధ్యాత్మికమార్గం దేహాన్ని శిథిలం చేసి,
తరువాతి జీవితాన్ని సౌభాగ్యవంతం చేస్తుంది.
స్వర్ణనిధి కోసం ఉన్న ఇల్లు కూల్చి
పొందిన నిధులతో రాజప్రాసాదం నిర్మించుకోవడంలా!
నీటిని ఆపి, నది అడుగును శుభ్రపరచగా

పానయోగ్యమైన నీటితో నది పారినట్లుగా!
చర్మాన్ని విడదీసి ఇనుపములికిని తీసివేస్తే
ఆనక మంచి చర్మము గాయాన్ని మూసివేయదా!
అవిశ్వాసి కోటను నేలమట్టము చేసి
ఆ శిథిలాలపై నూరు బురుజులను, గోడలను నిర్మించాలి!
తనను పోలిన వాడే లేని వాడి పనులే రీతిని వర్ణించగలను?
ఆశ్చర్యంతో చూడడం మినహా ఆ కార్యములను విమర్శించలేను.
పరస్పర విరుద్ధ కార్యాల నవలోకించి పరవశింతును.
ఒకరిచూపు తాను ప్రేమించిన వారివేపు, మరొకరిది తనవేపు–
ప్రతి ఒక్కరి వదనాన్ని నిశితంగా పరీక్షించు.
సాధుసంతుల స్వభావాన్ని చక్కగా గమనించు.
ఆదాము రూపున్న సాతానుతో కరచాలనము తగదు గాక తగదు.
పక్షిని మోసపుచ్చడానికి వేటగాడు పక్షిలా అరుస్తాడు.
దైవభక్తులననుకరించి మోసగాడు సామాన్యులను దోచుకుంటాడు.
సాధువులు కాంతిమార్గ నిర్దేశకులు; మోసగాళ్లు భ్రాంతిలో పడవేస్తారు.
మోసగాళ్లు ఉన్నితో సింహాన్ని చేసి ఊరూరా అడుక్కుంటారు.
బుముసెలిమ్‌లకు అహమద్ అని పేరిడి అబద్ధమాడతారు.
వాళ్లు అబద్ధపు కద్దాబ్‌లే ఎన్నటికీ,
మహమ్మద్ ఎప్పుడూ ఉలుల్–అల్‌బాబ్–జ్ఞానియే!

దేవుని మధువు కస్తూరి పరిమళాలనిస్తుంది.
మోసగాళ్ల సారాయి మురికి కంపు కొడ్తుంది.

## అనుమాన భయంతో క్రైస్తవులను చంపిన యూదురాజు

ఆ యూదు ప్రభువు క్రైస్తవ వ్యతిరేకి, క్రూరుడు.
అది జీసస్ ప్రవక్తగా ప్రభవించిన కాలం.
జీసస్ ఆత్మ మోసెస్; మోసెస్ ఆత్మ జీసస్.
అయితే ఆ వంకర చూపుల రాజు వారిద్దరినీ విడదీయబోయాడు.

ఒక గురువుకు అలాంటి వంకరచూపుల శిష్యుడున్నాడు.
–"శిష్యా! వెళ్లి గదిలోని సీసా తీసుకునిరా!"
–"అయ్యా! ఆ రెండు సీసాల్లో తమకేది కావాలి"
–"అక్కడ ఉన్నది ఒక్కటే సీసా! సరిగా చూసి పట్టుకురా!"
–"ఆర్యా! నన్ను తిట్టకండి! అక్కడ రెండున్నాయి!"
–"అయితే ఒకదాన్ని పగలగొట్టు" అన్నాడు గురువు.
శిష్యుడు పగలగొట్టాడు. అక్కడ ఇప్పుడే సీసా లేదు.
కోపం, కోరిక మనిషిని వంకరచూపుల వాడిగా చేస్తాయి.
స్వార్థమున్నపుడు సుగుణం దాక్కుంటుంది.
కంటికి, హృదయానికి మధ్య వంద తెరలు అడ్డువస్తాయి.
లంచగొండితనం హృదయాన్ని మూగపరచినపుడు
దెబ్బకొట్టిన వాడికి, గాయపడినవాడికి మధ్య తేడా ఎలా తెలుస్తుంది.
యూదు మత ఛాందసమెక్కువైన రాజు చూపుల్లో వక్రత.
క్రైస్తవులు దేవుని ప్రార్థించారు కరుణ చూపమని.
వందల, వేలాది మంది క్రైస్తవులను కత్తికెరజేసాడా రాజు.
"నేను మోసెస్ మత రక్షకుడిని. ధర్మపాలకుడినంటూ"

## వజీరు పన్నాగం

రాజుకు తగ్గ మంత్రి ఆ వజీరు
దుష్టపన్నాగాలతో నీటి ధారలకు ముడివేయగలిగినవాడు.
అతడన్నాడు రాజుతో– "క్రైస్తవులిప్పుడు ప్రాణభయంతో ఉన్నారు.
వారు తమ మతాన్ని రాజు దృష్టికి రాకుండా జాగ్రత్తపడ్తున్నారు.
అటువంటి వారిని చంపడం వలన మనకొనగూడే ప్రయోజనం ఏమిటి?
మతానికి ఏ సుగంధమూ లేదు. అది కస్తూరీ, కలబంద కాదు.
రహస్యానికి వంద పొరలుంటాయి.
బయటకు మీ మాట అంగీకరించినా, లోలోన వారు వ్యతిరేకులే!"–

అప్పుడు రాజు అడిగాడు– "దీనికేమీ విరుగుడు లేదా?
ఈ లోకాన ఒక్క క్రైస్తవుడూ ఉండకూడదూ, బయటైనా, లోనైనా"–

వజీరు అన్నాడు– "ఓ ప్రభూ! నా చేతుల్ని చెవుల్ని నరికించు
నా నాసికను నిలువుగా చీల్చు. నన్ను ఉరికంబమెక్కించు
అప్పుడు నా తరపున ఒక మధ్యవర్తి మీతో మాట్లాడనివ్వండి.
నన్ను నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలందరి ముందు నిలబెట్టి
నాకా శిక్ష విధించి నన్ను దేశం నుండి బహిష్కరించండి
అప్పుడు నన్ను క్రైస్తవులు తమవాడిగా భ్రమిస్తారు.
నేను వారితో అంటాను– 'నేను మీలా రహస్య క్రైస్తవుడిని.
అన్ని రహస్యాలు తెలిసిన దేవుడికి నా సంగతి తెలుసు.
రాజుకు ఈ సంగతి తెలిసి నాకీ కఠిన శిక్ష విధించాడు"
"నీ మాటలు రొట్టెలో దాగున్న సూదిలా గాయం చేస్తున్నాయి.
నీ నా హృదయాల మధ్య కిటికీ ఉన్నది.
ఆ కిటికీ ద్వారా నేను నీ హృదయాన్ని స్పష్టంగా చూసాను.
నీ మాటలను ఎన్నటికీ నమ్మను" అన్నాడు రాజు.
–"ఆరోజున జీసస్ నా సాయానికి రాకపోతే
యూదుల సంప్రదాయం ప్రకారం నన్ను ఖండఖండాలుగా నరికేవారు.
జీసస్ కోసం నేను ప్రాణాలర్పిస్తాను.
అతడి మతం కోసం నేనేమైనా చేస్తాను.
అటువంటి పవిత్ర మతము అవిశ్వాసుల చేతుల్లో
విచ్ఛిన్నమవడం సహించలేను.
నన్ను తన అనుయాయుడిగా అంగీకరించిన జీసస్‌కు కృతజ్ఞతలు.
నేనిప్పుడు యూదుల నుంచి, యూదు మతం నుంచి విముక్తుడనైతిని.
నా నడుమును క్రైస్తవ పటకాతో బంధించుకొంటిని.
ఇది జీసస్ యుగం.
మిత్రులారా! మీ ఆత్మను జీసస్ మతానికి అంకితం చేయండి"–
–అని నేను వారితో అంటాను అన్నాడు వజీరు.

రాజుకు ఈ సలహా నచ్చి, వజీరు చెప్పినట్లే చేసాడు.
గాయాలతో ఉన్న వజీరును క్రైస్తవుల గూటిలోకి తోలినాడు.

## వజీరు వలలో క్రైస్తవులు

అసంఖ్యాకంగా క్రైస్తవులతని చుట్టూ మూగినారు.
సువార్తను, రక్షణా కవచాన్ని, ప్రార్థనతడు వారికి వినిపించాడు.
బయటకతడిప్పుడు మతన్యాయబోధకుడు.
లోపల ఈల, వల చేతబట్టిన వేటకాడు.
*దీని గురించే ఒకప్పుడు మహమ్మదు అనుయాయులు*
*వివరించమని ప్రవక్తనడిగారు.*
*–"ఆత్మాంకితపు దైవసేవలో స్వార్థపుటాలోచనలు దాగి ఉన్నాయా?"*
*అడిగారే కాని వారు దైవసేవలో ఉన్నతస్థితిని గాని,*
*బాహ్య ప్రకటనలలోని లొసుగు గురించి తెలుసుకో యత్నించలేదు.*
*కాని క్రమేపీ వారు వెంట్రుకనుంచి వెంట్రుకను, కణం తర్వాత కణాన్ని*
*దేహాత్మపు మోసాన్ని, గులాబికి పార్స్లీకి ఉన్న తేడాను తెలుసుకున్నారు.*
*ప్రవక్త వారిని గద్దించినపుడు అత్యంత నీతి నియమ వర్తనులు*
*కూడా ఒక్కోసారి నిరాశకు గురయ్యేవారు.*

## వజీర్‌ను అనుసరించిన క్రైస్తవులు

మనసా, వాచా క్రైస్తవులు వజీర్‌కు విధేయులైనారు.
అతడంటే వారికిప్పుడు గుడ్డినమ్మకం. వల్లమాలిన ప్రేమ.
జీసస్‌కు ప్రతినిధిగా అతడిని విశ్వసించినారు.
కాని ఆ వజీరు ఒంటికన్ను విరోధి, క్రీస్తు మత శత్రువు.

*దేవా! మా మొరాలకిస్తున్నావా! రక్షకుడా! ప్రభూ!*
*మా చుట్టూ ఎన్నో ఉచ్చులు, వలలు; మేం ఆకలిగొన్న పక్షులం!*
*ప్రతిక్షణం ఏదో ఒక కొత్త ఉచ్చులో పడ్తున్నాం.*
*ఫాల్కన్ డేగలైనా, సిమర్గ్ పిచ్చుకలైనా వలల్లో చిక్కుకుని విలపిస్తున్నాం.*
*మమ్మల్ని నీవు విడుదల చేసిన ప్రతిసారీ మరొక ఉచ్చు మా కొరకు సిద్ధం.*
*ఈ గాదెలో మొక్కజొన్నల్ని నింపుతున్నాం. కోల్పోతున్నాం*
*దీనికి కారణం గాదెలోని ఎలుక అని గ్రహించాము.*

తెలిసేసరికే గాదె ఖాళీ అయ్యింది. గాదెకు రంధ్రం మిగిలింది.
ఓ ఆత్మా! ముందు ఆ ఎలుకను తరిమివేసి, ఆనక గాదెను నింపు.

ప్రవక్త ఏనాడో ప్రవచించినాడు–
“మనసును దేవునిపై లగ్నంచేస్తేనే ప్రార్థనకు ఫలితం ఉంటుంది.
నీ గాదెలో ఎలుక లేకుంటే నలభై ఏళ్ల పంట ఎలా మాయమౌతుంది?
ప్రతిరోజూ ఒక్కోగింజ దాచినట్లు ధ్యానిస్తేనే గదా ఫలితం.
కాల్చిన ఇనుము నుంచి వెలువడే నిప్పురవ్వలను మండే హృదయం స్వీకరిస్తుంది.
చీకటిలో దాగున్న దొంగ, వేలితో చుక్కల్ని చెరపబూనినట్లు
ఒక్కో చుక్క నార్పేస్తే ఆకాశపు ఆత్మలో దీపప్రకాశముండదని.

మన పాదాల వద్ద వేలాది ఉచ్చులుండనీ
అతడు మన తోడున్నపుడు మనకే ప్రమాదమూ ఉండదు.
ప్రతిరాత్రి మనం దేహపు ఉచ్చు నుంచీ ఆత్మను విముక్తి చేస్తాం.
మనసు ఫలకంపైని రాతలను చెరిపివేస్తాం.
పంజరం నుంచి ఆత్మలను వదిలివేస్తాం.
రాత్రిపూట ఖైదీలకు రక్షకభటుల స్పృహ ఉండదు.
దుఃఖముండదు. లాభనష్టాల బేరీజులుండవు. భేషజాలుండవు.
నిద్రపోకపోయినా మెలకువ ఉండే ఈ స్థితిని విశ్వసించు.
ప్రాపంచిక వ్యవహారాల్లో అలిసి నిద్రిస్తున్న అతగాడు
దైవ నియంత్రణ గల హస్తము అందుకున్న కలం లాంటివాడు.
ఆ లేఖనంలో కదలిక కనిపిస్తుందే కాని హస్తం కనిపించదు.
నిద్రలోనే మెలకువగా ఉండే ఈ స్థితిని సాధువులే కాక
సామాన్యులూ అనుభవిస్తారు కాని గుర్తించలేరు.
పేరు తెలియని ఎడారుల్లోకి ఆత్మలు నిష్క్రమిస్తాయి.
దేహమూ, ప్రాణాలు విశ్రాంతిగా నిద్రిస్తుంటాయి.
ఈల వేసి వాటిని మరల ఉచ్చు దగ్గరకు నడిపిస్తావు.
న్యాయపీఠానికి, న్యాయదేవతకు ముందర నిలబెడ్తావు.
ఇజ్రాయెల్ (సెరాఫియెల్) దేవదూత ఆత్మలందరినీ ఒకచోట చేరుస్తాడు.

*వాటికి దేహరూపాలనిచ్చి యధాపూర్వ స్థితికి తెస్తాడు.*
*మృత్యువు సోదరుడే నిద్ర -అన్న వాక్యార్థమిదే*
*మరలా ఉదయం మెలకువ వచ్చేసరికి వారి కాళ్లకు దీర్ఘ*
*బంధనాల నేర్పరుస్తాడు. రాత్రి మైదానాల నుంచి పగటి పొలాల్లోకి*
*ఆత్మ చేరుకునేలా అమరుస్తాడు.*

*నోవా పడవలోని వారిని, గుహలోని మనుషులను*
*అతడు కాపాడిన విధమిదే!*
*చేతన, మెలకువల వరద నుంచి*
*మనసు, కన్ను, చెవులను సంరక్షించినదీ తీరుననే!*
*ఈ ప్రపంచంలో నీ ముందరా, వెనకా, పక్కనా*
*అనేకమంది, గుహలోని మనుష్యులున్నారు.*
*గుహ అతడిది. నీ స్నేహితుడు అతడితో సంభాషిస్తున్నాడు.*
*నీవు కనులు, చెవులు మూసుకుంటే ఏం ప్రయోజనం?*

## కాలిఫ్-లైలా

కాలిఫ్ అడిగాడు లైలాను- "మజ్నూను ఉన్మత్తుడిగా చేసింది నీవేనా?
ఇక్కడున్న అందగత్తెలకన్నా నీవేమీ గొప్పగా లేవు!"-

లైలా సమాధానమిచ్చింది- "నీవు మజ్నూవి కాదు కదా!
అతడి కళ్లతో చూడు! నా అందం కనిపిస్తుంది నీకు!"

భౌతిక ప్రపంచానికి మెలకువతో ఉన్నట్లు కనిపించేవాడు
యదార్థంగా ఆత్మలలోకంలో నిద్రిస్తుంటాడు.
అతడి మెలకువ నిద్రకన్నా కఠినమైనది.
దేవుని గురించి మెలకువ లేని ఆత్మకు, మెలకువ ద్వారబంధనమే.
రోజల్లా వ్యాపార లాభనష్టాలను గుణించేవాడికి
స్వర్గలోక ప్రయాణపు ఆనందం, దాని కీర్తి అగుపించవు.
ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి లేక నిద్రించేవాడికి

వృథా విషయాలపై తపన పెరిగి వాటికై తహతహలాడ్తాడు.
నిద్రలో సాతాను లాంటి 'హురి'కనిపించి సాతానుపై ప్రేమను పెంపొందిస్తుంది.
ఆ కామసౌఖ్యానికి ఉలికిపడి లేవగానే అంతా అదృశ్యమౌతుంది.
స్వప్నాల వలన కలిగే తలనొప్పి, దుర్గంధం కృత్రిమ మాయాజనితాలు.
ఆకాశంలో ఎగిరే పక్షి నీడ నేలపై వేగంగా కదుల్తుంటుంది.
ఆ నీడను వెంటాడే వెర్రివాడు త్వరగానే అలిసిపోతాడు.
అతడికి పక్షి గురించి తెలియదు; నీడ గురించీ తెలియదు.
తన అమ్ములపొదిలోని బాణాలైపోయేంత వరకూ నీడను వేటాడ్తాడు.
అతడి జీవితపు పొది ఖాళీ. నీడను వేటాడిన జీవనమూ ఖాళీ.
కాని దేవుని నీడ అతడికి పరిచర్య చేసి నీడ నుంచి విముక్తినిస్తుంది.
దేవుని నీడ ఈ ప్రపంచం దృష్టిలో మరణించిన దైవ సేవకుడిది.
అతడి అంగీని అందిపుచ్చుకో! యుగాంతాన రక్షింపబడతావు.

సాధుసంతుల రూపంలో దేవుని ఛాయ అధికం చేయబడ్తుంది.
దివ్య సూర్యుని కాంతివేపు దారి తీస్తుంది.
మార్గదర్శి లేకుండా లోయలోకి పోవలదు.
అబ్రహం (ఖలీల్) లా పలుకు– ఆ గుంపును నేనిష్టపడను.
నీడ నుంచి బయల్దేరి సూర్యుడినందుకో.
షామ్స్–ఐ–టబ్రిజ్ సూర్యుడి అంగీని అందుకో!

వివాహపు విందున్న చోటుకు దారి తెలియకపోతే
జియా ఉల్ హక్ –దైవప్రకాశపు హుసాముద్దీన్ నడుగు.
దారిలో అసూయ నీ గొంతును నొక్కితే
అది సరిహద్దు దాటిన ఇబ్లిస్ (Iblis) అసూయగా గమనించు.
అతడికి ఆదామంటే శత్రుత్వం. అసూయకు ఆనందం శత్రువు కదా!
స్వర్గలోకపు మార్గంలో ఇదే కష్టతరమైన దారి.
అసూయ ఆవహించని వాడిక్కడ అదృష్టవంతుడు.
గుర్తుంచుకో! ఈ దేహం అసూయకు నిలయం. కుటుంబమూ అంతే!
'మీరిద్దరూ నా ఇంటిని శుభ్రం చేయండి' –అన్నది దైవవాక్యం.

పరిశుద్ధ హృదయం దివ్యకాంతి నిలయం.
అసూయలేని వాడిపై అసూయ కుట్ర పన్నినవాడు
తన హృదయంపై నల్లని మచ్చను పొందుతాడు.
దేవుని అనుచరుల పాదాల కింద ధూళిగా నలిగిపోతాడు.
అందుకే అసూయపై ఇంత దుమ్మూధూళీ చల్లు.

## వజీరు అసూయ

అసూయలో మొలకెత్తిన వజీరుకు తన సామర్థ్యంపై
మితిమీరిన నమ్మకం. అందుకే తన ముక్కూ చెవులను త్యాగం చేసాడు.
తనకున్న అసూయ అనే ముల్లుతో క్రైస్తవులను కుట్టి
తనలోని విషాన్ని వారిలో ప్రవేశపెట్టాలనుకున్నాడు.
అసూయ తలకెక్కినవాడికి ఆధ్యాత్మిక విషయాల వాసన తెలీదు.
ఆధ్యాత్మిక వాసనలను పసిగట్టే నాసికను కోల్పోయి సత్యదూరుడైనాడు.
వాసన గ్రహించలేనివాడికి నాసిక ఉన్నా వ్యర్థమే!
వాసన గ్రహించినా కృతజ్ఞత లేనివాడి నాసిక నాశనమౌతుంది.
అందుకే దేవునికి కృతజ్ఞతలు తెలియజేసి దైవభక్తుల దారిలో నడువు.
వజీరులా బందిపోటు దొంగవు కాకు. ప్రార్థనల నుంచి భక్తులను మళ్లించకు
బయటకు మతబోధకుడిలా కనిపించిన వజీరు
ఆల్మండ్ కేకులో వెల్లుల్లి రహస్యంగా జొనిపినవాడైనాడు.

## వజీరు మోసాన్ని గ్రహించని క్రైస్తవులు

వజీరు మాటలలోని తియ్యందనానికి ముగ్ధులై వారతనిని అనుసరించినారు.
సత్య విషయాలలో అక్కడక్కడా అసత్యాన్ని రంగరించి
చక్కెర తీపి పదార్థంలో కాసింత విషాన్ని కలుపుతున్నాడా వజీరు.
పైకి 'నిరాడంబరంగా బతుకు'; లోపల ఆత్మతో– 'విశృంఖలంగా చరించు'
వెండి పైకి తెల్లగా కనిపించినపుడు, చేతులు దుస్తులు నల్లబడతాయి.
అగ్ని ఎర్రగా కాంతిరవ్వలను వెదజల్లుతున్నా అది పడినచోటు నల్లగా మారదా!
మెరుపు అత్యంత ప్రకాశవంతంగా ఉన్నా, చూస్తే కళ్లకు చీకట్లు కమ్మవా!

అజాగ్రత్తలో ఉన్న క్రైస్తవులకు, వజీరు మాటలు వాళ్ల మెడలో పటకాలైనవి.
ఆరేళ్లపాటు అతడు క్రైస్తవులకు ఆలంబనగా మారినాడు.
తమ మతభావాల్ని, హృదయాల్ని అతడికి అర్పణ చేసి,
అతడి కోసం చావడానికి సిద్ధంగా ఉన్నారా క్రైస్తవులు.

రాజు, వజీర్‌ల మధ్య రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతున్నాయి.
'మంత్రీ! సరైన కాలం వచ్చింది. నా కోరిక నెరవేర్చు!'
'ప్రభూ! నేను ఇప్పుడు జీసస్ మతంలో కలతలు తేనున్నాను!'

## క్రైస్తవుల పండ్రెండు తెగలు

వారిలో పండ్రెండు తెగలకు పండ్రెండు నాయకులు (అమీర్లు)న్నారు
ప్రతి తెగలోని ప్రజలూ వారి అమీర్‌కు అత్యంత విధేయులు.
పన్నెండుమంది అమీర్లూ దుష్టవజీరుకు సేవకులైనారు.
వజీరు మాటలను సంపూర్తిగా విశ్వసించి, అనుసరించసాగినారు.
వజీరు కోరితే మారు మాట్లాడకుండా ప్రాణాలను విడవగలరు.

## సువార్తకు వక్రభాష్యాలు పలికిన వజీరు

ప్రతి అమీర్‌కు ఒక లిఖిత శాసనపు కాగితపు చుట్టనిచ్చినాడు.
ప్రతి చుట్ట (Scroll)లో వేర్వేరు విధివిధానాలను నిర్దేశించినాడు.
అవన్నీ తుదినుండి మొదలు వరకు పరస్పర విరుద్ధాలుగా ఉన్నాయి.
ఒకదానిలో ఆకలిని జయించడం, భౌతిక సుఖాలకు దూరంగా
ఉండటమే ప్రాయశ్చిత్తానికి మూలము, మార్పునకు చిహ్నమని–

మరోదానిలో భౌతిక వాంఛలకు దూరంగా ఉండటం వలన ప్రయోజనం లేదు.
దాని వలన దాతృత్వము పెరుగుతుందేమోకాని సత్యపు దారి దొరకదన్నాడు.

ఇంకొకదానిలో ఉపవాసము, దాతృత్వము భగవానుని చేరేందుకు
దారిచూపే ప్రత్యక్ష మార్గాలని వ్రాసినాడు. నమ్మకమే ముఖ్యం.
సుఖ దుఃఖాలకు అతీతంగా జీవితాన్ని గడుపు. అవన్నీ ఉచ్చులన్నాడు.

మరో దానిలో– దైవసేవ బంధం కారాదు. అది అనుమానాన్ని రేకెత్తించదు.

ఇంకొకచోట– దైవాజ్ఞలు, నిషిద్ధాలు ఆచరణ కొరకు కాదు
అవి మనలోని బలహీనతలను ఎత్తిచూపే మార్గాలు.
దేవుని సర్వోత్కృష్టతను తెలిపే కాంతి దీపాలన్నాడు.

మరోచోట– నీ బలహీనతను గణించకు. అది కృతఘ్నత.
నీ శక్తిని గమనించు. అది దైవ ప్రసాదం.

ఇంకోచోట– బలం, బలహీనతలను వదిలివేయి.
నీకు కనిపించేది దేవుని ప్రతిరూపాలే!
దీపాన్ని ఆర్పివేయకు. ధ్యాన నిమగ్నుడివి కావడానికది ఉపయోగిస్తుంది.
బాహ్యదృష్టిని లోనికి మరలించాక దీపంతో పనిలేదు.

ఇంకోచోట– దీపాన్ని ఆర్పివేయుము. వేలాది దీపాలు సాక్షాత్కరించును.
అంతర్దీపాన్ని వెలిగిస్తే నీ లైలా నీకు మజ్నూగా మారుతుంది.
ప్రపంచాన్నే త్యాగం చేసినవాడికి ప్రపంచం మరింత దగ్గరవుతుంది.

మరోచోట– ఏది చేసినా దేవుడు నీ మేలుకొరకు సృజించాడు.
సృష్టిలో ప్రతి వస్తువుకూ ఉపయోగముంది. ఆందోళన చెందకు.

ఇంకోచోట– 'నా' అనే దాన్ని వర్జించు. నీ సహజ ప్రవృత్తిని
అనుసరించావా ఆత్మవినాశనాన్ని కొనితెచ్చుకుంటావు.
అనేక దార్లను కనుగొని తనకి నచ్చిన దారే సరైనదనుకుంటున్నావు.
అదే నిజమైతే యూదులకు, జోరాస్ట్రియన్లకు దేవజ్ఞానముండేది.

మరోచోట– ఆధ్యాత్మిక జీవనమే హృదయస్పందనమైనపుడు దైవమార్గం
స్పష్టంగా కనిపిస్తుంది. ఇంద్రియసుఖాలు ఒంద్రుమట్టిలో
మొక్కల్లా ఎండి నశిస్తాయి. వాటి ఫలసాయము శూన్యమే!
పశ్చాత్తాపము మిగుల్తుంది. దాని నమ్మితే వచ్చేది నష్టమే కదా!
అదీ సులభం కాదు. చివరకు కష్టమే నిలుస్తుంది.
అన్ని సులభమార్గాలు అదృశ్యమయ్యాక మిగిలే శాశ్వత
దైవమార్గాన చరించేప్పుడు అనేక కష్టనష్టాలను ఎదుర్కోవాలి.

ఇంకోచోట– సరైన గురువుకై అన్వేషించు. వంశపారంపర్య లక్షణాలలో
దూరదృష్టి ఉండడం తక్కువగా కానవస్తుంది.
ప్రతి మతమూ అంతాన్ని నిర్వచించాయి, వాటి పరిస్థితులకనుగుణంగా.
అంతాన్ని వ్యాఖ్యానించడం నేతమగ్గాన్ని గమనించడమంత సులువు కాదు.
చూడు! ఎన్ని తేడాలున్నాయో ఈ మతాలలో!

మరోచోట– నీవే అసలైన గురువు,
ఎందుకంటే గురువు గురించి నీకు తెలుసు గనుక!
ఏ మనిషీ ఇంకో మనిషికి దారి చూపించలేడు. నీ దారి నీవే వెదుక్కో?

ఇంకోచోట– ఈ మార్గాలన్నీ చేరేది ఒకచోటుకే
వంకర కళ్లున్నవాడు దేనినీ స్పష్టంగా చూడలేడు.
వంద ఎన్నడూ ఒక్కటి కాబోదు. పిచ్చివాడే ఔననగలడు.
సిద్ధాంతాలన్నీ పరస్పర విరుద్ధాలు. పంచదారా, విషమూ ఒకటి కాబోవు.
ఈ పంచదార, విషాల్ని దాటి అన్వేషిస్తేనే ఏకాత్మను దర్శిస్తావు.

అలా అతడు పన్నెండు పుస్తకాలను వ్రాసి
ఒక్కొక్కటి ఒక్కో నాయకుడి కిచ్చాడు.

## సిద్ధాంతాలేవీ సత్యమార్గ దర్శనాలు కావు

ఆ వజీరుకు జీసస్ ధర్మప్రవచనపు వాసనలు తెలీదు.
జీసస్ జీవకలశపు ద్రవాన్నతడు చూడలేదు.
ఆ పవిత్ర కలశంలో ముంచితే నూరు రంగులున్న వస్త్రం
ధవళకాంతితో మిలమిలలాడే ఏకవర్ణ వస్త్రమౌతుంది.
అది ధరించితే అలసట ఉండదు. నిర్మల జలాల్లో ఈదులాడే చేపలా
వ్యక్తి నిత్యజీవనుత్తేజంతో తొణికిసలాడుతాడు.
నేలపై వేలాది వర్ణాలున్నా, చేపలు నిర్మలమైన నీటికై తహతహలాడతాయి.
ఎవరు చేప, ఎవరు నీరు; ఎవర్ని పోలి ఉంటాడా జగత్ప్రభువు?

జీవన ప్రపంచంలో అసంఖ్యాక సముద్రాలూ, చేపలూ
ఆ అత్యంత దయామయుడూ, భాగ్యశీలి ముందు మోకరిల్లుతాయి.

ముత్యపు చిప్పలో బడిన చినుకు ముత్యమవుతుంది.
దాతృత్వపు సూర్యుని వెలుగును చూసి మేఘాలు, సముద్రాలు దాతలైనాయి.
జ్ఞానసూర్యుని కిరణాలు తాకిన నేల విత్తన యోగ్యమవుతుంది.
ఏది విత్తినా ఫలించి కృషికి తగిన ఫలితాన్నిస్తుంది.
దైవవిశ్వాసాన్ని అనుకరించే అంకురమై సూర్యుని వెలుగును పొందుతుంది.
–దేవుని అనుమతి పత్రాన్ని తీసుకుని వసంతం వచ్చేవరకు
నేల తన రహస్యాలను వెల్లడిచేయదు.
–నిశ్చల, నిర్జీవ పదార్థాలకే ఇటువంటి శక్తినిచ్చిన ఆ సర్వోన్నతుని
ఆగ్రహం, జ్ఞానులమని విర్రవీగేవాళ్లని అంధులను గావిస్తుంది.
–మానవ హృదయం, ఆత్మ ఆ పొంగును తట్టుకోలేవు.
ఈ విషయాల్ని నేనే చెవికి అందజేయాలి? ఎవరర్థం చేసుకోగలరు?
–వినికిడి ద్వారా చూపు శక్తివంతమౌతుంది. రాయి ముక్క నీలమణిగా ప్రకాశిస్తుంది.
–అతడు మహా రసవాది. రసవాదమంటే ఇత్తడి పుత్తడి కావడమేనా?
ప్రవక్తలకు ప్రత్యేక శక్తులనిచ్చినవాడు. ఆ శక్తుల ముందు మంత్రాలేపాటి?
–నేను దేవుడిని పొగడ్తున్నానంటే నిజానికి నేను పొగడడం లేదు.
పొగడ్తున్నానంటే నేనున్నట్లే కదా! 'నేను' అనేదే పాపం.
–అతడున్నచోట నేనుండదు. అతడి కాంతిముందు నేను నల్లటి చీకటిని.
దానికి చూపుంటే ఎప్పుడో కరిగిపోయేది. దివ్యసూర్యప్రకాశంలో నివ్వెరపోయేది.
దుఃఖము వలన నీలమైనది కావుననే ఈ నేల ఘనీభవించినది.

## వజీరు పాపం

తన రాజులానే వజీరు కూడ అజ్ఞాని, దుందుడుకు స్వభావి.
శాశ్వతుడైన విధితో తలపడుతున్నాడు అతడు.
మన లోకాల్లాంటివి నూరింటిని క్షణంలో నిశ్శేషం చేయగలవాడితో
నూరిటిని క్షణంలో మనముందు సాక్షాత్కరింపజేయగలవాడితో,
మనకు అంతూ పొంతు లేనిదిగా కనిపించే ఈ విశ్వమతనికి అణు మాత్రమే!
మన ఆత్మలు నిర్బంధింపబడిన జైలు ఈ ప్రపంచం!
దీనిని దాటి తరలి ఆతడి స్వేచ్ఛాప్రపంచంలోకి వెళ్లు.

ఒకటి ఎల్లలున్న ప్రపంచం. అది అనంత విశ్వం.
రూప చిత్రాలు సత్యమార్గాన్వేషణకు ప్రతిబంధకాలు
ఫారో రాజభటుల వేలాది బల్లేలు
ఒక్క మోసెస్ దండపు ధాటికి మొక్కవోయాయి.
మహావైద్యుడు గాలెన్ లాంటి ప్రసిద్ధ వైద్యుల వైద్యచికిత్సలన్నీ
జీసస్ జీవజల సూర్యకాంతి ముందు కొడిగట్టిన దీపాలే!
అతని రాకపూర్వమున్న అనేక ఉద్గ్రంథాలు
నిరక్షరాస్యుడైన ప్రవక్త ముందు వెలవెలపోయిన కాగితాలే!
అటువంటి ప్రభువు కోసం ఆత్మార్పణ చేయనివాడు మూర్ఖుడు.
పర్వత సమాన మనస్సును పెకలించినవాడతడు.
మోసకారి పక్షులను కాళ్లతో వేలాడ గట్టినవాడు.
అనవసరపు తెలివితేటల ప్రదర్శన కాదు,
ఆత్మార్పణ గెలుస్తుంది ప్రభువు మనస్సును.

గుప్త నిధుల అన్వేషణలో భూమికి రంధ్రాలు చేసినవారు
ఆ దుష్ట వజీరుకు ఇష్టస్నేహితులైనారు.
ఏ వృషభానికి నీవు గడ్డానివి? ఏ నేలపై నీవో మోడువి?
తన వంచన గుర్తించబడి పాలిపోయిన వదనమున్న స్త్రీని
దేవుడు జుహ్రా (Venus) గ్రహంగా మార్చినాడు.
స్త్రీని గ్రహంగా మార్చిన దేవుడు ఈ భూమినేం చేయబోతున్నాడు?
నీ ఆత్మ నిన్ను ఊర్ధ్వలోక స్వర్గానికి తీసుకుపోతున్నపుడు
నీవు అధోలోకపు నీరు, మట్టిని కోరుకున్నావు.
అందుకనే ఆ ఉన్నత స్థానం నుంచి నేలపైకి కూలిపోయినావు.
నీ కోరికల గుర్రాన్ని తారామండలం వేపు పయనించమని,
ఆద్యుడైన ఆదామును గుర్తించకుండా సాగిపోయావు.
ఏది ఏమైనా నీవు అతడి వంశీకుడివి.
మూర్ఖుడా! ఎన్నాళ్లు నీవు నిన్ను అధమస్థాయిలో ప్రతిష్ఠించుకుంటావు?
ఎన్నాళ్లు విర్రవీగుతావు నేను ఈ ప్రపంచాన్ని ఆక్రమిస్తాను,

దీనిని నా కీర్తిప్రతిష్ఠలతో నింపివేస్తానని?
ఈ భూమంతా మంచుతో కప్పబడితే, ఒక్క చూపును విసిరి
సూర్యుడు తన కిరణాల వేడితో మంచును కరిగిస్తాడు.
దేవుని ఒక్క కరుణాపూరితమైన చూపు,
లక్షలాది దుష్టవజీర్ల పాపభారాన్ని తొలగించి వేస్తుంది.
అతడు ఆ మోసపుటాలోచనలను జ్ఞానంగా,
ఆ విష జలాలను అమృతప్రాయంగా మారుస్తాడు.
అనుమానాలను పటాపంచలు చేసి, ద్వేషపు స్థానంలో ప్రేమను చిగురింపజేస్తాడు.
అగ్నిజ్వాలల్లో అబ్రహాంకు కనిపించినవాడు, భయాన్ని రక్షగా మారుస్తాడు.
నాకున్న సంశయ నివృత్తి గావించి, నన్ను జ్ఞానిగా మలుస్తాడు.

## వజీరు పన్నిన మరో పన్నాగం

ఈసారి వజీరు మరో కుట్ర పన్నినాడు. అకస్మాత్తుగా
అతడు మౌనవ్రతం అవలంబించాడు ఏకాంత స్థలంలో
నలభై యాభై రోజులు ఎవరికీ అందకుండా
తనను చూడాలనే తహతహను వారిలో రగిలించాడు.
అన్నిదినాలు అతడు కనపడకపోయేసరికి
వారు దాదాపు ఉన్మత్తులై అతడి కోసం దిగులుపడసాగినారు.
దుఃఖితులై వారు ప్రార్థనలు చేస్తున్నకొద్దీ
అతడు మరింత బిగువును చూపించసాగినాడు.
–"నీవు లేక మేము కాంతిహీనులమయ్యాము,
నాయకుడు లేని అంధుల పరిస్థితి మాది.
మామీదొట్టు, దేవుడిమీద ఒట్టు, వెంటనే యధాస్థితికి రా!
మేము అనాథ పిల్లలము. నీవు మా సంరక్షకురాలివి.
నీ రక్షణ ఛత్రం క్రింద ఇన్నాళ్లూ హాయిగా ఉన్నాము"

ఎట్టకేలకు వారిపై జాలిపడినట్లు అతడన్నాడు–
–"నన్ను ప్రేమించేవారికి దూరంగా నా ఆత్మ చరించలేదు.
కాని ముందుకు రావడానికి నాకు అనుమతి లేదు"–

పన్నెండుమంది అమీర్లు అతడి ముందుకు వచ్చినారు.
–"గురువర్యా! ఏమిటీ దురదృష్టం?
నీవు లేని మేము నాయకుడు లేని అనాథలం.
మా హృదయాలలోని ఆవేదనను గమనించు!
మమ్మల్ని మరింత పరీక్షించి దుఃఖితులను గావించకు!
తమ మకరంద ప్రవచనాలను, జ్ఞానక్షీరాన్ని తాగి బతుకుతున్నాము.

దేవా! ప్రభూ! మమ్మల్నింత నిర్దయగా చూడకు.
ఈ దినమే మమ్ము కరుణించు. రేపు మాపని జాగు చేయకు
హృదయపూర్వకంగా నీ వాళ్లము. నీవు లేని మేము శూన్యులము.
ఒడ్డున పడిన చేపల్లాంటి మాపై కాసిని నీళ్లను జల్లుము!
మూసి ఉంచిన ఆనకట్ట తలుపులను తెరచి మమ్ము కాపాడుము.
నీలాంటి గురువు ఈ ప్రపంచాన వేరొకరు లేరు.
దయ ఉంచి నీ ప్రజలను నీవే కాపాడుము"

## నిరాకరించిన వజీరు

వజీరు అన్నాడు– "మాటలకు బానిసలైన మిత్రులారా!
మీ జిహ్వా భాష్యాన్ని, శ్రవణశక్తిని కట్టడి చేయలేరా?
చెవుల్లో దూదిని నింపి, కనులపైనున్న పట్టీని తీసివేయండి.
బాహ్య శ్రవణేంద్రియము అంతరాత్మపై నుంచిన దూది లాంటిది.
చెవులకు చెవుడు సోకినప్పుడే అంతరాత్మకు బధిరత్వం సంభవిస్తుంది.
బాహేంద్రియ జ్ఞానము నశించిన పిదపే
నీకు దేవుని పిలుపు వినబడ్తుంది.
నీవు నిద్ర భాషనెలా అర్థం చేసుకొనగలవు?
మన మాట, నడక బాహ్య ప్రయాణపు చూపు,
అంతర్లోక ప్రయాణం ఆకాశం వేపు.
మట్టి నుంచి పుట్టిన దేహం పొడినేలనే చూసింది.
కాని, జీసస్ లాంటి ఆత్మ నీటిపైన నడవగలిగింది.

మట్టిలో పుట్టిన దేహం మట్టిలోకే మరలుతుంది.
కాని, ఆత్మప్రయాణం సముద్ర హృదయం వేపు సాగుతుంది.
నీ ప్రయాణమంతా నేలపై, కొండలపై, నదులపై, ఎడారులలో,
మరెప్పుడు జీవజలాన్ని పొందుతావు, కడలి అలల్నెలా చీలుస్తావు?
భూమిపై కనిపించే అలలు మన ఊహాజనితాలు,
ఆలోచనలు, అవగాహనల ప్రతిబింబాలు.
నీటిపై ఎగసిపడే అలలు అంతర్ముఖానికి,
ఉన్మత్తతకు, మృత్యువుకు చిహ్నాలు.
కర్మేంద్రియాల మత్తులో ఉన్నపుడు జ్ఞానేంద్రియాలకు దూరమౌతారు.
ఈ పాత్ర నుంచి తాగేప్పుడా కలశం నీకందదు.
వాగాడంబరము ధూళి వంటిది. మౌనం పసిడి లాంటిది.

## అమీర్ల ఒత్తిడి – వజీరు నిరాకరణ

గురువర్యా! ఏదో ఒక విషయాన్ని సాకుగా తీసుకుని
మమ్మల్ని తమనుంచి దూరం చేయ తగునా?
జంతువుల బలాన్ని బట్టి దానిపై బరువు వేయడం ఉచితం!
శక్తిని మించిన పని చేయడం దుర్లభం.
పక్షి పరిమాణాన్ని బట్టి గింజలు వేయాలి.
అన్నిటికీ మర్రి విత్తు ఆహారంగా చాలదు కదా!
పసిపాపకు పాలకు బాదులు రొట్టెనివ్వలేము,
ఇస్తే అది ప్రాణాంతకమవుతుంది కదా!
పళ్లు వచ్చినాక ఆ బిడ్డ తనంతట తనే తింటుంది రొట్టె.
రెక్కలు రాని పక్షి ఎగరడానికి ప్రయత్నిస్తే, పడి పిల్లికి ఆహారమౌతుంది.
అదే పక్షి రెక్కలు వచ్చాక సురక్షితంగా జీవిస్తుంది.
తమ వాక్కు దెయ్యాన్ని నిశ్శబ్దపరుస్తుంది.
మాకు కర్ణపేయమై జ్ఞానాన్ని కలిగిస్తుంది.
తమరు మాట్లాడ్తుంటే మా చెవులు పరవశిస్తాయి.
మీరు సముద్రమైతే మేము మామూలు నదులం.

మీరున్నపుడు ఈ నేల కూడా స్వర్గతుల్యమైనది.
ఆకాశంలో ఆర్కటరస్ నక్షత్రం, మీనరాశి మిలమిల మెరుస్తాయి.
మీరు లేని స్వర్గమైనా మాకు చీకటి గుయ్యారం.
తమతో పోలిస్తే, ఓ చంద్రుడా! స్వర్గమెటువంటిది?
అంతర్గతమైన రూపమున్నది స్వర్గం. పరిశుద్ధాత్మ దాని సారాంశం.
అంతర్గతమైన రూపము దేహమైతే, పేరు దాని సారాంశం.

## వజీరు సమాధానం

మీ వాగ్యుద్ధాన్ని కట్టిపెట్టి, నా మాటలను మీ ఎదలో ప్రతిష్ఠించుకోండి.
నన్ను మీరు విశ్వసిస్తే, నా విశ్వసనీయతను విశ్వసించండి.
నేను స్వర్గాన్ని నేలగా పిలిస్తే మీరూ దాన్ని అలానే పిలవండి.
నేను సంపూర్ణుడినని భావిస్తే, మీకిక సందేహమెందుకు?
నేను అలా కాకపోయినప్పుడు నన్నింకా మీరు ఇబ్బంది పెట్టడమెందుకు?
నేనీ ఒంటరితనాన్ని వదలలేను. నేను అంతర్గత అనుభవాలలో మునిగి ఉన్నాను.

## శిష్యుల ఒత్తిడి

ప్రభూ మాది అపనమ్మకం కాదు. మా మాటలు పరాయివాళ్లవి కావు.
మా కన్నీరు మీ ఎడబాటు వలన కలిగినది. ఈ నిట్టూర్పులు మా ఆత్మవి.
తన దాయితో తృప్తిచెందని శిశువు ఏడుస్తుంది, మంచీచెడూ తెలియనిది.
మేము వీణపై తీగలం. మా నుంచి రాగాలు పలికించే వైణికుడివి నీవు.
ఈ ఆలాపనా విలాపాలు మావికావు. అవి నీవు పలికించిన రాగాలే!
మేము వేణువైతే సంగీతకర్తవు నీవు.
పర్వతం మేమైతే దానినుంచి వెలువడే ధ్వని, ప్రతిధ్వని నీది.

జయాపజయాలందు మేము చదరంగపు బల్లపై పావులం.
గెలుపోటములు నీవి. విధానకర్తవు నీవు.
మా ఆత్మలలో ఆత్మవు నీవు. నీ పక్కన లేకుంటే మాకు ఉనికేది?
పరిపూర్ణుడవైన నీ ముందు మా ఉనికి ఉన్నా లేనిదే.

మేము గాలిలో కదలాడే పతాకపైన కనుపించే సింహాలం.
పతాక కనిపిస్తుంది. గాలి కనిపించదు. ఆ వాయువు నీవు.
మా కదలిక, మా ఉనికి నీవిచ్చిన బహుమతి. నీవు మా స్తపతి.
ఉండీ లేకపోవడంలోని ఆనందాన్ని నీవు మాకు చూపించావు.
నీపై సంపూర్ణ ప్రేమ ఉండేట్లు చేసావు, నీవు లేకున్నా!
ఆ భాగ్యాన్ని దూరం చేయకు. మా నుండి రొట్టెను,
మధువును, మధుపాత్రను వేరుచేయకు.
అది దూరమైతే మమ్మల్ని ప్రశ్నించేదెవరు? చిత్రకారుడితో చిత్రాలు ఉంచేదెవరు?
మావేపు నిశితంగా చూడవలదు. నీ కరుణ, దయలపై దృష్టి నిలుపు.
మేము కోరక మునుపే మాపై అమృతధారలను వర్షించావు.
నీ కరుణాపూరిత దృక్కులను పలకని ప్రార్థనలా కురిపించావు.
చిత్రకారుడు, కుంచె ముందర, చిత్రం ఓ గర్భస్థశిశువు లాంటిది.
ఆ సర్వశక్తిమంతుని ఎదుట సమస్త జీవప్రపంచం
సూది ముందు వస్త్రంలా అసహాయ స్వరూపం.
అతడు ఒకసారి సాతానును, ఒకసారి ఆదామును చిత్రించినట్లే
దుఃఖాన్ని, సుఖాన్ని చిత్రంగా మనకిస్తాడు.
ఆత్మరక్షణ, ఆక్రందన, శత్రుత్వం, గాయాలు లేవక్కడ.
నీవు ఈటెను విసిరావంటే నీవే విసిరినట్లు కాదు.
మనం విల్లు ఎక్కుపెట్టి బాణాన్ని వదిలినా అది మనం వదిలినట్లు కాదు.
మనం విల్లులాంటి వాళ్లం, బాణాన్ని వదిలేది దేవుడే!
ఈ వ్యాఖ్యానం ఆ సర్వశక్తిమంతుడిని వినయంగా సంబోధించడం.
మన ప్రవర్తన అవసరాన్ని తెలియజేస్తుంది.
అపరాధ భావన స్వేచ్ఛా ఆలోచనను విడమరుస్తుంది.
స్వేచ్ఛా ప్రవర్తన లేకుంటే సిగ్గు చెందాల్సిన అవసరమేముంది?
ఈ దుఃఖం, అపరాధపు అభద్రతల గందరగోళానికి చోటెక్కడుంది?

గురు శిష్యుల మధ్య సంవాదమెందుకు? ప్రణాళికలో మార్పులెందుకు?
స్వేచ్ఛా ప్రవర్తకుడు దైవమార్గదూరుడైనపుడు
దేవుని చంద్రుడు మబ్బులలో మాయమవుతాడు.

అపనమ్మకాన్ని వర్జిస్తే దైవధర్మానికి దగ్గరవుతాము.
జబ్బుపడినప్పుడు పశ్చాత్తాపం, వినయం ప్రత్యక్షమవుతాయి.
రుగ్మత వచ్చేది అంతరాత్మ మెలకువకు వచ్చినప్పుడు.
నీకు జబ్బు వస్తే తప్పులను క్షమించమని దేవుడిని ప్రార్థిస్తావు.
నీ పాపపు దోషం నీకు చూపబడగానే
సరైన దారిలోకి వస్తానని నిర్ణయిస్తావు.
దేవుడికి వినయ విధేయతలతో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తావు.
దీనిని బట్టి రుగ్మత నీకు అంతరాత్మను, మెలకువను ఇస్తుందని అర్థమౌతుంది.
ఓ అన్వేషకుడా! బాధే సరైన మార్గాన్ని చూపుతున్నది.
ఎంత మెలకువ ఉంటే బాధ అంత తీవ్రం.
ఎంత దైవజ్ఞానం వస్తే అంత పాలిపోతుంది నీ వదనం.
దైవమార్గం తెలిసి ఉంటే ఏదీ నీ వినయపు జాడ?
సర్వశక్తిమంతుడి గురించి ఏదీ నీ అవగాహనా నీడ?
సంకెళ్లలో బంధించబడినవాడు ఆనందించగలడా?
ఖైదీ ఎప్పుడు స్వేచ్ఛాజీవిలా సంచరించగలుగుతాడు?
కాళ్లకు శృంఖలాలతో రాజభటుల కాపలాలో ఉన్నట్లు ఊహించుకో!
అప్పుడు నీవు క్రూరుడైన అధికారిలా వ్యవహరించగలుగుతావా?
అసహాయుడి తత్త్వం కాదది. స్వేచ్ఛగా ఉన్నవాడు దర్పంగా ఉంటాడు.
దైవశాసనాన్ని నీవు స్పృశిస్తుంటే, నీ మొహంలో ఎక్కడా భావన?
నీకేదైనా పని చేయాలనిపిస్తే, నీ శక్తి నీకు తెలుసు.
నీకా కోరిక లేనపుడు, ఆ పనిని దేవుడు పంపాడంటావు.
ప్రవక్తలు ప్రాపంచిక కార్యాలను వర్జిస్తారు. అవిశ్వాసులు ఆహ్వానిస్తారు.
విశ్వాసులకు పరలోక కార్యాలు స్వేచ్ఛామనోవాంఛితాలు
అవిశ్వాసులకు ఈ లోకపు పనులు స్వేచ్ఛామనోపూరితాలు.
గూటికి పోయే ప్రతిపక్షికీ దాని ఆత్మ ముందు దారి చూపుతుంటుంది.
నరకలోక జనితులైన అవిశ్వాసులకు ఈ లోక బంధనం తప్పదు.
స్వర్గలోక పుత్రులైన ప్రవక్తలు, దివ్యాత్మ వేపు చరిస్తారు.
ఈ చర్చ అనంతం. మనం ప్రస్తుత కథలోకి నడుద్దాం.

## వజీరు పట్టుదల - శిష్యులలో నిరాశ

వజీరు గొంతెత్తి అరిచాడు–

శిష్యులారా! ఇది నా మాట! జీసస్ నాకొసగిన సందేశం!
–*'నీవు దేవుని ప్రతినిధివి. నా అనుచరుడివి.*
*గోడకు అభిముఖంగా కూర్చో. ప్రాపంచిక బంధాలు తెంపివేయి.*
*నీ ఉనికి కూడ నీకు తెలియరాదు. ఇక సంభాషించకు!'*–
మిత్రులారా! నేను మరణించాను. మాటలకిక అనుమతి లేదు.
నా వస్తువులను నాలుగవ స్వర్గంలోకి తీసుకుపోతున్నాను.
కష్టాలు మోసాల కట్టెలు కాల్చలేని అగ్నిగోళంలోకి వెళ్తున్నాను.
అక్కడ, ఆ నాల్గవ స్వర్గంలో జీసస్ పక్కన ఆసీనుడనౌతాను.

## తన వారసులుగా అమీర్లను నియమించిన వజీరు

తరువాత వజీరు ఒక్కొక్క అమీరును పిలిచి మాట్లాడినాడు.
ప్రతి ఒక్కరితో అతడు ఈ విధంగానే పలికినాడు.
–జీసస్ మతానికి నీవు దైవ ప్రతినిధివి. నా అనుచరుడివి.
మిగతా అమీర్లు నీ అనుయాయులు. నీ అనుచరులు.
ఎవరైనా కాదని ఎదురు తిరిగితే వారిని కత్తికెరచేయి, బంధించు.
కాని, నేను బతికున్నంత కాలం ఇది వెల్లడి చేయకు.
నేను చనిపోయేంతవరకు నీ సర్వంసహాధికారాన్ని తెలియనివ్వకు.
అప్పటి వరకూ ఈ రహస్యాన్ని నేనూ బహిర్గతం చేయను.
ఇదుగో, ఈ పవిత్ర పుస్తకం తీసుకో! దీనిలో శాసనాలున్నవి.
ఒక్కొక్క దాన్ని జాగ్రత్తగా పఠించు, అమలుచేయి తరువాత!–

అలా ప్రతి ఒక్కరితో– 'నీవే నా తరువాత దైవప్రతినిధివి' అన్నాడు.
అందరినీ అలాగే సంబోధించాడు. దానిని రహస్యంగా ఉంచమన్నాడు.
'యా' నుంచి 'అలిఫ్'కు అక్షరాలెలా విభిన్నంగా ఉంటాయో
వారికిచ్చిన పవిత్ర పుస్తకంలోని శాసనాలూ అంతే విభిన్నమైనవి.
అవి పరస్పర విరుద్ధాలు. ఘర్షణా జనకాలు.

# వజీరు ఆత్మహత్య

నలభై రోజులు అతడు తలుపులు మూసిన గదిలో ఉండి
నిద్రాహారాలు లేకుండా ప్రాయోపవేశంతో ఆత్మహత్య చేసుకున్నాడు.
అతడి మరణవార్త తెలియగానే ప్రజలు అన్నిదిక్కుల నుండి
అసంఖ్యాకంగా వచ్చి, జుట్టు పీక్కుంటూ, దుస్తులు చింపుకుంటూ దుఃఖించినారు.
అరబ్బులు, టుర్కులు, గ్రీకులు, కుర్దులు ఎంతమంది వచ్చారో దేవుడికే ఎరుక.
అతడి సమాధి మట్టిని తలపై పెట్టుకున్నారు. అనంతంగా దుఃఖించారు.
ఒక నెల పాటు సాగిన ఆ సంతాప సమయంలో
వాళ్ల కన్నీళ్లు రక్తపువాగుల్లా పారాయి.

# వజీరుకు వారసుడెవరని ప్రశ్నించిన ప్రజలు

'మీలో ఎవరు ఆ మహానుభావుడి వారసుడని' ప్రజలడిగారు.
అతడిని గురుస్థానంలో ఉంచి మేం విధేయులమౌతాము.
సూర్యుడస్తమించాక చీకటి కమ్ముతుంటే దీపముండాలి కదా!
అతడితోపాటు అదృశ్యమయ్యే అదృష్టానికి నోచుకోలేదు,
కనీసం అతడి వారసుడి అండన జీవిద్దాం.
గులాబితోట ఎండిపోయి గులాబీలదృశ్యమైనపుడు
మనకు మిగిలిన గులాబీ అత్తరు పరిమళాలలో గతాన్ని చూడవచ్చు.
దేవుడు స్వయంగా ప్రత్యక్షము కానపుడు, ప్రవక్తలను పంపుతాడు.
కాని దైవ ప్రతినిధులు ఒక్కరికంటె ఎక్కువైతే అది మంచిది కాదు.
రూపాన్ని పూజించేప్పుడు నీవిద్దరివి, అస్తమించిన
ఆ మహానుభావుడికి రూపరహిత పరమాత్మ ఒక్కడే!
రూపాన్ని చూసే కళ్లు రెండు. కళ్ల నుంచి వెలువడే కాంతి ఒక్కటే.
రెండుకళ్ల నుంచి వెలువడే కాంతిని విడదీసి చూచుట కష్టం.
పది దీపాలున్నాయనుకో వేర్వేరు రూపాలుండవచ్చు.
వెలువడే కాంతి ఒకే రంగులో ఉన్నపుడు ఏ కాంతి దేనిదో చెప్పడం కష్టం.
వంద ఏపిల్ ఫలాలను లెక్కించవచ్చు వాటి రూపాన్ని బట్టి,

కాని, రసందీసి కలిసాక దేనిదే రసమో చెప్పలేము.
ఆత్మకు బేధాలు, సంఖ్యలుండవు. వ్యక్తులు, అడ్డుగోడలుండవు.
స్నేహం తీయనైనది. రూపం అహంకార పూరితమైనది.
కష్టాలతో దేహాన్ని ఒడిలింపజేయి. అడుగున నిధి దొరుకుతుంది.
నీవు చేయకపోతే అతడు చేస్తాడు. నా హృదయం అతడి బానిస.

అతడు మన హృదయంలో ప్రత్యక్షమవుతాడు.
భక్తుల చిరిగిన దుస్తులను కుట్టిపెడతాడు.
మనమంతా ఒకే మట్టినుంచి తయారు చేయబడినవాళ్లం.
శిరస్సు, పాదాలు లేకుండా ఉన్నాము.
సూర్యుడిలా ఒక్కరమే! నీళ్లలా ముడిలేని స్వచ్ఛమైనవాళ్లం.
కాంతి, రూపాన్ని పొందినపుడు యుద్ధపు గుంపు నీడలు కానవస్తాయి.
గుంపులో కలిసాక విభేదాలు మాయమవుతాయి.

'ఈ విషయాలు జటిలమైనవి. అర్థం కావడం కాస్త కష్టం.
కత్తిమొనలా పదునైనవీ భావాలు నిన్ను గుచ్చుకుంటాయి.
డాలులాంటి విచక్షణా జ్ఞానంతో వీటిలోని మంచిని గ్రహించు.
రక్షణ లేకుండా యుద్ధానికి దిగకు. కత్తికి నీ నా భేదం లేదు.
ఇప్పుడు కత్తిని ఒరలో ఉంచాను. అపార్థానికిక ఆస్కారం లేదు.
ఈ కథ ముగింపుకు వస్తున్నది'

అప్పుడు అక్కడ సమావేశమైన యావన్మంది అనుయాయులూ
ముక్తకంఠంతో తమకు వజీరుకు వారసుడిగా ప్రతినిధి కావాలన్నారు.

## అమీర్లలో తగాదా

అమీర్లలో ఒకడు ధైర్యంగా ముందుకు వచ్చి ఇలా అన్నాడు–
–"చూడండి! మీరు ఎదురుచూస్తున్న వ్యక్తిని నేనే!
ప్రస్తుతకాలంలో జీసస్ ప్రతినిధిగా నియమింపబడ్డాను.
ఈ పుస్తకమే దానికి సాక్ష్యం. ఇదుగో చూడండి"–

మరో అమీరు ముందుకు వచ్చి తానే ప్రతినిధినన్నాడు.
అతడూ తన చంకలోంచి కాగితపు చుట్ట తీసి చూపించాడు.
మిగతావాళ్లూ తమతమ హక్కుల్ని, పుస్తకాల్ని జనం ముందుంచారు.
కోపాలు హద్దులు దాటాయి. ఎవరికి వారే తమది నిజమన్నారు.
ఒక చేతిలో ఖడ్గం మరో చేతిలో పుస్తకం,
మదించిన ఏనుగుల్లా పోరాటానికి సిద్ధం.
అమీర్ల అనూయాయుల్లో పొంగింది వీరావేశం.
లక్షలాది మంది క్రిస్టియన్లు వేర్వేరు గుంపులైన తరుణం.
ఖడ్గాల మెరుపుల్లో శవాల గుట్టలు, శిరస్సుల గుత్తులు.
ఏరుల్లా పారిన రక్తం. ఆకాశాన్నంటిన రుధిర ధూళి.
వజీరు నాటిన సంశయ విత్తనాలు ఒక మహోత్పాతాన్ని సృష్టించాయి.

బాదంకాయ పగలగొట్టినాక వచ్చే పప్పులా
మరణానంతరం మిగిలే ఆత్మ స్వచ్ఛమైనది.
భౌతిక దేహానికి సంభవించే కత్తివేటు, మృత్యువూ
ఏపిల్, దానిమ్మ పళ్లను పగలగొట్టడం లాంటివి.
వాటిలో మంచిది, తీపిగా ఉన్నది రసానికి పనికి వస్తాయి.
కుళ్లినవి దుర్గంధ వాయువుల్ని వెలువరిస్తూ శబ్దిస్తాయి.
మంచి గౌరవింపబడ్తుంది. కుళ్లినది పారవేయబడ్తుంది.

వెళ్లు! సత్యాన్ని అన్వేషించు! రూపాన్ని పూజించేవాడా!
వాస్తవం రూపానికి రెక్కలాంటిది.
సత్యాన్వేషకులతో కలిసి ప్రయాణించు. ఘనమైన బహుమతిని పొందు.
సత్యదూరమైన ఆత్మ ఒరలో ఉన్న కొయ్యఖడ్గం లాంటిది.
కొయ్యఖడ్గంతో యుద్ధానికీ పోగలవా? ముందు నీ ఖడ్గాన్ని సరిచూసుకో!
అది చెక్కకత్తి అయితే వర్జించు. లోహపు ఖడ్గమైతే ధరించు.
సాధుసంతులకు సత్యమే ఖడ్గం! వారిననుసరించుటే ముక్తిమార్గం.
జ్ఞాని సామాన్యులకు కరుణతో దారిచూపును.
దానిమ్మ పైతొక్కను ఒలిస్తే, ముత్యాల గింజలు చిరునవ్వు నవ్వుతాయి.

దాని నవ్వు ఆశీర్వదించబడునుగాక! ఆ నవ్వు నుంచి దాని హృదయం
నగలపెట్టెలో ముత్యంలా ప్రకాశిస్తుంది.
ఆశీర్వదించబడని నవ్వు సముద్రపు ఎర్ర ఏనిమోన్ నవ్వు.
దాని నల్లని నవ్వు కఠిన హృదయాన్ని తెలియబరుస్తుంది.

నవ్వే దానిమ్మ, తోటను నవ్వులలో ముంచెత్తుతుంది,
మంచివారితో స్నేహం నిన్నూ మంచివాడిని చేస్తుంది.
నీవు శిలాహృదయుడివైనా, చలువరాతిలా ఉన్నా
సాధుసంతుల సన్నిధిలో రత్న సమానుడవుతావు.
నీ ఆత్మలో సాధువుల ప్రేమను ప్రవేశపెట్టు,
ఆనంద మార్గావలంబకుల లోగిలిలో నీ హృదయాన్ని విడిచిపెట్టు
నిరాశా ప్రదేశంలోకి అడుగుపెట్టకు. అవిగో ఆశాదీపాలు.
చీకటి రాజ్యంలో చిక్కుకోకు. అవిగో సూర్యరూపాలు.

నీ హృదయం నిన్ను హృదయమున్న వారి వేపు నడిపిస్తుంది.
నీ శరీరం నిన్ను నేల, నీరున్న ఖైదువేపు కదిలిస్తుంది.

నీ హృదయం సంభాషణను తత్సమానులతో పంచుకో.
జ్ఞాన సంపదను నీకన్న అధికుల నుండి పెంచుకో.

## ముస్తఫా (మహమ్మదు) – శాంతిః శాంతిః

సువార్తలలో ముస్తఫా గురించి పేర్కొనబడి ఉన్నది.
పవిత్రమైన, స్వచ్ఛమైన సముద్రము వంటి వాడు ముఖ్యప్రవక్త.
అతడి రూపురేఖల గురించి, ఆహార విహారాల గురించి పేర్కొనబడినది.
క్రైస్తవులలో కొందరు దివ్యలోకపు బహుమతికై సువార్త పఠిస్తున్నపుడు
ఆ మహాజ్వాల సమీపమునకు వచ్చిరి.
ఆ పదాన్ని ముద్దాడి, వర్ణనను శిరసు వంచి ఔదల దాల్చిరి.
అటువంటి క్రైస్తవులు ఇంతకుముందు చెప్పుకున్న
అల్లకల్లోలాలకు దూరంగా ఉన్నవారు.
వజీరు, అమీర్ల తగాదాలంటనివారు. అహమ్మదు నాశ్రయించినవారు.

వారి వంశం దినదిన ప్రవర్ధమానమై, ముహమ్మద్ కాంతులను పొందినది.
మిగతా క్రైస్తవులు మహమ్మదు నామమును తిరస్కరించినారు.
ఒకరితో ఒకరు కలహించుకుంటూ వేరువేరు వర్గాలైనారు.
ఇదంతా వజీరు కుట్రని వారికెలా తెలుస్తుంది?
వజీరు ఇచ్చిన పుస్తకాలవల్ల వారి మతం, నమ్మకాలు
పరస్పర విరుద్ధాలుగా, ఘర్షణా జనకాలుగా మారినాయి.
మహమ్మదు నామము ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో
ప్రకాశవంతమైన దీపమై తన అనుయాయులను రక్షిస్తుంది.
మహమ్మదు నామము ఆ క్రైస్తవులకు చొరరాని కోటగా ఉన్నదంటే
ఆ అద్భుత విశ్వసనీయమైన ఆత్మస్వరూపమెట్లాంటిది?

## జీసస్ మతాన్ని నాశనం చేయబోయిన మరో యూదులరాజు

వజీరు కుట్ర వలన క్రైస్తవ సమూహంలో రక్తపాతం సంభవించింది.
ఆ తరువాత కొన్నాళ్లకు మరో యూదు ప్రభువు
తనను తాను జీసస్ మతావలంబకుల ధ్వంసకుడిగా ప్రకటించుకున్నాడు.
ఇతడి గురించి మీరు తెలుసుకోవాలనుకుంటే
పవిత్రగ్రంథం (ఖురాన్)లోని ఆదికాండంలోని గ్రహస్థితులను గమనించండి.
ఇతడూ మునుపటిరాజు అడుగుజాడల్లోనే నడిచాడు.
దుష్టమార్గావలంబకులు ప్రతిఘడియకూ ఏదో చెడు పని చేస్తూనే ఉంటారు.
సత్ప్రవర్తకులు నిష్క్రమించిన తరువాత కూడా వారి దారులు శాశ్వతాలు.
వంచకుల దారులనిండా అన్యాయపు శిధిలాల జాడలు.
పునరుత్థాన దినం వరకు అవిశ్వాసుల ముఖం అటువేపు తిరిగి ఉంటుంది.
శుద్ధ, కలుషిత జలాలు ప్రవహించేనాడులు,
పునరుత్థాన దినపు బాకాలు మోగేవరకు వెనకటిలానే ఉంటాయి.
సత్ప్రవర్తకుడికి శుద్ధ తియ్యని జలాలందుతాయి.
అతడికి పవిత్ర గ్రంథం అందజేయబడ్తుంది.

అర్థం చేసుకో! దైవభక్తుల ప్రార్థనలు, ప్రవక్తతత్త్వపు కిరణాలు.

ఆ తత్త్వంలో భ్రమించే కిరణాలు, అటే దూసుకుపోతాయి.
శింశుమారచక్రంలో సూర్యుడు రాశి నుంచి రాశికి పోతున్నపుడు
ఇంటి గవాక్షాల నుండి వెలువడే కాంతి చుట్టూరా తిరుగుతుంది.
ఏ గ్రహముతో ప్రభావితులైనవాడు అదే గ్రహలక్షణాల్ని కలిగి ఉంటాడు.
శుక్రగ్రహ (వీనస్) సంజాతకుడు ఆనందం కోసం అన్వేషిస్తాడు.
మంగళ గ్రహ (మార్స్) ప్రభావితుడు అంగారకుడిలా
యుద్ధం, ద్వేషం, శత్రుత్వాలకు మొగ్గు చూపుతాడు.
గ్రహాలకన్నా దూరంగా అనేక తారలున్నాయి.
వాటి ప్రభావం ఇతమిత్థంగా చెప్పలేము.
ఈ గ్రహాల, తారల కావల ఏ దుష్ప్రభావాన్ని చూపని తారలున్నాయి.
ఈ ఏడు ఊర్ధ్వలోకాల కావలనున్న తారల గురించి తెలిసినవారరుదు.
అన్నిటికన్నా అత్యంత ప్రకాశవంతమైనది ఆ మహిమాన్వితుని వెలుగు.
ఆ వెలుగు దేనితోనూ కలవదు. విడిగానూ ఉండదు.
ఒకవేళ ఎవరైనా ఆ వెలుగు ప్రభావాన జన్మించి ఉంటే
అతడి ఆత్మ అవిశ్వాసులను కాల్చి తరిమివేస్తుంది.
అతడి ఆగ్రహం అంగారక గ్రహ ప్రభావ సంభూతుని
కోపంలా వక్రీకరించబడి ఉండదు. అది మహాజ్వాల.
సాధుసంతుల ఆగ్రహం స్వచ్ఛమైన జ్వాల.
దేవుని రెండు కిరణాలనే వేళ్లమధ్య కనుపించే మసక మాత్రమే!
దేవుడు దానిని అన్ని ఆత్మలపై ప్రసరింపజేసాడు.
సత్ప్రవర్తకులు తమ ప్రేమ అంగీలతో వాటిని పోగు చేసుకున్నారు.
ఆ సౌభాగ్యాన్ని పొందిన అదృష్టవంతుడు
తన వదనాన్ని దేవుని వేపు లగ్నం చేస్తాడు.
ఆ అదృష్టానికి నోచుకోనివాళ్లు ప్రేమను అనుగ్రహాన్నీ కోల్పోతారు.
దైవభక్తుల వదనాలు దివ్యజ్యోతిపై కేంద్రీకరించబడి ఉంటాయి.
నైటింగేలు పక్షి దృక్కులన్నీ గులాబీలపై లగ్నమవుతాయి.
ఎద్దురంగు బాహ్యంగా ప్రస్ఫుటం. మానవుడి రంగు అంతరంగ నిక్షిప్తం.
అందమైన రంగులు స్వచ్ఛజలాల నుంచి వస్తాయి.

అనుమానపు నల్లటి నీళ్ల నుంచి తుచ్ఛమైన ప్రవర్తన
దేవుని ఆగ్రహానికి గురయ్యే దారి వంకర నల్లటి దారి.
అన్ని నదులూ, సముద్రాలు కలిసేది ఆ అనంత సముద్రంలోనే
మన శరీరంలోని ప్రేమావేశపు ఆత్మాప్రవాహాలూ కలిసేది దానిలోనే!

## యూదులరాజు - అగ్నిపూజ

ఈ యూదుల రాజు కుట్ర చూడండి. అతడు అగ్నిపక్కనే ఒక విగ్రహాన్నుంచాడు.
"ఈ విగ్రహానికి మొక్కినవాడు రక్షింపబడుదురు.
లేనివారు మంటల్లో భక్షింపబడుదురు."-
కాని అతడు తన భౌతిక రూపానికి శిక్ష విధించుకోలేదు.
ఆత్మరూపాన్నుంచి మరో రూపం నిర్మించబడింది.
నీ బాహ్యరూపమే విగ్రహాలలో ప్రతిష్ఠింపబడ్తుంది.
నీ ఊహాశక్తి ఆ విగ్రహాలకు రూపాన్నిచ్చింది,
నీ ఊహాజనిత భౌతిక విగ్రహం పాములాంటిది.
ఆత్మరూప జనితమైనది ఆదిసర్పం (డ్రాగన్) లాంటిది.
భౌతిక రూపం నిప్పురవ్వ-నీళ్లతో ఆర్పివేయబడుతుంది.
ఆధ్యాత్మిక రూపము ప్రచండాగ్ని-నీళ్లను ఆవిరి చేస్తుంది.
శిలా, లోహం నీళ్లకు ఎలా లొంగిపోతాయి?
వాటితో నిర్మితమైన మనిషి సురక్షితంగా ఎలా ఉండగలదు?
కూజాలో నిలకడగా ఉన్న నీరులాంటిది విగ్రహం.
జలధారలో ప్రవాహరూపమైన నీరు ఆత్మరూపం.
నిండా నీరున్న పాత్రలాంటిది భౌతిక విగ్రహం
గలగలపారే నీరున్న జలధార ఆత్మరూపం.
ఒక్కరాయి విసిరి అనేక నీటి కుండలను పగులగొట్టవచ్చు.
కాని జలధార ప్రవహిస్తూ అనేక శిలల్ని ఆవలకు నెడ్తుంది.

భౌతిక విగ్రహాన్ని పగలగొట్టడం అత్యంత సులభం
ఆత్మ విగ్రహ రూపాన్ని చెదరగొట్టగలననుకోడం దోషపూరితం.

కుమారా! ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవాలనుకుంటున్నావా?
సప్తద్వారాలున్న నరకపు కథను పఠించు.

ప్రతిక్షణం ఏదో ఒక వంచనాపూరిత కార్యం జరుగుతుంటుంది.
ఆ ప్రతి సంఘటనలోనూ వందలాది 'ఫారో'లు ససైన్యంగా మునిగి చస్తారు.
మోసెస్ వద్దకు మోసెస్ నమ్మిన దేవుని శరణువేడుకో!
ఫారో రాజు మూర్ఖత్వాన్ని నమ్మి విశ్వాసపు జలాల్ని విసిరిగొట్టకు.
నీ హస్తాన్ని అహమద్ వేపు చాచు.
సోదరా! ఈ భౌతిక దేహాన్నుంచి విముక్తి పొందు.

## బాలుడు - అగ్ని

అగ్ని మహోగ్రంగా జ్వలిస్తున్న సమయాన, ఆ యూదుప్రభువు
ఒక బాలుడిని, ఆతడి తల్లిని ఆ విగ్రహం వద్దకు తీసుకువచ్చాడు.
ఆ బాలుడిని మంటల్లోకి విసిరి వేయగానే
ఆమె తన మతంపై విశ్వాసాన్ని కోల్పోయింది.
ఎప్పుడైతే ఆమె ఆ విగ్రహానికి మొక్కడానికి తలవంచిందో
ఆ అగ్నిజ్వాల మధ్యలోనుంచి బాలుడి కేక వినిపించింది.
–'అమ్మా! నేను మరణించలేదు. నీవూ లోపలికి వచ్చేయి.
నేను ఈ అగ్ని మధ్యలో హాయిగా ఉన్నాను.
సత్యాన్ని కప్పి ఉంచే మాయవంటిదీ అగ్ని.
అగోచరమైన దాన్నుంచి మనకు కనిపించే దివ్యకరుణ ఇది.
రా! అమ్మా! దేవుని నిదర్శనాన్ని చూడు!
దేవుని ఎన్నికను ఆనందంతో సందర్శించు!
రా! తల్లీ! నిజమైన అగ్ని ప్రభావాన్ని వీక్షించు!
ఆ జలసదృశ్యమైన భౌతికాగ్ని నుంచి బయటపడు!

అగ్నిలో సైప్రస్, జెస్సామిన్‌లను దర్శించిన అబ్రహాం శక్తులను చూడు!
పుట్టినప్పటి నుంచి నీకు దూరంగా పోతానేమోనని, ప్రతిక్షణం నేను మరణాన్ని చూసాను.
కాని నేను ఇప్పుడు గర్భకోశపు సన్నని దారి నుండి విశాల విశ్వంలోకి వచ్చాను.

ఈ అగ్నిని చూసాక ఆ విశాల విశ్వం తొలిదారికన్నా ఇరుకుగా అనిపిస్తోంది.
ఈ అగ్నిలో ప్రతి కణమూ జీసస్ ఊపిరిని పోసుకున్నది.
భౌతిక నయనాలకగుపించని శాశ్వతలోకమిది.
కళ్లకు కనిపించే అశాశ్వత ప్రపంచమది.
మాతృత్వపు మధురిమలను కురిపించే అమ్మా! రా!
నీలా ఎంత చల్లనిదో ఈ అగ్ని! స్పృశించు!
అవకాశాన్ని అందిపుచ్చుకో! అదృష్టాన్ని చేజారనివ్వకు!
ఆ కుక్క పొగరును చూసావు. ఇక్కడ దేవుని ప్రేమను చూస్తావు.
నీపై జాలితో నిన్నర్థిస్తున్నాను కాని, ఇక్కడి అనంతప్రేమలో అన్నిటినీ మరచిపోతున్నాను.
రా! అందరినీ పిలుచుకురా! అమ్మా! ఈ అగ్నిలో
ప్రభువు మనకోసం విందు ఏర్పరచినాడు.
విశ్వాసులారా! మీరందరూ లోపలికి రండి!
ఈ మాధురి తప్ప మిగతాదంతా చిత్రహింసయే!
నూరు వసంతాలున్న ఈ అదృష్టాగ్నిలోకి శలభాల్లా దూకండి.
–అంటూ అతడు ఆర్ద్రతో కేకలు పెడుతుంటే
అక్కడ ఉన్న జనసందోహం ఆశ్చర్యంతో చూసారు.
ఆడామగా తేడాలేకుండా అందరూ అగ్నిలోకి దూకినారు.
–ఎవరి రక్షణా లేదు, ఎవరూ వాళ్లను బలవంతంగా ఈడ్చుకుపోలేదు.
స్నేహితుడి మీద ప్రేమతో వాళ్లు ముందుకురికారు.
అతడి నుంచే కదా వాళ్లు ప్రతికష్టంలోనూ సుఖాన్ని రుచిచూసింది.
–రాజుగారి చీమలదండు లాంటి సైనికులు ఆపబోయారు వాళ్లను
వాళ్లలా దూకుతూనే ఉన్నారు.
నల్లబడ్డ ముహంతో యూదుడు నిశ్చేష్టుడయ్యాడు.
ఎంత విశ్వాసులయ్యారంటే వాళ్లు ఏ బాధనైనా ఓర్చుకో సిద్ధమయ్యారు.
సాతాను కుట్ర ఫలించలేదు. అవమానం మిగిలింది సాతానుకు.
విశ్వాసులమీద రుద్దుదామనుకున్న మకిలి అంతా
వాడి మొహం మీదే గట్టిగా అంటుకున్నది.
ప్రజల దుస్తుల్ని పరపరా చింపుదామనుకున్నవాడికి
వాడి దుస్తులు చిరిగాయి, ప్రజలకేమీ కాలేదు.

## మహమ్మదు నామాన్ని వ్యంగ్యంగా పలికినవాడి గతి

మహమ్మదు పేరును వ్యంగ్యంగా పలికాడొకడు
నోరెండిపోగా నానా కష్టాలు పడినాడు. పశ్చాత్తాపంతో
తిరిగి అన్నాడు– దైవజ్ఞానం పొందినవాడివి నీవు
నిన్ను హేళన చేయబోయి తప్పు చేసాను.
దేవుడు ఎవరి ముసుగునైనా చింపదలుచుకుంటే
ముందుగా పవిత్ర వ్యక్తులను పరీక్షిస్తాడు.
దేవుడు ఎవరి తప్పునైనా దాచదలుచుకుంటే
తప్పు చేసిన వారి గురించి ఒక్క మాట మాట్లాడడు.
దేవుడు మనకు సాయం చేయదలుచుకున్నపుడు
మన దృష్టిని ఒక నిష్కల్మషమైన అభ్యర్థనగా మారుస్తాడు.
అతడి కోసం విలపిస్తున్న కళ్లు ధన్యమైనవి.
అతడి కోసం గాయపడ్డ హృదయాలు ధన్యమైనవి.
ప్రతి దుఃఖం సంతోషపు నవ్వుల జల్లుతో ముగుస్తుంది.
అంతిమ దినాన్ని ముందే గమనించినవాడు దేవుని ముఖ్య సేవకుడు.
పారే నీరున్న చోట హరిత వనముంటుంది.
కన్నీరు పొరలుచోట కరుణ చూపించబడ్తుంది.
జలచక్రంలా నేత్రాలు తడిచి ఉన్నపుడు
ఆత్మ ఆవరణలో ఆకుపచ్చని మొక్కలు పెరుగుతాయి.
నీకు కన్నీళ్లు కావాలంటే దుఃఖించేవాడిపై కరుణ చూపు,
నీకు కరుణ కావాలనుకుంటే పేదవాడిపై జాలి చూపు.

## యూదుల రాజును అగ్ని తిరస్కరించుట

యూదుల రాజు అగ్నివేపు తిరిగి అడిగాడు–
–"ఓ జ్వలించే అగ్నీ? ఏమైంది నీ సర్వభక్షకత్వం?
ఎందుకు నీవు అన్నిటినీ కాల్చలేకపోతున్నావు?
నీ సహజ గుణాల్లో ఏదైనా మార్పు వచ్చిందా?
నిన్ను ఆరాధించే వాళ్లను కూడా నీవు కాల్చేసేవాడివే!

మరి నిన్ను పూజించనివాళ్లనెందుకు రక్షిస్తున్నావు?
ఏనాడూ ఒక్క క్షణం ఓపికలేనివాడివి,
ఎందుకు నీ అగ్నితత్త్వం నశించిదీనాడు?
ఇదేమైనా మాయాజాలమా! లేక నీలో పెరిగిన అలసత్వమా?"-

అగ్ని పలికింది- "నేను అగ్ననే! కావాలంటే తాకి చూడు!
నాలో మార్పు లేదు! నేను దేవుడి ఖడ్గాన్ని!"-

అతిథి గృహం ముందు విశ్వాసం గల శునకాలు పరుండి ఉంటాయి.
ఎవరైనా కొత్తవాడు అటు వస్తున్న అలికిడి కాగానే
సింహాల్లా అవి అటువేపు దూకుతాయి.
నేను విశ్వాసంలో ఆ శునకానికేమీ తీసిపోను.
దేవుడు ఆ తుర్కమాన్ యజమానికన్న గొప్పవాడే!
నీ తత్త్వమున్న అగ్ని నీకు బాధ కలిగిస్తుందనుకుంటే
దేవుని ఆజ్ఞతో అది నిన్ను కాల్చివేయగలదు.
నీ అగ్ని బాహ్యంగా వేడినిస్తే, దేవుని అగ్ని నిన్ను ప్రక్షాళన చేస్తుంది.
బాధ కలిగినప్పుడు దేవుని క్షమాపణ అడుగు,
అతడు అన్ని తీవ్రతలను తగ్గించి వేస్తాడు.
అతడు సంకల్పిస్తే బాధ సంతోషమౌతుంది.
బంధనాలు స్వేచ్ఛావీచికలవుతాయి.

గాలి, నీరు, భూమి, అగ్ని అతడి సేవకులు,
నీలో, నాలో మృతులు, దేవునిలో అవి సజీవులు.
దేవుడి సమక్షంలో అగ్ని ప్రజ్వరిల్లుతుంటుంది,
ప్రేమికుడిలా రాత్రింబవళ్లు జ్వలిస్తునే ఉంటుంది.

రాతితో ఇనుము మీద కొట్టావనుకో!
నిప్పు రవ్వ వెలువడ్తుంది దేవుడి ఆజ్ఞతో!

రాతిని, లోహాన్ని కలిపి కొట్టకు! అవి మగ, ఆడ లాంటివి.
అవి కారణాలే, కాని, అంతకు మించి ఆలోచించాలి!

అంతర్గత కారణం వలనే బాహ్య కారణం జనిస్తుంది.
ఏ కారణం లేకుండా తనలో జనించే కారణమేది?

మామూలు మనుషులకు బాహ్య కారణాలు చాలు,
ప్రవక్తలు ఆత్మకు సంబంధించిన కారణాలను శోధిస్తారు.

ఆత్మకు సంబంధించిన వాటివలనే బాహ్య విషయాలు నడుచుకున్నా
ఒక్కోసారి నిష్ఫలము, నిష్ప్రయోజనమవుతాయి.

బావిలో నీరు తోడేప్పుడు గిలక తిరగడాన్ని చూసావా?
గిలక తిరుగుతుంటే తాడు కదుల్తుంది.
కాని గిలకను తిప్పేవాడిని చూడలేదంటే ఎలా?

ఈ తాళ్లను స్వర్గపు గిలకతో సరిపోల్చకు.
బోలుగా, మసకమసకగా స్వర్గపు గిలకలా ఉండి
ఏమీ తెలియనప్పుడు ఎందుకట్టెలా మండుతావు.

దేవుని ఆజ్ఞతో గాలి అగ్నిలా మండుతుంది.
రెండూ దేవుని మధువు తాగి ఉన్నాయి గనుక.
కుమారా! కళ్లు తెరచి చూడు! దేవుని దగ్గర్నుంచే వస్తాయి
చల్లబరిచే నీరూ, జ్వలించే అగ్నీ –రెండూనూ.

దైవాజ్ఞ లేకుండా వాయువు యొక్క ఆత్మకు
విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్య తేడా ఎలా తెలుస్తుంది?

## వాయువు కథ

'హద్' విశ్వాసుల చుట్టూరా ఒక గీత గీసాడు.
అక్కడకు వచ్చేసరికి గాలి శాంతించి చల్లబడేది.
ఆ గీతకు బయట ఉండిన వాళ్లని తాకి ముక్కలు చేసేది.
షాయిబాన్ అనే గొర్రెలకాపరి అలాగే తన మంద చుట్టూరా గీత గీసేవాడు.

శుక్రవారం దైవ ప్రార్థనకు వెళ్లినప్పుడు, ఏ తోడేలూ మందపైకి రాకుండా!
ఏ తోడేలూ ఆ గీత దాటి లోనికి పోలేదు. గొర్రెపిల్ల బయటకు రాలేదు.
మానవుడు గీచిన గీత వల్ల రెండు జంతువులూ విడదీయబడినాయి.
అయితే మృత్యువుకు ఈ గీతలేమీ అడ్డురావు.
కాని, జోసెఫ్ లాంటి వాళ్లను అది మెత్తగా తాకుతుంది.
అబ్రహాంను అగ్ని బాధించలేదు. ఎందుకంటే
అతడు దేవుడిచే ఎన్నిక చేయబడినవాడు కనుక.
కామాగ్ని సజ్జనులనేమీ చేయలేదు. ఇతరుల్ని పాతాళంలోకి ఈడ్చేస్తుంది.
దైవాజ్ఞతో విరుచుకుపడిన కెరటాలు మోసెస్ ప్రజలను,
ఈజిప్షియన్లను వేరు వేరుగా గుర్తించలేదా?
దైవాజ్ఞ రాగానే భూమి ఖారున్‌ను వాడి బంగారు
సింహాసనంతో సహా అట్టడుగు పొరల్లోకి లాక్కుపోలేదా?
జీసస్ ఊపిరితో నీరు, మట్టి నిండినప్పుడు
మట్టిబొమ్మకు రెక్కలొచ్చి పక్షిలా ఎగిరింది కదా!
నీ శరీరంలో మట్టీ, నీరుతో దేవుడిని స్తుతించినపుడు
అది స్వర్గలోకపు విహంగమై శాశ్వతంగా ఎగుర్తుంది.
మోసెస్ కాంతిని చూసిన ఆనందంతో సినాయి పర్వతం
నృత్యం చేస్తూ తనపై మకిలిని పోగొట్టుకున్నది
ఒక పర్వతమే పవిత్ర సూఫీ సాధువు కాగలిగినప్పుడు
మట్టితో చేయబడినవాడే కదా మోసెస్, అతడికేం?

## సన్నిహితుల సలహాను త్రోసిపుచ్చిన యూదురాజు

ఇన్ని విశేషాలను విన్నా ఆ యూదురాజు వాటిని త్రోసిపుచ్చాడు.
అతడి అంతరంగిక మిత్రులు, సలహాదారులన్నారు– 'ప్రభూ!
అన్యాయాన్ని మరింత వృద్ధిచేయకు. మూర్ఖత్వపు గుర్రాన్ని ఎక్కకు!'–
ఆ సలహాలిచ్చినవాళ్లని జైళ్లపాలుచేసి మరిన్ని అన్యాయాలు చేసాడు రాజు.
ఏనాడైతే అతడి పాపాలు సరిహద్దు రేఖ దాటాయో,
ఆనాడు పెద్ద కేక వినవచ్చింది– 'ఓ కుక్కా! ఆగక్కడ! నీ కాలం మూడింది

అగ్ని నలభై నిలువుల ఎత్తు ఎగిసి జ్వాలాచక్రంగా మారింది.
ఆ దుర్మార్గుడైన యూదురాజు పరివారంతో సహా కాలిపోయాడు.
వాళ్లు ఇహలోకాగ్నిలో పుట్టారు. ఇక్కడే భస్మమయ్యారు.
నరకాగ్ని వాళ్ల జన్మస్థానం. చచ్చాక అక్కడకే పోతారు.

ఆ బాలుడి తల్లి అందుకే తటపటాయించింది.
నీటిని ఒక పాత్రలో బంధించి చూడు! క్రమేపీ అది ఆవిరైపోతుంది.
గాలి దాని జన్మస్థానం. అందుకే కొద్దికొద్దిగా నీరు గాలిలో కలిసిపోతుంది.
మన ప్రాణవాయువూ అంతే! కొద్దికొద్దిగా ఈ సంసారపు జైలు నుంచి విడుదలైపోతుంది.
మన మంచి పనులు పరిమళ ధూమాలై పైకెగసి స్వర్గాన్ని చేరతాయి.
శాశ్వతత్త్వపు లోకంలోకి మన కానుకలుగా అర్పించబడతాయి.
అత్యంత కరుణామయుడి వద్ద నుంచి అనేకరెట్లు మనకందజేయబడ్తాయి.
మన మంచిపనులు, మాటలు ప్రభువు నుంచి మరిన్ని ఆశీసులను తెస్తాయి.
పరమాత్మ, ఆత్మలను తనవేపు ఆకర్షించుకుంటుంది.
అందుకనే ప్రార్థనలకు ఎనలేని మాధుర్యముంటుంది.
మనందరి చూపులూ అటువేపే! ఎడబాటులోని ఎదురుచూపే!
ప్రతి ఆనందానికి దానిదాని ప్రత్యేకత ఉంటుంది.
ఆనందంలో భాగానికి మొత్తానికుండే లక్షణమే ఉంటుంది.
అట్లాంటి ఆనందంలో భాగం మరొక ఆనందంతో కలిసి
సహజ స్వభావాన్ని కోల్పోయి మరొకటిగా మారుతుంది.
ఉదాహరణకు, నీరు, రొట్టె మన శరీరంలో భాగాలు కావు.
ఆరగించి, అరిగించుకున్నాక అవి శక్తిగా మనలో కలిసిపోతాయి.
అందుకని మనకు రూపంలో రొట్టె, నీరు భిన్నంగా ఉన్నా
అంతిమ క్రియ ద్వారా అవి మనలో భాగాలైపోతున్నాయి.

ఆనందం మన తత్వానికి సరిపడనప్పుడు
అది అరువు తెచ్చుకున్న బరువులా భారమవుతుంది.
వేటగాడి ఈలను విని పక్షి భ్రమించి వస్తుంది.
అతడిని చూడగానే భయంతో వణికి పారిపోతుంది.

దాహంతో ఉన్నవాడికి ఎండమావి కన్పడగానే హాయి అనిపిస్తుంది.
దగ్గరకు వెళ్లి చూడగానే నిరాశ కమ్ముకుని దుఃఖం ఆవహిస్తుంది.
ముడి బంగారాన్ని చూసి ఏమీ లేనివాడు మురిసిపోవచ్చు
కాని స్వచ్ఛమైన స్వర్ణమున్న చోట అది వెలవెలబోతుంది.
కాకి బంగారం నిన్ను దారితప్పిస్తుంది, చెడు ఊహ పాడు నూతిలోకి నెడ్తుంది.

## సింహం-అడవి మృగాలు

ఆ అడవిలో ఒక సింహం విచ్చలవిడిగా వేటాడ్తుండేది.
దాని భయానికి పచ్చిక మైదానాల్లో వెళ్లడానికే భయమేసి
అన్ని జంతువులూ ఒక పథకం ప్రకారం సింహం వద్దకు వచ్చాయి.

'ప్రభూ! తమకిది న్యాయం కాదు! తమకోసం
మేమే ప్రతిరోజూ ఆహారం పంపిస్తాము. కొన్నాళ్లైనా
మిగతావాళ్లం ప్రశాంతంగా బతకడానికి వీలవుతుంది.

సింహం అన్నది- 'నాకు సమ్మతమే, ఇది కుట్ర కానంతవరకూ!
జెయద్, బకర్ లాంటి మనుషులు చేసిన మోసాలు నాకు తెలుసు.
వాళ్ల మోసం వల్ల నేను దాదాపు మృత్యువుకు దగ్గరగా పోయాను.
ఆ తేలు, పాము నన్ను కుట్టి విషాన్ని నాలో నింపాయి.
మోసగాళ్లకన్నా నన్ను చంపడానికి ప్రయత్నించే రక్తమాంసాలున్న మనిషి
నాకు ముఖ్య శత్రువు.
నేను విన్నాను- 'విశ్వాసి రెండుసార్లు మోసపోడని'
ప్రవక్త చెప్పిన ఈ మాటలను మనసా, వాచా విశ్వసిస్తున్నాను.

## మృగాల సమాధానం

ప్రభూ! నీవు జ్ఞానివి. అయినా దేవుని ఆజ్ఞకు ఎదురేమున్నది?
జాగ్రత్త పడేవాళ్లకు కష్టాలు తక్కువగా వస్తాయి.
నీ నమ్మకాన్ని దేవుడిపై ఉంచు! విధితో పోరాడరాదు.
ఓ శత్రుభయంకరుడా! అవిశ్వాసులతో విధి తగాదా పడ్తుంది!

దేవుని ఆజ్ఞ ముందు చచ్చిపడుండాల్సిందే, లేకుంటే
తెల్లవారాక కాంతిఖడ్గం దెబ్బ చవిచూడాల్సి వస్తుంది.

సింహం పలికింది– 'అవును. దైవ విశ్వాసమే నిజమైన మార్గదర్శి.
అదే ప్రవక్తల ఆదేశాలకూ మూలస్తంభం, పునాది.
ప్రవక్త గట్టిగా చెప్పాడు– దైవవిశ్వాసం నీ ఒంటెకాళ్లను బంధిస్తుంది.
అందుకనే వ్యక్తికి దైవవిశ్వాసంతోపాటు తను చేసే పనుల్లో జాగ్రత్త ఉండాలి.

జంతువులన్నాయి– 'బలహీనమైన జంతువుల పరిస్థితి ఏమిటి?
వాటి గొంతుకకు సరిపడా సంపాదించుకునే మార్గమేది?
దైవ విశ్వాసాన్నిమించిన కార్యమేమున్నది? దేవుని శరణువేడుటకన్నా లక్ష్యమేమున్నది?
బలహీనులు పెనం నుంచి పొయ్యిలోకి పడినట్లు
పామును తప్పించుకుని డ్రాగన్ నోటిలో పడతారు.
మనిషి, ఉచ్చును కనిపెట్టి దాంట్లోనే చిక్కుకుని,
జీవితాన్ని తన ఆత్మను ధ్వంసం చేసేదిగా అనుకుంటాడు.
ఇంట్లో దొంగనుంచి ఇంటికి తాళం వేసినట్లు, ఫారో కథలోలా!
వందల వేలమంది పసిపిల్లలను చంపించాడు ఫారోరాజు,
అసలు అతడిని చంపబోయేవాడు తన ఇంట్లోనే ఉన్న సంగతి తెలియక.
మన ముందుచూపులో బోలెడంత మసక ఉంటుంది.
అది మన నిజమైన స్నేహితుడి (దేవుడు) ముందు తొలగిపోతుంది.
మన చూపుకు బదులు అతడి దృక్కులు–గొప్ప బేరం!
ఆ దృక్కులలో నీ కోరికలకు మూలం తెలుస్తుంది.
సరైన శక్తి వచ్చేవరకు బాలుడు తండ్రి భుజాల మీద ప్రయాణించినట్లు
అప్పటి వరకు సరైన మార్గంలో పోయినవాడు,
తన కాళ్లూ చేతులూ కాస్త ఆడేసరికి కష్టాల్లో పడతాడు.
కాళ్లూ చేతులూ సృష్టించబడకముందు అందరూ విశ్వాసంగానే మెలిగారు.
వాళ్లను ఎప్పుడైతే దైవాజ్ఞ బంధనాల్లో ఉంచిందో,
వాళ్లలో ఆగ్రహం, మోసపు లక్షణాలు వృద్ధిచెందాయి.
మనం పాలకోసం ఏడుస్తున్న పిల్లలాంటి వాళ్లం

ప్రవక్త అన్నట్లు మనమందరం దేవుడి కుటుంబానికి చెంది ఉన్నాం.
ఆకాశం నుంచి వాన కురిపించేవాడే, విశ్వాసులకు ఆహారాన్నీ ఇస్తాడు.

## సింహపు మాట

సింహం అన్నది– 'అవును. ప్రభువు తన సేవకుల పాదాల
ఎదుట ఒక నిచ్చెన ఉంచినాడు. మెట్టు తర్వాత మెట్టు ఎక్కాలి.
ఊరికే కూర్చుని పైకప్పు చేరాలంటే కుదరదు.
మీకు కాళ్లున్నాయి కదా! మరి కుంటివాళ్లలా ఎందుకు ప్రవర్తన?
చేతులకు వేళ్లున్నాయి కదా ఆధారాని పట్టుకోడానికెందుకు ఆలోచన?
బానిస చేతిలో పలుగు, పార ఉంచినాడంటే,
యజమాని ఉద్దేశ్యం బానిసకు అర్థం కాదా?
పార, చేతులు దేవుడిచ్చిన చిహ్నాలు, పనికిరాకుండా
పారవేయడానికి కాదు గదా వాటిని సృజించినది!
అతడు చూపే నిదర్శనాలను, చిహ్నాలను అర్థం చేసుకో,
అప్పుడు వాటికోసం నీ జీవితకాలాన్ని వినియోగిస్తావు.
అతడి భారాన్ని నీకివ్వాలనుకుంటే అతడే నిర్దేశిస్తాడు.
అతడి ఆజ్ఞల్ని నీ ద్వారా ఇవ్వదలుచుకుంటే నిన్నందుకే సృష్టిస్తాడు.
అతడి ఆజ్ఞను పలకడం ద్వారా నీవు ప్రవక్తవవుతావు.
అతడితో ఐక్యం కాదలుచుకున్నపుడు అంతిమంగా అతడిలో చేరతావు.
దేవుడి గొప్పతనాన్ని నీ స్వేచ్ఛా ప్రవర్తనతో వెల్లడిచేయి.
నీ అవకాశవాద ప్రవర్తనతో దానిని నిర్లక్ష్యం చేయకు.
అతడికి కృతజ్ఞతలు తెలపడం ద్వారా నీ శక్తిని వృద్ధిపరచుకో!
అవకాశవాద ప్రవర్తన ద్వారా ఆ శక్తిని పోగొట్టుకోకు.
మీ అవకాశవాదమెటువంటిదంటే రహదారి మీద పడుకోవడం!
అటూయిటూ ద్వారాలు బంధించకుంటే వాహనాలు పైకెక్కవా!
ఓ అవకాశవాదీ! ఆ పండ్లచెట్టు దగ్గర నిదురించు!
గాలికి కొమ్మ ఊగినప్పుడల్లా పళ్లు రాలిపడ్తాయి.
దూరాభారానికి కావాల్సిన ఆహారమూ దొరుకుతుంది.

కావాలని దోపిడీ దొంగలుండే దారిలో ప్రయాణిస్తావా?
అపాయం జరగకుండా బయటపడడం సాధ్యమేనా?
అతడి నిదర్శనాలను నీవు అర్థం చేసుకున్నపుడు పురుషుడివి
అనుకున్నా, నిజానికి నిగూఢంగా ఆలోచిస్తే నీవు స్త్రీవి.

నీ అర్థం చేసుకునే శక్తి నశించాక, తల కాస్తా తోకవుతుంది.
కృతఘ్నుడు నరకాగ్ని అట్టడుగున పడి కాలిపోతాడు.
నీవు నిజంగా దేవుడికి విశ్వాసం చూపించదలుచుకుంటే
ఆ ధ్యాస నీ పనిమీద పెట్టు, విత్తనాలు నాటు, దేవుణ్ణి ప్రార్థించు.

## జంతువుల పలుకులు

ఆ బలహీన మృగాలన్నీ గొంతెత్తి ఒక్కుమ్మడిగా అరిచాయి–
'అసంఖ్యాకమైన జనానికి ఎందుకు అదృష్టం దూరంగా ఉంటోంది?'
ఈ ప్రపంచం ఉన్నప్పట్నుంచి అసంఖ్యాక తరాలు తమ
వందలాది నోళ్లను డ్రాగన్ మృగాల్లా తెరిచి ఉంచాయి.
తెలివిగలవాళ్లు అదృష్ట జలధార పునాదులు పగలగొట్టి
తమకు అంతా రాబట్టుకునే కుట్రలు చేసారు.
దేవుడు చెప్పాడు– ఆ కుట్రలకు పర్వత శిఖరాలు కదిలాయని.
కాని, స్వర్గాన్ని తాకిన శిఖరాలను ఆ కుట్రలు కదిలించలేవు.
వాళ్ల కుట్రలు నశించాయి. దైవసృష్టి యధాతథంగా ఉండింది.
ప్రఖ్యాతి చెందినవాడా! పని అనేది ఒక పేరుగా భావించకు!
తెలివి గలవాడా! కష్టపడడం వృధా ప్రయాసగా అనుకోవద్దు!

## సులేమాన్ కాలపు కథ

ఒకరోజున ఒక వ్యక్తి సులేమాన్ సభలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు.
సులేమాన్ అడిగాడు– 'ఏమయ్యింది నీకు? ఎందుకలా రొప్పుతున్నావు?'
'ప్రభూ! అజ్రాయెలు నావేపు ద్వేషంగా అసహ్యంగా చూసాడు.
సులేమాన్ అడిగాడు– 'అయితే, నీకేం కావాలి?'

అతడన్నాడు– 'ప్రభూ! గాలినాజ్ఞాపించు! నన్ను వేగంగా హిందూస్తాన్‌కు తీసుకుపొమ్మని! అక్కడ రక్షించుకుంటాను నన్ను నేను!'

దారిద్ర్యం నుంచి పారిపోయే వాళ్ల నోటినిండా మోసపు మాటలుంటాయి. పేదరికం అనేది అతడి భయం లాంటిది. ప్రయత్నం పారిపోవడం వంటిది. సులేమాన్ ఆజ్ఞతో అతడు వాయువేగాన హిందూస్తాన్‌కు పోయాడు.

మరుసటిరోజు సులేమాన్ ప్రభువు అజ్రాయెల్‌నడిగాడు–
'ఎందుకు నీవు అతడి వేపు ద్వేషంగా, అసహ్యంగా చూసావు?'
అజ్రాయెల్ అన్నాడు– 'లేదు ప్రభూ! నేనలా చూడలేదు.
దేవుడు నన్ను అతడిని హిందుస్తాన్‌కు తీసుకుపొమ్మన్నాడు,
నేనాశ్చర్యంతో అన్నాను– 'వేయిరెక్కలున్నా అతడు పోలేడే!'–

అందుకే కళ్లుతెరచి లోకాన్ని అవలోకించు!
దేన్నుంచి మనం పారిపోతున్నాం? మననుంచేనా?
ఎవర్నుంచి ఏమి తీసుకుపోతున్నాం? దేవుడి నుంచా?

## సింహపు సమర్థన

'కావచ్చు' –అన్నది సింహం. 'ప్రవక్తల, విశ్వాసుల పోకడలను గమనించు.
వారి కష్టాలను దేవుడు మరింత ఎక్కువ చేసాడు,
వాళ్లు చలి, వేడికి, అణచివేతలకు గురయ్యారు.
అయినా వాళ్ల పనులు సర్వకాలాల్లోనూ గొప్పవే! మంచివే!
స్వర్గలోకపు పక్షిని వలవేసి పట్టుకోగానే వాళ్ల బాధలన్నీ ఆనందాలయ్యాయి.
అందుకనే ప్రవక్తలు చెప్పిన దారిననుసరించుట ఉత్తమం.
ప్రయత్నమనేది విధికి వ్యతిరేకం కాదు.
విధి మనపై రుద్దగా మనం చేసేదే ప్రయత్నం.
విశ్వాసం, వినయాల దారిలో ఎవరికైనా నేను
ఒక్కక్షణం జాగు చేయించినా, నన్ను అవిశ్వాసిననవచ్చు.
నీ తల పగలలేదు. పగలనిదానికి కట్టెందుకు?
మంచి పనులు చేయి! మనసారా సంతోషాన్ని పంచివేయి!

చెడ్డవాడు ఈ లోకాన్ని చూస్తాడు; మంచివాడు శాశ్వతలోకాన్ని దర్శిస్తాడు.
ఈ ప్రపంచాన్ని గెలిచే ప్రణాళికలు వృథా!
ఈ లోకాన్ని త్యజించే ఆలోచనలే అవసరమైనవి సదా!
సరైన పథకం బందీకి కారాగారం నుంచి బయటపడనిస్తుంది.
తప్పుడు ఆలోచన వాడిని మళ్లీ కారాగారానికే తరలిస్తుంది.
ఈ ప్రపంచమొక జైలు, మనమందరం బందీలం!
ఈ గోడలకు రంధ్రం చేసి అవుదాం విముక్తులం!
దేవుడిని మరిచే ప్రపంచమేమి ప్రపంచం?
మనుషుల్ని వెండి, వస్తువులా తూచే యంత్రం!
ధనం గురించంటావా? మంచిమనిషికెంత ధనం కావాలి?

ప్రవక్త అన్నదదే– 'మంచి ధనం మంచిదేనా?'
పడవలో నీరు ప్రమాదం! పడవ కింద అదే ఆధారం.

ఇహలోక సంపదలు సుఖాలు త్యజించినవాడు కనుకనే
సులేమాన్ తనని తాను పేదవాడిగా అభివర్ణించుకున్నాడు.

మూత మూసిన సీసా నీళ్లల్లో తేలుతుందెందుకంటే
దాని హృదయం నిండా వాయువు నిండి ఉంటుంది గనుక.

తన హృదయంలో భోగభాగ్యాల పేదతనం ఉన్నవాడు
ప్రపంచపు జలాలపై సదా తేలియాడుతూనే ఉంటాడు.

ఈ ప్రపంచమంతా తన సామ్రాజ్యమైనా సరే,
అతడి హృదయనేత్రంలో అది ఎందుకూ కొరగానిది.

అందుకే నీ హృదయపు నోటిని మూసి ముద్రవేసి బంధించు
దానిని దివ్యలోక వాయువుతో నింపి ఉంచు.

ప్రయత్నం, వ్యాధి, నివారణ ఇవన్నీ వాస్తవాలు;
వాటిని కాదనేవాడు మరల మరల ప్రయత్నిస్తూనే ఉంటాడు.

## దేవునిపై విశ్వాసం కన్నా మానవ ప్రయత్నం గొప్పది

సింహం అలా అనేక రకాలుగా ప్రయత్నం గురించి మాట్లాడింది.
నక్క, కుందేలు, జింక, గుంటనక్కలు 'ప్రయత్నము'
అనే సిద్ధాంతాన్ని ఒప్పుకుని తగాదాను మానివేసాయి.
జంతువులన్నీ సింహంతో ఒడంబడిక చేసుకుని సింహానికి
ఆహారం కోసం ప్రయత్నించే కష్టాన్ని తగ్గించాయి.
ఎవరి వంతు రాగానే ఆ జంతువు సింహం దగ్గరకు చిరుతపులిలా
వేగంగా వెళ్లి స్వయంగా అర్పణ అయ్యేది.

ఈసారి కుందేలు వంతు రాగానే అది–
'అయ్యో! ఎన్నాళ్లీ అన్యాయం! అని ఎలుగెత్తి ఏడ్చింది.
అది ఆలస్యం చేయడాన్ని గమనించిన మిగతా జంతువులన్నాయి
'నీ వలన మరల సింహానికి కోపం వస్తే మళ్లీ కథ మొదలువుతుంది'.

## కుందేలు సమాధానం

'మిత్రులారా! నన్ను నమ్మండి! ఏదో ఉపాయంతో మనల్ని రక్షిస్తాను!
నా తెలివితేటలతో మనల్ని రక్షించి మన వంశాల్ని కాపాడుతాను!'
ప్రజలలో తిరిగే ప్రతి ప్రవక్తా ఇదే మాదిరిగా
విముక్తి మార్గాన్ని దైవాజ్ఞతో కనుక్కొని ప్రజలకు చెబుతాడు.
స్వర్గం నుంచి ఉన్న విముక్తి మార్గాన్ని దర్శించిన ప్రవక్త
ప్రజల కళ్లముందు సన్నగా ఉన్న కనుపాపలా చిన్నగా కనిపిస్తాడు.
వాళ్లు అతడి చిన్ని బాహ్యరూపాన్ని దర్శించారే గాని
ఆ కంటి పాప గొప్పతనాన్ని గమనించలేదు.

## జంతువుల తిరస్కారం

కుందేలు మాటలకు జంతువులన్నీ కోపగించాయి.
'మూర్ఖుడా! నీ చెవులపిల్లి తెలివితేటల్ని అదుపులో ఉంచుకో!
నీవెంత? నీ పరాక్రమమెంత? నీకీ ఆలోచన ఎలా వచ్చింది?

నీవు ఆత్మవంచకుడివైనా అయ్యుండాలి, లేదా మా చావుకైనా వచ్చుండాలి?
లేకుంటే ఈ రకపు మాటలు నీ నోటి నుండి ఎలా వస్తాయి?

## కుందేలు జవాబు

'మిత్రులారా! ఇది దేవుని ఆశీర్వచనం!
దైహికంగా బలహీనుడనైనా సింహానికి, అడవి గాడిదలా నేను లొంగలేదు!
పట్టుపురుగుకు నేర్పిన విద్య ఏనుగుకు నేర్పలేదు కదా!
మట్టినుంచి పుట్టిన ఆదాముకు దేవుడు జ్ఞానాన్నిచ్చాడు.
అతడికి ఏడవ స్వర్గం వరకు అన్నీ తెలిపాడు.
దేవుని గురించి సంశయిస్తున్నవాడి అనుమానం తీర్చడానికి
ఆదామును సృష్టించి, దేవదూతల గర్వమును వ్రక్కలు చేసినాడు.
అనేక వేల సంవత్సరాల వయసున్న మునిని
ఆదాముకు ఆయుధంగా చేసినాడు భగవానుడు.
మతం యొక్క జ్ఞానక్షీరాన్ని తాగవద్దని,
గాలిమేడల్లో విహరించవద్దని నిస్సంశయంగా తెలిపినాడు.
ఇంద్రియజ్ఞానావలంబకుల శాస్త్రాల్ని ఆయుధంగా చేసి
అంతర్లీనమైన జ్ఞాన క్షీరాన్ని అందకుండా చేసినాడు.
సముద్రాలలో, ఆకాశంలో లభ్యం కాని అనర్ఘమణిని
హృదయంలోని రక్తబిందువులో ఉండేట్లు చూసినాడు.
రూపాన్ని పూజించేవాడా? ఎన్నాళ్లుంటుందీ రూపం?
వాస్తవాన్ని గుర్తించలేని ఆత్మ ఈ రూపంలో ఎన్నాళ్లు దాగుంటుంది?
రూపం వల్లనే మానవుడు ప్రస్తుత రూపంలో ఉన్నాడంటే
అహమ్మద్, బుజాల్‌లు మానవుడిలానే మసిలేవాళ్లు.
గోడమీది చిత్తరువు లాంటివాడు ఆదాము,
దానిని పరీక్షగా చూడు కనిపిస్తుంది నీకు లోపము.
చిత్రం అద్భుతమైనదే కాని దానిలో ఆత్మలేదు.
వెళ్లు! ఆ అనర్ఘమణి కోసం అన్వేషించు.

ప్రపంచంలోని సింహాలన్నీ శిరసు వంచాయి,
దేవుడు గుహలోని ఆశీర్వదింపబడినవారి శునకం ముందు.
అసహ్యించుకునే రూపం వల్ల దానికేం తక్కువ కాలేదు,
కాంతిసముద్రంలో దూకిన దాని ఆత్మలా!
అక్షరాలతో వర్ణించబడే రూపం వల్ల ఒనగూడేదేమీ లేదు.
జ్ఞానం, న్యాయం, సత్యం వీటిని తెలిపే అక్షరాలే శాశ్వతం.
వాటిని ఏ చిత్తరువు ముందూ, వెనకా చూడలేవు.
ఆకాశంలో సూర్యుడికో ప్రత్యేకించబడిన స్థానం లేదు.
ఆత్మాసూర్యుడికి దేహంలోనూ అంతే!
(ఈ చర్చకు అంతం లేదు. మామూలు చెవులకీ భాష అర్థంకాదు)
సులేమాన్ రాజ్యపు మూత జ్ఞానంతో సీలు వేయబడినది.
ప్రపంచం దాని రూపం. జ్ఞానం దాని ఆత్మ.
జ్ఞానవంతుడైన మానవుని ముందు భూజలచరాలు లొంగిపోయినవందుకే!
చిరుతపులి, సింహం ఎలుకల్లా వణికిపోతాయతడిని చూస్తే
మహానదిలో మొసలి కూడా గజగజలాడ్తుందతడు వస్తే.
భూత పిశాచాలు, వనకన్యలతడిని చూసి పారిపోయారు,
రక్షణకై మారుమూల గుహల్లో దాక్కున్నారు.
అయినా మానవుడికి రహస్య శత్రువులున్నారు,
జాగ్రత్తగా సంచరించేవాడు తెలివైనవాడు.
మంచీ, చెడూ అనేవి రహస్య జీవులు
ప్రతిక్షణం వాటి దెబ్బలు హృదయంపై పడతాయి.
నదిలో దిగి కాళ్లు కడుక్కుందామని వెళ్లావనుకో, ముల్లు గుచ్చుకుంటుంది.
అది నీకు కనబడదు కాని, నెప్పి నీకు దాని రూపాన్ని చూపిస్తున్నది.
దేవదూతల దర్శనాలు, సాతాను ఆకర్షణలు వేలాది రూపాలున్న ముళ్లు.
రహస్య జీవులు కనబడేంత వరకూ ఓపికతో చూడు, సమస్య తొలగుతుంది.
ఎవరు నీకు కర్ణధారి కాగలడో, ఎవరి మాటలు తిరస్కరించాలో తెలుస్తుంది.

## జంతువులు-కుందేలు

చెవుల పిల్లీ! నీ మాటలకర్థం చెప్పు!
సింహంతో పోట్లాడాలనుకుంటున్నావు కదా నీ ఆలోచన ఏమిటి?

అందరితో కలిసి ఆలోచిస్తే ప్రణాళిక విజయవంతమవుతుంది.
అందుకే ప్రవక్త ప్రబోధించాడు– 'నమ్మకస్తుల సలహా విను'–అని

కుందేలు అన్నది– కొన్ని పనులు రహస్యంగానే చేయాలి.
సరిసంఖ్య బేసి కావచ్చు, అలాగే బేసి సంఖ్య సరికావచ్చు.

దోషంలేని మాటలను అద్దం ముందు పలికినా, అది మసక బారుతుంది.
మూడు విషయాలలో నోరు మెదపరాదు. 'నీ పోకడ, నీ స్వర్ణం, నీ మతం' గురించి
వీటి గురించి ఎదురుచూసేవాళ్లు ఎప్పుడూ నీ చుట్టుపక్కలే ఉంటారు.
నీవు వెళ్లేసంగతి ఒకరిద్దరికి చెప్పినా అది ఊరంతా క్షణాల్లో తెలిసిపోతుంది.
రెండు మూడు పక్షుల్ని కలిపి కట్టావనుకో అవి దుఃఖంతో అక్కడే పడి ఉంటాయి.
కాని అవి తమలో తాము చర్చించుకుంటాయి. చూసేవాళ్లని దారి మళ్లిస్తాయి.

ప్రవక్త తన అనుయాయులతో మార్మికంగా మాట్లాడేవాడు,
వాళ్లు వాటి అంతరార్థం తెలీకుండానే సమాధానమిచ్చేవాళ్లు.
ప్రవక్త తాను చెప్పదలుచుకున్నది ఓ నీతికథలా చెబితే,
శత్రువుకు ఆ మాటల్లో తలా తోకా తెలిసేది కాదు.
శత్రువు నుంచి సమాధానం రాబట్టేవాడు కాని తనలో మాట తెలిపేవాడు కాదు.

## కుందేలు వ్యూహం

బాగా ఆలస్యం చేసి, ఆకలిగొన్న సింహం ముందుకు వెళ్లింది కుందేలు
ఆకలితో కోపంతో సింహం అక్కడ అల్లకల్లోలం చేస్తోంది.
'నాకు తెలుసు! ఆ మతిమాలినవాళ్లు వాగ్దానభంగం చేస్తారని–
నన్ను వాళ్లు గాడిదను చేసారు, చూస్తాను ఎంతసేపు వీళ్ల పొగరుంటుందో!'
గడ్డంలో బలం లేని యువరాజు తెలివితక్కువగా తప్పులు చేస్తాడు.
ఆగ్రహం కళ్లను కమ్మినప్పుడు అతడు వెనకా ముందూ చూడబోదు.

రహదారి నున్నగా ఉన్నా అక్కడక్కడా గుంటలున్నాయి,
పేర్ల మధ్యలో భావార్థం లోపించినట్లు,
మాటలు, పేర్లు గుంటల్లాంటివి. పొగడ్తలు ఇసుక గోతులు.
మన జీవన జలాల్ని ఇంకింప చేసే సైకత తీరాలు.

నీరు పైకుబికే ఇసుకదిబ్బను వెదకు! దాని కొరకు అన్వేషించు,
జ్ఞానాన్ని అన్వేషించేవాడు జ్ఞానజలధార అవుతాడు.
కార్యకారణాలకు అతడు అతీతుడు.
దైవశాసనం రక్షక కవచమౌతుంది. ఆత్మజ్ఞానాన్నందిస్తుంది.
మానవుడి జ్ఞానం అతడికి గురువై, క్రమేపీ అదే శిష్యుడవుతుంది.
గాబ్రియెల్‌లా– "ఓ అహమ్మద్! ఇంకో అడుగు వేస్తే అది నన్ను కాల్చివేస్తుంది.
నన్నిక్కడ విడిచి నీవు ముందుకుపో! ఇది నాకు సరిహద్దు!
ఓ ఉన్నతాత్మా!" –అంటుంది జ్ఞానం.

ఎవరైనా మొండిగా, ఓపిక లేకుండా, కృతజ్ఞతలు తెలపకుండా,
ఉండవలసి వస్తే అది అత్యవసర సమయాల్లో మాత్రమే అలా ఉండాలి.
అనవసరంగా జబ్బు నటించేవాడు, ఆఖర్న గోతిలో పడతాడు.

ప్రవక్త అన్నాడు– "రోగం నటించేవాడికి రోగం నిజమవుతుంది.
అటువంటి వాడు దీపంలా ఆరిపోవలసి వస్తుంది"–

అత్యవసరమంటే ఏమిటి? ఎముక విరిగినా, నరం తెగినా అతికించడం.
దారిలో కాలు విరిగితే ఎవర్ని నిందిస్తావు? కాలికి కట్టు ఎందుకు కట్టావు?
శ్రమ వలన కాలు విరిగినపుడు, బురాక్ వచ్చి అతడిని తీసుకువెళ్లింది.

అతడు మతాన్ని మోసి తానే మతమైనాడు.
దివ్య ఆజ్ఞను పాటించి అంగీకరించబడినాడు.
ఇంతవరకు అతడు ప్రభువు ఆజ్ఞలను స్వీకరించినాడు.
ఇప్పటి నుంచి వాటిని ప్రజలకు తెలుపుతున్నాడు.
ఇంతవరకు తారలు అతడిపై తమ ప్రభావాన్ని చూపినవి.
ఇప్పటినుంచి అతడు వాటిని ప్రభావితం చేయనున్నాడు.

ఇది నీకు అర్థమయితే చంద్రుడిలో చీలిక అర్థమవుతుంది.
నాలుకపై మాటలతో కాదు, రహస్యంగా కోరికలు తీర్చుకునేవాడా!
విశ్వాసమంటే ప్రతిరోజూ కొత్తగా పుట్టడు.

కోరికలు గలవాడికి ఆ తలుపు తెరవబడదు.
నీవు పవిత్ర శబ్దాన్ని వ్యాఖ్యానించదలుచుకుంటే, ముందు నిన్ను నీవు సరి చూసుకో?
పవిత్ర గ్రంథాన్ని నీ దృక్కోణంలో పరిశీలించకు!
అంతరార్థాన్ని నీ భావజాలంతో అపవిత్రం చేయకు!

## ఈగ వ్యాఖ్యానం

గాడిద మూత్రంతో ఒక గుంట నిండిన చోట, దాంట్లోని
గడ్డిపరకపై ఓ ఈగ వాలి తలపైకెత్తింది నావికుడిలా!
–'ఎన్నాళ్లనుంచో పెద్ద ఓడకు కర్ణధారినవుదామనుకున్నాను.
ఇదుగో చూడండి నా పడవ, ఇదుగో సముద్రం!
నేను ఈ నౌకకు కెప్టెన్‌ను, చాలా నేర్పుగలవాడిని'–
ఈగకు ఈ కాస్తమడుగు పెద్ద సముద్రంలా కన్పించింది.
దృష్టిని బట్టేగదా వస్తువు కూడా! ఈగ దృష్టి పరిమితి అంతే!
గ్రంథాలను వ్యాఖ్యానించేవాళ్లు చాలామంది ఆ ఈగల్లాంటివాళ్లు.
సత్యాన్వేషి వ్యాఖ్యానం మాత్రమే సరైన రూపాన్ని దర్శించి సరిగా వివరిస్తుంది.

## ఆగ్రహించిన సింహం

ఎంతసేపటికి కుందేలు రాకపోయేసరికి సింహానికి కోపం వచ్చింది.
–'శత్రువు నా చెవులతోనే నా కళ్లు కప్పేసినాడు.
అవకాశవాదుల పన్నాగాల ఉచ్చులో నేను చిక్కుబడిపోయాను.
వాళ్ల కొయ్య ఖడ్గమీనాడు, నన్ను గాయపరచింది.
ఇకనుంచి నేను వాళ్ల మొరలు వినబోను.
భూత పిశాచాల కేకల్లా వాళ్ల వేడికోళ్లు అన్నీ మోసపూరితాలే!
ఓ హృదయమా! ఇంక ఆలస్యం చేయకు! జాలివద్దు!
వాళ్లను ముక్కలు ముక్కలుగా చీల్చేయి! వాళ్ల చర్మాల్ని చింపేయి!
వాళ్ల మాటలన్నీ నీటి అలలే! కొనసాగింపులేని కతలే!
గింజపైన ఊకలాంటిది; ఊక–మాటలు, గింజ–అర్థం.
మాటలే రూపము, లోని గింజ అంతరార్థం.

పైపొట్టు, లోని గింజను దాచి చూపిస్తుంది.
ఒలిచిన తరువాతే గింజ నాణ్యత బయటపడ్తుంది.
నీటి మీద వ్రాసిన వాక్యాలు నిలబడవు.
గాలి కలంగా, నీరు కాగితంగా వ్రాసిన మాటలు వెంటనే చెరిగిపోతాయి.
నిరాశతో నీవు చేతులు కొరుక్కుంటావు.
ఆశ, కోరికలు మానవుడిలోని గాలి తరంగాలు.
దురాశను వదిలిపెట్టినప్పుడే దేవుడి నుంచి వార్తను స్వీకరించడానికి అర్హుడవవుతావు.
దేవుడి నుంచి వచ్చే వార్తలు మధురమైనవి. శాశ్వతమైనవి.
రాజుల స్తుతులు రాజ్యాలూ నశిస్తాయి.
ప్రవక్తల ప్రార్థనలు, సామ్రాజ్యాలూ శాశ్వతంగా నిలుస్తాయి.
రాజుల వైభోగం మితిమీరిన ఆశతో వచ్చింది,
ప్రవక్తల ప్రఖ్యాతులు దేవుని ఆశీస్సులతో వచ్చాయి.
దీరాముల నుంచి రాజుల పేర్లు తొలగించబడతాయి,
అహమ్మద్ నామం శాశ్వతంగా ముద్రించబడి ఉంటుంది.
అందరు ప్రవక్తల పేరూ అహమ్మదుగా భావించు.
వంద లెక్కిస్తున్నామంటే దానిలో తొంభై ఉన్నట్లే కదా!

## కుందేలు పథకం

ఆలస్యంగా బయల్దేరిన కుందేలు, తన ఆలోచనలను సరిచూసుకున్నది.
సింహానికేమి, ఎలా చెప్పాలో బాగా మననం చేసుకున్నది.
సహేతుకంగా ఉండే కారణం చెప్పాలి, కాని ఆ సముద్రపు వెడల్పెంత?
ఈ తియ్యటి సముద్రంలో మన రూపాలు వేగంగా కదుల్తాయి.
నీటిపై బోలు దోనెల్లా, కాగితపు పడవల్లా,
వాటిలో నీరు చేరిందా నిండా మునుగుతాయి.
కారణం కనపడకుండా దాగి ఉంటుంది. దాని రూపం కనిపిస్తుంది.
ఇదే కార్యకారణ సంబంధం.
కారణం సముద్రంలా ఉండి కార్యాలను అలల్లా ఒడ్డుకు విసిరివేస్తుంది.
అంతరాత్మనిచ్చినవాడిని హృదయం దర్శించినట్లే

బాణం తనను వదిలిన విలుకాడిని చూడదు.
వేగంగా పోతున్న గుర్రాన్ని గుడ్డివాడు చూడలేడు.
గాలి కంటే వేగంగా తనను తీసుకుపోతున్న సంగతి గమనించడు.
గుర్రం పోయిందనుకుని కనబడినవాళ్లనల్లా అడుగుతాడు ఏడుస్తూ!
–'నా గుర్రం ఏమయ్యింది?' – 'మీరెక్కింది గుర్రమే కదా!
'ఇది గుర్రం సరే, నా గుర్రమేమయ్యింది?'
దగ్గరగా ఉన్న ఆత్మను గుర్తించలేరు చాలామంది,
నిండా నీళ్లున్న కూజా, అంచుల వద్ద ఎండి ఉన్నట్లుగా!

కాంతినే చూడనివాడిని ఎరుపు, ఆకుపచ్చ, ఎరుపు, పసుపు
కలిసిన రంగుల్నెలా గుర్తించగలవు?
రంగుల్ని గుర్తించే ఉత్సుకతతో నీవు ఆ ముసుగులో
అసలు కాంతినే చూడలేకపోతున్నావు.
రాత్రిపూట రంగులు కనబడక పోవడాన్ని గమనించి
నీవు కాంతిలోనే రంగులున్న విషయాన్ని గుర్తిస్తావు.
బయట వెలుగు లేకుండా రంగుల్ని గుర్తించలేనట్లే,
నీ లోపలి రంగుల్ని గుర్తించడానికి ఓ పరంజ్యోతి కావాలి.
ఈ బయట కనిపించే వెలుగు, సూర్యుడు, 'సుహా' తార జననం
నీ లోపలి వెలుగు దేవుని ప్రకాశపు పరావర్తనం.
కంటికి కాంతినిచ్చే కాంతి హృదయ జనకం
హృదయ జనకమైన కాంతి కనుల ప్రకాశం.
హృదయానికి లభించే కాంతి పరంజ్యోతి ప్రసాదలబ్ధం.
ఇంద్రియ గోచరమయ్యే ఈ బాహ్యకాంతికి అది విరుద్ధం.
రాత్రి వెలుగు లేదు. రంగులూ కనబడలేదు.
చీకటి ఉన్నపుడు వెలుగు మరింత ప్రకాశవంతంగా ఉన్నది.
ముందు కాంతిని, తరువాత రంగును, ఆ పిమ్మట
కాంతికి వ్యతిరేకమైన చీకటిని నీవు గమనిస్తావు.
దేవుడు దుఃఖాన్ని బాధను ఈ లోకంలో ఉంచిందే

నీవు ఆనందపు ఆవశ్యకతను గుర్తిస్తావని.
దాగున్న వస్తువులన్నీ వాటి వ్యతిరేకాల వల్ల కనిపిస్తాయి.
దేవుడికి సాటి వచ్చేదేదీ లేదు కనుకనే దేవుడు కనిపించడు.
ముందుగా చూపు కాంతిమీద పడ్తుంది. ఆ తర్వాత రంగుపై-
ఆ విధంగానే నీవు గ్రీకులను, ఇథియోపియన్లను గుర్తిస్తావు.
నీవు కాంతిని చీకటి వలన గ్రహిస్తావు,
గుణాన్ని, వస్తువును వాటి వ్యతిరేక విషయాలతో పోల్చి చూస్తావు.
దైవకాంతికి సాటి రాగలిగినది లేదు. అందుకే
అత్యంత చీకటి మనకింకా అవగతం కాలేదు.
అతడు మనలను చూడగలడు, కాని, మనకళ్లు అతడిని చూడలేవు.
ఉదాహరణకు సినాయి పర్వతం వద్ద మోసెస్ వృత్తాంతమదే!

అడవిలో సింహంలా ఆత్మనుంచి రూపం వస్తుంది.
ఆలోచన నుంచి మాట, ధ్వని ఉద్భవించినట్లు.
మాట, ధ్వని ఆలోచన నుంచి వస్తాయి, సరే
కాని, ఈ ఆలోచనా సముద్రం ఎక్కడున్నదో తెలుసా నీకు!

మాటల అలలు సరైనవని తెలుసుగనుకనే
నీవు ఆలోచనా సముద్రం గొప్పదని గుర్తించావు.
ఆలోచనా తరంగాలు జ్ఞాన సముద్రం నుంచి వచ్చినపుడు
జ్ఞానం మాటల సంభాషణల రూపాన్ని దాలుస్తుంది.

రూపాన్ని దాల్చిన మాట అణగిపోతుంది, సముద్రంలో ఉబికిన అలలా.
రూపరహిత స్థితి నుంచి ఏర్పడిన రూపమూ అంతే
సముద్రపు అలలా వచ్చిన చోటుకే తిరిగి పోతుంది.
ప్రతిక్షణం నీవు పుడ్తున్నావు, మరణిస్తున్నావు,
ముస్తఫా వచించినట్లు ఈ ప్రపంచం ఓ క్షణకాల సమానం.

మన ఆలోచనలు అతడి నుంచి గాలిలోకి వెలువడిన బాణాలు.
అవి గాలిలో ఎంత కాలముంటాయి? అతడి వద్దకు వెళ్లిపోతాయి.

ప్రతిక్షణం ఈ ప్రపంచం మార్పు చెందుతూనే ఉంటుంది.
మనమనుకుంటాం ఈ ప్రపంచంలో మార్పేమీ లేదని.
ప్రవాహంలోని నీటిలా జీవితం కొత్తగా వస్తూనే ఉంటుంది.
దేహంలో మనకు తెలీకుండానే కొనసాగింపు ఉంటుంది.
నీవు చేతితో వదలిన కాంతిశకలాల ధారలా
అతి అత్యంత వేగంగా ప్రవహిస్తుండటం చేత కలిసి ఉన్నట్లుంటుంది.

కాగడాను లాఘవంగా విసిర్తే దాని కాంతి ఓ
దీర్ఘ కాంతిరేఖలా కనిపించి ఆశ్చర్యపోతాము.
దైవజనితమైన కార్యమూ అంతే!
దాని వేగము సాధారణ ఇంద్రియాల కగోచరం.
దానిని అన్వేషించేవాడు గొప్ప జ్ఞాని అయితే అను–
'అడుగో అతడు హుసాముద్దీన్! పవిత్ర గ్రంథం లాంటివాడు'

## కోపంతో ఉన్న సింహం వద్దకు వచ్చిన కుందేలు

వస్తున్న కుందేలును అంత దూరం నుంచే గమనించింది సింహం!
అయినా కుందేలు నిర్భయంగా, నెమ్మదిగా, సింహాన్ని సమీపించింది.
పళ్లు పటపట కొరుకుతూ, గోళ్లతో నేలను గోకుతూ గర్జించింది సింహం!
'ఆగు అక్కడే! కాలం చెల్లినవాడా! బలిసిన ఎద్దునే
ఆ మూలనుంచి ఈ మూలకి చీల్చి కాళ్లు విరగొట్టగలిగినవాడిని.
మదించిన ఏనుగు చెవుల్ని మెలిదిప్పి తల పగలగొట్టేవాడిని.
నా ముందు ఓ అర్భక చెవులపిల్లి తలెత్తుకు నడుస్తుందా?
గాడిదా! నీ బుర్రతక్కువ కుందేటి వ్యవహారం మాను! వినబడ్తుందా?'

## క్షమాపణ చెప్పిన కుందేలు

'మహాప్రభూ! క్షంతవ్యుడిని! తమ కరుణ ఈ బక్కప్రాణిపై ఉండునుగాక!

సింహం అరిచింది– 'ఎందుకు? ఆలస్యానికి ఏమిటి నీ సమాధానం?
తెలివితక్కువ, చూపుతక్కువ దద్దమ్మా! రాజుల ముందుకు ఇలానా వచ్చేది?

సమయపాలన చేయనందుకు నీ తల తెగ్గొట్టాలి! మూర్ఖుల జవాబు విననక్కర్లేదు.
మూర్ఖుడి తప్పుకన్నా దాని సమర్థన మరీ ప్రమాదకరం!
అజ్ఞాని సమర్థన విషం లాంటిది అది జ్ఞానాన్ని చంపేస్తుంది.
నీ తెలివితక్కువ సమాధానం వినడానికి నాకు గాడిద చెవులు లేవు'

కుందేలు అన్నది– 'ప్రభూ! ఎందుకూ పనికిరాని నా మాట ఈ ఒక్కసారి విను.
అణగారిన బతుకుతో అల్లాడుతున్న ఈ బక్కప్రాణి మొరాలకించు!
తమకు విధేయుడనై, విధివశాత్తూ దారి తప్పిన నా ప్రార్థన అంగీకరించు!
ప్రతి ప్రవాహానికీ కొంత నీరిచ్చే సముద్రం చెత్తాచెదారంపై తలవాలుస్తుంది.
దాని వలన సముద్రం గొప్పదనం తగ్గదు. దాని సంపదలకేమీ కాదు'

సింహం అన్నది– 'అవునా! నేను దేనిస్థానంలో దానిని ఉంచుతాను.
ఎవరి తాహతుకు తగ్గ వస్త్రాన్ని అంతవరకు కత్తిరిస్తాను'–

కుందేలు వేడుకున్నది– "అయ్యా! తమ కరుణ పొందదగిన జీవిని కాను.
తమరి పరాక్రమము ముందు తలవంచగా ఇటు వచ్చినాను.
నేను ఉదయాననే తమ దర్శనం కోసం ఇటు బయల్దేరాను.
జంతువులన్నీ తమకు ఆహారంగా రెండు కుందేళ్లను నిర్ణయించాయి.
దారిలో ఓ సింహం ఎదురై మమ్మల్ని అటకాయించింది.
నేనన్నాను– 'మేము రాజాధిరాజు కొలువులో చిన్ని సేవకులం'–
ఆ సింహం ఆగ్రహించింది– 'ఈ అడవిలో నేను రాజాధిరాజును.
ఈ అడవిలో ప్రతి వెధవా తాను రాజునని చెప్పుకునేవాడే!
నిన్నూ, నీ రాజును ముక్కలు ముక్కలుగా చీరేస్తాను! జాగ్రత్త!'
నేనన్నాను– 'అయ్యా! ఒక్కసారి మా రాజుకు నా మొహం చూపించి వస్తాను'–
ఆ సింహం అన్నది– 'వెళ్లిరా! అంతవరకు నీ మిత్రుడు ఇక్కడే ఉంటాడు.
పో! నీ రాజుకు మొరపెట్టుకో! నువ్వూ రాలేదా ఇతడిని తినేస్తాను'
ప్రభూ! నా స్నేహితుడు నాకు మూడింతలుంటాడు, బహుచక్కనివాడు.
మన రాజమార్గాన ఆ సింహం ఇతరులు పోకుండా ఆపుతున్నది.
అలా తమ ఒప్పందం భంగమయ్యే పరిస్థితి వచ్చింది ప్రభో!

ఇది నిజం! కఠోర నిజం! నిజం నిప్పులాంటిది!
తమకు ప్రతిరోజూ ఆహారం కావాలంటే ఆ అడ్డు తొలగించాలి!"

## కుందేలుతో బయల్దేరిన సింహం

'ఎంత కండకావరం! నా అడవిలో నాకు ప్రతిద్వంద్వియా?
పద! వాడెక్కడున్నాడో చూపించు! పద వెళదాం!
వాడి పొగరణగించి వాడిలాంటి వందల మందికి బుద్ధి చెబుతాను!
నీవు గనుక అబద్ధమాడితే నీకు తగిన గుణపాఠం చెబుతాను"

కుందేలు వినయంగా సింహం ముందు నడుస్తూ తన ఉచ్చులోకి దారితీసింది.
లోతైన బావి ఆ ఉచ్చు! ఆగ్రహంతో బుసకొడ్తున్న సింహం అటే నడిచింది.
పచ్చగడ్డితో కప్పబడిన లోతైన బావి వద్దకు వాళ్లు చేరుకున్నారు.
గడ్డిపరకతో పర్వతాన్ని లాగడం సాధ్యమయ్యే పనేనా?
కుందేలు తన తెలివితేటలతో సింహాన్ని బోల్తాకొట్టిస్తున్నది.
మోసెస్, ఈజిప్టు ప్రభువైన 'ఫారో'ను ససైన్యంగా మట్టికరిపించాడు.
అతడికి సముద్రం లాంటి నైలునది సాయపడింది.
సగం రెక్క ఉన్న దోమ నిమ్రాద్ తల పగలగొట్టించలేదా?
శత్రువు మాట విన్నవాడిని, ప్రతీకారం కోసం మిత్రుడైనవాడిని,
హమన్ మాటలను విన్న ఫారో, సాతాన్ బోధనలకు లొంగిన నిమ్రాద్
మితస్వరంతో మాట్లాడే శత్రువును గమనించాలి!
ఎర గురించి వర్ణిస్తూ గాలం వేసేవాడిని గమనించాలి!
అతడిచ్చే మధుర పదార్థమైనా అది విషమే!
అతడు నీపై కరుణ చూపినా అది క్రూరత్వమే!
కాని విధి త్రోసుకు వచ్చినప్పుడు బాహ్యరూపమే నిజమనుకుంటావు.
మిత్రుల మధ్య నున్న శత్రువును గుర్తించలేవు.
అందుకే దేవుని శరణు వేడుకో! ఆతడి కరుణను పొందు!
ప్రార్థించు! ఓ కరుణామయుడా! అన్ని రహస్యాలు తెలిసినవాడా!
కుట్రపూరితమైన రాళ్ల కింద మమ్ములను కూరుకోకుండా కాపాడు.
సింహాన్ని సృష్టించినవాడా! మేము తప్పు చేసినట్లయితే క్షమించు!

మేం చేసింది ద్రోహమైతే సింహాన్ని మాపై ఉసికొలపకు!
మంచినీటికి అగ్నిరూపన్నివ్వకు! నీటిని ప్రజ్వరిల్లనీకు!
నీ ఆగ్రహ మధువుతో మత్తెక్కిన మాకు లేనివి ఉన్నట్లుగా కనిపిస్తాయి.
ఏమిటీ అవస్థ? కంటిచూపును బంధించే ఈ స్థితి ఏమిటి?
రాయి మణిలా, ఉన్ని నీలంలా కనిపించేట్లు చేసే శక్తి ఏమిటిది?

ఏమిటీ ఇంద్రియ వైపరీత్యం? తమరిస్క్ చెట్టు
చందన వృక్షంలా కనిపించే ఈ స్థితి ఏమిటి?

## హూపొ-సులేమాన్ కథ

అక్కడ సులేమాన్‌కు గుడారం ఏర్పరచగానే
పక్షులు గుమికూడి తమ విధేయతను ప్రకటించుకున్నవి.
అతడు తమ భాష మాట్లాడడం గమనించి
ఒక్కోపక్షీ తమ మనోభావాల్ని ఆత్మీయంగా వెల్లడించాయి.
సులేమాన్‌తో మాట్లాడ్తుంటే పక్షుల సంభాషణ
ఎంత స్పష్టంగా ఉందంటే మనం కూడా అలా మాట్లాడలేము.
ఒకేభాష మాట్లాడడం అనేది ఒక బంధుత్వం, ఒక ఆకర్షణ.
పక్కవారితో సంభాషించలేని మనిషి పంజరంలో పక్షిలా కొట్టుకుంటాడు.
ఎందరో హిందూస్తానీయులు, తుర్కులు ఒకే భాష మాట్లాడుతారు.
కాని పక్కపక్కనే ఉన్న తుర్కులు అపరిచితుల్లా మెలగుతారు.
ఒకరినొకరు అర్థం చేసుకోడానికుపయోగపడే భాష ప్రత్యేకమైనది.
హృదయపూర్వకంగా ఒకరినొకరు అర్థం చేసుకోవడం భాషకన్నా గొప్పది.
భాష, మాట, అక్షరాల అవసరం లేకుండానే
లక్షలాది మంది దుబాసీలు హృదయభాష నెరుక పరుస్తారు.
అలా పక్షులు అనేక రకాలు తమతమ నేర్పును, రహస్యాలను
సులేమాన్ ప్రభువుతో మనసు విప్పి మాట్లాడినాయి.
అవి తమ గొప్పతనాన్ని చెప్పుకుంటూ సులేమాన్ ప్రసన్నతను
పొందడానికి ప్రయత్నించాయి. వాటిలో గర్వం లేదు.

ఎవరైనా తనను తాను బానిసగా అమ్ముకోడానికి సిద్ధపడ్డపుడు
తన గొప్పదనాన్ని, నేర్పును, ప్రావీణ్యతను ఘనంగా చెప్పుకుంటాడు.
అయితే తనని ఎవరైనా కొంటున్నారని తెలియగానే అతడు
సిగ్గుతో తన నేర్పును మరచి కుంటిగా, చెవిటిగా జబ్బు పడతాడు.

ఇప్పుడు హూపొ పక్షి వంతు వచ్చింది. హూపొ అన్నది
'ప్రభూ! మా జాతికున్న ప్రత్యేకతను, క్లుప్తంగా తెలియజేస్తాను'
'అవునా! వివరించు! విన కుతూహలంగా ఉంది'–
'ప్రభూ! నేను ఆకాశంలో నడినెత్తిమీద ఎగుర్తూ
నేల అట్టడుగున నీరు ఎక్కడ, ఎంత లోతులో ఉందో చెప్పగలను.
నీటి స్వభావం, అది ఎక్కడ పైకి ఉబుకుతుందో
అది రాతినేలా, మట్టి మాత్రమేనా అన్న విషయం కూడా!
అనంతమైన సేనావాహిని ఉన్న తమకీ విద్య ఉపయుక్తం అవుతుంది'
సులేమాన్ ప్రభువు అన్నాడు– 'నీ సేవ నిజంగా మాకు ఉపయోగకరమే!'

## కాకి అసూయ

హూపొ మాటలు విన్న కాకి అసూయతో అన్నది–
'ప్రభూ! ఆ మాటలు అబద్ధం. అందునా తమ సమక్షాన అలా మాట్లాడరాదు.
అంతెత్తు నుంచి భూమి అడుగున నీరు చూడగలిగిన వాడు
నేలమీద ఉన్న ఉచ్చు చూసుకోడా! పంజరంలో ఎలా చిక్కాడు?'

సులేమాన్ అడిగాడు– 'హూపొ పక్షీ! అబద్ధం చెప్పావా?
మజ్జిగ తాగగానే మధువు తాగినంత కైపెక్కి మాటలు పేలావా?'
హూపొ అన్నది– 'ప్రభూ! నా శత్రువు ఆరోపణలు నిజం కావు.
నా గురించి నేను చెప్పిన మాటల్లో అసత్యముంటే నా తల తెగనరకండి.
కాకి ఏనాడూ విధినీ, దైవాన్ని నమ్మని అవిశ్వాసి,
కాని దానికి వేలాది తెలివితేటలున్నాయి.
కాఫిర్‌లోని ఒక్క 'క' అక్షరమున్నా నాలో,
నేనున్న ప్రదేశమంతా దుర్గంధంతో నిండి ఉండునుగాక!

నేను ఉచ్చును చూడగలను కాని దైవప్రేరితమై
ఆ క్షణంలో నా కంటిచూపు నిశితంగా ఉండకపోతే!
దైవప్రేరితమై విధి వెంటాడినప్పుడు జ్ఞానం మసకబారుతుంది.
చంద్రుడు నల్లబడతాడు. సూర్యకాంతి ఆపివేయబడ్తుంది.
దైవ ప్రేరితమైన విధి నిర్ణయంలో ప్రత్యేకత అదే!
అవిశ్వాసి ప్రత్యేకత కూడా దైవ నిర్ణయమే!

## ఆదాము కథ

తొలి మానవుడు ఆదాముకు దేవుడు అనేక వేల శాస్త్రాలను నేర్పినాడు.
ఉన్నవి, రాబోయేవీ యుగాంతం వరకు ఉండే వాటన్నిటి పేర్లూ తెలిపినాడు.
ఆ పేర్లూ మారలేదు. అతడు 'వేగి' అన్నది నెమ్మదిగా పోనూలేదు.
విశ్వాసినీ గమనించినాడు, అవిశ్వాసినీ అవలోకించినాడు.
అన్నీ తెలిసినవాడే వాటికి పేర్లు పెట్టినాడు, ఆదాముకు నేర్పినాడు.
మోసెస్ చేతికర్ర కొయ్యదే, కాని దేవుడి దృష్టిలో అది మహాసర్పము.
ఉమర్ అంటే విగ్రహారాధకుడు కావచ్చు, కాని అతడు విశ్వాసి.
పేరు కేవలం విత్తనం వంటిది. ఒక ఆలోచనలాంటిది.
విత్తనం వృక్షమవుతుంది. అప్పుడే దానిపేరు సార్ధకమవుతుంది.
మన అంతిమ రూపమే దేవుడి దృష్టిలో మన పేరు అవుతుంది.
మనం జీవితాన్ని అంతిమదినం వరకు గడిపిన దానిని బట్టి
మన పేరు నిర్ధారణవుతుంది, కాని, మనకున్న పెట్టుడు పేర్లవల్ల కాదు.
స్వచ్ఛమైన దైవకాంతిలో ఆదాము జీవజాలాన్ని చూసాడు.
అందుకే వాటికి తగిన పేర్లతో వాటిని పిలిచినాడు.
అతడిలో దైవకిరణాలను గమనించారు గనుకనే
దేవదూతలు అతడిని ప్రస్తుతించడానికి వేగిరపడినారు.
ఆదాము అన్నీ తెలిసినవాడే అయినా విధి నిర్ణయం ముందు
ఆ ఒక్క నిషేధాన్నీ అమలు పరచలేకపోయినాడు.
ఆ నిషేధమెందుకో అతడికి అర్థం కాలేదు, అది తనను
దైవాజ్ఞను తప్పేట్లు చేయడానికి ఉద్దేశించబడిందా?

లేక దానిని విస్తృతంగా శోధించమని అన్యాపదేశమా?
ఎప్పుడైతే ఆదాము దైవాజ్ఞను అన్యాపదేశంగా భావించాడో
వద్దన్న పండు తినడానికి వేగిర పడినాడు.
తోటమాలి కాలిలో ముల్లు గుచ్చుకోగానే దృష్టి మారగానే
దొంగ (సాతాను)కు అవకాశం దొరికి ఫలాలతో దౌడు తీసినాడు.
ముల్లు వదిలించుకుని తోటమాలి (ఆదాము) రహదారిపైకి రాగా
దూరంగా, సొత్తుతో పారిపోతున్న దొంగ కనిపించాడు.
అతడు అరిచాడు– 'ప్రభూ! మేము తప్పు చేసాము,
చీకటి కమ్మి మాకు దారి కనిపించకపోయింది.'
దైవ నిర్ణయం అనేది ఒక్కోసారి మబ్బులా సూర్యుణ్ణి కప్పుతుంది.
అటువంటప్పుడు సింహాలూ, డ్రాగన్లు చిట్టెలుకలవుతాయి.
–నేను క్రింద ఉన్న ఉచ్చును చూడలేదంటే అది
ఆనాటి దైవనిర్ణయాన్ని తెలుపుతుంది.
సరైన మార్గంలో పోయేవాడికి దేవుడే శక్తిని ఇస్తాడు.
ఒకవేళ దైవనిర్ణయం మబ్బులా కమ్ముకున్నా, అదే
ఆఖరి క్షణాన నిన్ను తన చేత్తో ఆపద నుంచి గట్టెక్కిస్తుంది.
వందసార్లైనా ఉచ్చుల్లోంచి, మృత్యు ముఖాన్నుంచి బయటకు నెడ్తుంది.
స్వర్గ శిఖరాన నీకు గుడారాన్ని నిర్మించి ఇస్తుంది.
అర్థం చేసుకో దేవుడి కరుణా కటాక్ష వీక్షణాలను.
నిన్ను భయపెట్టేదంతా నిన్ను పరీక్షించి రక్షణనివ్వడానికే!
సరే! ఇప్పుడు కాలాతీతమవుతున్నది. కుందేలు కథలోకి పోదాం!

## వెనకడుగు వేసిన కుందేలు

బావి దగ్గరకు వచ్చేసరికి కుందేలు వెనకగా రాసాగింది.
సింహం అడిగింది– 'ఎందుకు వెనక్కు తగ్గావు? పద ముందుకు!'
కుందేలు అన్నది– 'ప్రభూ! భయంతో నాకు అడుగు
ముందుకు పడడం లేదు. నాకు కాళ్లూ చేతులాడడం లేదు.
ఆత్మ వణుకుతున్నది. గుండెధైర్యమేనాడో పారిపోయింది.

నా ముహాన్ని చూడు, పాలిపోయి, నాలోపలి దీనావస్థను చెబుతున్నది.
దేవుడ్ని బయటకు కనిపించేట్లు చేసే అవస్థనే
కళ్లు గమనించి అటు నిశితంగా చూస్తాయి.
రంగు, వాసన ఘంటానాదం లాంటివి, సకిలింపు గుర్రాన్ని గుర్తు చేస్తుంది.
ధ్వనిని బట్టి మనం దేనికి చెందిందో అనుభవ జ్ఞానంతో చెప్పగలుగుతాం.
తలుపు కిర్రు చప్పుడు నుంచి, గాడిద ఓండ్రిపును వేరుగా గుర్తిస్తాం!
మనుషుల గురించి ప్రవక్త అన్నాడు– 'నాలుక మడతపెట్టుకున్నవాడు బయటపడడు!
ముఖం రంగు హృదయపు తీరును తెలియజేస్తుంది.
నాపై దయ ఉంచి తమ హృదయంలో నాపై కరుణను ప్రతిష్ఠించండి.
ఎరుపురంగు ముఖం సంతృప్తిని తెలియబరుస్తుంది.
పాలిపోయిన ముఖాలు భయాన్ని, సహనాన్ని చెబుతాయి.
ఇప్పుడు మనం నా కాలూ, చేయిని కదలకుండా చేసి,
నా ముఖం రంగును పాలిపోయేట్లు చేసిన చోటుకు వచ్చాం.
ఆ శత్రువు తనకు దొరికిన దానిని చీల్చిచెండాడుతుంది.
చెట్లను సైతం కూకటివేళ్లతో పెకలించి పారేస్తుంది.
అది మనిషిని, జంతువును, రాయీ రప్పల్ని, మొక్కల్ని నాశనం చేస్తుంది.
ఈ చుట్టుపక్కల వెలిసిన రంగులూ, దృశ్యాలూ ఆ హింసాభాగాలే!
ఇప్పుడిప్పుడే ఈ చుట్టుపక్కల కాస్త ఆకుపచ్చదనం అగుపిస్తున్నది.
ఉదయాన అగ్నివర్ణాన అరుదెంచే సూర్యుడు సాయంకాలం అస్తమిస్తాడు.
నాలుగు దిక్కులా వెలిగే చుక్కలొక్కోసారి ఉల్కలై కాలిపోతుంటాయి.
అందమైన చంద్రబింబం, మాయదారి రోగం వచ్చినట్లు కళాకాంతులు తప్పుతుంది.
స్థిరంగా ఉన్న భూమి భూకంపాలతో దద్దరిల్లుతుంది.
ఎన్నో ఉన్నత పర్వతాలు కాలగతిని పొడిపొడి ఇసుకగా మారినాయి.
జీవాన్నిచ్చే గాలి, విధి నిర్ణయం మారినప్పుడు, కంపుగొట్టే మృత్యుపవమౌతుంది.
ఆత్మను ఉల్లాసపరిచే మంచినీరు కలుషితమై దుర్గంధ భూయిష్ఠమౌతుంది.
తన కొసన వాయువున్న అగ్నిజ్వాలను చిన్నగాలి ఆర్పేస్తుంది.
సముద్ర తరంగాలను చూసి మనం తుఫానును అంచనా వేయవచ్చు.
ఎప్పుడూ శోధించే మనస్తత్వమున్న పిల్లల్లాంటిది దైవలోకం.

ఇప్పుడు అట్టడుగు, తర్వాత మధ్యన, ఆనక ఆకాశం,
అంత తేలికగా అంతు పట్టేవికావు దైవలీలలు.
సూక్ష్మస్థితిని చూసి మనం స్థూల విశ్వాన్ని అంచనా వేయాలి.
పూర్తి దేహమంతా బాధననుభవిస్తుంటే
దానిలోని భాగం పాలిపోకుండా ఉంటుందా?
ముఖ్యంగా విరుద్ధ తత్వాలున్నపుడు– నీరు, నేల మరియు గాలి, అగ్ని
గొర్రెలు వణికిపోయాయెందుకనంటే అవి తోడేలును మిత్రుడనుకున్నాయి.
జీవితమంటే విరుద్ధ తత్వాల మధ్య సమన్వయం.
మృత్యువు వస్తున్నదంటే వాటిమధ్య సమరం మొదలైందని అర్థం.
దేవుడి కరుణ సింహానికి, అడవి గాడిదకు మధ్య సమన్వయాన్నిస్తుంది.
ప్రపంచమే జబ్బుపడి జైలులో ఉన్నపుడు ఒక ఖైదీ మరణిస్తే ఏమిటి?
–'ఈ బంధాల వల్ల నేను వెనకబడ్డాను, ప్రభూ!' అన్నది కుందేలు.

## సింహం–కుందేలు

'అయితే, నీ కష్టాలకు కారణమైన నా శత్రువు ఎక్కడ?'– గర్జించింది సింహం.
'ఆ సింహం ఈ బావిలో దాగి ఉన్నది–అపాయాలకు దూరంగా'
తెలివిగలవాళ్లు సుఖంగా జీవించడానికి బావి అడుగును ఎన్నుకుంటారు.
ఎందుకంటే ఒంటరిగా ఉంటే ఆత్మానందం కలుగుతుందని.
బావిలోని చీకటి బాహ్యప్రపంచపు నీడలకన్నా మేలైనది.
లోకపు పాదాలననుసరించేవాడి తల ఏనాడు క్షేమంగా లేదు.
'ఇటురా!' అరచింది సింహం. 'పోయిచూడు! నా శత్రువు ఉన్నదా! లేదా!'
'తమరు పక్కనుంటే నాకు భయంలేదు' అన్నది కుందేలు.
ఇద్దరూ బావి అంచువద్దకు వెళ్లి లోనికి తొంగిచూసారు.
నీటిలోపల సింహం, కుందేలు రూపాలు స్పష్టంగా కానవచ్చాయి.
ఎప్పుడైతే తన శత్రువును చూసిందో, సింహం వెంటనే బావిలోకి దూకింది గర్జిస్తూ
తన ప్రవర్తన తవ్విన గోతిలో తానే పడింది సింహం.
దుర్మార్గుల అనైతిక ప్రవర్తన ఎంత తీవ్రంగా ఉంటే,
వాళ్లు తవ్వుకునే గోతులంత లోతుగా ఉంటాయి.

దైవన్యాయం దారుణాన్ని దారుణంగా శిక్షిస్తుంది.
ఓ అనైతిక ప్రవర్తకుడా! నీవు తీసే గోతిలో నీవే పడతావు.
పట్టుపురుగులా గూడును నీ చుట్టూరా అల్లుకోకు!
గోతిని బాగా లోతుగా తవ్వకు. అది నీకోసమే తెలుసుకో!
వాడు బలహీనుడు కదా సాయమందదనుకోకు!
పవిత్రగ్రంథం పఠించు– 'దేవుని సహాయం ఎలా వస్తుందో చదువు'–
నీవు ఏనుగువు కనుక నీ శత్రువు నిన్ను చూసి పారిపోతే,
గమనించు, ప్రతీకారం వందలాది పక్షుల్లా నీపై దాడి చేస్తుంది.
ఎవరైనా పేదవాడు దిక్కుతోచని స్థితిలో సాయమర్థిస్తే,
సాక్షాత్తు దేవలోకంలో కలకలం పుట్టి కదిలివస్తుంది.
ఎవర్నైనా నీవు పళ్లతో కొరికావా, నీకు తీవ్రంగా పంటినెప్పి వస్తుంది.
సింహం తన నీడను చూసి శత్రువుగా భ్రమించింది.
ఆగ్రహం దాని విచక్షణా జ్ఞానాన్ని నశింపచేసింది.
తన నీడను శత్రువనుకుని తనపైనే తాను కత్తిదూసింది.
ఇతరుల ముఖాల్లో నీవు చూసేది నీ ప్రతిబింబమే!
ఆ ప్రతిబింబాలలో నీ అనైతికత, మూర్ఖత్వం, మొండితనం కన్పిస్తాయి.
నీ దుష్టబుద్ధితో నిన్ను నీవే తిట్టుకొంటున్నావు, కొట్టుకుంటున్నావు.
నీలో ఉన్న చెడును చూస్తే, నిన్ను నీవే ఆత్మసాక్షిగా అసహ్యించుకుంటావు.
ఓ మనిషీ! ఆగ్రహంతో ఉన్న సింహంలా అపాయాన్ని కొనితెచ్చుకుంటావు.
నీవు నీ సహజ స్వభావాన్ని అట్టడుగు నుంచి పరిశీలించు,
నీలోనే ఆ దుష్టబుద్ధి దాగున్నదని గ్రహిస్తావు.
బావిలో అడుగుకు పోయినాక సింహానికి అర్థమయ్యింది.
తన శత్రువు తానే, ఇంకెవరూ కాదని.
బలహీనుడి ఉసురు తీయబూనుకుంటే వాడికి సింహం గతే పడ్తుంది.
ఎదుటివాడి మొహంలో చూసేది నీ ప్రతిబింబమే,
అందుకే నీ నుంచి నీవు పారిపోలేవు.
ప్రవక్త చెప్పలేదా! 'అద్దాలు అబద్దాలాడవని'–
కంటిముందు నీలిరంగు అద్దముంటే ప్రపంచమంతా నీలంగా కనిపిస్తుంది.

నీవు గుడ్డివాడివి కాకపోతే నీకు తెలుస్తుంది.
ఈ నీలం రంగు నీ నుంచే వచ్చిందని!
నీ గురించి ముందు మాట్లాడుకో, ఇతరులపై నెట్టకు.
దైవకాంతి వెలుగులో చూస్తున్నాడు కాబట్టే విశ్వాసికి
రహస్య విషయాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.
దైవాగ్ని జ్వాలలో నీకు మంచీ చెడుల బేధం తెలీదు.
అగ్నిపై కొద్దికొద్దిగా నీరుజల్లు! అది కాంతిగా మారుతుంది.
దేవుడు పరిశుద్ధ జలాన్ని జల్లినప్పుడు ప్రపంచాగ్ని కాంతుల్ని వెదజల్లుతుంది.
ఓ ప్రభూ! ఈ యావత్ సముద్రజలాలు, అగ్ని, నీరు అన్నీ నీవే!
నీవు అంగీకరిస్తే అగ్ని తీయని నీరవుతుంది.
నీవు కోపిస్తే జలం జ్వాలగా మారుతుంది.
ఈ సత్యాన్వేషణను మాలో నెలకొల్పేది నీవే ప్రభూ!
దుష్ట ఆలోచనలు, దుష్ప్రవర్తన నుంచి విముక్తము చేసేది నీవే!
కోరకుండానే మాకు సత్యాన్వేషణా ధోరణులను,
అనంతంగా బహుమతులను అందజేస్తున్నావు.

## కుందేలు - మిగతా జంతువులు

సింహాన్ని అలా బావి పాలు చేసి కుందేలు
మిగతా జంతువుల్ని వెదుక్కుంటూ ఎడారి ప్రాంతానికి చేరుకున్నది.
సింహం బావిలోకి దూకి అదృశ్యం కాగానే
కుందేలు సంతోషంతో గంతులు వేస్తూ మైదానాన్ని దాటింది.
మృత్యువు నుంచి తప్పించుకున్నానన్న సంతోషంతో కుందేలు
రెండు చేతుల్తో చప్పట్లు కొడుతూ పూలతీగెలా నృత్యం చేసింది.
శాఖ, ఆకు తలపైకెత్తి నేల పంజరం నుంచి బయటపడి,
గాలికి సహచరులై ఊగుతున్నట్లు, కుందేలు గంతులేయసాగింది.
శాఖ నుంచి విప్పారిన ఆకులు తలలు పైకెత్తి వృక్షాగ్రాన్ని కమ్ముకున్నట్లు
ఫలపుష్ప సముదాయంతో వృక్షం దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు
'మహిమాన్వితుడైన దేవుడు నన్ను విత్తనం నుంచి వృక్షం దాకా మలిచినాడు'

మట్టితో చేయబడిన దేహంలో బంధించబడిన ఆత్మ,
విడుదల కాగానే పరమాత్మతో ఐక్యం చెందడానికి వేగిరపడినట్లు,
అనంతమైన దివ్యప్రేమలో, మచ్చలేని చంద్రుని మనోహర కాంతిలో
ఆత్మలు ఆనంద పారవశ్యంతో నాట్యం చేస్తున్నట్లు
అంతా అనిర్వచనీయమైన, అద్భుతమైన, అలౌకికమైన ఆనందమే!
కుందేలు సింహాన్ని కూల్చివేసింది. సింహం శిరస్సు ఛిద్రమైంది.
అయినా సింహం ఇంకా జంతువులలో పెద్దగానే భావించబడ్తున్నది.
ఓ బావి అడుగున ఉన్న సింహమా! నీ ఆత్మలాంటి కుందేలు అదుగో!
ఎడారి దగ్గర నీ ఆత్మ ఎగురుతున్నది! నీవేమో బావి అడుగున ఉన్నావు.
కుందేలు గంతులేస్తూ మిగతా జంతువుల మధ్యలోకి పరిగెత్తింది.
'మిత్రులారా! సంతోషకరవార్త! ఆనందాన్నిచ్చే విషయం!
అందరికీ సంబరం! నరకలోకపు శునకం నరకానికి పోయింది!
మన శత్రువు సృష్టికర్త ఆగ్రహానికి గురై నశించినాడు.
తన గోళ్లతో ఎందరినో చీల్చిచంపిన వాడు, ఈనాడు
మృత్యువు చేతి చీపురుతో చెత్తలోకి తోయబడినాడు.
మిగతా జంతువుల సంతోషానికి అంతే లేదు.
అవి కుందేలు చుట్టూ వలయంలా మూగి నమస్కరించాయి.

'నీవు దేవదూతవో, రక్షకుడివో, లేక సింహాల పాలిటి అజ్రాయెల్‌వో!
నీవెవరైనా అందుకో మా కృతజ్ఞతలు. నీకు అభినందనలు.
దేవుడి ఈ నీటిని ప్రవాహంగా చేసినాడు. నిన్ను ఆశీర్వదించినాడు.
వివరించు! నీ యుక్తి ఎలా ఫలించిందో! ఎలా నిర్వర్తించావీ పనిని!
ఈ కథ మాకు శాంతినొసగనీ! మా గాయాలకు లేపనం కానీ!
ఆ దురహంకారి దుష్ప్రవర్తనతో మా ఆత్మల నిండా గాయాలే!

కుందేలు అన్నది– 'అయ్యలారా! ఇదంతా దైవకృప!
నేను ప్రభు కరుణ లేకుండా ఈ పని చేయగలిగేవాడిని కాను!
నాకు శక్తినిచ్చి, నా హృదయాన కాంతి నిలిపినాడతడు.
మన ఉన్నత, అథోస్థానాల ఉత్థాన పతనాలు ఆతడి లీలలే!

✤✤✤✤✤

విశ్వాసులకు, సందేహస్తులకు దేవుడెప్పుడూ వీటిని బహిరంగపరుస్తాడు.
రాజ్యాధికారం వచ్చిందని సంబరపడవద్దు.
కాలపు సంకెళ్లలో బందీలై ఉండి విముక్తి దొరికిందని గంతులేయవద్దు
ఎవరి కోసమైతే ఈ నిరంతర చలన ప్రపంచపు ఆవలి రాజ్యం
నిర్ణయించబడిందో, వారికై సప్తగ్రహాల సంగీతం వేచియున్నది.
ఈ కల్లోల ప్రపంచాల కావల శాశ్వత ప్రభువులున్నారు.
వారి ఆత్మలు పరమాత్మ చుట్టూరా పరిభ్రమిస్తుంటాయి.
ఈ భౌతిక సుఖాల మధువును వర్జించు,
స్వర్గలోకపు మధువుతో నీ పెదాలను తడుపుకో!

యుద్ధం నుంచి సంగ్రామంలోకి
ప్రభువులారా! మనం బాహ్య శత్రువుని నిర్జించాము!
అతడికంటె బలవత్తరమైన శత్రువు ఇంకొకడున్నాడు.
ఇతడిని ఆలోచనతోనో, యుక్తితోనో, తెలివి తేటలతోనో గెలువలేము.
ఈ అంతర్సింహాన్ని తెలివిగల కుందేలేదీ జయించలేదు.
ఇంద్రియ చాపల్యమనేది నరక సమానం. నరకాగ్నిని సముద్ర జలాలతో ఆర్పలేము.
సప్తసముద్రాల నీటిని తాగినా ఆ అగ్ని శాంతించదు.
రాళ్లు, రాతి హృదయం గత అవిశ్వాసులు, దీనులు, లజ్జాపూరిత వీరనం గల
వాళ్లు ఆ అగ్నిలో ప్రవేశించినా దాని ఆకలి చల్లారదు.
అప్పుడు దేవుడి పిలుపు వినవస్తుంది– 'నీ ఆకలి తీరిందా?'–
అది అంటుంది– 'లేదు. ఇది అగ్ని. ఇది జ్వాల. ఇది వెలుగు'.
ప్రపంచం అంతా దాంట్లో కాలి భస్మమైనా అది ఇంకా కావాలని అరుస్తుంది.
దేవుడు తన పాదంతో నరకాగ్నిని అణిచాక అది పూర్వస్థితిని చేరుకుంటుంది.
మన అహం నరకంలో ఒక భాగం. అన్ని భాగాలకు పూర్వ స్వభావముంటుంది.
దేవుని పాదం మాత్రమే ఈ అగ్నిని అణచివేయగలదు.
దేవుని విల్లు నుండి వెలువడిన బాణం తిన్నగా ఉండి లక్ష్యఛేదన చేస్తుంది.
మన నుంచి వెళ్లే బాణం వెనక్కు వంగి ఉంటుంది.
బాహ్యయుద్ధం ముగిసాక అంతర్యుద్ధం మొదలవుతుంది.

చిన్ని యుద్ధాన్ని ముగించి మనం ప్రవక్తతో కలిసి మహా సంగ్రామానికి వెళ్తున్నాం.
నాకు దేవుడు సర్వశక్తులనొసగును గాక! సూదితో పర్వతాన్ని లేవబూనుదును గాక!
శత్రువులను తుత్తునియలు చేసే సింహాన్ని చూడు!
నిజమైన సింహం తన అంతశ్శత్రువులను నిశ్శేషం చేస్తుంది.

## ఉమర్ - రమ్ రాయబారి

రమ్ దేశం నుంచి చక్రవర్తి పంపగా రాయబారి వచ్చి ఇలా అన్నాడు–
'ఓ సేవకులారా! కాలిఫ్ రాజభవనం ఎక్కడ! నేనక్కడకు వెళ్లాలి!
వాళ్లన్నారు– 'అతడికి రాజభవనం లేదు. దివ్యకాంతి అతడి సౌధం.
అతడు ప్రవక్త సైన్యాధ్యక్షుడే కాని అందరిలా గుడారంలో నివసిస్తాడు.
సోదరా! నీ హృదయనేత్రాన్ని వెంట్రుకలు కప్పినపుడు,
ఉమర్ భవనాన్ని నీవు చూడలేవు సుమా!
ఆ వెంట్రుకలను, దృష్టిలోపాన్ని సవరించుకో, ఆ భవనం కనబడుతుంది.
కోరికలను వర్జించిన వారికి అతడి భవనం వెంటనే కనిపిస్తుంది.
ఏనాడైతే మహాత్ముడు ఈ అగ్నినీ, పొగలను వదిలించుకున్నాడో
ఆనాడే అతడి వదనాన అల్లాహ్ వెలుగురూపం కానవచ్చింది.
హృదయపు తలుపు తెరవబడినవారికి సూర్యనగరం కనిపిస్తుంది.

తారల మధ్య చంద్రుడిలా దేవుడు ప్రకాశిస్తాడు.
రెండు చూపుడు వేళ్ల కొనలతో కళ్లు మూసుకో!
ఈ ప్రపంచమంతా అంధకారమయంగా అనిపించడం లేదా!
నీకు కనబడకపోయినంత మాత్రానీ ప్రపంచం లేనట్లు కాదుకదా!
నీ వక్ర ఆలోచనా వేళ్ల చివర తప్పు ఉన్నదని అర్థం చేసుకో!
రా! ఆ అడ్డం ఉన్న వేళ్లను తీసివేయి! నీక్కావల్సింది చూడు!
'నోవా'ను ప్రజలడిగారు– 'ఏదీ దేవుని ఉనికి?'–
అతడన్నాడు– 'మీరు మీ వస్త్రాలతో కప్పుకున్న దానికి ఆవలవేపు'–
మీ శిరస్సులను ముఖాలను వస్త్రాలతో కప్పుకున్నారు,
కళ్లుండి కూడా అవసరమైన వాటిని చూడలేకున్నారు.

మానవుడే నేత్రం! మిగతాదంతా చర్మమే;
ఆ నేత్రం చేయాల్సిందల్లా తన ప్రేమను చూడడమే!
ప్రేమను చూడలేని నేత్రం, గుడ్డిదిగా ఉండడమే ఉచితం.
అశాశ్వతమైన ప్రేమికుడు లేకపోవడమే నీకు శుభం.”–
రమ్ దేశపు రాయబారి ఈ మాటలను విన్నాడు.
అతడి హృదయం ఉద్విగ్నతకు లోనైనది.
అతడు ‘ఉమర్’ దర్శనం చేయ సంకల్పించినాడు.
తన గుర్రాన్ని వస్తువుల్ని వదిలేసి అన్ని దిక్కులా అన్వేషించసాగినాడు.
–‘ఈ ప్రపంచంలో ఎవరైనా వ్యక్తి ఆత్మలా ప్రపంచానికి కనిపించకుండా దాగి ఉన్నాడా?’
అతడి మాటలు విన్న ఓ అరబ్ స్త్రీ అన్నది– ‘ఓ పరదేశీ!
అడుగో! ఉమర్! ఖర్జూరపు చెట్టు కింద విశ్రమించి ఉన్నాడు.
నీడలో నిదురిస్తున్న దేవుని ఛాయను అక్కడ చూడగలవు’–

## ఉమర్ – రాయబారి

ఉమర్‌ను చూడగానే అల్లంత దూరంలో నిలబడ్డ రాయబారికి
ఆపాదమస్తకం కంపించి, విస్మయం, ఆనందం కలిగాయి.
భయం, ఆనందం వ్యతిరేకాలయినా ఆ క్షణం
అతడి హృదయంలో ఆ రెండూ మిళితమైన అపురూప సందర్భమది.

అతడు తనలో అనుకున్నాడు– ‘ఎందరో ప్రభువుల్ని చూసాను,
ఎంతో సాదరంగా గౌరవింపబడ్డాను; సుల్తానులచే ఆదరించబడ్డాను.
ఏ రాజును చూసినా నాకేనాడూ భయం కలుగలేదు.
కాని ఈ వ్యక్తి నన్ను పూర్తిగా విభ్రముణ్ణి చేసినాడు.
సింహాలు, చిరుతపులులు ఉన్న అడవుల్లో ఒంటరిగా సంచరించినపుడు
కూడా నా వదనం రంగు మారలేదు. యుద్ధరంగంలో సింహంలాంటివాడిని.
ఎన్నో దెబ్బలు తిన్నాను, ఎందరినో మట్టికరిపించాను.
నేను అరిస్తే, యుద్ధ నినాదాలు చేస్తే శత్రువులు వణికేవారు.
అంతటి గుండెధైర్యం గలవ్యక్తిని నేను, ఈనాడు–
ఈ చెట్టు కింద నిరాయుధుడై నిద్రపోతున్న వ్యక్తిని చూసి

నా సప్తమండలాలూ, నవనాడులూ వణికిపోతున్నాయి, ఏమి ఆశ్చర్యం?
ఈ భయం దేవుడి వలన కలిగిందే! మానవమాత్రులకసాధ్యమిది!
సాధువుల వస్త్రాలను ధరించి దైవాగ్రహాన్ని ఆయుధంగా ధరించినవారికి
సమస్త భూతాలూ, మానవులూ దాసోహమనాల్సిందే!'–
అనుకుంటూ ఆ రాయబారి ముకుళిత హస్తుడై అక్కడే నిలబడినాడు.

## రాయబారి – ఉమర్

ఉమర్‌ను పలకరించి సలాం చేశాడు రాయబారి.
'ముందు సలాం తర్వాతే మాటామంతీ' –అన్నాడు ఉమర్.
రాయబారిని తన పక్కనే కూర్చోమని ఆజ్ఞాపించినాడు.
–'భయపడకు! రా! ఇక్కడ కూర్చో!'–
భయపడుతున్న వాడికి ధైర్యం చెప్పు. స్థిమిత పడనీయి!
భయం లేనివాడికి భయపడవద్దు అని చెప్పనవసరం లేదు కదా!
భయపడుతున్న రాయబారిని స్థిమితపరచినాడు ఉమర్.
ఆ తరువాత దేవుని గొప్పతనాన్ని, సూక్ష్మ అంశాలను బోధపరచినాడు.
దేవుడు సాధువులపై కురిపించే ప్రేమపూర్వక కరుణను
శాశ్వతస్థానాన్ని, మధ్య మజిలీని వివరించినాడు.
మధ్య మజిలీ లేదా ప్రస్తుతస్థితి– హాల్ అనేది మేలిముసుగులో ఉన్న యువతి లాంటిది.
మకాం లేదా శాశ్వతస్థానమనేది ఆమె పక్కన ఒంటరిగా ఉన్న ప్రభువు
మేలిముసుగు తీసినప్పుడు ఆమె వదనాన్ని అందరూ చూడగలుగుతారు.
కాని అక్కడ ప్రభువొక్కడే ఉన్నపుడు అతడే చూడగలడు.
మేలిముసుగు తొలగించడమనే క్రియ అందరిముందూ ఒక్కలానే ఉంటుంది.
కాని అక్కడ ప్రభువొక్కడే ఉన్నపుడు అతడే చూడగలడు.
మేలి ముసుగు తొలగించడమనే క్రియ అందరిముందూ ఒక్కలానే ఉంటుంది.
కాని వధూగృహంలో ప్రభువొక్కడే ఆమె వదనాన్ని చూస్తాడు.
ఎందరో సూఫీ సాధువులున్నా మకాం కొద్దిమందికే లభ్యమవుతుంది.
ఉమర్ ఆ రాయబారికి ప్రాణయాత్రలో ఆత్మ దాటాల్సిన
దశలను ఆత్మ, ప్రాణాల మధ్య సంబంధాన్ని వివరించినాడు.

ఆత్మ (Soul) మనస్సుకు, మానసిక ప్రపంచానికి సంకేతం.
దివ్యాత్మ లేదా ప్రాణం (Spirit) దైవ సంబంధ జగతికి చిహ్నం.
కాలస్పృహ లేని కాలం గురించి, పవిత్ర స్థానం గురించి తెలిపాడు
ఆత్మ ఈ భౌతిక రూపాన్ని పొందక మునుపున్న స్థితిని వర్ణించాడు.
ప్రతి ప్రయాణం ఈ లోకపు అంచుల్ని దాటే వైనాన్ని,
ఎడబాటుతో దుఃఖిస్తున్న ప్రేమికుడి ఆశకన్నా విస్తృతిని తెలియజెప్పాడు.
ఎప్పుడైతే ఉమర్ రాయబారిలో ఒక స్నేహితుడిని గమనించాడో,
అప్పుడే అతడు ఆతడికి ఆత్మసంబంధిత అలౌకిక విషయాల్ని ఎరుక పరచినాడు.
షేక్ ఉమర్ జ్ఞాని, విద్యావంతుడు, మార్మిక విషయాలు తెలిసినవాడు.
రాయబారి మంచి విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం గలవాడు.
అందుకే మంచి నేలలో మంచి విత్తులు నాటినట్లు
ఉమర్ ఆ రాయబారికి అలౌకిక విషయాలను వివరించినాడు.

## ఉమర్‌తో రాయబారి

రాయబారి అడిగాడు– 'మహా సేనాధిపతీ! దివ్యాత్మ
ఈ భూమి పైకి దివి నుండి ఎలా దిగివచ్చింది?'
అనంతమైన పక్షి పంజరంలో ఎలా బంధించబడింది?
ఉమర్ బదులిచ్చాడు– 'దేవుడు మంత్రాక్షరాలను దివ్యాత్మపై
పఠించినప్పుడు, అంతవరకూ లేనివి కూడా జీవంతో నృత్యం చేసాయి.
ఉన్నవాటి పైని దైవవాక్కు లేనివిగా మార్చివేసింది.
గులాబి చెవిలో పలుకగా అది పూలగుత్తులతో శోభించింది.
రాతితో పలుకగా అది ప్రకాశవంతమైన గనిగా మారింది.
దేహం దివ్యాత్మగా మారింది. సూర్యుడు ప్రకాశవంతమైనాడు.
అతడు ఆగ్రహించగానే వందలాది గ్రహణాలు సూర్యుడిని కప్పివేసాయి.
మబ్బుల చెవిలో ఏమి పలికాడో గాని,
వాటి కన్నులనించి వర్షం ధారాపాతమై కురిసింది.
భూమితో ఏమన్నాడో గాని అప్పటి నుంచి మౌనంగా ఉండిపోయింది.
ఎవరైనా దుఃఖంలో, సందిగ్ధంలో ఉన్నపుడు
దైవవాక్కు అతడి చెవిలో ఒక సంజ్ఞగా, సమస్యగా వినబడ్తుంది.

విన్నవాడికి రెండు ఆలోచనలు వస్తాయి:–
–'నేను విన్నదే ఆచరించాలా, లేక దానికి వ్యతిరేకంగానా?'–
దేవుని దృష్టిలో ఒకదానికి ప్రాముఖ్యత ఉన్నది రెండోదానికన్నా.
నీ ఆత్మ సందేహావస్థలో ఉన్నపుడు,
దివ్యాత్మ చరించే చెవిలో దూదిని పెట్టుకోవద్దు.
అప్పుడే నీవు దైవమిచ్చే సంజ్ఞలను అర్థం చేసుకోగలుగుతావు.
దివ్యాత్మ చరించే చెవిలోకి వాహే–ఉత్తేజితశక్తి
ఇంద్రియాతీతమైనది దిగివచ్చి నీకు ప్రేరణనిస్తుంది.
ఇంద్రియాతీతమైన ఈ చెవి, కన్ను అలౌకిక విషయాలను అవగతం చేస్తాయి.
ప్రేమకోసం ఏ పనైనా చేయలేకుండా ఉండడం నన్ను అసహనానికి గురిచేస్తుంది.
ఆ పదం ప్రేమికుడు కానివాడి చేతుల్లో బందీ అయివుంటుంది.
దేవునితో ఐక్యం చెందడం అనేది తప్పనిసరికాదు, ఐచ్ఛికమది.
అది వెన్నెలకాంతి. మబ్బుల దడి కాదు–
మామూలు వాళ్లకు అక్కర్లేదు, ముఖ్యంగా అంతా నాకు తెలుసుననుకునేవాళ్లకు.
ప్రేమకోసం ఏదైనా చేయాలనుకోవడం అనే విషయాన్ని
దేవుడు దివాత్మానేత్రంతో వాళ్ల హృదయాలను తెరుస్తాడు.
వాళ్లకు భవిష్యద్దర్శనమవుతుంది. గతస్మృతులు నిశ్శేషమవుతాయి.
స్వేచ్ఛావర్తన, ప్రేమకోసం ఏదైనా చేయడం ఒకటే కాదు.
ముత్యపు చిప్పలో పడిన నీరు ముత్యమవుతుంది. బయట నీటిచుక్కగానే ఉంటుంది.
వాళ్లు కస్తూరిజింక గ్రంథుల్లాంటి వాళ్లు–
బాహ్యంగా రక్తం కనిపిస్తుంది. లోన అంతా కస్తూరి పరిమళమే.
'అడగవద్దు! రక్తం గ్రంధిలోకి వెళ్లి కస్తూరి ఎలా అవుతుందని?'–
'అడగవద్దు! బయట గుర్తించబడని రాగి రసాయనంలో ముఖ్య వస్తువెలా అయ్యిందని!'
నీలో స్వేచ్ఛావర్తన, విపరీత ప్రవర్తన చెడుగా ఉండవచ్చు.
కాని వాళ్లలో అవి దైవకాంతిశోధనకు పనికి వస్తాయి.
రొట్టెను వస్త్రంలో చుడితే అది వట్టి వస్తువే!
దానిని తిన్నాక అది శక్తిస్వరూపమవుతుంది.
వస్త్రంలో ఉన్నపుడు రొట్టెకు ఎటువంటి మార్పులేదు.
అది జీవజలంలో తడిచినాక అది శక్తిజనకమైనది.

ఆత్మకే అటువంటి శక్తి ఉంటే పరమాత్మశక్తిని ఊహించగలమా!
తెలివితేటలు, ఆత్మ ఉన్న మానవుడు పెద్ద పర్వతాన్ని
నీటికాలువతో, పరికరాలతో రెండుగా చీల్చగలుగుతున్నాడు.
మామూలు మనిషి శక్తి కొండల్ని రెండుగా చీలిస్తే
పరమాత్మ చంద్రుడినే రెండుగా చీల్చినాడు.
ఈ రహస్యం తెలిసిన వారి ఆత్మ అత్యున్నత స్వర్గానికి పయనిస్తుంది.

## ఆదాం - ఇబ్లీస్

దేవుడిచే సృష్టించబడిన మనం కొన్ని పనులను చేస్తున్నాము.
మనం చేసేవి బయటకు కనిపిస్తాయి. దైవకార్యాలు అంతర్గతమైనవి.
హేతువాది బయట పనుల్ని చూస్తాడు. అతడికి లోపలివి కనిపించవు.
కన్ను ముందుకైనా, వెనకకైనా చూడగలుగుతుంది. రెంటినీ ఒకేసారి చూడలేదు.
ఆత్మకూడా అంతే. దేహాన్ని చూసేది దివ్యాత్మను చూడలేదు.
దేవుడొక్కడే రెండిటిని చేయగలిగినవాడు.
సాతాను అన్నాడు- 'నీవు నన్ను మాయచేసావు'
కాని అతడు తనను తానే మోసం చేసుకున్నాడు.
ఆదాం అన్నాడు- 'మాకు మేమే తప్పు చేసాము'-
కాని ఆదాంకు తాను చేస్తున్న తప్పు తెలుసు.
అతడు తప్పును తనపై వేసుకున్నాడు. దేవుడు ప్రశ్నించాడు.
'నీకు ఏం జరగాల్సి ఉందో అది ముందే నిర్ణయమయి ఉన్నది కదా!
మరి నీవెందుకు తప్పు నీమీద వేసుకున్నావు?'
ఆదాం అన్నాడు- 'దేవునికి నేనివ్వాల్సిన గౌరవం వలన'-
దేవుడన్నాడు- 'నీపై నా గౌరవం పెరిగింది'-
ఉత్తమస్త్రీలెవరికోసం? ఉత్తమ పురుషుల కోసం!
నీ మిత్రుడిని గౌరవంగా చూడు! లేకుంటే ఏమవుతుంది?
వణుకుతున్న చేతిని కరచాలనం చేసావనుకో నీకేమనిపిస్తుంది!
రెండు చేతులూ దేవుడు సృష్టించినవే కాని ఎలా పోలుస్తావు వాటిని?
నీవు పట్టుకుంటే అతడి చేయి వణికిందని నీవనుకుంటావు.
అతడు నీ చేయి గురించి ఏమని అనుకుని ఉంటాడు?

కెంపులు ముత్యాలకై వెదకడం వేరు, ఆత్మజిజ్ఞాస వేరు.
తెలివికి సంబంధించిన విషయాలను అర్థం చేసుకున్నవాడు
ఆత్మ గురించి మాట్లాడుతున్నపుడు తెల్లమొహం వేసినాడు.

ఇంద్రియస్థానంలో విద్యావంతుడు, ఆత్మజ్ఞానంలో అధముడిగా ఉన్నాడు.
గుడ్డివాడి చేతికర్రకు, దేవుడిచ్చే కాంతిరేఖకు తేడా లేదా?

అజ్ఞానం ఖైదు లాంటిది; జ్ఞానం రాజభవనం వంటిది.
మనం భగవానుని కృపలో నిదురిస్తాం, అతడి చేతుల్లో మేలుకుంటాం.

మనం దుఃఖిస్తున్నపుడు దేవుడు పంపిన వర్షమేఘంలా ఉంటాము.
మనం నవ్వుతున్నపుడు విద్యుల్లతల్లా విరిసిపోతాము.

ఆగ్రహంలో, యుద్ధంలో అతడి శక్తిని ప్రదర్శిస్తాము,
శాంతి, క్షమలో అతడి ప్రేమను వెల్లడిచేస్తాము.

ఈ చిక్కుల ప్రపంచంలో మనమెవరం?
అలిఫ్‌లా అతడొక్కడే! మనం ఏమీ లేనివాళ్లం, శూన్యులం!

## రాయబారి సందేహం

రాయబారి అడిగాడు దేవుని కరుణా కటాక్షానికి పాత్రుడైన 'ఉమర్'ను–
'ప్రభూ! పవిత్రమైన ఆత్మ ఈ అపరిశుభ్ర చీకటి కొట్లో
ఎందుకు బంధించబడి ఉన్నది?
బురదలో స్వచ్ఛమైన నీరులా దేహంలో ఆత్మ ఉన్నదేల?'
ఉమర్ అన్నాడు– 'అతి గూఢమైన ప్రశ్న అడిగావు!'
గాలిని పదంలో బంధించినట్లు, ఒక్కమాటలో అనంతాన్ని ఇమిడ్చావు.
నీకు నీవు ముసుగులో ఉన్నా, ఒక మంచిపని కోసం ఈ ప్రశ్న అడిగావు.
నీవు పలికే ప్రతి మాటా ప్రాణంతో ఉండి నీ దేహానికి ఉపయోగంగా లేదా?
ఆత్మను దేహంతో సంయోగపరిచే ప్రాణం ఉపయోగం ఎంత ఉండి ఉండాలి?
వాక్కు వలన ఉపయోగం లేకపోతే మాట్లాడడం మానివేయి!
ఆ వాక్‌శక్తిని నిన్ను సృష్టించిన దేవుని శ్లాఘించడానికి వినియోగించు!

దేవునికి కృతజ్ఞతలు తెలుపుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.
అదేదో దోషమైనట్లు ముఖంలో గంటుపెట్టుకోవడం, కాదు క్షంతవ్యం.
దానికి కృతజ్ఞతలు చెప్పడమెందుకు? చిరాకు ముఖానికి పులుపునీళ్లు చాలు!
కవిత్వానికి సరైన మార్గం తెలీదు! వొడిశెలలో రాయి కాస్త మేలు!

రాయబారి ఎప్పుడైతే ఒకటి రెండు కప్పుల జ్ఞానాన్ని సేవించాడో
అతడు తాను వచ్చిన పని, సందేశం రెండూ మరచిపోయాడు.

దేవుడి మహిమకు అతడు అమితంగా ఆశ్చర్యపడినాడు,
రాయబారిగా వచ్చి రాజవడమంటే ఇదేనేమో!

* * * * * *

వరద సముద్రాన్ని చేరగానే తానూ సముద్రపు రూపును పొందుతుంది.
పొలంలో మొలిచిన మొక్కజొన్నవిత్తు మొక్కజొన్నల పొలమవుతుంది.

ప్రాణం లేని రొట్టె జీవి దేహంలోకి అన్నంగా చేరుతుంది.
ప్రాణం వచ్చి తానే జీవిగా మారి జ్ఞానాన్ని పొందుతుంది.

మైనం, కొయ్యదుంగ అగ్ని కర్పిస్తే, వాటి చీకటితత్వం తొలగి వెలుగు పుడ్తుంది.
ఏంటిమొని పొడిని కంటిలోవేస్తే మసక తొలిగి దృష్టి ప్రకాశవంతమౌతుంది.

తన నుండి విడిపోయి శాశ్వతుడితో కలిసినవాడు ధన్యుడు.
మృతుడితో ఉన్నవాడు దుఃఖితుడు. అతడూ మృత సమానుడు.

దేవుని మాటలో ఆశ్రయం పొందినవాడు
ప్రవక్తల ఆత్మలతో కలిసి నడుస్తాడు.

దేవుని పవిత్ర సముద్రంలో ఈదే చేపలు ప్రవక్తలు.
ప్రవక్తల స్థితిగతులను వివరించేదే పవిత్ర గ్రంథము ఖురాన్!

చదివీ ఖురాన్‌ను అర్థం చేసుకోకపోతే
ప్రవక్తలను చూసినా నీకేమిటి ప్రయోజనం?

ఖురాన్‌ను అంగీకరించావనుకో, ప్రవక్తల గురించి తెలుసుకుంటావు.
అప్పుడు నీ దేహపంజరంలోని పక్షి దిగులు చెందుతుంది.

ఈ పక్షి పంజరంలోంచి బయటపడాలనుకోవడం లేదు.
అది అజ్ఞానపు ఖైదు నుంచి విముక్తం కావాలనుకుంటున్నది.

పంజరాల నుంచి బయటపడినవారే ప్రవక్తలు, మార్గదర్శకులు.
వారి గొంతు బయట నుంచి వినిపిస్తుంది. ఇదే విముక్తి మార్గమని.

ఎందుకని అందరూ ఆ సన్నటి సందుగుండా రాలేకపోతున్నారు?
కీర్తికామన అనేది గట్టి బంధం. ఇనుప సంకెళ్లకన్నా మందం.

## హిందూదేశపు చిలుకలతో మాట్లాడిన చిలుక

ఒక వ్యాపారస్తుడి దగ్గర అందమైన చిలుక ఉండింది.
అతడు హిందుస్తాన్‌కు వెళ్లబోతూ సేవకులందరినీ అడిగాడు–
'తిరిగి వచ్చేప్పుడు మీకేమి తీసుకురమ్మంటారు?' –అని
అందరూ వాళ్ల కోరికలు చెప్పారు. చిలకనడిగితే అది అన్నది–

'అక్కడి చిలుకలను చూసినప్పుడు నా దుస్థితి గురించి చెప్పండి!
దైవనిర్ణయం వలన నా దగ్గర ఓ చిలుక పంజరంలో ఉన్నది.
అది మీ సలహా తీసుకొమ్మని నన్ను కోరింది.

ఇలా నేను ఒంటరిగా జీవించి, చనిపోవడం న్యాయమా?
మీరక్కడ గులాబి తోటలో, నేనిక్కడ పంజరంలో!

మైదానాలలో మీరు విహరిస్తున్నపుడు నా గురించి తలుచుకోండి!
లైలాకోసం ఎదురుచూస్తున్న మజ్నూలా, స్నేహితులుంటే సంతోషమే!

జంటలుగా విహరిస్తూ మీరు దివ్యమధువును సేవిస్తున్నారు.
ఒంటరిగా విలపిస్తూ నేను నా రుధిరాన్ని తాగుతున్నాను.
మీరు మధువును సేవించేప్పుడు నాకోసం ఒకచుక్కను నేలపై విదిల్చండి!

ఏవీ మనం పలికిన ప్రమాణాలు? ఏవీ ఆనాటి బాసలు!
నీ సేవకుడు తప్పు చేసాడని నీవూ తప్పు చేయడం సబబా?
అటువంటప్పుడు నీకూ, అతడికి తేడా ఏమిటో తెలుసా!

కోపంతో నీవు చేసే హాని వీణానాదంలా వినసొంపుగా ఉంటుందా?
నీ క్రూరత్వం మంచితనంకన్నా గొప్పదా? నీ ప్రతీకారం ప్రాణంకన్నా ఎక్కువా?

ఇది నీ నెగడు! ఎంత అగ్ని కావాలో అంత వెలిగించు.
ఇది నీ తద్దినం! ఎంత వేడుక కావాలో అంత జరుపుకో!
నీ క్రూరత్వంలోని మాధుర్యం, నీ రూపంలో ఉన్న ఠీవికి
ఎవరూ నీ అంతరంగపు అడుగు కొలువ సాహసించరు.
దేవా! నీ ప్రేమ, ఆగ్రహం రెండూ నాకు ఇష్టమైనవే!
ఈ దుఃఖపు ముల్లును తీసివేసి, ఆనందపు తోటలో కోయిలనవుతాను.
అద్భుతమైన నైటింగేలు పక్షిలా, ముళ్లను, గులాబీలనూ రెంటినీ తింటాను.
ఎటువంటి నైటింగేల్ ఇది? అతడి ప్రేమలో అన్నిటినీ ఆరగిస్తున్నదే!
అతడు విశ్వప్రేమికుడు. అతడే విశ్వరూపుడు.
తనను తాను ప్రేమిస్తాడు. దానికై అన్వేషిస్తాడు.

## దివ్యజ్ఞానం గల పక్షులు

చిలుక కథే ఆత్మకథ. చిలుకలకు ఆత్మీయుడెవ్వడు?
బలహీనంగా, అమాయకంగా ఉండీ, ఎదలో సులేమాన్ ఉన్న చిలుక ఏది?
ఆ చిలుక దుఃఖిస్తూ ప్రశ్నిస్తుంటే, ఏడు ఊర్ధ్వలోకాలు కంపిస్తాయి.
అటువంటివాడు ఒక్కసారి పిలిస్తే దేవుడు వందసార్లు పలుకుతాడు.
అటువంటి వాడి నింద విశ్వాసం కన్నా విలువైనది.
అతడు ప్రతిక్షణం దేవుడి వేపు ప్రయాణిస్తుంటాడు.
ప్రశ్నిస్తున్న అతడి కిరీటంపై అసంఖ్యాక కిరీటాలు నెలకొంటాయి.
అతడు భూమిపై ఉన్నా అతడి ఆత్మ ఊర్ధ్వలోకాల్లో ప్రయాణిస్తున్నది.
భూమిపై అతడి మనస్సు శరీరాలు ఉన్నాయి.
అతడి ఆత్మ స్థలంలేని చోట ప్రయాణిస్తున్నది.
స్థలం, స్థలరహితం రెండూ ఆ దేవుని అధీనంలోనే ఉన్నాయి.
స్వర్గంలోని నాలుగు నదులూ అతడి అధీనంలో ఉన్నట్లుగా!

## వ్యాపారి-హిందూస్తాన్ చిలుకలు

వ్యాపారి హిందుస్తాన్ వెళ్లాడు తన గాడిదపై స్వారీ చేస్తూ.
అక్కడ మైదానాల్లో చిలుకలు అసంఖ్యాకంగా ఉన్నాయి.
తన చిలుక సందేశం వినిపించగానే ఒక చిలుక నేలపైపడి ప్రాణాలు విడిచింది.

వ్యాపారికి దుఃఖం కలిగింది– 'నేనే ఈ చిలుకను చంపానా?
ఇది నా చిలుకలాంటిదే. వీటి దేహాలు వేరైనా ఆత్మ ఒక్కటే కాబోలు!
ఎందుకు నేనీ రాయబారానికి ఒప్పుకున్నాను! అయ్యో!
ఈ సందేశం ఇచ్చి అమాయకపు చిలుక మరణానికి కారణమయ్యానే!
ఈ మాట చెప్పకుండా ఉంటే ఈ చిలుక బతికేది కదా!' అనుకున్నాడు.

మాట శిలలాంటిది, అగ్ని వంటిది కూడా! కఠినంగా కాల్చివేస్తుంది.
ఎప్పుడు రాతిపై ఇనుమును కొట్టకు! అగ్ని పదాలు జనిస్తాయి సుమా!
చీకటిగా ఉంది కదా అని పత్తి విరగబూసినచోట నిప్పు వెలిగిస్తావా?
కళ్లు మూసుకుని వృధామాటలు పలికితే ప్రపంచం తగలబడ్తుంది.

ఒక్కమాట ప్రపంచాన్ని వణికిస్తుంది. నక్కలను సింహాలుగా మారుస్తుంది.
ప్రతి దేహంలోనూ జీసస్ ప్రాణమున్నది.
దేహాన్నుంచి విముక్తి పొందిన ఆత్మ జీసస్ లానే ఉంటుంది.
మధురమైన మాటలను మాట్లాడదలుచుకున్నపుడు
విషయ వాంఛలకు దూరంగా ఉండు, విజ్ఞతతో మెలగు!
ఆత్మనిగ్రహం స్వర్గానికి దారి. విషయవాంఛ నరకానికి త్రోవ.

## ఫరిదుద్దీన్ బోధన

సాధువు విషం తాగినా అది అతడినేమీ చేయలేదు.
అతడు విషయ వాంఛలకు అతీతుడు. విషానికి విరుగుడు.
ప్రవక్త అన్నాడు– 'అన్వేషకుడా! జాగ్రత్త!
నీవు నిమ్రాద్ లాంటివాడివైతే అగ్నిలోకి అడుగుపెట్టకు!
అబ్రహంగా మారు, అగ్ని నిన్నేమీ చేయలేదు!
నీవు ఈతగాడివో, నావికుడివో కానప్పుడు సముద్రంలోకి పోకు!

సాధువు సముద్రంలోకి దూకి అడుగున ఉన్న ముత్యాలు తెస్తాడు.
కష్టాలకోర్చి ఘనమైన సంపదలను లోకానికిస్తాడు.
ముని ముట్టుకుంటే మట్టి బంగారమౌతుంది.
మనం విషయ వాంఛాపరులం తాకితే స్వర్ణం బూడిదౌతుంది.
దేవునిచే స్వీకరింపబడిన వ్యక్తి హస్తాలు దైవ హస్తాలే!
విషయలాలసుడి చేతులు సైతాను క్రూరహస్తాలే!
దైవజ్ఞానమున్నవాడికి అజ్ఞానం కూడా జ్ఞానాన్నిస్తుంది.
అజ్ఞాని జ్ఞానాన్ని కూడా అంధకారంలోకి నెడతాడు.
వ్యాధిగ్రస్తుడు తీసుకున్నది వ్యాధిలో కలుస్తుంది.
పరిపూర్ణ వ్యక్తికి అవిశ్వాసం కూడా సన్మతమౌతుంది.
పధికుడా! అశ్వికుడిని చూసి అసూయపడకు.
నేలమీద ఉన్నపుడు పాదాన్ని స్థిరంగా ఉంచుకో!

## మోసెస్ - మంత్రగాళ్లు

దుష్ట ఫారో రాజు ఆస్థాన మాంత్రికులు అడిగారు 'మోసెస్'ను-
'నీవు ఆజ్ఞాపించు, నీవా, మేమా ముందు ప్రయోగించేది?'-
వాళ్లు అతడిని గౌరవంగా సంబోధించారు, మోసెస్ అన్నాడు-
'మీరే! మీ నేర్పును, విద్యలను ప్రదర్శించండి ముందుగా!'-
'నిజమైన మతం ఎదుటివారి గౌరవాన్ని పొందుతుంది.
తుచ్ఛమతాలు గాలికి దూదిపింజల్లా ఎగిరిపోతాయి.
వాళ్లు ప్రవక్తకు గౌరవమిచ్చి అతడితో పోటీకి దిగారు
అందుకే వాళ్ల తప్పులు క్షమించబడినాయి.

పరిపూర్ణుడైన వ్యక్తి ప్రతిమాటా చట్టమౌతుంది.
అసంపూర్ణుడు మౌనంగా ఉంటేనే మంచిది.

పసిపాప పుట్టినపుడు దేవుడు 'నిశ్శబ్దంగా ఉండు' అన్నాడు.
పసిపాప కొన్నాళ్లు నిశ్శబ్దంగా ఉండి, మాటలు నేర్చుకున్నాక మాట్లాడ్తుంది.

చెవులు వింటాయి. నాలుక మాట్లాడ్తుంది.
పుట్టుచెవిటికి మాటలెలా వస్తాయి?

దేవుడు ఆద్యుడు, ఆధారరహితుడు, అన్నిటినీ భరిస్తాడు.
ఏ గురువూ లేనివాడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు.

మామూలు మనుషులకు గురువు, ఒక పద్ధతిలో జ్ఞానబోధన కావాలి.
జ్ఞానం అవగతం కానప్పుడు, తప్పు చేసినపుడు, సాధువునాశ్రయించాలి.
మనసు స్వచ్ఛమై మెరిసేంతవరకు కన్నీళ్లు కార్చాలి.
కన్నీళ్లే పశ్చాత్తాపపు ఊపిరి. కన్నీళ్లతోనే ఆదాము క్షమించబడినాడు.
దుఃఖించడానికే ఆదాము ఈడెను తోట విడిచి భువిపైకి వచ్చినాడు.
స్వర్గం నుంచి, సప్త ఊర్ధ్వలోకాల నుంచి బహిష్కరింపబడినాడు.
ఆదాము సంతానమైన నీవు క్షమా గుణాన్ని అలవరుచుకో!
హృదయంలో దుఃఖ జ్వాలతో, కన్నీళ్ల వర్షంతో పునీతుడివికా!
సూర్యుడు, మేఘాల రాకతో వనం పూలతో పరిమళించనీ!

నీకు కన్నీటి రుచి తెలుసా? కన్నీటి విలువ తెలుసా?
రొట్టెను ప్రేమించేవాడా! రొట్టెను వర్జించు, రత్నాలను దాచుకో!

నీ ఆత్మను సైతాను క్షీరం నుంచి దూరం చేయి!
దానిని దేవదూతలకు సైదోడుగా సిద్ధపరచు!

ఎప్పుడైతే నీవు మూర్ఖంగా, విషాదంగా, దిగులుతో ఉన్నావో,
అప్పుడు నీవు దెయ్యపు పాలు తాగుతున్నావని అర్థం చేసుకో!

నిజాయితీతో సంపాదించినవి నిష్కళంక కాంతినిస్తాయి.
అగ్నిని ఆర్పే ద్రవమేమిటి? నీరే కదా!

న్యాయబద్ధమైన కబళం నుంచి జ్ఞానం ఆలోచన జనిస్తాయి.
న్యాయబద్ధమైన ఆహారం నుంచి ప్రేమ, ఆప్యాయత జనిస్తాయి.

తినే ఆహారపు ముద్దలో నీకు ద్వేషం, కుట్ర కనిపిస్తున్నాయా?
అజ్ఞానం, అవిధేయత కనిపిస్తున్నాయంటే అది అన్యాయపు కూడు.

గోధుమలను జల్లితే బార్లీ మొలకెత్తదు కదా!
గుర్రం గాడిదకు జన్మనిస్తుందా?

ఆహారం విత్తనం, ఆలోచనలు దాని ఫలం.
ఆహారమనే సముద్రంలో ఆలోచనలు ప్రశస్త ముత్యాలు.

న్యాయబద్ధమైన ఆహారం నిన్ను దైవప్రేమికుడిని చేస్తుంది.
అన్యాయపు కూడు నిన్ను సైతాను సేవకుడిగా మారుస్తుంది.

## వ్యాపారి–చిలుక

వ్యాపారం ముగించుకుని అతడు సంతోషంగా ఇంటికి వచ్చాడు.
సేవకులకు, పరిచారికలకు తగిన బహుమతులిచ్చాడు.
'నా బహుమతి ఏది?' –అడిగింది చిలుక 'అక్కడేం జరిగింది?'–

'నీకే బహుమతీ లేదు' అన్నాడతడు. 'అక్కడ జరిగినదానికి చింతిస్తున్నాను'–
ఆ దోషానికి చేతులూ, వేళ్లూ కొరుక్కుంటున్నాను.
బుద్ధితక్కువై నీ సందేశాన్ని ఆ చిలుకలకు వినిపించాను'

చిలుక అన్నది– 'అయ్యా! ఎందుకీ ఆగ్రహం? ఎందుకీ దుఃఖం?'
అతడన్నాడు– 'అక్కడనేక చిలుకలున్నాయి. నేను నీ బాధ చెప్పాను!'
ఒక చిలుక ఆ మాటలు వినగానే అక్కడికక్కడే కూలి మరణించింది.
నా దుఃఖానికి అంతులేదు. నేను పశ్చాత్తాపపడని క్షణం లేదు'–

నోటి నుంచి అకస్మాత్తుగా వెలువడిన మాట ధనుర్విముక్త శరమే కదా!
కుమారా! ఆ బాణం వెనక్కి తిరిగిరాదు. వదిలినచోటు దానికి తెలీదు.

ఆ మాట వేరే స్థానంలోకి వెళ్లింది.
తాను వెళ్లిన స్థానాన్ని ఏం చేస్తుందో తెలీదు.
మనం అనాలోచితంగా చేసే పనులు
అవి ఎటువంటి ఫలితాలనిస్తాయో ఊహించలేము.

'జావెద్' బాణం వదిలి 'అమ్రు'ను గాయపరచాడు.
చిరుతపులిలా ఆ బాణం 'అమ్రు'పై విరుచుకుపడింది.

ఒక సంవత్సరం పాటు ఆ గాయం అతడిని బాధపెట్టింది.
బాధ దైవసంకల్పం. అది మానవుడి చేతిలో లేదు.

'అమ్రు' గాయాన్ని చూసి భయపడి జావెద్ అక్కడికక్కడే మరణించాడు.
కాని అమ్రు చనిపోయేంతవరకు గాయంతో బాధపడ్తూనే ఉన్నాడు.
సంఘటనలన్నీ దైవనిర్ణయాలే అయినా
మనం జావేద్‌ను హంతకుడంటాము.
అమ్రు బాధలకు అతడే కారణమంటాము.
బాధలు దైవనిర్ణయాలని తెలిసి కూడా!
ఈ భవబంధాలనే ఉచ్చుల్లో పడి కొట్టుకుంటుంటాం,
అవన్నీ దైవసంకల్పితాలని గ్రహించి కూడా!
విల్లులోంచి బాణం దూసుకువెళ్తుంది. కాని,
సాధువులకు ప్రవక్తలు మాత్రమే దానిని దారి మళ్లించగలరు.

సాధువు దైవశక్తితో కార్యము నుంచి కారణాన్ని విడదీయగలుగుతాడు.
మూసిన తలుపులు తెరచి వదిలిన మాటను వెనక్కి రప్పిస్తాడు.

మాట అనే అగ్ని జ్వలించదు, నెగడు వెలగదు, మాంసం కాలదు.
విన్నవాళ్ల మనసుల్లోంచి మాటను, ఫలితాన్ని చెరిపివేస్తాడు.

దేవుడి వాక్యాన్ని చదువు– 'వాళ్లు నిన్ను నా ఆజ్ఞను మరిచేలా చేసారు'–
వాళ్లకు మనుషుల ఎదల్లోంచి దైవవాక్యాన్ని చెరిపేసే శక్తి వచ్చింది.

అందుకే వాళ్లు మనుష్యులలో శక్తివంతులయ్యారు.
నీకు మతిమరుపు తెప్పించి సన్మార్గంలో పెట్టగలరు.

గ్రామాధికారి ఆ గ్రామ ప్రజలకు రాజు, హృదయాధిపతి అందరికీ ప్రభువు.
ఏదైనా చూసిన దాన్ని నీవు చేయగలుగుతావు.
అందుకే మనిషి కనుపాపలాంటివాడు.

మతిమరుపు, జ్ఞాపకం దైవసంకల్పమైనా
జీవి దేవుణ్ణి తలచుకోగానే అతడికి సాయమందుతుంది.

ప్రతిరోజూ దేవుడు జీవుల మనసులో పేరుకున్న
లక్షలాది ఆలోచనలను ఖాళీ చేయిస్తాడు రాత్రిపూట.
పగలు ఆల్చిప్పల్లో ముత్యాలను నింపినట్లు ఆలోచనలను నింపుతాడు.

నిద్రలో కోల్పోయినవన్నీ మెలకువలో నీకు మరలా లభిస్తాయి.
ఇంద్రియాలు తమతమ సహజ శక్తులను తిరిగి పొందుతాయి.
స్వర్ణకారుడి విద్య లోహకారుడికి తెలీదు. ఎవరి స్వభావం వారిదే!
పునరుత్థానం రోజున ఆత్మలు తమ పాతరూపాలను తెచ్చుకుంటాయి.
నిద్ర లేచిన తరువాత కూడా అంతే ఎవరి నైపుణ్యత వారికి వస్తుంది.
వార్తలు తెచ్చే పావురాల్లా అవి ఇతర నగరాల వార్తల్ని ఇక్కడకు తెస్తాయి.

## పంజరంలో చిలుక

ఎప్పుడైతే చిలుక అక్కడి వృత్తాంతం విన్నదో,
పంజరంలో ఉన్నది ఉన్నట్లుగానే నేలకూలి కన్నుమూసింది.
వ్యాపారి దుఃఖంతో తన తలమీది టోపీ నేలకు విసిరికొట్టినాడు.
చిలుక చనిపోవడాన్ని గమనించి తన అంగీని చింపుకున్నాడు.
అతడు దుఃఖించాడు– 'ఓ నా ప్రియమైన చిలుకా! ఎందుకిలా చేసావు?
అందానికి అందం, మాట ఎంతో మధురం, నీవు నా ఆత్మవు!
నీవు నా స్నేహితుడివి, నమ్మకస్తుడివి, నా తోటలోని తులసి మొక్కవు!
సులేమాన్ దగ్గర నీవంటి పక్షి ఉంటే, ఇతర పక్షులమాటే తలపెట్టడు కదా!
చౌకగా దొరికిన విలువైన పక్షివి, ఇంతలోనే సుదూరంగా వెళ్లిపోయావే!
అయ్యో! ఈ నాలుక ఎంతో చెడ్డది. అది మాట్లాడ్తుంటే అడ్డే చెప్పలేదు.
ఓ నాలుకా! మంటవూ నీవే, దుంగవూ నీవే! ఇంకెంత కాలమిలా కాలుతావు?
రహస్యంగా నా ఆత్మ మూలుగుతున్నది. అయినా నీవు చెప్పినట్లు చేస్తుంది.
నాలుకా, నీవు అనంత ధనరాశివి, నయంకాని రోగమూ నీవే!
పక్షుల నాకర్షించే ఈలవూ నీవే, బంధించే వలవూ నీవే!
ప్రియతముడి ఎడబాటు బాధను మరపించే సౌఖ్యమూ నీవే!
దయలేనివాడా! నామీద దయనెప్పుడు చూపిస్తావు?
నామీద బాణాన్నెందుకు వదిలి ప్రతీకారం తీర్చుకుంటున్నావు?
నా పక్షి ఎగిరిపోయేలా చేసావు. అన్యాయపు మైదానంలో చూడకిక!
ఈ తప్పునైనా సరిదిద్దు లేదా కారణాన్ని సమర్థించు!
సంధ్య తొలగినది, చీకట్లు కమ్ముతున్నవి,
నా పక్షి తన తొలిగూటికి చేరుకున్నది.

అజ్ఞాని కడపటి వరకు బాధను ప్రేమిస్తాడు.
పవిత్ర గ్రంథంలోని... 'నేను ప్రయాణం చేస్తున్నాను'... వాక్యం పఠించు!
నీ వదనం చూసి నన్ను కష్టాలు తాకలేదు.
నీ నదీజలాల్లో నన్ను నురగ అంటలేదు.
ఈ ఆర్తనాదాలు ఎడబాటు వల్ల కలిగినవి,
ఈ జయధ్వానాలు అతడి అద్భుత దర్శనం వలన పలికినది.

దేవుని ఎదిరించే ఆయుధమున్నదా?
దేవుని ప్రేమచే సహస్ర శకలాలు కాని హృదయమున్నదా?
అతడు మాటలకందనివాడు, నామరూప రహితుడు.
నా కన్నీళ్లే సముద్రమయితే, వాటిని వరమాలగా అతడికి సమర్పించనా!

నా చిలుక, నా మనస్సును విశదపరిచే నేస్తం, నా అంతరాత్మ
అంటూనే ఉన్నది– 'మంచైనా, చెడైనా నా వాటా నాకు వస్తుందని'.
ఏ చిలుకస్వరం దివ్యప్రేరణతో ఆవిర్భవిస్తుందో
దేని ఉనికి ఈ లోకాల ఉనికి కన్నా ముందు ఉన్నదో
ఆ చిలుక నీలో దాగి ఉన్నది. దాని నీడలు లోనా బయటా గమనిస్తావు.

దానివలననే నీకు ఆనందం కలిగినది.
దానితో పాటు ఆ ఆనందమూ పోయినది.

దేహంలో జ్వలించే ఆత్మ కలిగినవాడా!
ఆత్మను ప్రజ్వలింపచేసి నీ దేహాన్ని కాంతిమయం చేసినావు.

నేను దేవుని ప్రేమతో జ్వలిస్తున్నాను.
ఎవరైనా తానూ అగ్నికణిక కావలిస్తే నా నుంచి అగ్నిని స్వీకరించవచ్చు.
ఈ భగభగమండే నిప్పు కణికల నుంచి, అంగారాన్ని తీసుకోవచ్చు.
అయ్యో! అయ్యో! అటువంటి చంద్రుడు మబ్బుల చాటున ఉన్నాడే!
నేనే మాటను పలుకను? నా ఎదలోని జ్వాల తీవ్రమైనది.

ఎడబాటు సింహమై గర్జిస్తూ, రక్తాన్ని కళ్లజూస్తున్నది.
శాంతంగా ఉండే సింహం ఇలా భీకరంగా మారితే
అది అతడి చేతి మధువు తాగినాక ఇంకెలా ఉంటుందో!

మాటలతో వర్ణించ శక్యం కాని ఆ సింహాన్ని
ఆ గడ్డిమైదానం దాచి ఉంచగలదా?

నేను కవిత్వపు యతిప్రాసల గురించి తంటాలు పడుతుంటే
నా ప్రియతముడంటున్నాడు– 'యతిపై కాదు, మతిని సద్గతిపై ఉంచు–
నన్ను ధ్యానించు, నన్ను స్మరించు, నాతో మమైకంకా!'
ఎటువంటి మాటలను తలపోస్తున్నావు? ఏమిటా పదాలు?
ద్రాక్షతోట కంచెకున్న ముళ్లు కాదా ఆ నిరర్థక వాక్యాలు!

మాట, ధ్వని, సంభాషణ ఇవి గందరగోళంలో పడవేస్తాయి.
ఈ మూడూ లేకుండా మాట్లాడుకుందామా?

ఆదాము నుంచి దూరంగా ఉంచిన మాటను చెబుతాను.
అబ్రహంకు, గాబ్రియేల్‌కు తెలియని పదాన్ని వెల్లడిస్తాను.
జీసస్ ప్రవక్త కూడ ఆ పదాన్ని పలుకలేదు.
'మ' అంటే ఏమిటి? అవునా, కాదా?
నాకు స్వార్థం లేదు అంటే నాలో వ్యతిరేక ధర్మమున్నది.

సమూహంలో వ్యక్తిత్వాన్ని చూసాను నేను.
అందుకనే భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తిస్తాను.
రాజులు తమ బానిసలకు బానిసలు,
తమకోసం చనిపోయినవారికి బతికున్నవారు మృతప్రాయులు.

తమ పాదాల ముందు ప్రణమిల్లినవారికి రాజాధిరాజులు ప్రణమిల్లుతారు.
ప్రేమతో తమల్ని వశం చేసుకున్నవాడి ప్రేమకు అందరూ వశులౌతారు.
పక్షులను వేటాడేవాడు వాటి ఆహారంలా నటిస్తాడు.
చటుక్కున లేచి ఆ పక్షులను తన ఆహారంగా పట్టుకుంటాడు.

గుండెల్ని కొల్లగొట్టేవాళ్ల గుండెల్ని, పోగొట్టుకున్నవాళ్లు పట్టుకుంటారు.
ప్రేమికుల వలలో ప్రేమించబడినవాళ్లు తేలికగా చిక్కుకుంటారు.
ప్రేమికుడు ప్రేమించబడతాడు. ప్రేమించబడేవాడే ప్రేమికుడౌతాడు.
దాహం గొన్నవాడు నీళ్లు అడిగినట్లే, నీళ్లు దాహార్తుల కోసం వెదకుతుంటాయి.

అతడు నీ ప్రేమికుడైతే నిశ్శబ్దంగా ఉండు, నీ చెవి పట్టుకు లాగితే వింటూ ఉండు.
ఆనంద ప్రవాహం వరదైతే అడ్డుకట్టవేయి. లేకుంటే అది విధ్వంసానికి మూలమౌతుంది.
ఎందుకు శిథిలాలలో వెదుకుతున్నాను? శిథిలాల క్రింది నిధి ఉంది కనుక.
దేవుడనే సముద్రంలో మునిగినవాడు మరింత లోతు మునగాలనుకుంటాడు.
అతడి ఆత్మ అలలపై లేచిపడుతూ ఆనందిస్తూ ఉంటుంది.
ప్రశ్నించు! సముద్రంపైన బాగుందా లోనా? అతడి బాణం గొప్పదా, కవచమా!
ఓ హృదయమా! నీవు చెడు సలహాతో ముక్కలైనావు.
సంతోష దుఃఖాలమధ్య తేడా తెలీకున్నావు.

నీ కోరికలక్ష్యం చక్కెరను రుచిచూడడమే అయినప్పుడు,
నీకు కోరికే లేకుండా చూడడం నీ ప్రియతముడి లక్ష్యం కాదా!
నూరు చంద్రుళ్ల రక్తశుల్కం ఒక్క నక్షత్రం అయినప్పుడు
ఈ దుష్టప్రపంచ రక్తాన్ని కళ్లచూడడం అతడికి న్యాయమే!

మనం మూల్యం, రక్తశుల్కం రెండూ చెల్లించాము,
మన ఆత్మను జూదమాడడానికి త్వరపడినాము.
ప్రేమికుల జీవితం మృత్యువుతో ముడిపెట్టబడి ఉంటుంది.
నీ హృదయాన్ని కోల్పోకుండా ప్రియతముడి హృదయాన్ని గెల్చుకోలేవు.
నూరు మాటలు, చేతలతో అతడి హృదయాన్ని గెలవాలని ప్రయత్నించాను.
ఒక్క తిరస్కారపు చూపుతో అతడు నన్ను నిరాశపరచాడు.
నేనన్నాను– 'నా మనసూ, ఆత్మానీవే, నీలోనే మునిగి ఉన్నాయి?'–
అతడన్నాడు– 'పో! పో! ఇటువంటి మోసపు మాటలు మాట్లాడకు'–

నాకు తెలియదా నీ మనోభావమేమిటో! ఏమనుకుంటున్నావు నన్ను!
నన్ను తేలికగా కొనగలననుకుని, తేలికగా మాట్లాడుతున్నావా?

చౌకగా కొన్నవాడు చౌకగా అమ్ముతాడు.
పిల్లవాడు రొట్టెముక్కకు ముత్యమిమ్మంటే ఇచ్చేస్తాడు.
మనసులో మాధుర్యమున్నవాడు గంభీరంగా కనిపిస్తాడు.
మాటల నిధి కలిగినవాడు నిశ్శబ్దాన్ని పాటిస్తాడు.
'హకీం' మాటలకు వ్యాఖ్యానం చెప్పబడుతున్నది–

–'విశ్వాసమైనా, అవిశ్వాసమైనా దానివలన నీవు దారిలో వెనకబడినావా?
అందం వలనో, అనాకారితనం వలనో నీవు నీ ప్రేమికుడి నుంచి విడదీయబడినావా?
ప్రవక్త అన్నట్లు– సయ్యద్ అవిశ్వాసాన్ని సహించడు.
నేను అతడికంటే, నాకంటే అల్లాహ్ అవిశ్వాసాన్ని అసలే సహించం.
అందుకే దైవం బాహ్యాంతర దుష్కార్యాలను నిషేధించినాడు'–

దేవుడు అవిశ్వాసాన్ని సహించడు గనుక ప్రపంచమూ సహించకున్నది.
ప్రపంచం దేహమైతే దేవుడు ఆత్మ
ఆత్మ నుంచి మంచీ, చెడూ రెంటినీ దేహం స్వీకరిస్తుంది.

ఎవరి ప్రార్థనా స్థలమైనా మార్మిక దర్శన స్థానమైనపుడు,
అతడు తన పాత విశ్వాసానికి మారితే అది అవమానంగా భావిస్తావా?
ప్రభు దుస్తుల సంరక్షకుడు పహారాభటుడైతే బాగుంటుందా?
సుల్తానుకు మిత్రుడైన వాడిని ద్వారపాలకుడిగా చూడగలవా?
రాజాధిరాజు తన చేతిని ముద్దాడడానికి అనుమతినిచ్చినపుడు
అతడి పాదాలను ముద్దాడడం పాపమవుతుంది.
ప్రభువుకు పాదాభివందనం చేయడం విధేయతను సూచించినా,
ఇచ్చిన గౌరవాన్ని విస్మరించి ప్రవర్తించడం అవిధేయత అవుతుంది.
ముఖాన్ని చూసి, అత్తరు వాసన ఇష్టపడేవాడిని దేవుడు సహించడు.
పోలిక చెప్పాలంటే– దేవుడికి గోధుమ గింజలిష్టం, మనిషికి గడ్డిలా!

అవిశ్వాసాన్ని సహించలేక పోవడమనేది దైవలక్షణం.
మానవజాతికి దానిలో కొంత వచ్చి చేరింది.

## నేనెందుకు దుఃఖిస్తున్నాను?

ఎందుకంటే నేను అతడి ప్రేమతో మత్తెక్కిన వాళ్లలో లేనుగనుక.
ఇంకా అతడికి అంతరంగీకుడిని కాను గనుక!

రాత్రి, పగలు కొరకు దుఃఖిస్తున్నట్లు, లోనా, బయటా,
నేను అతడి దివ్య దర్శనం కొరకు తపిస్తాను.

అతడి అయిష్టం నా ఆత్మకు ఇష్టం. నా హృదయాన్ని
రగిల్చే అతడికి నా ఆత్మ అంకితం.
నా ప్రభువుని సంతోషపెట్టడానికి నేను నా దుఃఖాన్ని బాధను ప్రేమిస్తాను.
నా దుఃఖపు ధూళిని నా కళ్లకు లేపనంగా తయారుచేస్తాను.
నా నేత్ర సముద్రాలను ముత్యాల రాశులుగా మారుస్తాను.

అతడి కొరకు దుఃఖించేవారి అశ్రువులు మేలిమి ముత్యాలు
ప్రజలనుకుంటారు అవి మామూలు కన్నీళ్లని.
నేను పరమాత్మకు ఫిర్యాదు చేయడం లేదు; నా భావాన్ని తెలుపుతున్నాను.
నా హృదయం అంటున్నది- 'అతడు నన్ను హింసిస్తున్నాడు'-
దాని అజ్ఞానానికి నేనెప్పుడు పగలబడి నవ్వుతుంటాను.

ఓ మంచికి విశ్వరూపమా, నీ ఆవరణ ద్వారానికి నేను గుమ్మాన్ని.
ఏది ఆవరణ? ఏది గుమ్మం? ప్రియతముడున్నచోటే నేనూ, మనమూ ఉన్నది.
'నేనూ, మన' పదాల నుంచి విముక్తమైనవాడా! స్త్రీ పురుషులలోని ఆత్మవు నీవు.

దేహం దేహాన్ని చూస్తుంది. సుఖదుఃఖాల్ని అనుభవిస్తుంది.
ఏడుపు, నవ్వులతో హృదయం కట్టిపడవేయబడలేదు.
ఈ రెండూ అశాశ్వతమైన బంధాలు.
అనంతమైన ప్రేమవనంలో సుఖ, దుఃఖాలే కాక ఇతర ఫలాలూ ఉన్నాయి.
ప్రేమ ఈ రెండు భావనల కన్నా ఉన్నతమైనది.
వసంత, శరత్తులు లేకున్నా అది తాజాగా, ఆకుపచ్చగా శోభిస్తుంది.

చెల్లించాల్సిన సుంకాన్ని చిరునవ్వుతో చెల్లించు!
ముక్కలైన ఆత్మకథను ముచ్చటగా విన్నవించు!
తన వాలుచూపుల మాయతో అతడు నా హృదయాన్ని జీవింపచేసాడు.
నా రక్తాన్ని చిందించిన అతడి ప్రేమను న్యాయమని సమర్థించాను.
ధూళిలాంటి వారి విషాదాన్ని వినకుండా పారిపోతున్నావే, ప్రియతమా!
దుఃఖితుల హృదయాల్లోకి మరింత దుఃఖాన్నెందుకు నింపుతున్నావు?

తూర్పు వదనంలో ఉదయసంధ్యగా సూర్యకాంతుల్ని వెదజల్లేవాడా!
ఎందుకు నీ ప్రేమికుడిని విడిచిపోతున్నావు? వెలకట్టలేని నీ చిరునవ్వులేవి?

పాత ప్రపంచంలో కొత్త ఆత్మా! హృదయం, ఆత్మలేని నా దేహపు కేక విను!
గులాబి కథను విడిచిపెట్టు! గులాబిని విడిచిన నైటింగేల్ వ్యధ కనుగొను!

సుఖ దుఃఖాల వలన ఈ ఉద్వేగం రాలేదు,
ఊహ, భావనల వలన మన చేతన పుట్టలేదు.

వీటన్నిటినీ మించిన సచ్చిదానంద స్థితి మరొకటి ఉన్నది.
మానవుడి స్థితిని బట్టి దానిని అంచనావేయకు.

మంచీ చెడూ పనులలోనే దానికి కట్టుబడకు.
మంచీ, చెడూ, సుఖదుఃఖాలు అవి ఉనికిలో ఉంటాయి.

ఉనికిలో ఉన్న ప్రతిదీ అశాశ్వతమై నశిస్తుంది.
వాటికి వారసుడూ, యజమానీ దేవుడే!
ఉదయ సంధ్యకు ఆధారమూ, ఆశ్రయమూ అయినవాడా!
హుసాముద్దీన్ ప్రభువు నన్ను క్షమించును గాక!
విశ్వాత్మను, ఆత్మను క్షమాపణ కోరగలిగినవాడివి నీవు.
ఆత్మలో ఆత్మవు, పగడంలో ప్రకాశానివి.

ప్రభాత సంధ్య వెలుగులో మేము 'మన్సూర్' మధువును సేవిస్తాము.
ఆ మత్తులో ఉన్న మాకు, అంత ఆనందాన్ని ఇంకే మధువివ్వగలదు?
మధువు పులిసేది మాకొరకు. మేము పులియుట అతడికొరకు.
మధువు మనల్ని అర్థిస్తుంది. పరిభ్రమిస్తున్న స్వర్గం చేతనను కోరుతుంది.
మన వలన మధువుకు మత్తెక్కుతుంది. దాని వలన మనకు కాదు.
మన వలన దేహం ఉనికిలో ఉన్నది. దేహం వలన మనం కాదు.
మనం తేనెటీగలం. దేహం తేనెపట్టు, మైనంతో చేసాము ప్రతి కణాన్ని!

## చిలుక - వ్యాపారి కథ

ఈ విధంగా వ్యాపారి దుఃఖంతో ఎన్నోమాటలు పలికినాడు.
కాసేపు స్వవచోవిఘాతం, కాసేపు నిరాశ, కాసేపు లొంగుబాటు
కాసేపు వాస్తవం, కాసేపు భ్రాంతితో కాలం గడిపాడు.

మునిగిపోతున్న వాడికి గడ్డిపోచైనా ఆసరాగా ఉన్నట్లు
ఎవరన్నా రక్షిస్తారేమోనని కాళ్లు చేతులు అల్లల్లాడించినట్లు

మన స్నేహితుడికీ ఘర్షణ ఇష్టం.
పోరాడి ఓడిపోవడం, లొంగుబాటుకన్నా శ్రేష్ఠం.

మనందరికీ ప్రభువు ఖాళీగా కూర్చోలేదు.
అతడు దేనిగురించీ మనలను అడగబోడు.

కాని, అతడు సోమరితనాన్ని సహించడు.
అందుకే నీవు ఆఖరి క్షణం వరకు సత్కార్యాలు చేస్తూ ఉండు.

ఎవరి ఆత్మ నిరంతరం అతడిని స్మరిస్తూ ఉంటుందో, ఆ
పరమాత్మ కళ్లూ చెవులు గవాక్షం నుంచి అతడిని గమనిస్తూనే ఉంటాయి.

## వ్యాపారి – చిలుక

ప్రాణం లేని చిలుకకు పంజరంతో ఏమి పని? –అనుకుని
వ్యాపారి చిలుకను బయట పడేసినాడు.
మరుక్షణం చిలుక ఎగిరి చెట్టుపై వాలింది.
వ్యాపారి ఆశ్చర్యపోయి చిలుక వేపు చూసాడు.

'చిలుకా! హిందూస్తాన్ చిలుక నీకేమి చెప్పింది?
నీకేమి అర్థమై ఇలా ఎగిరిపోయి నాకు దుఃఖాన్ని మిగిల్చావు?'–

చిలుక అన్నది– 'ఆ చిలుక సందేశం బహుచిత్రమైనది.
నా గొంతు మధురంగా ఉందనే కదా నీవు నన్ను కొన్నది.
అందుకని మౌనంగా ఉండమని హెచ్చరించినది.
నీపై మమకారాన్ని తెంచుకుని, చచ్చినట్లు నటించమన్నది.
అందుకే ఆ చిలుక, నా సందేశం వినగానే నేలకూలినట్లు నటించినది.
నీవు ధాన్యపు గింజవయితే పక్షులు ఏరుకుతింటాయి.
నీవు చిగురు కొమ్మవయితే పిల్లలు నిన్ను తెంపుతారు.
ధాన్యాన్ని దాచి నీవే ఉచ్చుగా మారు!

చిగురును దాచే కప్పుపైని గడ్డిగా మారు!
ఎవరైనా తన అందాన్ని అమ్మకానికి పెడ్తే
నూరు దురదృష్టాలు అతడిని వెంటాడుతాయి.
ధారాపాతంగా కురిసే జలధారల్లా
కుట్రలు, అసూయలూ, కుతంత్రాలు ఒక్కుమ్మడిగా కురుస్తాయి.
అసూయతో శత్రువులతడిని ఛిద్రం చేస్తారు.
స్నేహితులు కూడా అతడి ఆయుర్ధాయాన్ని తరిగిస్తారు.
దేవుడి కరుణ అనే ఆశ్రయంలోకి పరిగెత్తు
వేయిరెట్ల రక్షణను అతడి వద్ద స్వీకరించు.
నీరూ, నిప్పూ నీకక్కడ నేస్తాలవుతాయి.
మోసెస్, నోవాలకు సముద్రం సాయం చేయలేదా?
అబ్రహాంకు తోడైన అగ్ని, నిమ్రాడ్ హృదయంలో పొగను పుట్టించలేదా!
యాహ్యాను పర్వతం కోటగా నిలిచి పగతుర నుంచి రక్షించలేదా!
'యాహ్యా! ఇటురా! శత్రు ఖడ్గం నుంచి రక్షణను పొందు!' అన్నదా కొండ.

## ఎగిరిపోయిన చిలుక

వ్యాపారికి హితబోధ చేసి సెలవు తీసుకున్నదా చిలుక.
అతడన్నాడు– 'వెళ్లు! దేవుడు నిన్ను రక్షిస్తాడు.
నీవు నాకీనాడు ఓ కొత్త త్రోవను చూపించినావు'–
అతడనుకున్నాడు– 'ఈ చిలుక చూపిన మార్గమే సరైనది.
నేను ఈ చిలుకకు ఏం తీసిపోయాను?
కాంతితో నిండి ఉన్న మార్గాన నేనూ నడుస్తాను'

## సన్మానాలూ–ఇబ్బందులూ

ఈ దేహమొక పంజరం. వచ్చేపోయేవాళ్ల ఆత్మలకు అది కంటకం.
ఒకటంటుంది– 'నేను నీ నమ్మకస్తుడిని'; ఇంకొకటి– 'నేను నీ భాగస్వామినంటుంది.'
'నీవంటి అందమైన వాళ్లు లేరు' అని ఒకరు– 'కరుణామయుడివి నీవు...'
అని ఇంకొకరు... 'ఈ రెండు లోకాలు, సకల ఆత్మలు నీవే!...'
ఇలా పొగుడుతూంటే, గర్వం పెరిగి, అతడు కోల్పోతాడు ఆత్మనిగ్రహం.
అతడికి తెలీదు ఇలా లక్షలాది మందిని 'డెవిల్' నీటిలో ముంచిందని.

పొగడ్త, వంచన తియ్యటి ఎర లాంటివి.
మితంగా తిను, లోపల నిప్పుకారం ఉంటుంది.
నిప్పు కనిపించదు. రుచి పొగలా పైకి కనిపిస్తుంది.

'నేనెందుకు పొగడ్తలు స్వీకరించవద్దు? అతడి కోరిక ఏమిటో తెలుసుకోవద్దా?
అని అడుగుతున్నావు సరే! అతడు నిన్ను పదిముందు వ్యంగ్యంగా విమర్శిస్తే?
అతడి మాటలు నిన్ను నిప్పులా కాల్చేస్తే అప్పుడేం చేస్తావు?
అతడి మాటలు నిరాశలో పుట్టినవే కావచ్చు, కాని బాధ నీదేకదా!

పొగడ్త అయినా అంతే! అది నీలో అహంకారాన్ని పెంచుతుంది.
గర్వం అతిశయించి ఆత్మబోధనలను అణగదొక్కుతుంది.
పొగడ్త మధురం కదా! అది బయటకు కనిపించదు.
తెగడ్త చేదులా కొట్టవచ్చినట్లు అగుపడ్తుంది.
చేదు కషాయం లాంటి గోలీలు మింగితే ఆ బాధ కలకాలం గుర్తుంటుంది.
హల్వా తీపి క్షణంలో కరిగి అరిగి జ్ఞాపకాల్లోకి జారిపోతుంది.

తట్టుకోలేనట్లు కనిపించేది తట్టుకుంటుంది కనిపించకుండా!
ముల్లును ముల్లుతో తీసినట్లు, వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి.
మధురంగా ఉన్నదని చక్కెర తింటే, చీముగడ్డ పుట్టి చీరాల్సి వస్తుంది.
ఫారోరాజు పొగడ్తల మయం. అతడి ఆత్మ అత్యంత బలహీనం.
ఏకఛత్రాధిపత్యం కన్నా సేవకత్వం మిన్న; 'కర్ర'కన్నా 'బంతి' మిన్న.

నీలో అందం, సౌభాగ్యం అంతరించినపుడు, నీ వాళ్లెవరూ తోడుండరు.
నిన్ను నిన్నటి వరకు పొగిడినవాళ్లు, ఇప్పుడు తెగడడానికి వెనుకాడరు.

నిన్ను చూడగానే– 'అడుగో! చచ్చినవాడు బ్రతికివస్తున్నాడు' అంటారు.
'నూనూగు మీసాల నూతన యవ్వనుడైన ప్రభువని'
నిన్ను పొగిడినవారే నిన్ను పరిహసిస్తారు.
అపకీర్తి పాలైనవాడిని 'డెవిల్' కూడా తలుచుకోదు.

నీవు మనిషిగా ఉన్నంత వరకూ నిన్ను తన మార్గంలోకి
తెచ్చుకోడానికి సాతాను తన మధువును నీకిస్తాడు.
నీకు 'డెవిల్' అంశ రాగానే అతడు నీవేపుకే రాడు!

అతడు వచ్చిందే నిన్ను వంచించడానికి.
నీవు అతడికన్నా వంచకుడివైతే, నీతో అతడికేం పని?
నిన్ను పొగిడేవాళ్లు అంతే! నీవు వాళ్లస్థాయికి దిగజారాక
వాళ్లకిక నీతో ఏం పని? నిష్క్రమిస్తారు మరోచోటుకి!

## దైవనిర్ణయం లేనిదే ఏదీ జరగదు

దైవం, దైవంచే ఎన్నిక చేయబడిన వారి వాక్యాలు లేని పుస్తకం నల్లబార్తుంది.
దైవం మన తప్పుల్ని క్షమించి చూపించే 'త్రోవ' నిరాటంకమైనది.
నీవు మా కొసగిన జ్ఞానబిందువు, నీ అనంత సముద్రానికి దారి చూపుతుంది.
ఈ మట్టి దేహపు విషయవాంఛల నుంచి విముక్తి నిస్తుంది.
జ్ఞానబిందువును మట్టి తాగుతుంది. గాలి ఊడ్చేస్తుంది.
దానిని నీవు పునః ప్రతిష్ఠించి మాకు మార్గం చూపిస్తావు.
సర్వవ్యాపకుడవైన నీనుంచి అది తప్పించుకుని ఎక్కడకు పోగలదు?
అది అగాధంలోకి పోయినా నీ పిలుపు వినగానే వెంటనే వస్తుంది.
లక్షలాది వ్యతిరేక ధర్మాలు వ్యతిరేకతను ఎదిరిస్తాయి.
నీ ఆజ్ఞ వాటినన్నిటినీ ఒకచోటుకు చేరుస్తుంది.
బిడారు తరువాత బిడారు శూన్యం నుంచి ఉనికి వేపు వస్తూనే ఉంటాయి.
రాత్రిచీకటి పడేసరికి అన్ని ఆలోచనలూ సముద్రంలో అస్తమిస్తాయి.
ఉదయానే, చేపలు పైకి వచ్చినట్లు, ఆలోచనలు తలెత్తుతాయి.
ఆకురాలు కాలంలో చెట్లనుంచి విడివడి ఆకులు చెదరిపోతాయి.
నల్లదుస్తులు తొడుక్కున్న కాకి దుఃఖంతో తోటలో విలపిస్తూంటుంది.
భూమి ప్రభువు వచ్చి శూన్యాన్ని – 'నావి నాకిచ్చేయమని అడుగుతాడు'–
'ఓ నల్లని మృత్యువా! నీవు మింగిన ఆకులూ, చెట్లను తిరిగి ఇచ్చివేయి!'–

వసంతం, శరత్తులు వస్తూపోతూనే ఉంటాయి.
అవి నీలోనూ ఉన్న విషయాన్ని గమనించు, సోదరా!

నీ హృదయ వదనాన్నెల్లప్పుడూ పచ్చదనంతోనింపి,
గులాబీలు, మల్లెలు, శంకువృక్షాలతో పరిమళింపచేయి!

ఆకుల చాటున దాగిన శాఖలు, పూలమాటున ఉన్న భవనాలు
విశ్వకారణ భూతమైన ఈ పదాలు, ఆ పుష్పజనిత పరిమళాలు.

గులాబీలు లేని చోట గులాబీ వాసన నెప్పుడైనా గమనించావా?
మధువు లేకుండా మధుపాత్రపై నురుగు గుర్తించావా?

ఆ పరిమళం నిన్ను తన దారిలోకి నడుపుతుంది.
నిన్ను ఈడెను, కాధర్ వనాల్లోకి తీసుకువెళ్తుంది.

ఆ సుగంధం కాంతివంతం, నేత్రలేపనం.
జాకబు కళ్లు తెరిపించిన దటువంటి సుగంధమే!

దుర్వాసన కనులను మూసేస్తుంది. సువాసన కాంతినిస్తుంది.
ఓ జోసెఫ్ కానివాడా! నీలోని చెడును తొలగించుకో!

## గజ్నా చెప్పిన మాట

గజ్నాముని అన్నాడొకసారి– 'గులాబి లాంటి ముఖముంటే నిరాశ చెందు'–
లేకుంటే, కోపతాపాలకు దూరంగా ఉండు'–
చూడరాని ముఖంలోని నిరాశే అనాకారితనం!
చూడలేని కన్నులోని బాధే గుడ్డితనం!
జోసెఫ్ ముందు నీ గొప్పలను ప్రదర్శించకు.
అతడి శరణు కోరి నీ బాధలను విన్నవించు!
చిలుక చెప్పిన మరణమన్నదే దేవుడి శరణు కోరడం.
శరణు కోరి అతడిలో ఐక్యం కావడమే మరణం.
జీసస్ ప్రవక్త ఊపిరి నీకు జీవాన్నిస్తుంది. ఆశీర్వదిస్తుంది.
వసంతమైనా కఠిన శిలను పచ్చికతో కప్పలేదు.
మంచి మట్టివికా, సువర్ణ, వర్ణపుష్పాలతో శోభిల్లుదువు గాని!
ఇన్నేళ్లూ నీ గుండె శిలగా ఉన్నది కదా, ఈసారి కాస్త మట్టిగా మారు!

# స్మశానంలో గాయకుడు

ఉమర్ కాలంలో ఒక మంచి గాయకుడుండేవాడు.
కోయిల గొంతుతో అతడు పాడుతుంటే ఆనందం వంద రెట్లయ్యేది.
అతడి ఊపిరి పాటగా సభకు ఆభరణమై
అతడి గానం ప్రాణంగా మృతులను బ్రతికించేది.
ఇశ్రాయిల్ దేవదూతలా అతడి పాట ఎందరికో ప్రాణం పోసింది.
ఏనుగులకే రెక్కలు వచ్చినట్లు అవి ఎగిరి గంతులేసేవి.
ఒకరోజున అతడు, సంగీత నాదంతో, నూరేళ్లనాటి
కంకాళానికి ప్రాణం పొయ్యాలని ప్రయత్నించినాడు.

ప్రవక్తలు కూడా తమ శక్తులతో ఆ పని చేయగలరు.
భగవానుని ఆశీస్సులు పొందిన వారికది సాధ్యమే!

ఆ శబ్దాలను మామూలు చెవులు వినలేవు.
అలౌకిక శబ్దాలకు అనంతం ప్రతిధ్వనిస్తుంది.

జిన్నులలోని 'పెరి' శబ్దాలు మానవుడికి వినబడవు.
పెరి, మానవుడు ఇద్దరూ అజ్ఞానపు ఖైదులో బందీలే!

'పెరి' గొంతు మానవులకు వినబడదు. అర్థంకానిది శబ్దమే!
(సురాతు-యల్-రహమాన్‌లోని-'ఓ జిన్నుల బృందమా!'-వాక్యాన్ని చదువు)

సాధువుల హృదయనాదాలు అంతర్గతంగా ఘోషిస్తూనే ఉంటాయి-
-'ఓ ఉనికిలేని అణువుల్లారా! ఊహలు మానండి!
కలుషిత ప్రపంచంలోని కల్లోలం నుండి బయటకు రండి!

శాశ్వతమైన ఆత్మకు జనన, వృద్ధి, క్షయాలు లేవు.
సాధువుల హృదయనాదాలు వినగానే జీవాత్మలు లేచి వస్తాయి.

ఆ మధురనాదం మీకు చేరువలోనే ఉన్నది, కాని
దేవుని ఆజ్ఞ- మీ చెవులకు సోకమని చెప్పలేదు.

సాధువులు ఇజ్రాయెల్ లాంటివవారు. మృతులను బతికిస్తారు.
వారి మాటలకు మృతాత్మలు దేహపు సమాధి నుంచి లేచి నిలబడతాయి.

లేచి అంటాడతడు– ఈ గొంతు వేరేగా ఉన్నది.
అది దేవుని పిలుపు. 'మేరీ'కి లభించినదదే!

ఓ మృతుడా! లేచిరా! శూన్యం నుంచి ఉనికి లోకి!
అది దేవుని పిలుపే! దైవసేవకుడి గొంతు నుంచి వస్తుంది!

దేవుడు సాధువుతో అన్నాడు– 'నేను నీ నేత్రాన్ని, నాలుకను.
నేను నీ ఇంద్రియ శక్తిని, ఆగ్రహాన్ని, ఆనందాన్ని.

నా వలన అతడు చూస్తాడు. నా వలన మాట్లాడ్తున్నాడు.
నా వలన అతడికి, నీకు చేతన లభించినది.

నీవంటావు ఆశ్చర్యంతో– నేను నీకు ప్రణమిల్లుతాను.
సాధువు దేవుడికి దగ్గరివాడు కదా!" అంటావు అమాయకంగా.

సూర్యుడు ఉదయించగా చీకట్లు తొలగినట్లు
మనుసు మూలల్లోని అజ్ఞానాన్ని నేను తొలగిస్తాను.

ఆదాముకు దివ్యనామాలు తెలుపబడినవి.
అతడి ద్వారా మిగతావారు వాటిని గ్రహించినారు.

సాధువు, ఆదాము నుంచైనా, నా నుంచైనా జ్ఞానం స్వీకరించవచ్చు.
మధువును కలశం నుంచైనా, కప్పు నుంచైనా తాగవచ్చు.

ముస్తఫా అన్నాడు– 'నన్ను స్వయంగా వీక్షించినవారు ధన్యులు!
నన్ను వీక్షించిన వారిని చూసినవారు ధన్యులు!'

కొవ్వొత్తి నుంచి మరో దీపాన్ని వెలిగించడం చూసినవారు
కొవ్వొత్తిని తప్పకుండా చూస్తారు.
వందలాది దీపాలు అలా వెలిగి, మూలదీపాన్ని తలుస్తాయి.
నీవు కాంతిని ఆఖరి దీపం నుంచైనా గ్రహించవచ్చు.

లేదా పవిత్ర కాండెలాబ్రా దీపం నుంచైనా పొందవచ్చు.
నీ దగ్గరలో ఉన్న సాధువులనుంచైనా, లేదా
ప్రాచీనులైన మునులనుంచైనా దైవకాంతిని గ్రహించు.

## దేవుని ఊపిరి

ప్రవక్త పలికాడు– ఈరోజుల్లో దేవుడి ఊపిరి వినవచ్చు!
మనస్సు, చెవులను స్థిరంగా ఉంచి ఆలకించు!
నీకు ఊపిరినిచ్చి దివ్య ప్రాణం వెడలిపోయింది.
మరొకసారి వచ్చినపుడు దానిని వీడకు, మిత్రుడా!

ఆత్మలోని అగ్ని, అగ్నినార్పే విధానం కనుకున్నది.
మృతాత్మ తనలోని జీవాన్ని తెలుసుకున్నది.
అది తూబా వృక్షపు తాజానడక. జంతువుల చలనం కాదు.
అది నేలపై వ్యాపించి భీతి గొల్పించినప్పుడు
పవిత్ర గ్రంధపు వాక్యాలు పఠించమన్న పిలుపు, పాటించబడలేదు.
పర్వత హృదయాన్ని రక్తంగా మార్చే పదాలను పలుకలేదు.

గతరాత్రి ఆ ఊపిరి నా వద్దకు వచ్చినపుడు
ఇతర వాసనలు దానినడ్డుకోబోయినాయి.
పిడికెడు ముద్దకోసం ఆత్మ బందీ అయినది ముళ్లదారిలో!
ఆ ముల్లును పెరికివేసి అసలు దారి తెలుసుకో!

అత్యాశ నిన్ను అంధుణ్ణి చేసింది. అంధకారంలోకి నెట్టింది.
మనిషి ఆత్మ దేవుని గులాబితోట అయితే ఆత్మకు ముల్లు ఎలా గుచ్చుకున్నది?
ముళ్లపొదలను తినేది ఒంటె. ఆ ఒంటెను నడిపేది ముస్తఫా!

ఓ ఒంటె! నీ వీపుపై గులాబిపూల గుచ్ఛమున్నది.
ఆ పరిమళంతో నూరు గులాబితోటలు నీలో విరుస్తాయి.

నీ చూపు ముళ్లపొదలు, ఇసుక తిన్నెల వేపు!
నిరర్ధకమైన ముళ్ల నుంచి ఏ గులాబీలను సేకరిస్తావు?

ఓ అన్వేషకుడా– 'ఎక్కడ, ఎక్కడ గులాబితోట?' అని అరుస్తున్నావా?
నీ కాలిలోని ముల్లు తీసివేయి. నెప్పికి కళ్లు మూసుకున్నావు నీవు.

ప్రపంచంలోనే పట్టనివాడు, ముల్లు చివర దాగి ఉంటాడు.
ముస్తఫా వచ్చింది ఈ జగతిలో మంచిని నెలకొల్పడానికి.

ఓ హుమాయ్‌రా! గుర్రపు నాడాను అగ్నిలో వేయి!
దాని వెలుగుతో ఈ పర్వతం కెంపులా మెరవనీ!
(హుమాయ్‌రా–స్త్రీపదం–అరబ్బులకు ఆత్మ స్త్రీరూపం)

ఆత్మకు లింగ భేదం లేదు. ప్రాణానికి తేడా తెలీదు.
తడి, పొడి అంటనిది. ఆహారం అక్కరలేనిది.

చక్కెర మధురమైనది. తీపిలేని తీపి పదార్థమేది?
నీవు చక్కెరగా మారినపుడు మధురమైన విశ్వాసివి.

అన్నిటికన్నా మధురమైన వాడి నుంచి నీవెలా విడిపోగలవు!
స్వచ్ఛమైన మధువు సేవించిన వాడికి మిగతావాటితో పనేమిటి?

దైవతత్వం నశించినపుడు దెయ్యంగా మారుతావు.
దేవదూత సైతం అరిమానుడవుతాడు.

శూన్యంగా మారనిదేదీ కోల్పోదు తన ఉనికిని.
ఉనికిని కోల్పోనిదేదీ ఉన్నతుడిని చేరుకోదు.

పరమాత్మ సంపూర్ణుడు. అతడి పిలుపు సంపూర్ణమైనది.

ముస్తఫా అనేవాడు– 'ఓ బిలావ్! గొంతెత్తి పాడు!
నేను నీ హృదయంలో ఊదిన ఊపిరిని మరలా ఊదు!
ఆ ఊపిరితోనే ఆదాము మూగవోయి నిలబడినది.
ఆ ఊపిరితోనే స్వర్గలోక నివాసులు స్తంభించిపోయినది!'

అతడి గాన మాధురిలో 'ముస్తఫా' రాత్రి ప్రార్థన మరచినాడు.
తెల్లవారే వరకూ అలా నిద్రపోతూనే ఉన్నాడు.

ప్రేమ, ఆత్మ రెండూ రహస్య స్థలాన దాగి ఉన్నవి.
దైవాన్ని నేను వధువుగా తలచినా అతడు కాదనడు.
కాని, నేను ఒక్కక్షణం మౌనంగా ఉంటే అతడూ ఊరుకోడు.

అతడంటాడు– 'కనిపించని జగతిని చూసే మార్గమిదే! రా!'

తప్పులు వెదికేవాడు తప్పులే చూస్తాడు.
తప్పులే లేని స్వచ్ఛమైన ఆత్మకు తప్పులెలా కనిపిస్తాయి?

దోషం అజ్ఞానానిది. దోషరహితుడైన దేవుడిది కాదు.
అవిశ్వాసము అంతే. దానిని పెంచిపోషిస్తే విషమవుతుంది.

నూరు సుగుణాల్లో ఉండే ఒక తప్పు
చెరకుగడపైని చెక్క వంటిది.
ఒకే రకంగా పైకి కనిపించినా
ఒకటి ఆత్మ మరొకటి దేహం.

చక్కెర, చెరకుగడ రెండూ తియ్యగానే ఉంటాయి.
సాధువుల దేహం ఆత్మ రెండూ మధురమైనవే!

వారి మాటలు, రూపం, ఆత్మ అన్నీ పరమాత్మకు చెందినవి.
సాధువులకు ఇష్టం లేనిది దేహం, దాని వాంఛలు.

మట్టిలో పుట్టిన దేహం మట్టిలో కలుస్తుంది.
లవణాల్లో కలిసిన దేహం పరిశుద్ధమౌతుంది.

ఆధ్యాత్మిక లవణ ప్రభావంతో మహమ్మదు ప్రవక్త అయినాడు.
ప్రాచీన గ్రంథాలలోని (హడిత్) పదాలకన్నా మిక్కిలిగా పలికినాడు.

అతడి వంశంలో వస్తున్నదా పవిత్ర లవణం.
అతడి వారసులిక్కడే ఉన్నారు, అన్వేషించు నిజం.

అతడు నీముందే ఉన్నాడు; 'ముందు' అంటే ఎటు?
అతడు నీ ఎదుట ఉన్నాడు; ఎదుట అంటే ఎక్కడ?

ముందు, వెనక, పైనా, క్రిందా అనేవి దైహిక సంబంధమైనవి.
ఆత్మకు దిక్కులతో పనిలేదు. నీ అంతర్దృష్టిని పెంపొందించుకో!

## ఆయేషా ప్రశ్న

ఒకరోజున ముస్తఫా స్మశానంలోకి వెళ్లాడు.
తన స్నేహితుడి శవపేటిక ననుసరిస్తూ.
గొయ్యి తవ్వి దానిలో శవపేటికనుంచారు.
చెట్లు మధ్యవర్తుల్లా నిలబడి చూస్తున్నవి.

అవి తమ నూరు చేతుల్ని పైకెత్తి, మాట్లాడుతున్నవి,
చెవులున్న వాడు వాటిని వినును గాక!
ఆకుపచ్చని నాలుకలతో, పొడుగాటి చేతులతో
భూమి అంతరాత్మ రహస్యాలను విప్పుతున్నవి.

నీటిలో తలలు ముంచిన బాతుల్లా, ఆ చెట్లు నేలలో తలదించి
నెమళ్లలా, శీతాకాలంలో నల్లటి కాకుల్లా కనిపిస్తాయి.

శీతాకాలంలో వాటిని మంచులో బంధించి
వసంతకాలంలో విడుదలచేసి పత్ర వస్త్రాలనిస్తాడు.

సందేహవాదులంటారు– 'ఈ సృష్టి శాశ్వతమైనపుడు
ఆ కీర్తి అతడికెందుకివ్వాలి?–

అయినా, దేవుడు తన వాళ్ల హృదయాలలో గులాబి తోటలను నాటినాడు.
ప్రతి గులాబీ తన పరిమళాలతో సృష్టి రహస్యాలను విప్పి చెబుతున్నది.

ఆ సుగంధం నాలుగు దిక్కులా వ్యాపించి సంశయవాదుల ముసుగును తొలగిస్తున్నది.
వారు ఆ సువాసన ముందు పురుగులవుతున్నారు. ఢంకా ధ్వనికి బిత్తరపోతున్నారు.

ఏదో పని ఉన్నట్లు నటిస్తున్నారు. తమ కనులను వెలుగు నుంచి మళ్లిస్తున్నారు.
వాళ్లు కళ్లను మళ్లించినచోట కళ్లు లేవు. రక్షిత ప్రదేశాన్ని చూపించేదే గదా నేత్రం.

స్మశానం నుంచి తిరిగి వచ్చి ముస్తఫా, ఆయేషా వద్దకు వెళ్లినాడు.
అతడి వదనాన్ని చూసి ఆయేషా, తన చేత్తో అంగీని, శరీరాన్ని తడిమినది.

'ఎందుకిలా తడుముతున్నావు?' అడిగాడు ముస్తఫా.
'వర్షంలో నడిచినా నీ బట్టలు తడవలేదే'– ఆశ్చర్యపోయింది ఆయేషా

ప్రవక్త అడిగాడు– 'నీ తలపై ముసుగు ఎలా తయారు చేసావు?'–
ఆయేషా పలికింది– 'నీవిచ్చిన ఉన్నితోనే నేను తయారు చేసుకున్నాను!'–

'అందుకే నీవు అందరూ చూడలేనిది చూడగలిగినావు' –అన్నాడతడు.
'నాపై కురిసిన వర్షం ఈ లోకపు మబ్బులు కురిపించినది కాదు'–

## హకీం పలుకులు

మానసిక లోకంలో కనిపించేవి ఈ నింగిలోని మేఘాలు.
ఆధ్యాత్మిక లోకంలో కనిపించేవి ఊర్ధ్వ, అథోలోకాలు.
మనకు కనిపించని ప్రపంచంలో నీరు, మబ్బులు,
నింగీ, సూర్యుడూ అన్నీ ఉన్నాయి.
జ్ఞానులకు కనిపించే ఆ లోకం కొత్తసృష్టికి కారణమౌతుంది.

పోషణకు పనికొచ్చే వర్షంలానే, లయకారక వర్షమూ ఉన్నది.
వసంతకాల వర్షము మంచిది, శరత్కాల వర్షం హానికరమైనది.

అలాగే మంచు, గాలి, ఎండ కూడా, సకాలంలో ఇస్తాయి సత్ఫలితాలు.
ఆ కనిపించని లోకంలోనూ అంతే, లాభనష్టాలున్నాయి.
సాధువుల ఊపిరి వసంతయామినిలా హృదయం, ఆత్మలు హరితవనాలౌతాయి.
అక్కడక్కడ ఎండుచెట్టు ఉంటే అది ఆ ఊపిరి తప్పుకాదు.
ఆ ఆత్మ ఆ ఊపిరి కన్నా తన ఆత్మకు ప్రాముఖ్యమిచ్చింది.

ప్రవక్త అన్నాడు– "మిత్రులారా! మీ దేహాలను వసంతం నుంచి దాచకండి!
వసంతపు చల్లదనం మొక్కలకులానే మీకూ ఉపయోగకరం.
శరత్తు నుంచి పారిపొండి! మొక్కలకు లానే అది మీకూ హానికరం"–

ఈ మాటలను సంప్రదాయవాదులు భౌతిక దేహానికి అన్వయించారు.
దేవుడి ఊపిరిని చూడలేనివాళ్లు, కొండలోని గనులనేం చూస్తారు?

దేవుడి దృష్టిలో ఆకురాలు కాలమంటే దేహం, విషయవాంఛలు
వసంతయామిని అంటే ఆత్మ, శాశ్వత జీవనం.

నీకు అర్ధసత్యం తెలుసు అందుకే పూర్ణసత్యం కొరకు శోధించు.
పరిపూర్ణుడైన వాడిచే చేయబడినవాడిని పరిపూర్ణతకై ప్రయత్నించు

దేవుడి ఊపిరి వసంతంగా, జీవులకు ప్రాణంగా గ్రహించు.
సాధువులు పలికే మంచిచెడ్డలను అర్థం చేసుకో,
నరకలోకాగ్నిలోని మంచు, మంటల నుంచి కాపాడుకో!

వసంతకాలపు శీతోష్ణాలు నిజాయితీతో కూడిన విశ్వాసం, సేవలకు ప్రతీకలు.
దైవంలోని దివ్యుల వనాలు, సముద్ర హృదయంలో ముత్యాల రాశులు.
జ్ఞాని హృదయంలోని వేలాది దుఃఖాలు, దైవం నుంచి వస్తే భారరహితాలు.

## వర్షపు అంతరార్థం

ఆయేషా అడిగింది ముస్తఫాను– 'ఆ వర్షానికి అర్థమేమిటి?'
అది కరుణతో కూడినదా? లేక దైవన్యాయ ప్రభావితమైనదా?
అది వసంతపు వర్షమా, లేక శరత్కాలపు అకాల వర్షమా?'–

ముస్తఫా అన్నాడు– 'అది ఆదాము సంతానం ఆపదలో ఉన్నపుడు
ధారగా కురిసే దయా వర్షం. అయినా మానవుడు మారకపోతే అదే విధ్వంసం!
ఈ లోకం ధ్వంసమై, స్వార్ధపూరిత ఆలోచనలు సర్వం నశిస్తాయి'

దేవుని క్షమ ఈ లోకపు మూలస్తంభం; ఆత్మజ్ఞానం హానికరం.
జ్ఞానం ఆ లోకానికి చెందినది. అది ఈ లోకాన్ని నశింపచేస్తుంది.

జ్ఞానం ఎండవేడిమి, మంచు చల్లదనం లాంటిది.
జ్ఞానం నీరువంటిది, ఈ ప్రపంచం మట్టి లాంటిది.

అందుకే కొద్దిపాటి జ్ఞానం బిందువుల్లా ఈ లోకానికి వస్తుంది.
కామం, అసూయలు ప్రకోపించకుండా నియంత్రిస్తుంది.
జ్ఞానం అధికంగా వచ్చినపుడు ఈ లోకంలో సుగుణ, దుర్గుణాలనేవేవీ ఉండవు.

## గాయకుడి కథ

ఆ గాయకుడు తన అద్భుత గానంతో మనసు, ఆత్మలకు రెక్కలనిస్తాడు.
అతడు వృద్ధుడయ్యేసరికి డేగలాంటి అతడి ఆత్మ దోమలను పట్టుకుంటున్నది.

మధుపాత్రలా అతడి నడుము వంగిపోయింది.
కనుబొమలు తెల్లటి చారలైనాయి. అతడి గొంతు జీరబోయింది.

జుహ్రా వీనస్‌నే కదిలించిన గాత్రం, గాడిద అరుపులా మారింది.
అన్ని అందాలు చివరకు నశిస్తాయి. పైకప్పులు నేలకూలుతాయి.

సాధువుల హృదయ నాదాలు మాత్రమే బాకాధ్వనుల్లా ప్రతిధ్వనిస్తాయి.
వారి హృదయాలు ఇతరుల హృదయాలను మత్తెక్కిస్తాయి.

సాధువులు ప్రతిధ్వనికీ, ఆలోచనకు అయస్కాంతాలు.
దివ్య రహస్యాలను తెలుసుకుని, తెలిపే వారధులు.

గానం తప్ప ధనం లేని ఆ గాయకుడు, రొట్టెముక్క కొనలేని పేద అయినాడు.
–'దైవమా! నాకు దీర్ఘ జీవితాన్ని, గౌరవాన్ని ఇచ్చావు.
డెబ్భై ఏళ్లు నేను పాపాలు చేస్తూ బతికినా నన్ను క్షమిస్తూనే ఉన్నావు.
నేనిప్పుడు నిరుపేదను. నీ అతిథిని. నీ గురించి గానం చేస్తాను'–

అతడు తన తంబూర తీసుకుని మదీనాలోని స్మశానానికి వెళ్లాడు–
–'అయ్యో! నేను ఇస్తున్న నకిలీ నాణేన్ని స్వీకరించావా, ప్రభూ!'–
అంటూ కాసేపు గానం చేసి, తంబూర తలగడగా నిద్రపోయాడు.
నిద్రలో అతడి ఆత్మ అనే పక్షి పంజరం నుంచి విముక్తి చెందినది.
అది తంబూరను, గాయకుడిని వదిలి ఎగిరిపోయినది దూర తీరాలకు.

'నేనీ దివ్యలోకపు వసంతవనంలో మధువు తాగి మత్తెక్కిపోతాను.
తుది మొదలు తెలీకుండా పయనిస్తాను, చక్కెరను ఆరగిస్తాను.
మెదడును కలుషితం చేయని ఊహ, ఆలోచనలతో స్వర్గంలో విహరిస్తాను.
కళ్లు మూసుకుని కొత్తలోకాన్ని చూస్తాను.
చేతులు లేకుండా గులాబీలను, తులసి ఆకుల్ని పోగుచేస్తాను.

పెదాలు, పళ్లు లేకుండా మధురాన్ని రుచిచూస్తాను'– అనుకున్నది.
నీటి పక్షి తేనె సముద్రంలోకి దూకింది.
జాజ్ జలధారలో స్నానం చేయగా కష్టాలన్నీ తీరాయి.

నాకీ ఆలోచనలు, అలౌకిక ద్విపదలై కలలో కనిపించినాయి.
మథ్నవీ రూప ఆకాశంలో పరమాత్మను దర్శింపజేస్తున్నాయి.
విస్తృతమౌతున్న ఈ భూమ్యాకాశాలు నా కోర్కెలను మరింత విప్పారుస్తున్నాయి.
ఆ మరో లోక సందర్శనం చేసాక ఇహలోకంతో పని ఉండదు.
దైవాజ్ఞ వస్తున్నది– 'కపటివి కాకు; కాలిలోని ముల్లు తీసివేయి!'
అతడి ఆత్మ అలా దేవుడి కరుణావనంలో తిరుగుతున్నది.

## దివ్యవాణి సందేశం

దేవుని మహిమతో ఉమర్‌కు ఆపుకోలేనంత నిద్రవచ్చింది.
ఉమర్ అనుకున్నాడు– 'ఎంత ప్రయత్నించినా నిద్ర ఆగడం లేదు.
ఏదో బలమైన కారణం, ప్రయోజనం ఉండి ఉంటుంది'–

అలా అనుకుంటూనే నిద్రపోయాడు. నిద్రలో కల.
అతడికో దివ్యస్వరం వినిపించింది. అన్నిశబ్దాలకదే మూలం.
నిజానికదే అసలైన ధ్వని మిగతావన్నీ ప్రతిధ్వనులే!
టుర్కులు, పర్షియన్లు, కుర్దులు, అరబ్బులర్థం చేసుకున్నారా స్వరాన్ని.
వాళ్లే ఏమిటి; ప్రతి శిలా, కొయ్యా అర్థం చేసుకున్నాయి'–
ప్రతిక్షణం అతడి నుంచి పిలుపు వస్తూనే ఉంటుంది,
–నేను మీ ప్రభువునేనా?'– ఆపదలు, ఉనికి రూపంలో!
సమాధానం రాకపోతే అది శూన్యం; వస్తే అది ఉనికి.

## చెక్క–శిల

తనను ప్రవక్త నుంచి వేరు చేసినందుకు స్తంభం దుఃఖించింది.
ప్రవక్త అడిగాడు– 'ఎందుకు దుఃఖం? నీకేం కావాలి?'–

స్తంభం సమాధానమిచ్చింది– 'నీ ఎడబాటుతో నా ఆత్మ రక్తమయమైనది.
నీవు నన్ను ఆనుకుని విశ్రాంతిని తీసుకునేవాడివి. నేడు వదిలేసావు'–

–'నిన్ను ఖర్జూర వృక్షాన్ని చేస్తే, అందరికి పండ్లు నిద్దువుగాని, సరేనా'–
లేదా సతత హరిత వృక్షంగా సుదూరలోకంలో ఉందువు గాని'–

అతడి మాటలకు ఆ స్తంభమిలా సమాధానమిచ్చింది.
'నీవిప్పుడా మంటపంలో కూర్చోవడం వలన నన్నెవరూ పట్టించుకోవడం లేదు'

ప్రవక్త ఆ స్తంభాన్ని నేలలో పాతిపెట్టినాడు.
పునరుత్థాన సమయంలో మనుషులతోపాటూ తానూ లేవనెత్తబడ్తుంది.

దేవుని పిలుపునందుకున్న వ్యక్తికి ఇహలోక బంధములుండవు.
దైవకార్యము చేయువ్యక్తికి భౌతిక వాంఛలపై మమకారముండదు.

నిర్జీవ, నిశ్చల పదార్థాలు మాట్లాడ్తాయంటే నీవు నమ్ముతావా?
ఆత్మల రహస్యం తెలిసినవాడే దానిని అర్థం చేసుకోగలడు.

కపట సైతాను, మనసులో సంశయాన్ని నాటుతాడు.
జనులు అమాయకంగా ఉచ్చులో చిక్కుకుంటారు.

తర్కవాదుల కాళ్లు కొయ్యవి. ఎప్పుడు విరుగుతాయో తెలీదు.
బాహ్య ఆధారాలను విశ్వసించేవారు ఒక్క సంశయంతో దారి తప్పుతారు.

గుడ్డివాడికి చేతికర్ర ఊతం, గులకరాళ్లలో పడకుండా నేస్తం.
కుతుబ్‌లా ఉన్నతమైన వ్యక్తికి మాత్రమే ఉంటుంది అచంచల విశ్వాసం.

యుద్ధంలో విజయానికి అశ్వికుడు కారణమైతే మతంలో ఎవడు?
దివ్యాత్మను కలిగి ఉండి సచ్చరిత్ర కలవాడు విజయుడు.

ఊతకర్ర సాయంతో అంధుడు నడిచినట్లు, సాధువులే సామాన్యులకు కాళ్లు.
అతడికి ఊతకర్ర చూపును ఇచ్చిందెవరు? అన్నిటినీ చూసే ఆ జగద్రక్షకుడు.

కాని ఈ కర్ర (చూపు) కదా అన్ని గొడవలకు కారణం! అంధుడా!
దానిని విరగొట్టు! అసలు చూపు నీకు అర్థమవుతుంది.

నీకు ఆసరాగా ఉండడానికి కర్రను సృష్టిస్తే, కోపం వచ్చినప్పుడు
దానిని నీవు ఆయుధంగా వాడ్తున్నావు, అందరిపైనా, చివరకు దేవుడిపైనా!

అంధులారా! మరి మీరేం చేయాలి? మీకూ, దేవుడికి మధ్య సాధువునుంచండి.
మీకు కర్రనిచ్చినవాడి అంగీని తాకి అతడి దారిలో పయనించండి.

మోసెస్, మహమ్మద్‌ల మహిమతో చేతికర్ర, స్తంభం జ్ఞానులు కాలేదా?
కర్ర నుంచి సర్పం, స్తంభం నుంచి పిలుపు వేదనతో కూడినది వినబడలేదా!

అవి రోజుకు అయిదుసార్లు జగత్ప్రభువుకు జేజేలు పలుకుతున్నాయి.
అర్థం చేసుకునే వాళ్లున్నప్పుడు మహిమల అవసరం లేదు.

గ్రాహ్యమైనదానికి ఏ ఉదాహరణలూ అక్కర్లేదు.
దానినెవరూ సందేహించరు, ఆక్షేపించరు.
కొత్త దారి అర్థం కానట్లుంటుంది. అదృష్టవంతులకది కనిపిస్తుంది.
ఆదాంపై అసూయతో డెవిల్, మృగాలు ద్వీపాల్లోకి పారిపోయాయి.
ప్రవక్తల మహిమల్ని చూసి సందేహవాదులు గడ్డిలో దాక్కుంటారు.

ఆత్మవంచనతో పవిత్ర ముస్లిములుగా పైకి నటిస్తారు.
లోపల వారెటువంటివారో ఎవరికీ తెలీదు.

దొంగ నాణేల్లా వాళ్లు చలామణీ కావాలని ప్రయత్నిస్తారు.
మాటలతో మాయ చేస్తారు. మనసులో విషం కక్కుతారు.

వేదాంతికి మాటలతో పనిలేదు. పలికే ప్రతిమాటా సత్య ప్రమాణమే!
ఆత్మ ప్రబోధంతో అతడి కరచరణాలు కదుల్తాయి.
సంశయవాదుల నాలుకలు చంచలం. వాళ్ల క్రియలూ అంతే!

## అబూ జాల్ – అహమ్మద్

అబు–జాల్ తన అరచేతిలో కొన్ని గులకరాళ్లనుంచుకుని అన్నాడు.
–'ఓ అహమ్మద్! నీవు ప్రవక్తనంటున్నావు, నా గుప్పెట్లో ఏమున్నాయో చెప్పు!'
ప్రవక్త అన్నాడు– 'నన్ను చెప్పమంటావా? వాటినే చెప్పమంటావా?'
అబుజాల్ అన్నాడు– 'అహ! సరే, వాటినే చెప్పమను!'–
మరుక్షణం గులకరాళ్లు మాట్లాడడం ప్రారంభించాయి–
–'దేవుడొక్కడే– అతడు అల్లాహ్; మహమ్మదు అతడి ప్రవక్త'
భయంతో, కోపంతో అబు–జాల్ గులకరాళ్లను నేలపైకి విసిరికొట్టినాడు.

## ఉమర్ కథ - దివ్యవాణి సందేశం

దివ్యవాణి ఉమర్‌తో పలికింది– 'ఉమర్! స్మశానం వేపు వెళ్లు!
అక్కడ దైవభక్తుడు, విశ్వాసి కష్టాల్లో ఉన్నాడు. స్వయంగా నీవే వెళ్లు!
ఖజానా నుంచి ఏడువందల దీనారాలను అతడికిచ్చి పలుకు–
'నీవు దేవునిచే ఎన్నిక చేయబడినావు. ఈ చిన్న బహుమతి స్వీకరించు.
వీటితో సిల్కు వగైరా కొనుక్కో, కావాలంటే మరల ఇక్కడకు రా!'

ఉలిక్కిపడి లేచిన ఉమర్, ఆ దైవభక్తుడి దగ్గరకు పరిగెత్తాడు.
ఆ స్మశానంలో ఒక వృద్ధుడు తప్ప ఇంకెవరూ లేరు.
అతడు కాదనుకుని స్మశానమంతా, చుట్టుపక్కలా గాలించాడు ఉమర్.
ఎవరూ కనిపించలేదు. ఉమర్ అనుకున్నాడు– 'చీకటిలో మణులుంటాయి'–

ఉమర్ దగ్గరకు రాగానే వృద్ధుడు దిగ్గున లేచి కూర్చున్నాడు.
భయంతో వణుకుతూ– 'దేవుడా! ఈ పేదవాడిపై, అధికారిని పంపినావా?'
అనుకుంటూ భయంతో పాలిపోయిన వృద్ధుడిని మహావీరుడు ఉమర్ గమనించాడు.

ఉమర్ అన్నాడు– 'భయపడకు? నీకు దేవుడి అనుగ్రహంతో మేలు జరుగుతుంది'
నీవు ఎంతో పుణ్యం చేసుకున్నావు. నీ క్షేమాన్ని కనుక్కోమని నన్ను పంపినాడు.
ఇవిగో దీనారాలు. ఖర్చుపెట్టుకో! ఇంకా కావలసివస్తే మళ్లీరా!

ఆ మాటలు వినగానే వృద్ధుడు దుఃఖంతో విచలితుడయ్యాడు.
–'ఓ దేవుడా! ఇన్నాళ్లూ నేను సత్యమార్గానికి దూరంగా ఉన్నాను.
ఈ సంగీతం ఒక తెరలా నన్ను నీ నుంచి వేరు చేసింది.
ఈ వాద్యవిశేషం ఒక బందిపోటు దొంగలా నన్ను దారి మళ్లించింది'–
అంటూ తన వద్ద ఉన్న తంబూరను నేలపైకి విసిరి ముక్కలు చేసాడు.
–'డెబ్బై ఏళ్లు నా రక్తాన్ని తాగి, నా ముఖానికి నల్లరంగు పూసినావు.
దేవుడా! నన్ను రక్షించు! నన్ను క్షమించు! నన్ను కరుణించు!
నాకు ఊపిరినిచ్చావు. నేనా ఊపిరిని గానంగా ఊది పారేసాను.
శృతి, లయలంటూ సాధనచేసి, సృష్టికర్తనే నిర్లక్ష్యం చేసాను.
నా హృదయంలోని తడి కాస్తా అంతరించి అది ఎండిపోయింది.

ఇరవై నాలుగు గంటల బిడారు కదిలింది కాని ఆలస్యమైపోయింది.
నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. నీ కరుణను కోరుకుంటున్నాను.
నా కంటే నాకు దగ్గరయిన వాడి దగ్గర నుంచే క్షమను ఆశిస్తున్నాను.
నాలో అహం నశించినది. నీ దివ్యస్వరూపం సాక్షాత్కరించినది.
నీ ఎదురుగా ఎవరైనా స్వర్ణాన్ని లెక్కిస్తుంటే
నీ చూపులటే ఉండి నిన్ను మర్చిపోతాయి.

## ఉమర్ ఓదార్పు

'నీ దుఃఖం నీలోని చేతనను మేల్కొల్పింది' ఉమర్ అన్నాడు.
"చేతన సరైనది కాకపోతే అదీ పాపమే!
అసలు దారి అటువున్నది. దాన్ని అన్వేషించు!
భూత భవిష్యత్తులు తెరల్లాంటివి. వాటిని తగలబెట్టు!
వీటి వల్లనే నీకు అనేక బంధాలు ఏర్పడ్డాయి.
ముడులు పడిన రెల్లు రహస్యాలను పంచుకోదు.
అది వేణువైతే పెదాలకు, స్వరానికి అన్వయాన్నివ్వదు.
దేవుని దారి తెలిస్తే అటు వెళ్లు, ఇంటికి పోవడం నీ ఇష్టం.
ఎప్పుడైతే నీ జ్ఞానమంతా నీకు జ్ఞానాన్నిచ్చినవాడిని మరచిందో వచ్చింది కష్టం.
నీ పశ్చాత్తాపం పాపం కన్నా అధికమైనది.
ఈ పశ్చాత్తాపం గురించి పశ్చాత్తాపపడవలసి వస్తుంది"

ఉమర్ మాటలు వినగానే వృద్ధుడు దుఃఖాన్ని తమాయించుకున్నాడు.
అతడికిప్పుడు సుఖదుఃఖాలతో నిమిత్తంలేదు.

అతడి ఇహలోక శబ్దం విడిచిపెట్టింది.
దివ్యవాణి అతడి ఆత్మలో ప్రతిష్ఠింపబడినది.

అతడి అన్వేషణ అనంతలోకాల్లోకి విస్తరించింది.
అన్వేషణ కాని అన్వేషణ, మాటలకు, భావాలకందని గవేషణ.

పరంజ్యోతి ప్రకాశంలో మునిగి ముక్తికై అన్వేషించింది.
ఆ అనంత సముద్రంలో నీటిబిందువై కలిసిపోయింది.

తత్కాల కారణాలు ఇంద్రజాలికుల తంత్రాలు.
శాశ్వత సత్యం ప్రవక్తల మహిమాన్విత ప్రదర్శనాలు.
ఆత్మారణ్యంలో డేగగా సంచరించేవాడు.
తన ఆత్మను వందలాది ఆత్మలకు మార్గదర్శిని చేస్తాడు.
ప్రాణ రక్షకుడైన సూర్యుడు ప్రతిక్షణం ఖాళీ అయి, నింపబడతాడు.
సత్యమనే సూర్యుడు ఆత్మజీవనాన్ని అలాగే నింపుతాడు.
ప్రవహించే జలంలా, ఆ దేవుడి నుంచీ
మానవ ఉనికి, ఆత్మ, ప్రాణాలు ఉద్భవిస్తున్నాయి.

## దేవదూతల ప్రార్థన

ప్రవక్త అన్నాడు– 'ఇద్దరు దేవదూతలు ప్రార్థిస్తున్నారనుకుందాం!–
'దేవా! దాతలకు ఒక 'దీనారు'కు లక్షదీనార్లివ్వు!
లోభులకు ఒక దీనారుకు మరో దీనారు నష్టాన్నివ్వు!'–
ఈ ప్రార్థన సమంజసమైనదేనా? కాదు కాదు.
ఒక్కోసారి దాతృత్వం కన్నా లోభత్వం మేలైనది.
దైవాజ్ఞతో ధర్మం చేయండం నీ సద్బుద్ధిని వెల్లడిస్తుంది.

ముస్తఫాకు వ్యతిరేకంగా కత్తులు నూరుతూ ఒంటెల్ని బలిస్తున్నారు.
వారికి దైవాజ్ఞ తెలీదు. వారికి ఓటమి తప్పదు.

అర్థం చేసుకో! దాత ధనాన్నిస్తాడు. ప్రేమికుడు ఆత్మనిస్తాడు.
దేవుడి పేరు మీద రొట్టెనిస్తే రొట్టె, ప్రాణమిస్తే ప్రాణం ఇవ్వబడ్తాయి.

నీ దయాగుణంతో నీవు పేదవాడివైతే, దేవుడు నిన్ను ధనవంతుడిని చేస్తాడు.
ధాన్యాగారం వట్టిపోయినా, పొలాల్నిండా పంట సిద్ధంగా ఉంటుంది.
నిండుగా ఉన్న ధాన్యాగారంలో ఎలుకలు, పురుగులు పడ్తాయి.
నిండుగా దేహముంటే లోపల పురుగులు పడకుండా చూసుకో!

నీలోని క్రూర ఆత్మను కత్తికి బలివ్వు! దివ్యాత్మకు స్వాగతం పలుకు!

## దయగల కాలిఫ్ - నిరుపేద అరబ్బు

ఒకప్పుడు ఎంతో దయగల కాలిఫ్ ఉండేవాడు.
తన దేశంలో పేదతనం లేకుండా చేసినాడతడు.
ముత్యాలతో నిండిన సముద్రంలా, అతడు ప్రజలకు మేలు చేసినాడు.
అతడి కీర్తి ఖండ ఖండాంతరాలు పాకింది.
ఈ ధూళిప్రపంచంలో అతడు వర్షపు మేఘం.
అతడి దయాగుణానికి గిరులు వణికాయి. గనులు కంపించాయి.
అతడి కోట ద్వారం దగ్గరే ఆకలిదప్పులు, అవసరాలు ఆగిపోయాయి.
పర్షియన్లు, గ్రీకులు, అరబ్బులు, తుర్కులు అందరూ సాయమందుకున్నారు.
అతడు జీవజలం, సంపదలున్న సముద్రం, నీడనిచ్చే మహావృక్షం.

ఒకరోజున పేదవాళ్లైన భార్యాభర్తల మధ్య గొడవ తారాస్థాయికి చేరింది.
–'మనకే ఈ దరిద్రం. మిగతా అందరూ హాయిగా ఉన్నారు.
తింటానికి తిండి లేదు. ఉన్నదంతా బాధ, అసూయ, ఆకలి,
పట్టుకోడానికి పాత్ర లేదు. కళ్లనిండా నీళ్లున్నాయి.
పైన కప్పుకోడానికి పగలు ఎండ, రాత్రిపూట వెన్నెల!
పూర్ణచంద్రుడిని రొట్టె అనుకుని అందుకోడానికి చేతులు చాస్తున్నాం.
నిరుపేదలు కూడా మన పేదరికాన్ని చూసి సిగ్గుపడతారు.
పగలు కూడా మన ఏడ్పుకు రాత్రిలా నల్లబడుతుంది.
బంధువులు, స్నేహితులు మనల్ని పీడలా భయపడ్తూ చూస్తారు.
ఎవర్నైనా ఇంత పప్పు అప్పడిగితే, పోవే దరిద్రపుదానా! అని తిడ్తున్నారు.
అరబ్బులు యోధులు, వీరులు; నీవు అక్షరాల్లో తప్పులాంటివాడివి.
యుద్ధం చేయకుండానే మనం చచ్చిపోయాము. లేమి వల్ల స్పృహ తప్పినాము.
ఆకలితో అడుక్కుంటే, దోమల గొంతు చీల్చి ఆహారాన్ని వెదుకుతున్నాం!
పొరపాటున మన ఇంటికి అతిథి వస్తే అతడిని కూడా అడుక్కుంటున్నాం!

## సాధువులు–మోసగాళ్లు

మీకు నిజానికి (నఖద్), నకిలీకి (నఖల్) తేడా తెలియాలి.
అందుకే మంచివాడికి అతిథిగా వెళ్తే అదృష్టమంటారు.

గురువులూ అంతే! శిష్యుల్ని మోసం చేసే వాళ్లూ ఉన్నారు.
నీవు మోసగాడికి శిష్యుడివైతే, అతడు నీ దగ్గర ఉన్నదంతా ఊడ్చేస్తాడు.

అతడే బలహీనుడు. నిన్నెలా బలం గలవాడిగా చేయగలుగుతాడు?
అతడిలోనే కాంతి లేనప్పుడు, ఇతరులకెలా కాంతి నివ్వగలడు?

సగం గుడ్డివాడు ఇతరుల కళ్లనేమి బాగు చేయగలడు?
అది మన పరిస్థితి. మన దగ్గరే అతిధి మనగలడు?

పదేళ్ల కరువు చూడదల్చుకుంటే ఎవరైనా మన ఇంటికి రావచ్చు!
బాహ్యరూపం గొప్పగా ఉండి మోసగాడు జనాల్ని మాయబుచ్చుతాడు.
హృదయంలో చీకటి, నాలుక ఫెళఫెళ లాడ్తుంది.

అతడికి దివ్య పరిమళం తెలీదు. కాని నటన బాగా వచ్చు.
'సెద్'కన్నా ఆదాం కన్నా ఎక్కువగా తెలిసినట్లు నటిస్తాడు.

మోసగాడిని చూసి డెవిల్ కూడా సిగ్గుపడ్తుంది.
సూఫీల దుస్తుల్ని మాటల్ని వాళ్లు కాపీ గొడ్తారు.

ఈ మోసగాళ్లు దైవజ్ఞానము, దివ్యకాంతి ఉన్నట్లు నటిస్తారు.
కనీసం జాలి, కరుణ, కొవ్వొత్తి కూడ లేనివాళ్లు వీరు.

వాళ్లు ప్రకటిస్తారు– ఇవిగో భక్ష్యాలు! నేను దైవ సేవకుడిని
ఆకలితో బాధపడ్తున్న అభాగ్యులారా! రండి! ఆరగించండి!

తింటానికి వెళ్తే అక్కడ మీకేం దొరకదు. –'రేపు రండి' అంటారు.
ఆ రేపు ఎప్పటికీ రాదు. అది మోసపు విందు. అంతా మాయ.

మంచీ చెడుల మధ్య తారతమ్యం తెలవడానికి కావాలి చాలా సమయం.
దేహం వెనుక నిధి ఉంటుంది. అందులో పాముందో, చీమ ఉందో, డ్రాగన్ ఉందో తెలీదు.

తను ఎందుకూ పనికిరానివాడినని తెలిసేప్పటికి
తనువు చాలిస్తాడు. జ్ఞానం వల్ల ఏమిటి ప్రయోజనం అప్పుడు?

## మంచి శిష్యుడు - చెడ్డ గురువు

ఒక్కోసారి సద్బుద్ధిగల శిష్యుడు మోసగాడిని విశ్వసిస్తే
అతడి నమ్మకం మంచితనం అతడికి మేలు చేస్తుంది.

ఆ ప్రయత్నం కటికచీకట్లో నాణెం వెదకడం.
నాణెం దొరక్కపోవచ్చు కాని అతడి ప్రయత్నం మెచ్చుకోబడ్తుంది.

పేరు కోసం మోసగాడిలా ప్రయత్నం మానుకో!
దివ్యాత్మను ప్రసన్నం చేసే సద్గురువును ఎన్నుకో!

## పేదవాడు - భార్య పోరు

భార్య పోరు విని దుఃఖితుడై పేదవాడిలా అన్నాడు–
ఎందుకు పేదరికం గురించి వగుస్తావు? అదంతా భూతకాలమే!
కాలప్రవాహంలో ధనం, దారిద్ర్యం అన్నీ కొట్టుకుపోతాయి.

ఆ నీరు బురదగా ఉన్నదా, తేటగా ఉన్నదా అని కాదు. ఎంత కాలం ఉంటుందని!
ఈ ప్రపంచంలో అనేక జంతువులు నిరంతర భయంతో జీవించడం లేదా!

పావురం దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతుంది రాత్రికి ఆహారమున్నా, లేకున్నా!
నైటింగేల్ గానం చేస్తుంది– 'నాకు ఆహారమిచ్చిన దేవునికి ధన్యవాదాలు' అని.

రాజు చేతిమీద వాలిన డేగకు, కళేబరాలపై ఆసక్తి ఉండదు.
చీమ నుంచి ఏనుగు వరకు అన్ని ఆ దేవుడికి కృతజ్ఞతలు చెబ్తాయి.
ఈ శోకాలు, విలాపాలు మనకు కోరికలవల్ల వచ్చేవే!
కొడవలిలా అవి మనల్ని కోస్తూపోతాయి.

ప్రతి బాధా మృత్యువులోని ఒక భాగం.
నీకు చేతనైతే దాన్ని తొలగించు.
భాగాన్నే తొలగించలేకపోతే, మొత్తం నిన్ను మింగివేస్తుంది.
బాధే మధురంగా ఉంటే, మృత్యువు మరింత మధురం కాదా!
బాధలనేవి మృత్యుదూతలు. మూర్ఖుడా! వాటి నుంచి పారిపోకు.

సుఖంగా బతికినవాడు కుక్కచావు చావవచ్చు.
దేహాన్ని ప్రేమించినవాడు ఆత్మను ద్వేషించవచ్చు.
గొర్రెలను మైదానాల్లోకి తోలుతారు. బలిసిన దానిని కోసుకుతింటారు.

రాత్రి గడచింది. తెల్లవారబోతోంది.
ఇంకా స్వర్ణంపై మమకారం తీరలేదా?

చిన్నతనంలో, తీగెలా ఉన్నపుడు సంతృప్తిగా కనిపించేదానివి.
బంగారు తీగెలా ఉండేదానివి, బంగారం కోసం అన్వేషిస్తూ మారిపోయావు.
ద్రాక్ష తీగె ఫలించకుండానే కుళ్లిపోతున్నదా!

నీవు నా భార్యవు. మనమిద్దరం సఖ్యతతో ఉంటే బాగుంటుంది.
భార్యాభర్తలు చెప్పుల జతలా ఒకేరకంగా ఉండాలి.
ఏ ఒక్కటి కాలికి బిగువైనా రెండూ పనికిరావు.
తోడేలు, సింహం కలిసి కాపురం చేయవు.

ఒంటెపై వేసిన సంచులు రెండు పక్కలా ఒకే బరువుండాలి.
నేను సంతృప్తిగా ఉన్నాను. నీవెందుకు ఇలా గోలపెడ్తున్నావు?

## భార్య సమాధానం

పెద్ద నీతులు చెబ్తున్నావు, నీ మాటలు నన్నిక మోసం చేయలేవు.
అంతా దొంగ మాటలే! వీటిలో ఒక్కటి నీవు పాటించడం లేదు.
ఈ అలంకార వాక్యాల వల్ల ప్రయోజనమేమిటి? ఫలితం ముఖ్యం గాని!
గర్వం చెడ్డది. అడుక్కునేవాడికి మరింతగా!
చలికాలంలో తడి చొక్కా తొడుక్కున్నట్లుగా!

సాలెగూడులాంటి ఇంట్లో ఉంటూ, చాలు ఆపు నీ హితబోధలు!
సంతృప్తికి అర్థం తెలుసా నీకు? నీకు తెలిసింది ఆ పదం మాత్రమే!
ప్రవక్త అన్నాడు– 'సంతృప్తి అంటే నిధి' అని; నీకు బాధకు లాభానికి తేడా తెలీదు.
సంతృప్తి అనేది ఆత్మకు సంబంధించినది. నీకు అది లేదు.
నన్ను నీ జత అనకు. నేను న్యాయానికి జతను, మోసానికి కాదు.

కుక్కలతో బొమికలకై పోట్లాడుతూ, వెదురు బొంగులా వదరుతున్నావు.
దోమల గొంతుల్ని నరుకుతూ, వీరుల పక్కన నడుస్తున్నాననుకుంటున్నావు.
నావేపు కోపంగా చూడకు. నన్ను నీ తప్పుల్ని చెప్పనీ!

నా గురించి నీకేమి తెలుసని, నా జ్ఞానాన్ని తక్కువగా అంచనా వేసావు?
తోడేలులా నాపై దూకకు, నీ గురించి నీవు తెలుసుకో!
నీవు అర్థం చేసుకున్నది పాములా, తేలులా విషపూరితమైనది.
దేవుడు నీ మోసాన్ని, వంచనను నశింపచేయును గాక!
నీ అజ్ఞానం మాకేవిధమైన హాని కలిగించకుండును గాక!

నీవు పామువు, పాములవాడివి; అరబ్బులలో అధముడివి!
కాకికి తన రంగు తెలిస్తే, దుఃఖంతో మంచులా కరిగిపోతుంది.
పాముమీద పాములవాడు, వాడిమీద పాము, ఇద్దరూ మంత్రగాళ్లే!
పాము ఎత్తు పారితే పాములవాడిని కాటు వేస్తుంది.
వాడి ఎత్తు పారితే పామలవాడికి బానిస అవుతుంది.
డబ్బుమీద ఆశతో పామును పట్టుకోవాలని వాడనుకుంటే
ప్రాణం మీద ఆశతో పాము తప్పించుకోవాలనుకుంటుంది.

దేవుడి పేరు చెప్పి పాములవాడు పామును మాయచేయబోతాడు.
పాము అంటుంది– 'పాములవాడా! నీవు మంత్రం వేసావు సరే!
నా మంత్రం విను! దేవుడి పేరుమీద నన్ను స్తంభింపచేసావు.
నీ తంత్రం కాదు! దైవనామం నన్ను నీ ఉచ్చులో పడవేసింది.
నా తరపున నిన్ను దేవుని పేరు ప్రతీకారం తీర్చుకుంటుంది.
నా దేహాన్ని, ఆత్మను నేను పరమాత్మకు అప్పజెబుతున్నాను.
అది నా కాటుతో నిన్ను చంపుతుంది లేదా జైలులో పడవేస్తుంది.

## పేదవాడి జవాబు

నీవు మనిషివా, మహా శోకదేవతవా? ఏమిటి నీ గోల?
పేదరికం నాకు గర్వకారణం. ఎందుకు నా నెత్తిమీద పదేపదే కొడ్తావు?
డబ్బూ బంగారం తలపై టోపీల్లాంటివి. బట్టతలను దాచేస్తాయి.
ఉంగరాల జుట్టున్నవాడికి టోపీతో పనేమిటి?

దైవసేవకుడు నేత్రం వంటివాడు. దృష్టి బయటకు కనిపిస్తేనే మేలు.
బానిసలనమ్మేవాడు వాళ్లనమ్మేప్పుడు బానిసలపై దుస్తులు తొలగిస్తాడు.
దానివల్ల లోపల ఉండే అవలక్షణాలు బయటపడ్తాయి.
అందుచేత అవవలక్షణాలున్న బానిసపై మంచి వస్త్రాలుంచుతాడు.
ఎందుకని నీవడిగితే, ఈ బానిసకు సిగ్గెక్కువ, నగ్నంగా ఉండలేదు.

బానిసల వ్యాపారికి అన్ని వ్యసనాలు ఉన్నాయి, డబ్బు వాటిని దాచేస్తుంది.
అతడి వేషభాషలు దర్పంగా ఉండి, ఇతరులను మోసపుచ్చుతాయి.

నాలాంటి పేదవాడు నిజం చెప్పినా అది గమ్యం చేరదు.
పేదరికం గురించి నీకర్థం కాలేదు. దానిని కోపంగా చూడకు!
సూఫీ సాధువులు నిరాడంబరంగా ఉన్నా, దేవుని దయ పుష్కలం వారికి.
దేవుడు కరుణామయుడు. అతడు పేదాసాదలను కరుణిస్తాడు.
కొందరికి శీతల హర్మ్యాలను, కొందరికి అగ్నిమంటలనెందుకిస్తాడు?
నీలో ఏదో దురాలోచన ఉన్నది, దానిని కాల్చివేయడానికే అగ్ని.
పేదరికం నాకు గర్వమంటే హేళన చేస్తున్నావు,
కోపంలో నన్ను అనేక పేర్లతో తిట్టావు.
మోసగాడన్నావు, పామునన్నావు, పాములు పట్టేవాడినన్నావు.
పాములు పట్టేవాడినయితే, దాని కోరలు పీకి, కాపాడుతున్నాను.
కోరలు పీకిన పామును తెలిసినవాళ్లెవరూ తలమీద కొట్టి చంపరు.
తన కోరలే తన శత్రువు. వాటిని పీకి దానిని మిత్రుడిగా చేస్తున్నాను.

నేను ఏ కోరికలూ కోరుకోలేదు. ఉన్నదాంట్లో తృప్తిగా ఉన్నాను.
చెట్టుమీద కూర్చుని గాలిమాటలెందుకు? నేలమీదకు దిగి మాట్లాడు.
నీవు గుండ్రంగా, గుండ్రంగా తిరుగుతుంటే ఇల్లు తిరుగుతున్నట్లుంటుంది.
తిరిగేది ఇల్లు కాదు, నీవేనని తెలుసుకో ముందు.

## అబుజాల్ – అహమ్మద్

'అబుజాల్' అనేవాడు 'అహమ్మద్' వంక చూసి ఇలా అన్నాడు–
'హషీమ్ సంతానంలో కల్లా ఇతడే అనాకారి, అయోగ్యుడు'–

అహమద్ అన్నాడు– 'నీవు చెప్పింది నిజమే, కాని అవసరం లేదు దానితో!'
అబుబకర్ అన్నాడు– 'తూర్పునైనా, పడమరనైనా సూర్యుడు ప్రకాశిస్తాడు!
అహమద్ అన్నాడు– 'నీవు చెప్పింది నిజం. ఈ శూన్యలోకంతో పనిలేని వాడివి నీవు'
అక్కడ ఉన్నవాళ్లు అడిగారు– 'ఇద్దరూ సత్యవాదులే అన్నావు, ఏ విధంగా?'–
అహమద్ అన్నాడు– 'నేను దివ్యహస్తంతో చేయబడినాను.
టుర్కులు, హిందూ దేశస్థులు వాళ్ల వాళ్ల దృష్టితో నన్ను చూస్తారు'
సూర్యుడు ఎర్రఅద్దంలో ఎర్రగా, నీలి అద్దంలో నీలిగా కనిపిస్తాడు కదా!

## పేదవాడు - అతడి భార్య

నన్ను మోసగాడినన్నావు. ముందు ఈ డబ్బు గొడవ నుంచి బయటపడు.
నాది వంచన కాదు, నాకున్నదంతా దేవుడి కరుణ, దానికై ఆరాటం.
కొన్నాళ్లు ఓపికపట్టు, పేదరికంలోని సుగుణాల్ని గమనించు.
దానిపై అసహ్యాన్ని విడనాడు. దానిలోని కాంతిని స్వీకరించు.

వేలాది ఆత్మలు సంతృప్తి వలన తేనె సముద్రంలో దుముకుతాయి.
దుఃఖించే లక్షలాది ఆత్మలు గులాబి రసం తాగుతాయి.
నీవు ఓపికతో శోధిస్తే నా హృదయవేదన అర్థమయ్యేది.
ఆత్మ అనే పాలసీసాలో పాలున్నా తాగేవాళ్లుండాలి కదా!
వినేవాళ్లు సావధానంగా వింటుంటే వక్తలో ఉత్సాహం పొంగుతుంది.
కొత్తవాళ్లు ఇంటికి వచ్చినపుడు, అంతఃపురస్త్రీలు బురఖాలో దాక్కుంటారు.
తెలిసినవాళ్లు వస్తే వాళ్లు, తమ మేలిముసుగు తొలగిస్తారు.
చూసేవాడి దృష్టినిబట్టే వస్తువు కనిపిస్తుంది.
చెవిటివాడికి మధుర సంగీతం వినిపించినా లాభమేముంది?
కస్తూరీ పరిమళాలను దేవుడు సృజించింది అర్హులకొరకే కదా!
దేవుడు భూమ్యాకాశాలను సృష్టించి మధ్యలో అగ్ని వెలుగులనుంచాడు.
నేలను జీవులకు, ఆకాశాన్ని దివ్యులకు వాసయోగ్యం చేసాడు.
అనాగరికుడు ఉన్నతుడికి శత్రువు.
మన క్రియలే మన స్థానాన్ని నిర్ణయిస్తాయి.
నీవే చెప్పు! ఏనాడైనా ఏ అంధుడికైనా సాయం చేసావా నీవు?

ఈ లోకమంతా జ్ఞానముత్యాలతో నింపినా ఒక్కటి ఏరుకోగలవా నీవు?
సరే! నేను చెప్పేది నీకు నచ్చకపోతే నన్ను వదిలేయి!
ఎందుకు నాతో పోట్లాడి శాంతిని చెడగొడతావు.
నిశ్శబ్దంగా ఉంటే సరే! లేకుంటే నేనే ఈ ఇల్లు వదిలి వెళ్తాను.

## క్షమాపణ కోరిన పేదరాలు

అతడి ఉగ్రరూపం చూసి ఆమె వలవలా ఏడ్చింది.
నిజానికి స్త్రీల కన్నీళ్లు ఆకర్షణకు ఆనవాళ్లు.

ఆమె అన్నది– ‘నేను ఒకటనుకుంటే నీవన్నది వేరేగా ఉన్నది.
నేను నీకు భార్యగా తగను, కాని, మనసా,వాచా నీ భార్యను.
పేదరికం నా హృదయాన్ని గాయపరచింది.
ఈ మాటలన్నీ నేనన్నది నీలో మార్పు వస్తుందని,
కష్టాల్లో నాకు తోడున్నావు. కాని మన దగ్గర పైసాలేదు.
నా ఏడుపు, పెడబొబ్బలన్నీ నీ సుఖం కోసమే!
దేవుడి తోడు! నీకు వ్యతిరేకంగా నేనేదీ తలచలేదు.
నీ కోసం ప్రాణాలైనా విడుస్తాను గానీ, నిన్ను విడువను.
నీ ఆత్మకు అంకితమైన నా ఆత్మ, నా ఆలోచనలు నీ ఆత్మకు తెలుసు.
నీ హృదయం, ఆత్మలో ఉండినవాడివి, చిన్న తప్పుకు నన్ను వదిలేస్తావా?
గుర్తు తెచ్చుకో, నేను విగ్రహంలా, నీవు ఆరాధకుడిగా ఉన్న రోజులు.
నీవేది ఆజ్ఞాపిస్తే అది క్షణంలో చేసిన దానిని.
నీకెలా ఇష్టమయితే అలా నడుచుకుంటాను.
ఎప్పటిలానే మనం హాయిగా ఉందాం! ప్రేమగా ఉందాం!
నీ రాజసం ముందు నేనెప్పుడూ ఇలా మృగంలా ప్రవర్తించానా?
నా మాటల్ని ఉపసంహరించుకుంటూ నీ క్షమను కోరుతున్నాను.
ఇది నా ఖడ్గం. ఇది నా కవచం. శిరసు వంచాను. నరుకు!
ఏదైనా చేయి, కాని నా నుండి విడిపోతాననవలదు.
నీ అంతరాత్మ నా గురించి మాట్లాడుతున్నదానిని అంగీకరించు.
దయ ఉంచు! నీ క్షమ నూరు జాడీల తేనెకన్నా గొప్పది.

అలా మాట్లాడుతూ అతడిని శాంతపరచబోయిందామె.
కన్నీళ్లన్నీ ఖర్చైనాక ఆమెవదనంలో ప్రశాంతత విరిసింది.
తన అందంతో అతడిని సేవకుడిని చేసుకున్న ఆ స్త్రీ
తానే సేవకురాలినని కన్నీళ్లతో ప్రకటిస్తే ఏమవుతుంది?
తన కోపంతో అతడి హృదయాన్ని కంపింపచేసిన ఆమె
తన దుఃఖంతో కాళ్లావేళ్లాపడితే ఫలితం ఏమవుతుంది?
తన తిరస్కారంతో అతడి హృదయాన్ని, ఆత్మను గాయపరచిన ఆమె
తాను తన దాసీనని లొంగుబాటు ప్రకటిస్తే ఏమవుతుంది?
తన క్రూరత్వం, నియంతృత్వం ఉచ్చులో మనల్ని బంధించిన ఆమె
ఇప్పుడు తానే బంధితురాలినని ఏడిస్తే ఏమిటి పర్యవసానం?

ప్రేమ, ఆప్యాయత ఇవన్నీ దైవ నిర్ణయాలే అయితే
వాటి నుంచి ఎలా తప్పించుకోగలవు నీవు?
ఆదాము, ఈవ్‌లు ఒకరికొరకు ఒకరు సృష్టించబడినట్లయితే
వారు ఎలా విడిపోతారు? ఎవరు విడదీయగలరు?

జాల్ కుమారుడు రుస్తుమ్, హంజాకన్నా గొప్పవీరుడే కావచ్చు,
కాని ప్రేమించిన యువతికి లొంగిపోలేదా!
ప్రవక్త కూడా ఎలుగెత్తలేదా ‘ఓ హుమాయ్‌రా ’ అని!
మంట పైబడిన నీరు మంటను ఆర్పివేయగలదు.
అదే నీరు పాత్రలో ఉంటే మంట దానిని ఆవిరి చేయగలదు.
బాహ్యంగా నీవు నీ భార్యపై అధికారం చెలాయిస్తున్నా
అంతరంగాన నీవే ఆమెకు బానిసవు.

ప్రేమ మానవులకున్న ప్రత్యేక లక్షణం.
అది జంతువులలో కొరవడింది. అందుకే అవి అతడికి సేవకులు.
అందుకే అంటారు– ‘జ్ఞానులు స్త్రీలచే పాలింపబడతారు.
అనాగరికులు తమ బలంతో స్త్రీలను పాలిస్తారు’
అనాగరికుల మనస్సులో బందీ చేయబడిన జంతువు ఉగ్రంగా ఉంటుంది.
దయాదాక్షిణ్యాలు, ప్రేమ, మమకారం ఇవేమి ఉండవు.
ప్రేమ, కరుణ మానవ లక్షణాలు; కోపం, కామం జంతు లక్షణాలు.

## లొంగుబాటు

చచ్చేముందు నియంత విచారపడినట్లు అతడు విచారపడినాడు.
అతడనుకున్నాడు– 'నేను నా ఆత్మతో విరోధాన్ని ఎందుకు తెచ్చుకుంటాను.
నా ఆత్మ శిరస్సును కాలితో తన్నగలనా?
ఖర్మకాలినప్పుడు కళ్లు కనిపించవు. కాలికి తలకు తేడా తెలీదు.
ఆ తరువాత మనసు దుఃఖిస్తుంది. అంగీని చింపుకుని ఏడుస్తుంది.

అతడన్నాడు– నేనిప్పటి వరకు అవిశ్వాసిని. ఇప్పుడు ముస్లిమును.
నేను తప్పు చేసాను. ఇంకా నీవు నన్ను తవ్వవద్దు.
దేవుడు కరుణామయుడు, ప్రేమమూర్తి.
విశ్వాసి, అవిశ్వాసి ఇద్దరూ అతడిని ప్రేమిస్తారు.
రాగి, వెండి రెండూ ద్రావకంలో కరిగిపోతాయి.

## మోసెస్ – ఫారో

ఇద్దరూ ప్రతిభావంతులే! వేర్వేరు దారుల్లో నడిచారు.
పగటిపూట మోసెస్ ఎలుగెత్తి ప్రార్థనలు చేస్తే
రాత్రిపూట ఫారో దుఃఖంతో విలపించేవాడు.
అతడనేవాడు– 'ఎందుకు ప్రభూ నాకీ సంకెళ్లు?
మోసెస్ కాంతివంతుడై ఉండగా, నాకెందుకీ చీకటినిచ్చావు?
అతడు చంద్రుడై వెలుగుతుంటే, నాకు గ్రహణమెందుకు?
ప్రభువుగా నన్ను ప్రజలు పొగిడి హర్షధ్వానాలు చేస్తున్నపుడే
గ్రహణమేర్పడుతున్నది. లోహధ్వనులు ప్రజలు చేస్తున్నారెందుకు?
ఒకే చెట్టు శాఖలం మేము! ఒకే అడవి నుంచి తేబడినాము!
ఒక దానికి నీ పాలన, పోషణ! రెండోదానికి నిర్దయాలంబన!
ఎందుకు నీ శక్తివంతమైన గొడ్డలి మమ్మల్నిలా వేరుగా చూస్తున్నది?

ఫారో తనలో అనుకున్నాడు–
రాత్రిపూట దేవుడి ముందు అంతగా విలపించే నేను
ఎందుకు మోసెస్‌ను చూడగానే ఆగ్రహంతో మండిపడ్తున్నాను?
పది పొరలున్న బంగరు పూతెందుకు అగ్నిముందు నల్లబడ్తున్నది?

నా దేహం, నా ఆత్మ, నా మనస్సు నా అధీనంలో లేవా?
ఎందుకు ఒక్కోసారి పెంకుగా, ఇంకోసారి గింజగా ఉంటున్నాను?

ఎందుకు నాకు మోసెస్‌తో ఈ కలహం?
ఈ కాంతిలో తేడాలేనా మా శత్రుత్వానికి కారణం?

సహజకాంతిలో ఉన్నపుడు వాళ్లిద్దరూ మిత్రులే!
ప్రేమ ఒకరిని కాంతివంతంగా, అసూయ ఇంకొకరిని నల్లగా మార్చినాయి.

కాంతిరహిత స్థితి నుంచి కాంతి వస్తుంది.
కాంతికి తన జన్మస్థానంపై కక్షలేదు.

గులాబికి ముల్లుతో, ముల్లుకు గులాబీతో తగవుంటుందా?
ఉనికి లేని స్థితి నుంచి 'ఉనికి' వస్తున్నప్పుడు
ఉనికి లేని స్థితి ఉన్నట్లే కదా!

ఫారోలో ఉన్న ద్వేషం, అవలక్షణాలు,
అతడికి మోసెస్‌పై ఉన్న అసూయ వలన వచ్చాయి.

## వేదాంతి

'ఒక వేదాంతి 'ఆకాశం గుడ్డులాంటిది,
దానిలోని పచ్చసొన వంటిది భూమి' అని వాదించేవాడు.
కొందరడిగారు– 'అట్లయితే భూమి గాలిలో దీపంలా ఎలా ఉంది?
వేదాంతి అన్నాడు– ఆరువేపుల్నుంచి వచ్చే ఆకర్షణ భూమిని స్థిరంగా ఉంచింది.
చుట్టూ అయస్కాంత క్షేత్రం. మధ్యలో ఉన్నది భూమి'

పృచ్ఛకుడడిగాడు– 'స్వచ్ఛమైన ఆకాశానికి, నల్లని ఈ భూమితో ఏం పని?'
వేదాంతి సమాధానమిచ్చాడు– 'అది ఆకర్షణ కాదు వికర్షణ!
ఆరు దిక్కులనుంచి వికర్షణాబలాలు భూమిని మధ్యలో ఉంచాయి'–

ఫారోల దుఃఖస్థితికి కారణం సాధువుల నిరాదరణ.
అన్ని ప్రపంచాలు వాళ్లను తిరస్కరించగా వారికేది దారి?

నీవు దైవసేవకులను చూసి మొహం తిప్పుకుంటే
వాళ్లూ నీ ఉనికిని పూర్తిగా విస్మరిస్తారు.

వారి దగ్గర గుగ్గిలం లాంటి పచ్చరాయి ఉంటుంది.
అది నీ మనస్సును దేవునివేపు మళ్లిస్తుంది.

సాధువులతో పోలిస్తే నీకు జంతు ప్రవృత్తి ఉంటుంది.
మానవత్వాన్ని అవలంబించుకున్నాక నీకు జ్ఞానం వికసిస్తుంది.

ప్రవక్త– 'సేవకుల గురించి చెప్పింది పఠించు'–

నీవు ఒంటెవు. నీ జ్ఞానం ఒంటెను నడిపేవాడి వంటిది.
జ్ఞానులు ఒంటెను నడిపే జ్ఞానాన్ని నడుపుతారు.
వారిని చూడు. ఒక్కొక్కరు వేలాది మందిని ప్రభావితం చేస్తారు.
ఒంటెను నడిపేవాడికి మార్గదర్శకుడెవరు?

రాత్రికి మేకు కొట్టబడిన ప్రపంచం పగలు మేలుకుంటుంది.
సూర్యుడు గొర్రెతోలు కప్పుకున్న సింహంలా విజృంభిస్తాడు.

గడ్డిచే కప్పబడిన సముద్రమిది. అనుమానంతో అడుగు వేయకు.
అనుమానమనేది మూర్ఖులకు సహజం. మార్గదర్శికి అది వరం.
ప్రతి ప్రవక్త ఈ లోకంలోకి ఒంటరిగానే అడుగుపెట్టినాడు.
కాని అతడిలో కానరాని లోకాలు నూరున్నాయి.
తన చిన్న శరీరంతో బ్రహ్మాండాన్నే మంత్రముగ్ధం చేసాడు.
మూర్ఖులు అతడిని ఒంటరివాడిగా, బలహీనుడిగా ఆక్షేపించారు.

## సాలిహ్ – ఆడ ఒంటె

సాలిహ్ ఆడ ఒంటెను ఆ తెగవాళ్లు చంపివేసారు.
నీళ్లకోసం వాళ్లు నిర్దాక్షిణ్యంగా నరికి ఆకలిదప్పులు తీర్చుకున్నారు.
దేవుడి ఒంటెను చంపి వాళ్లు దైవదూరులయ్యారు.
మంచివాళ్ల దేహాల్లా ఆ ఒంటె ఇప్పుడు దుర్మార్గుల పాలిట మృత్యువైంది.
ఒంటెను చంపిన పాపం ఆ పట్టణానికి శాపమైంది.

ప్రవక్తల ఆత్మలు సాలిహ్ వంటివి. దేహం ఆడ ఒంటె!
ఆత్మ పరమాత్మతో కలుస్తుంది. దేహం కష్టాలకు లోనౌతుంది.

సాలిహ్ ఆత్మకు కష్టాలుండవు. ఒంటె భరించింది దెబ్బల్ని
ముత్యంకు దెబ్బ తగలదు. ముత్తెపుచిప్ప పగుల్తుంది దెబ్బలకు.
దేవుని కాంతి అవిశ్వాసుల హస్తాలచే కప్పివేయబడదు.
ఈ దేహాన్ని బంధించడం అతడిని బాధించడమే
ఈ కూజాలోని నీరు ఆ నదిలో కలుస్తుంది.
దేవుడు ప్రవక్తల దేహాల ద్వారా ప్రపంచానికి ఆశ్రయమౌతాడు.
ఒంటెను సేవించు! తద్వారా దేవుని కరుణను పొందుతావు.

సాలిహ్ తన ఒంటెను చంపిన 'థాముద్' ప్రజలతో అన్నాడు.
–మూడు రోజుల్లో దేవుడి ఆగ్రహం మిమ్మల్ని చుట్టుముట్టుతుంది.
మూడు రోజుల్లో మీకు మూడు సూచనలందుతాయి.
మొదటిరోజు మీ ముఖాలు కుంకుమ పసుపుగా ఉంటాయి.
రెండవరోజు యూదా చెట్టు పూల ఎరుపుకు మారుతాయి.
మూడవరోజు బొగ్గులా నల్లబడ్తాయి. అదే మృత్యువు రాక!
మీరు ఈ శాపం నుంచి బయటపడాలనుకుంటే
ఆ ఒంటెపిల్లకై వెదకండి, అది కొండల్లోకి పోకమునుపే!
దానిని పట్టుకోగలిగితే మీకు ఉపశాంతి కలగవచ్చు
లేకుంటే ఆశావిహంగం మెడచుట్టూ ఉచ్చు బిగుస్తుంది.
వాళ్లు ఆ ఒంటెపిల్ల కోసం పరుగులెత్తారు. అది కొండల్లో అదృశ్యమైంది.

సాలిహ్ అన్నాడు– మీ కథ పూర్తయ్యింది. విధి నిర్ణయం తప్పదు.

ఒంటెపిల్ల అంటే ఏమిటి? మీ హృదయాల్లో కలిగే పరివర్తన.
చేసేదేం లేక వాళ్లు, వచ్చినాక చూద్దాంలే అనుకున్నారు.

మొదటిరోజు వాళ్ల ముఖాలు పసుపుగా మారగానే నిరాశ చెందారు.
రెండవరోజు ఎరుపురంగుకు మారగానే ఆశను కోల్పోయారు.
మూడవ రోజు ముఖాలు నల్లబడగానే మోకాళ్లపై కూలబడినారు.
దైవాగ్రహం పిడుగుల్లా థాముడ్ నగరాన్ని ధ్వంసం చేసింది.

సాలిహ్ తానున్న చోటు నుంచి వచ్చి నగర విధ్వంసాన్ని చూసాడు.
ఆ ధూర్తుల శవాల నుంచి, ఎముకల నుంచి మూల్గులు వినిపించాయి.
వాళ్ల ఆత్మల నుంచి రక్తకన్నీరు వడగళ్లలా కనిపించింది.

అతడు వాళ్లకై అనేకమార్లు విలపించాడు.
'నేను మీకోసం దేవుని ప్రార్థించాను'–
దేవుడన్నాడు– 'ఓపిక వహించు! వారి సమయమాసన్నమైనది'–
నేను దేవుడితో అన్నాను– 'వారికెన్నోసార్లు హితబోధ చేసాను.
ప్రేమక్షీరం వారు నన్ను పెట్టిన బాధలకు పెరుగులా గడ్డకట్టింది'–
దేవుడన్నాడు– 'నీ గాయాలపై లేపనం వ్రాస్తాను. కట్టుకడ్తాను!'–

దేవుని కరుణతో నా బాధలు ఉపశమించినవి.
మీతో మాట్లాడిన ప్రతిమాటకూ పాలు, తేనె కలిపాను.
మీరు వాటిని విషప్రాయంగా భావించారు.
ఎందుకంటే మీరు విషంతో నిండి ఉన్నారు గనుక.

మీ వలన నాకు ఎల్లప్పుడూ దుఃఖమే కలిగింది.
ఆ దుఃఖం నశించినందుకు నేనెందుకు దుఃఖించాలి?–
అలా అనుకున్నా అతడిలో ఏదో కరుణ భావం మెదిలింది.
మరల దుఃఖిస్తూ, కన్నీరు వరదలా కారుస్తుంటే ఆత్మ అన్నది–

–'ఎందుకు విలపిస్తున్నావు? ఈ విధ్వంసాన్ని చూసా?
వారు పెట్టిన బాధలకా లేక వారి వినాశనాన్ని చూసావు గనుకా!
తుప్పుపట్టిన వారి ఎదల గురించా? వారి పాము నాల్కల గురించా?
వారి విషపూరితమైన ఊపిరి గురించా? వారి కోరల గురించా?
తేలు కొండెల్లాంటి వారి నేత్రాలు, నోళ్లు గురించా?
వారిని సర్వనాశనం చేసినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపు.
వారి చేతులు, కాళ్లు, నాలుక, చూపులు అన్ని విషపూరితాలే కదా!
వారి ప్రేమ, శాంతి, ఆగ్రహం అన్నీ విషమయమే కదా!
పూర్వాచారాల పాలన కోసం వాళ్లు సత్యానికి సమాధి కట్టారు.
సత్యాన్వేషకులను కాదని స్వార్థాన్ని నమ్ముకున్నారు.
అందుకే దేవుడు వాళ్లకు నరకాగ్నిని రుచి చూపించాడు.

## రెండు సముద్రాలు

నరక స్వర్గాలకు పోవాల్సినవాళ్లిరువురూ ఒకేచోట ఉంటారు.
వారిద్దరి మధ్య ఉన్న అడ్డుగోడను వాళ్లు దాటాలనుకోరు.
అగ్ని, వెలుతురు ప్రజల మధ్య క్వాఫ్ పర్వతాన్నుంచాడతడు.
వాళ్లను గనిలో మట్టి, స్వర్ణం కలిసి ఉన్నట్లు ఉంచినాడు.
వారి మధ్య వంద ఎడారులు, వంద బిడారి ఆశ్రయాలుంచినాడు.
హారంలో ముత్యాలు, రంగురాళ్లు కలిసి ఉంటాయి.
ఒక్కరాత్రి అతిధుల్లా అవి విడిపోతుంటాయి.
ఒక సగం ఇక్షుసముద్రం, మరో సగం విషసముద్రం.
ఒక సగం వెన్నెలలా తెల్లన, మరో సగం తారులా నల్లన.
రెండూ కలిసిన చోట అలలపై అలలు కొట్టుకుంటూంటాయి.
శాంతి, యుద్ధాలలో ఆత్మలు కలిసుండే సరిహద్దు అది.
శాంతి తరంగాలు ఒకదానిని ఒకటి ఢీకొని ద్వేషాల్ని నిలువెత్తున పెంచుతాయి.
యుద్ధపుటలలు గుద్దుకుని ఛిన్నాభిన్నమై నశిస్తాయి.
ప్రేమ, ద్వేషతరంగాలను స్నేహ తరంగాల వేపు మళ్లిస్తుంది.
ఎందుకంటే సత్ప్రవర్తన పునాదిపై ప్రేమ నిర్మించబడింది.
ఆగ్రహం, స్నేహతరంగాలను ద్వేషపుటలల వేపు తీసుకుపోతుంది.
అది చెడుబుద్ధి ఇటుకలలో నిర్మించబడింది కనుక,
తీపి, చేదు, ద్వేషం, స్నేహం ఇవన్నీ మామూలుగా కనిపించవు.
ఆఖరి నేత్రానికి అవి స్పష్టంగా కనిపిస్తాయి.
సత్యనేత్రం అంతర్నేత్రం. మాయానేత్రం బాహ్యనేత్రం.

జ్ఞానికి నిజం వెంటనే తెలుస్తుంది. సాధారణుడికి ఇంద్రియాలవసరం.
సాధారణుడు రుచిచూసి ఉమ్మేయడానికి ప్రయత్నిస్తాడు.
కొందరికి అది గొంతులోకి, కొందరికి శరీరమంతా వ్యాపిస్తుంది.
కొందరికి అది విసర్జించబడేప్పుడు విపరీతమైన బాధనిస్తుంది.
అదే వాళ్లకు అనుభవపాఠమౌతుంది.

కొందరికి అది రోజుల్లో నెలల్లో లభ్యమైతే
కొందరికి అది మరణానంతరం, సమాధిలో దొరుకుతుంది.

పునరుత్థానం రోజున కొందరికి అది అందుతుంది.
మధుర పదార్థాలు అందరికీ ఏదో నియమిత దినం నాడు లభిస్తాయి.

కెంపుకు తగిన కాంతి శోభ రావడానికి ఎన్నోఏళ్లు పడ్తుంది.
కూరగాయలకు రెండు నెలలు, గులాబికి సంవత్సరం కావాలి.
ఆ రకంగానే దేవుడు వాటికి నియమిత కాలాలనిచ్చినాడు-

ఈ సంభాషణ మీరు విన్నారు. ఇది జీవజలం!
ప్రతి అక్షరాన్ని మీ ఎదలో ప్రతిష్ఠించుకోండి!
ఒక్కోసారి దైవసంకల్పంచే విషం కూడా మందులా పని చేస్తుంది.
విషం ఆత్మను కాల్చేసినా, దేహానికి అమృతంగా పనిచేసింది.
లేత ద్రాక్షలో రసం చేదుగా ఉంటుంది. పండాక మధురమౌతుంది.
ద్రాక్షాపాత్రలో అది చేదుగా ఉన్నా, వినిగార్‌గా తియ్యనౌతుంది.

## సంపూర్ణత్వ సిద్ధి

సాధువుకు విషం విరుగుడవుతుంది. సామాన్యుడికి పిచ్చెక్కిస్తుంది.
సులేమాన్ దేవుడినడిగాడు- 'నాకొక్కడికే ఈ రాజ్యాన్నివ్వు!
ఇంకెవ్వరికీ ఇటువంటి అవకాశాన్నివ్వకు!'

పైకి ఇది స్వార్థపూరితమైన కోరికగా కానవస్తుంది.
కాని సులేమాన్ రాజరికంలోని ఆపదలను చూసినాడు.
అనేక ఆపదలు, క్షణక్షణం మృత్యుభయం!
మతానికి, హృదయానికి, శిరానికి ప్రతిక్షణం ఏ దెబ్బ తగుల్తుందో!
ఈ అసంఖ్యాకమైన ఆపదలనెదుర్కొనే గుండెధైర్యం కావాలి!
అంత ఆత్మశక్తి ఉన్నవాడిని కూడా, రాజ్యభారం ఉక్కిరిబిక్కిరి చేసింది.
దుఃఖపు ధూళి పేరుకుంటున్నా, అతడు దయతో పాలించినాడు.
దేవుని ప్రార్థించినాడు- 'ఈ రాజ్యాన్ని నీ వనుకున్నట్లుగా నాకివ్వు'-
ఒక సంపూర్ణ స్థితిగల రాజ్యాన్ని నీ సేవకుడికివ్వు. నేనే ఆ సేవకుడిని'-
నాకు పోటీదారు ఉండరాదు. మరొకరితో పంపకాలు వద్దు.

## పేదవాడు–భార్య–నీతి

పేదవాడు, భార్య పోట్లాట ఆత్మ, దేహాల తగాదా!
నేలపై నిర్మిత గృహాల్లో ఈ గొడవలు సర్వసాధారణమే!
భార్యకు ఇంటి అవసరాలు, పేరు ప్రతిష్ఠలు, గొప్పలు అవసరం!
దేహమూ అంతే! దానికి కావాలి పోషణ, ఇంద్రియసుఖం!
ఒక్కోసారి లొంగుబాటు, మరోసారి తిరుగుబాటు దాని లక్షణం.

దైవప్రేమలో మునిగిన ఆత్మకు వీటిపై పట్టింపు లేదు.
ఆ భార్యాభర్తల గొడవ గురించి నీకేమి అర్థమయ్యింది.
ఎవరు గెలిచారు? అంతిమంగా ఎవరు ఓడిపోయారు?
అది ఎర, ఉచ్చును తెలియజేస్తున్నది కదా!

ప్రేమ అనేది భౌతిక పదార్థమైతే దానికి ప్రార్థన అవసరం లేదు.
ఇద్దరి మధ్య ప్రేమ ఒసగే బహుమతి స్పందన.
అది బాహ్యంగా వివిధ వర్ణాలలో కనిపిస్తుంది.
మధువుతో మత్తెక్కిన వాడి ప్రవర్తనను;
పుల్లపెరుగు తాగి తూలేవాడికి తేడాను గమనించు.
వంచకుడు బయటకు నియమనిష్ఠలతో ప్రార్థన చేస్తున్నట్లుంటాడు.
అతడి నటనలన్నీ తాత్కాలికం. వాటివల్ల ప్రయోజనం శూన్యం.
దేవుడు మనకు యుక్తాయుక్త విచక్షణ నిచ్చును గాక!

## పేదవాడి లొంగుబాటు

ఆ పేద అరబ్బు తన భార్యతో అన్నాడు–
–'నేనిప్పుడు నిన్ను వ్యతిరేకించడం లేదు. నీ కత్తి దూయి!
నీవు చెప్పిన పని చేస్తాను. మంచో చెడో తెలియనీ!
ప్రేమికుడిలా నీ ముందు గుడ్డి చెవిటివాడినవుతాను.

అతడి భార్య అణుకువగా అన్నది–
–'నీవు స్నేహితుడివా! లేక అలా నటిస్తూ రహస్యశోధన చేస్తున్నావా?'

అతడన్నాడు– 'ధూళి నుంచి ఆదామును చేసిన వాడిపై ఒట్టు!
మూడు క్యూబిట్ల ఫలకంపై సమస్తాన్ని లిఖించిన వాడిపై ఒట్టు!
ఆదాముకు జ్ఞానాన్ని నేర్పిన మహాగురువుపై ఒట్టు!
దేవదూతలకు తన కాంతులను విడమర్చినవాడిపై ఒట్టు!
ఆదాముకు కనిపించిన దేవుడు, దేవదూతలకు భిన్నంగా కనిపించినాడు.
స్వచ్ఛమైన ఆత్మ కలిగిన ఆదాముకు ఏడు స్వర్గాలు ఇరుకుగా కనిపించాయి.
ప్రవక్త చెప్పలేదా– దేవుడు చిన్నా పెద్దా పాత్రలతో కొలువబడడు!
ఈ లోకాలేవీ అతడి పరిమాణాన్ని ఊహించలేవు.
అనంత పరిమాణమున్న అతడు, భక్తుడి చిన్నగుండెలో ఇమిడిపోతాడు.
అతడి సేవకుడిగా స్వర్గంలోని విశ్వరూపాన్ని చూడగలవు.

దేవదూతలు ఆదాముతో అన్నారు–
ఇంతకుముందు నేలపై నీతో మాకు పరిచయమున్నది.
అక్కడ మేము దైవార్చనకు బీజాలు జల్లినాము.
మేమనుకున్నాము– కాంతికి, ఈ చీకటికి గల సంబంధమేమిటి?
కాంతి, చీకటితో కలిసి ఎలా జీవించగలదు? ఓ ఆదాం!
నీ వల్లనే మాకూ నీకూ అనుబంధాలేర్పడినాయి.
నేలకు స్వర్గానికి మధ్య రాకపోకలు ప్రారంభమైనాయి.
మా కాంతి ఈ నేలపైన ప్రతిఫలించడానికి కారణం నీవు.
మమ్మల్ని దేవుడు ఈ చీకటి నేలపైకి పొమ్మన్నపుడు దుఃఖించాము.

దేవుడినడిగాము– 'ఓ ప్రభూ! నీ అద్భుత కాంతిలో ఈదులాడే మేము
ఆ చీకటి గుయ్యారంలో ఎలా ఉండగలం?–

దేవుడన్నాడు– 'తండ్రి ముందు చిన్నపిల్లాడిలా నీవలా అడగవచ్చు!
నా అనంతమైన కరుణ అలల్లా వస్తూనే ఉంటుంది.
నీకు నేలపై కనిపించేది దేవుడి ప్రతిరూపాలు
వాటిలో కనిపించే బేధాలు, వాటి స్వేచ్ఛా ప్రవర్తనలోని లోపాలు.
నా ఆగ్రహ కరుణా తరంగాలు సముద్రపుటలల్లా వస్తూ పోతుంటాయి.
మానవుని కరుణ ముత్తెపుచిప్ప. దైవకరుణ ఆణిముత్యం.
సముద్రపు అలలు తీరాన్ని తాకి నురగను తుంపరలనిస్తాయి.

పేదవాడు భార్యతో అన్నాడు–
–"వాటి సాక్షిగా నేను చెబుతున్నాను, నా మాటలలో వంచన లేదు.
నేను నిన్ను పరీక్ష చేయడం లేదు. కావాలంటే నీవే పరీక్షించు.
నీవు నీ రహస్యాలు విప్పు! నేను నా రహస్యాలు చెబుతాను.
చూడు! నా ఆత్మ ఎలా ఘోషిస్తున్నదో!"–

## ఆమె సూచనలు

సూర్యుడు ఉదయించినపుడు జగత్తంతా కాంతిమయమవుతుంది.
కరుణామయుడు, సృష్టికర్త, ఆతడి దయ వలనే ఈ 'బాగ్దాద్' వసంతశోభ.
ఆ ప్రభువు వలననే నీవు రాజువవుతావు, నీ దురదృష్టం తీరుతుంది.
అదృష్టవంతులతో స్నేహం అమృత సమానం. వారి చూపులు సిరుల తూపులు.
అహమ్మద్ చూపు అబుబాకర్‌పైన ఆగింది.
అబు బాకర్ విశ్వాసం అతడిని ప్రభువుగా చేసింది.

ఆమె భర్త అడిగాడు– 'రాజు వద్దకు వెళతాను సరే? ఏమి అర్థించను?'–
వట్టి చేతులతో వెళ్లలేను కదా! మనవద్ద ఏమున్నది?
లైలా అనారోగ్యంగా ఉన్నదని విని మజ్నూ దుఃఖించాడు–
ఆమె వద్దకు ఏ నెపంతో పోను? వెళ్లకపోతే నేనేమైపోతాను?
ఆమె బాధలో ఉన్నపుడు కూడా చూడకపోతే నా జీవితమెందుకు?
నేనే మంచి వైద్యుడినయితే ఏ అడ్డంకీ లేకుండా ఆమెను చూసేవాడిని.
దేవుడన్నాడు– 'మీరిటురండి'– మనలోని సిగ్గును తొలగించడానికి
గబ్బిలాలు సూర్యకాంతిని తట్టుకోగలిగితే, పగటి వెలుతుర్ని ఆనందించేవి!'

ఆమె అన్నది– రాజు మైదానంలోకి వచ్చినపుడు అశక్తత శక్తి అవుతుంది.
భౌతిక దేహానికి కానరాని శక్తి అంతర్లోకంలో ఆత్మకు కనిపిస్తుంది.
అతడన్నాడు– నా పేదరికాన్ని అతడి ముందు ఎలా ప్రదర్శించను?
దానిని చూడకుండా అతడు నాకెలా సాయం చేయగలడు?
వట్టిమాటలు, ప్రదర్శనల వల్ల ఏమిటి ఉపయోగం?
ఆ న్యాయాధిపతి ముందు ఏ నటనా చెల్లదు కదా!
రాజు వద్దకు ఏదైనా బహుమతి తీసుకువెళ్తాను.
అది నా పేదరికాన్ని ప్రభువుకు ప్రస్ఫుటం చేయునుగాక!

# వాననీరు

అతడి భార్య అన్నది– 'పాత్రలో వాననీరు ఉన్నది. అది నీ స్వంతమే!
అది తీసుకువెళ్లి రాజుకు చూపించు. అతడర్థం చేసుకుంటాడు.
అతడి కోశాగారం నిండా మణిమాణిక్యాలుండవచ్చును గాక!
కాని, ఇంత స్వచ్ఛమైన నీరు, నగరిలో ఎక్కడ దొరుకుతుంది?
ఆ మట్టిపాత్ర మన దేహం. వాననీరు మన ఇంద్రియాలు.
ఆ పాత్రకు అయిదు మూతులున్నవి. అవే ఇంద్రియాలు.
దీనిని కల్మషాల్నుంచి దూరంగా ఉంచాము.
ఈ పాత్ర నుంచి సముద్రానికి దారి ఉంటే నీరు అటు చేరుతుంది.
కాబట్టి ఈ నీళ్ల కూజాను రాజు దగ్గరకు తీసుకువెళ్లు.
అతడు దానిని కొని సరైన మూల్యం చెల్లిస్తాడు.
అతడి హస్తస్పర్శతో అది అక్షయపాత్ర అవుతుంది.
నూరు లోకాలకు సరిపడా నీటిని అది అందిస్తుంది.
దాని మూతుల్ని మూసి పాత్రను నీటితో నింపు.
దేవుడు వచించినట్లు కోరికల నుంచి నీ కళ్లను మూసివేయి.

పాపం! ఆ పేద అరబ్ రాజుకు తగ్గ బహుమతి అనుకున్నాడు.
కాని బాగ్దాద్ నగరానికి వెళ్లేదారిలో తియ్యని నీరున్న ఏరు ఉంది.
అది నగరం గుండా ప్రవహిస్తూ, పడవలతో, చేపలతో నిండి ఉంటుంది.
ఈ విషయం అరబ్ భార్యకు తెలీదు. అరబ్బుకూ తెలీదు.

ఆమె ఆ నీళ్ల కూజాను గట్టి గుడ్డలో చుట్టి మూతిని మూసింది.
భర్తకిచ్చి ఆ బహుమతిని ప్రభువుకు సమర్పించమన్నది.
ఉప్పునీళ్లు తాగే పక్షికి స్వాదుజలమెక్కడుందో ఎలా తెలుస్తుంది?
షాట్, జాహున్, యూఫరెటిస్ ఎక్కడ ఉన్నాయో ఎలా తెలుస్తాయి?
భౌతిక వాంఛలతో సతమతమయ్యేవాడికి
ఆత్మ అంతర్ధానం, విస్మృతి, విస్తృతి గురించి తెలియదు కదా!
అక్షరమాలలో అక్షరాలు పిల్లలకు కంఠతా వస్తాయి.
కాని వాటి అసలైన అర్థం వాళ్లకు తెలీదు కదా!

ఆ పేదవాడు నీళ్ల కూజాను తీసుకుని రేయింబవళ్లు నడిచాడు.
ఎడారి నుంచి నానా కష్టాలు పడి బాగ్దాద్‌కు తీసుకువచ్చాడు.
అతడి భార్య దేవుడిని అనేక విధాలుగా ప్రార్థించింది.
–'ప్రభూ! ఆ బహుమతిని కాపాడు! ఆణిముత్యం లాంటిదది.
నా భర్త తెలివైనవాడే గాని, దొంగలు వేలాదిగా ఉన్నారు.
కాథార్ ఎడారి నీరు, మంచిముత్యమంత విలువైనది.
ప్రభూ! దేవుడా! అతడికే ఆపదా రాకుండా రాజధాని చేరేట్లు చూడు!'–

ఆమె ప్రార్థనలు, అతడి జాగ్రత్త మొత్తానికి భద్రమే ఆ బహుమతి.
ఏ రాళ్లదెబ్బలూ, దొంగల దోపిడీ కాకుండా బాగ్దాద్ చేరుకున్నాడు.
రాజు కొలువులో అంతా కోలాహలమే! అర్థులు వస్తున్నారు.
రాజును మొక్కి ధనంతోనో, పదవితోనో హాయిగా పోతున్నారు.
ఎండా, వానలా, స్వర్గంలా, మంచీచెడుల మిశ్రమంగా ఉన్నదది.
కొందరు బహుమానాల్ని స్వీకరిస్తున్నారు, కొందరు వేచి ఉన్నారు.
సులేమాన్ నుంచి చీమ వరకూ పెద్దా, చిన్నా, గొప్పా, పేద
పునరుత్థాన దినం నాడు మోగే బాకా పిలుపు కోసం వేచిచూస్తున్నట్లు
ముత్యాల వలలో చిక్కుకున్నవాళ్లు, సత్యదర్శనమైనవాళ్లు
ఏ ఆశా లేనివాళ్లు కొందరు, గంపెడాశతో వచ్చినవాళ్లు మరికొందరు.

## దాత–గ్రహీత

అతడి చెవుల్లో ఏదో పిలుపు! గ్రహీతా! నీ వంతు వచ్చింది!
అద్దం వలన అందం ఇనుమడించినట్లు, దానం వలన దాతృత్వం శోభిస్తుంది.
దాతృత్వానికి అడుక్కునేవాడు అద్దం లాంటివాడు.
అందుకే– 'భిక్షకుడిని తరిమివేయకు'– అన్నాడు దేవుడు అహమ్మద్‌తో
దాతృత్వానికి భిక్షుకులు అద్దం లాంటివాళ్లయితే,
ఊపిరి అద్దాన్ని మసకబారుస్తుంది.
భిక్షుకులు రెండు రకాలు– సామాన్యులు, సాధువులు.
ఈ ఇద్దరూ కానివాళ్లు చచ్చినవాళ్లతో సమానులు.
దివ్యసభలో లేనివాడు, వస్త్రంపై చిత్తరువు లాంటివాడు.

## సాధారణుడు-సాధువు

దేవుని కొరకు తపించనివాడు సాధువు వేషంలో ఉన్న సాధారణుడు.
అతడు చిత్రంలోని బొమ్మ వంటివాడు. కుక్కబొమ్మకు రొట్టెతో పనేమిటి?
కొందరికి రొట్టె కావాలి! వారికి దేవుడిపై తపన లేదు.
రొట్టెమాత్రమే కావాలనుకునేవాడు చెరువులో చేపలాంటివాడు.
వాడికి సముద్రమక్కరలేదు. దైవప్రేమ అక్కరకు రాదు,
స్వార్థపూరితమైనది వాడి ప్రేమ. అవసరం వచ్చినప్పుడే దేవుడు కావాలి.
దైవత్వంలో లీనం కావడానికి కాక, దైవత్వం నుంచి ఆశిస్తూ వాడున్నాడు.
తన ఆలోచనలనే ప్రేమించేవాడికి, దేవుని మహిమ ఎలా తెలుస్తుంది?
హ్రస్వదృష్టి గల మనస్సులు అనేక దుష్ట ఆలోచనలనిస్తాయి.
అందరికి వినికిడి ఒకేరకంగా ఉండదు. అత్తిపండు అన్ని పక్షులకూ ఆహారం కాదు.
చచ్చి వాసనకొడ్తున్న పక్షికి, పక్కన ఎన్ని పండ్లున్నా ఏం లాభం?
బొమ్మలో ఉన్న చేపకు చెరువైనా, సముద్రమైనా ఏం లాభం?
హిందూ దేశపువాసికి సబ్బుకూ, నల్ల ద్రావకానికి తేడా ఏం తెలుసు?
బొమ్మను దుఃఖంగా చిత్రించినంతమాత్రాన కన్నీళ్లు కార్చదు కదా!
సంతోష దుఃఖాల రేఖలు కాగితంపై అర్థవంతంగా ఉండవచ్చు.
కాని, హృదయంలో లిఖించబడని దుఃఖ సంతోషాలకు విలువలేదు కదా!
దుస్తులను చూసి వ్యక్తిని నిర్ణయించడం, చిత్రాన్ని చూసి అంచనా వేయడం.
దేహానికి ఆత్మ గురించి తెలియదు. వస్త్రాలకు దేహం గురించి తెలియదు.

## ఖలీఫా ఉద్యోగులు – పేద అరబ్బు

ఖలీఫా రాజభవనం ద్వారం వద్దకు చేరుకున్నాడు అరబ్బు.
రాజోద్యోగులు అతడిని ఆహ్వానించారు. గులాబీ నీళ్లు జల్లినారు.
అతడు వచ్చిన పని గ్రహించినా, ఆచారం ప్రకారం అడిగారు–
–'ఓ అరబ్బుల నేతా! ఎడారి నుంచి ఇంత ప్రయాసతో ఎందుకు వచ్చావు?'
అతడన్నాడు– 'ప్రభువు దయ తలిస్తే నేను రాజునే! లేకుంటే పేదను!
మీ దర్శన భాగ్యమే నాకు జాఫర్ స్వర్ణంతో సమానం.
నేను మామూలు లోహం వంటివాడిని, ప్రభువు చూపు నన్ను బంగారాన్ని చేస్తుంది.

నేను సుదూరపు ఎడారి నుంచి సుల్తాన్ కరుణనపేక్షించి వచ్చాను.
అతడి దయ గురించి మా ఎడారి ఇసుక రేణువులకు కూడా తెలుసు.
నేను యాచించడానికి వచ్చాను. కాని ఈ సౌభాగ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాను.
రొట్టె కొనడానికి దుకాణానికి వెళ్లి, అమ్మేవాడి అందానికి దాసుడైనట్లు,
గులాబీలు చూడటానికి పోయి, తోటమాలిని చూసి తన్మయుడైనట్లు,
నీళ్లు తోడుకోవడానికి వెళ్లిన అరబ్బు, జోసెఫ్ అందానికి ధన్యుడైనట్లు,
అగ్ని తేవడానికి వెళ్లిన మోసెస్, అగ్నిపొదను చూసి విస్మయుడైనట్లు
శత్రువుల నుంచి తప్పించి జీసస్‌ను జలధార, నాల్గవ స్వర్గానికి తీసుకు వెళ్లినట్లు,
ఆకర్షించే జ్ఞానఫలం తిని ఆదాము, మానవజాతికి ఆద్యుడైనట్లు,
ఆహారం కోసం వచ్చిన డేగ, ప్రభువు కుడిచేతిపై వాలినట్లు,
చదువుకోడానికి వెళ్లిన విద్యార్థి, బహుమతి సంపాదించినట్లు,
పగ తీర్చుకోడానికి వచ్చిన అబ్బాస్, అహమ్మదుకు అనుచరుడైనట్లు,
నేను ఇక్కడకు ధనం యాచించవచ్చాను. నేనిప్పటికే ధనవంతుడినయ్యాను.
రొట్టెకోసం నీటిని కానుకగా తెచ్చాను. ఇక్కడ ప్రభువుగా పలకరించబడినాను.
ఆహారం ఆదామును స్వర్గచ్యుతుణ్ణి చేసింది;
ఆహారం నన్ను స్వర్గానికి తీసుకువచ్చింది.
ఇప్పుడు నాకు ఆకలిదప్పులు లేవు. స్వర్గంలో విహరిస్తున్నట్లున్నది.
గమ్యం లేని చలనం ఉండదు. దైవప్రేమికుల మనోదేహాల్లో మినహా!

## సగం ఎండ – సగం నీడ

సగం సగం ప్రేమికులు సంపూర్ణులు కాలేరు. పూర్ణత్వం ముఖ్యం.
ఒక భాగం ఇంకోభాగంతో ప్రేమలో పడితే, మొత్తానికీ ప్రేమలభిస్తుంది.
కొందరి దృష్టిలో ప్రేమ నవ్వులపాలు కావచ్చు, బలహీడిలా కనిపించవచ్చు.
అతడు సేవకుడైతే యజమాని చెప్పిన పని చేయాలి, ప్రేమ కుదరదు.
అరబిక్ సామెత ఉన్నది– 'ప్రేమిస్తే స్వేచ్ఛగా ఉన్న స్త్రీని ప్రేమించు.
దొంగిలించాలనుకుంటే మంచి ముత్యాన్ని దొంగిలించు'–
బానిస తన యజమాని వద్దకు వెళ్లిపోగా ప్రేమికుడు దుఃఖితుడైనాడు.
సుగంధం గులాబీ వద్దకు వెళ్లిపోయింది. అతడికి ముల్లు మిగిలింది.
అతడి శ్రమ వృధా! కష్టం నాశనం. పైగా కాలికి దెబ్బ.

నీడను పట్టుకున్న వేటగాడిని చూసి, చెట్టూ, పిట్టా ఆశ్చర్యపడినాయి.
–'ఎవడీ మతితప్పిన వాడు? ఏదో తేడా ఉంది వీడిలో'
భాగం మొత్తాన్ని కలుపుతుందని విశ్వసిస్తే ముల్లును పట్టుకో గులాబి వస్తుంది.
ప్రవక్తలు చేసే పని అదే! భాగాన్ని మొత్తంలో కలుపుతారు.

## ప్రభువుకు అందిన కానుక

–'ప్రభూ! ఇది ఎడారిలో పట్టిన వాన నీరు. స్వచ్ఛమైనది' అన్నాడతడు.
అధికారులు ఆ బహుమతిని తీసుకున్నారు. అంతరార్థం గ్రహించారు.
ప్రభువు మంచివాడైతే అధికారులూ మంచిగానే ప్రవర్తిస్తారు.
నీలి ఆకుపచ్చ ఆకాశం భూమిని నీలాకు పచ్చగా కనిపింపజేస్తుంది.
అనేక కాలువలున్న జలాశయంలాంటి వాడు రాజు.
అన్ని దిక్కులా మంచినీటిని అందించినట్లే అతడూనూ!
జలాశయపు నీరు మురికిగా ఉంటే కాలువలూ మురికినీళ్లనే ఇస్తాయి.
హద్దులు లేని ప్రేమ, ఆగ్రహం విధ్వంసాన్ని సృష్టిస్తాయి.
క్రమశిక్షణ కలిగిన నడత, మంచిపనులు సౌభాగ్యాన్నిస్తాయి.
కాథార్ సముద్రంలో ముత్యాలు, పగడాలు లభిస్తాయి.
గురువు ఏ శాస్త్రంలో పండితుడైతే శిష్యులూ అంతే!
వేదాంతమైనా, వ్యాకరణమైనా, న్యాయశాస్త్రమైనా
గురువును బట్టే శిష్యులు ఉద్ధండులవుతారు.
గురువు దైవజ్ఞాని, సూఫీ అయితే శిష్యుడూ అదే మార్గాన నడుస్తాడు.
ఆధ్యాత్మిక పేదరికానికి దైవజ్ఞాన మార్గం అవసరం.

## వ్యాకరణ పండితుడు–పడవ నడిపేవాడు

ఓ గర్విష్ఠి వ్యాకరణ పండితుడు పడవలో నది దాటుతున్నాడు.
పడవ నడిపేవాడి వేపు చూసి అడిగాడు– 'నీకు వ్యాకరణం వచ్చా?'–
వాడు రాదన్నాడు. పండితుడన్నాడు– 'నీ బతుకు వృథా!'–
పడవ నడిపేవాడు చదువుకోనందుకు లోలోన చాలా దుఃఖపడ్డాడు.

ఇంతలో అకస్మాత్తుగా పెద్ద గాలి వీచి పడవ సుడిగుండంలో చిక్కుకుంది.
పడవ నడిపేవాడు పండితుడినడిగాడు– 'అయ్యా! తమకు ఈతవచ్చా?'–

పండితుడు రాదన్నాడు– పడవ నడిపేవాడు నదిలో దూకుతూ–
'అయ్యా! ఇప్పుడు తమరి బతుకు వృధా!
వ్యాకరణం బదులు ఈత నేర్చుకునుంటే బతికేవారు'–
అని ఈదుకుంటూ వెళ్లిపోయాడు.

సముద్రంలో దూకి మరణించినవారిని,
అలల తలపై మోసుకుని తీరాన పడేస్తుంది సముద్రం.
దేహవాంఛలు నశించినవారిని దివ్యజ్ఞానం ఉన్నతీకరిస్తుంది.
నీళ్ల కూజా రకరకాల ఆకారాల్లో రకరకాల శాస్త్రాల్లా ఉంటుంది.
ఖలీఫా దైవజ్ఞానం కలిగి, నీటితో నిండిన టైగ్రిస్ నదిలాంటివాడు.
నది నుండి మనం కూజాలకొద్దీ నీళ్లు తెచ్చుకుంటాము.
పేద అరబ్బుకు టైగ్రిస్ నది తెలియకపోవడాన్ని క్షమించవచ్చు.
అతడికి తెలిసుంటే నీళ్ల కూజా మోసుకుని ఇంతదూరం వచ్చేవాడు కాదు.
బహుశా ఏదో బండరాయికేసి బాది ముక్కలు చేసి ఉండేవాడు.

## ఖలీఫా (కాలిఫ్) ఔదార్యం

ఖలీఫా, పేదవాడి కథ విన్నాడు. చలించిపోయినాడు.
కూజా నీళ్లకు బదులు కూజాడు బంగారమిచ్చినాడు.
తన అధికారుల నాజ్ఞాపించాడు– 'ఇతడు చుట్టూ తిరిగి వచ్చినాడు.
ఇతడిని టైగ్రిస్ నదిలో పడవ ప్రయాణంతో స్వస్థలానికి చేర్చండి'–
ఖలీఫాకు ప్రణామాలు చేసి అతడు ఇంటికి మరలినాడు.
పడవలో కూర్చుని ప్రభువుకు కృతజ్ఞతలు తెలిపినాడు.
'ప్రభువు ఔదార్యం గొప్పది. దానికన్నా కూడా అతడు నేనిచ్చిన నీటిని తీసుకున్నాడు.
ఆ గొప్పతనం అటువంటి సుల్తానులకే చెల్లుతుంది' –అనుకున్నాడతడు.
ఈ ప్రపంచం కూజాలా జ్ఞానంతో, అందంతో నిండి ఉన్నది.
ఇదంతా ఆ దేవుని గొప్పతనంలో ఒక బిందువు మాత్రమే!
ఈ దాగివున్న నిధి వల్లనే భూమి, స్వర్గాలకన్నా ఎక్కువగా వెలుగుతున్నది.
ఈ దాగి వున్న నిధి, శాటిన్ వస్త్రాలు ధరించిన సుల్తానులా ప్రకాశిస్తున్నది.

ఆ పేదవాడు ముందే టైగ్రిస్ నదిని చూసినట్లయితే
తన నీటి కూజాను బండరాతిపై పగలగొట్టేవాడు.

నీటి కూజాను రాతిపై విసిరినప్పుడు చూడు!
అది అనేక ముక్కలవుతూ చేసే నృత్యాన్ని చూడు!
ఆ విస్ఫోటన సమయపు శబ్దాలను విను!
సత్యద్వారాన్ని తట్టు! తలుపు తెరవబడుతుంది.
ఆలోచనా ఈకను పట్టుకో! డేగలా నిలుస్తావు.

ఆలోచనా ఈకకు మట్టి అంటుకుంది.
నీవు తినే రొట్టె, మాంసం, మట్టి నుంచే వచ్చాయి.
ఆకలిగా ఉన్నపుడు నీవు కుక్కలా ఉంటావు.
చిరాకుగా, అసహనంగా మొరుగుతుంటావు.

రొట్టె తిన్నాక పాదాలు లేని గోడలా పడుకుంటావు.
కాసేపు కళేబరానివి, కాసేపు కుక్కవు,
సాధువులు (సింహాలు) నడిచే దారిలో ఎలా వెళతావు?
నీవు వేటగాడివనుకో, కుక్కని బాగామేపి వేటకు తీసుకెళ్లకు?
బాగా తిన్నాక అది వేటకు రాదు, ఒక్కోసారి ఎదురు తిరుగుతుంది.
ఆకలి ఆ పేద అరబ్బును సుల్తాను దగ్గరకు తీసుకువెళ్లింది.

దేవుని ప్రేమించినవాడి మాటలు ప్రేమపూరితంగా ఉంటాయి.
మొక్కుబడి మాటలు భావదారిద్ర్యాన్ని కలిగి ఉంటాయి.
దైవ ప్రేమికుడి మాటలు మత విశ్వాసంతో కూడి ఉంటాయి.
సంశయాలను నివృత్తి చేసి సక్రమమార్గాన్ని చూపుతాయి.
సముద్రపు నురగలా నిజాయితీపై పొర స్వచ్ఛమైనదే!
దేవుని ప్రేమించేవాడు అసత్యాలాడితే సత్యంలా కనిపిస్తాయి.
ఆ అబద్ధాలు కూడ సత్యానికి అలంకారాలవుతాయి.
రొట్టెను చక్కెరతో కలిపి వండితే చక్కెర రుచి వస్తుంది.
దైవ విశ్వాసికి స్వర్ణ విగ్రహం దొరికితే ఏం చేస్తాడు.
తీసుకువెళ్లి అగ్నిలో పడవేసి అసలు బంగారంగా మారుస్తాడు.

విగ్రహ రూపమున్న స్వర్ణం నుంచి స్వర్ణాన్ని విముక్తం చేయాలి.
రూపరహితుడైన దేవునికి రూపాలనిచ్చి ఆరాధించరాదు.

ఈగ ఉంది గదా అని దుప్పటి తగలబెట్టము.
దోమలున్నాయని వ్యవసాయం మానుకోము.

విగ్రహారాధన వదిలి అసలు దేవుడిని ప్రార్థించు.
తీర్థయాత్రకు వెళ్లేప్పుడు తోడుగా విశ్వాసిని తీసుకుపో!

అతడు టుర్కా, హిందువా, అరబ్బా అని కాదు,
అతడి ఉద్దేశం, ఆలోచన సరిగా కనుక్కో!

అతడు నలుపా, తెలుపా అని కాదు, విశ్వాసి అవునా, కాదా అన్నది ముఖ్యం.
అందుకే ఈ కథ తుది మొదలు లేకుండా చెప్పబడింది.

## సూఫీ సాధువు

సూఫీ సాధువు ఆధ్యాత్మిక సంపదలశేషంగా కలవాడు.
అతడికి గత జ్ఞాపకాలతో నిమిత్తం లేదు.
మనం పేద అరబ్బు, నీటి కూజా, సుల్తాను లాంటివాళ్లం.
సత్యం నుంచి దారిమళ్లినవాడు, దారి తప్పుతాడు.
ఆ నిరుపేద భర్తలో నిజాయితీ, విశ్వాసం ఉన్నాయి.
ఆ గడుసు భార్యలో కామం, మోహం ఉన్నాయి.
అతడు కొవ్వొత్తి వెలుగు. ఆమె కటిక చీకటి.

అర్థం కాలేదా! భాగము, మొత్తం గురించి చెబ్తా, విను!
గులాబీ సుగంధం గులాబీకి చెందినదే,
కాని ఒక వస్తువులోని భాగాలు మొత్తానికి చెందవు.
మొక్కల అందాలు గులాబీకి చెందినవే,
గువ్వ కువకువలో నైటింగేల్ గానాన్ని ఆనందించు.
నాకే అర్థం కాని ప్రశ్నతో, జ్ఞానార్తి దాహాన్నెలా తీర్చగలను?
సింహం లాంటి ఆలోచనలు మాని, సావధానంగా విను.

ఒక్కోసారి మందులకన్నా ఏం వేసుకోకబోవడమే ఉత్తమం.
గోక్కున్నంతమాత్రాన దురద పూర్తిగా తగ్గదు.

లంఖణం పరమౌషధం! ఆత్మస్థైర్యం దివ్యౌషధం!
చెవికి కమ్మలు పెట్టుకున్నట్లు, ఈ మాటలను తగిలించుకో!
నెలవంకను; సప్తగ్రహాలను చేరుకోగలుగుతావు.
వివిధ రకాల జంతువుల ఆత్మశక్తి వివిధంగా ఉంటుంది.

అక్షరమాలలోని అక్షరాలు తొలినుండి తుదికి విభిన్నమే!
అనుకూల, ప్రతికూలతలు వాటిలో అమరి ఉన్నాయి.

పునరుత్థాన దినం నాడు ప్రతి ఒక్కరూ పరీక్షింపబడతారు.
తప్పుదారినబోయే హిందువుకు అది పరీక్షాదినం.
అతడి ముఖం ముసుగుతో కప్పివేయబడి ఉంటుంది.

అతడి ముల్లుపై ఒక్క గులాబీ ఆకు కూడా లేదు.
అతడి అంతరాత్మకు వసంతకాలమొక శత్రువు.

ఆకురాలు కాలంలో అన్ని గులాబీలూ ఒక్కలానే ఉంటాయి.
అందుకే, అవిశ్వాసి ఆకురాలుకాలాన్ని అభిలషిస్తాడు.

రంగురాళ్లకూ, కెంపులకూ తేడా తెలియదొక్కోసారి.
నాణ్యత తెలిసినవాళ్లూ, తోటమాలులూ, పసికట్టగలరు.
వసంతకాలాన్ని, మంచి రత్నాల్ని వాళ్లు ఆహ్వానిస్తారు.

తోటమాలికి తెలుసు శరత్కాలంలో కూడా మంచేదో, చేదేదో!
వసంతకాలం వచ్చినపుడు మంచివి సంతోషిస్తాయి.

పూలు వికసిస్తున్నంత కాలము పళ్లు కనిపించవు.
దేహం శిధిలమైనాక ఆత్మ తలెత్తుతుంది.

ముక్కలు చేసుకుని తిన్న రొట్టె శక్తిగా మారుతుంది.
తొక్కబడిన ద్రాక్షపళ్లు మధువుగా మార్తాయి.
మిరొబలన్‌చే మిళితమైన ఔషధాలు ఆకలి పుట్టిస్తాయి.

## సాధువుకు అణుకువగా ఉండడం

సత్యకాంతిలో వెలుగొందేవాడా! ఓ హుసాముద్దీన్!
సాధువు లక్షణాల గురించి చెబుతాను, వ్రాసుకో!
నీవు బలహీనం ఉన్నట్లున్నా, సూర్యకాంతిలేనిదే మాకు వెలుగు లేదు.
వెలిగించిన దీపానివైనా, నీవు వత్తిలో చివరి భాగానివి.

ఆధ్యాత్మిక గురువు (పీర్‌సాహెబ్) మార్గదర్శకుడు
ప్రజలు శరత్తులైతే అతడు మండువేసవి లాంటివాడు.
ప్రజలు రాత్రిలాంటివారైతే అతడు చంద్రుడు.
జ్ఞానవృద్ధుడైన యువకుడు మంచి ముత్యము వంటివాడు.
పాత మధువు, పాత బంగారంలా ప్రశస్తమైనవాడు.
ప్రమాదాలతో కూడుకున్న దారిన పోయేప్పుడు మార్గదర్శకుడవసరం.
అనేకసార్లు ప్రయాణించిన మార్గాన కూడా అతడుంటే మంచిది.

కొత్తదారిలో నడిచేప్పుడు అతడిపై నుంచి చూపు మరల్చకు.
అతడి రక్షణలేకపోతే ప్రతి అరుపుకూ నీవు భయపడతావు.
ఏ పిశాచో నిన్ను ఆకర్షించి సర్వనాశనం చేస్తుంది.
పవిత్ర గ్రంథం పఠించు. ఇబ్లిస్ ఎంత మందిని నాశనం చేసాడో గ్రహించు.
లక్షలాది సంవత్సరాల నుంచి అతడు జనుల్ని పక్కదోవలు పట్టిస్తున్నాడు.

నీ దేహమనే గాడిదను రహదారిలో నడుపుకో!
గాడిదకు దారిపక్కన గడ్డీగాదమంటే ఇష్టం.
ఒక్కక్షణం ఆదమరచావా, అది అడవిలోకి దూసుకుపోతుంది.
దారి దానికి శత్రువు. ఎందరినో గాడిద దారి తప్పించింది.
నీకు దారి తెలియదనుకో, గాడిదకు వ్యతిరేకంగా ప్రవర్తించు.
కామినుల ఆలోచనలను తిరస్కరించు. ఇంద్రియాలను నిగ్రహించు.
తోటి ప్రయాణీకుల నీడలో రహదారిలో ప్రయాణించు.
ఆధ్యాత్మిక గురువుననుసరించు. సత్యపథంలో చరించు.

## ప్రవక్త – ఆలీ

ప్రవక్త అన్నాడు– 'ఆలీ! ఓ ఆలీ! నీవు దేవుని సింహానివి!
ధైర్యశాలివి. అయినా నీ గుండె బలం సరిపోదు.
రా! ఆశాఖర్జూర వృక్షపు నీడలో నిలబడు!
నిన్ను పక్కదారి పట్టించని వ్యక్తి రక్షణలోకి రా!
అతడి నీడ ఖాఫ్ పర్వతపు నీడ లాంటిది.
అతడి ఆత్మ సిమర్ఘ్ పక్షిలా అత్యున్నతాకాశాన తిరుగుతుంటుంది.
పునరుత్థాన దినం వరకు అతడి లక్షణాలను పూర్తిగా నిర్వచించలేవు.
మనిషి రూపుదాల్చిన సూర్యుడతడు. నిజం దేవుడికి తెలుసు.
దైవమార్గంలో నడిచేప్పుడు దైవసేవకుడి నీడలో నడువు.
అలా నీవు నీ శత్రువు నుంచి రక్షింపబడతావు.
సాధువు నిన్ను అంగీకరించినప్పుడు, ఖిజర్ ఆజ్ఞలో నడచిన 'మోసెస్'వుకా!
ఆ గురువుకు శుశ్రూషలు చేయి, అతడి మన్ననలను పొందు.
నావకు రంధ్రం చేసినా, పసిబిడ్డను హతమార్చినా మారు పలకకు–
దైవహస్తం చేసిన పనికి వ్యాఖ్యానాలు చేయకు.

ఒంటరిగా ప్రయాణం చేసే ధైర్యశాలికి కూడా గురువులుంటారు.
శిష్యుడు దూరంగా ఉన్నా గురువు దైవహస్తం రక్షణనిస్తుంది.
రక్షణలో లేనివాడిని ఆదరించే దైవ హస్తం,
తన రక్షణలో ఉన్నవాడికి ఎటువంటి వస్త్రాన్నిస్తుందో గ్రహించు!
గురువును ఎన్నిక చేసుకో! నీటిలా, మట్టిలా నీరు కారబోకు,
ప్రతి దెబ్బకు ఆగ్రహిస్తే, అద్దంలా ఎప్పుడు తళతళలాడతావు?

## ఖాజ్వీ – పచ్చబొట్టు

ఖాజ్వీ ఒకనాడు భుజాలపై సింహపు బొమ్మ పచ్చబొట్టు కావాలన్నాడు.
అది తాయెత్తులా వీరులకు రక్షణ. నెప్పిని భరించాడతడు.
ఖాజ్వీ సేవకుడు కూడా భయంకర సింహం పచ్చబొట్టు కావాలనుకున్నాడు.
–సింహరాశి నాది! మంచి కళాత్మకంగా ఉండాలి సుమా!' అన్నాడు.
'ఎక్కడ పొడిపించుకుంటారు తమరు'– అడిగాడు పచ్చబొట్టు వేసేవాడు.

సేవకుడన్నాడు– 'నా భుజాలమీద! చూసేవాళ్లు జడుసుకోవాలి'–
అలాగే అని ఆ పచ్చబొట్టు వేసేవాడు,
సూదిని నీలి ద్రావకంలో ముంచి భుజాలమధ్య నెమ్మదిగా గుచ్చాడు.
ఎగిరిపడ్డాడా సేవకుడు– 'అయ్యబాబోయ్! ఇంత నెప్పా!
మహానుభావా! ఇంతకీ ఏ జంతువు బొమ్మ పొడుస్తున్నావు?'–
పచ్చబొట్టువాడన్నాడు– 'సింహం!'
కళ్లమ్మటే నీళ్లతో సేవకుడన్నాడు– 'ఏ భాగంతో మొదలెట్టావు?'–
పచ్చబొట్టువాడన్నాడు– 'తోకతో!'
సేవకుడన్నాడు– 'తోక వద్దులే! సింహం తోక తగిలినట్లుంది నాకు!
తోక లేకపోయినా సింహం సింహమే! నెప్పితో నా గొంతు మూగపోయింది'–
పచ్చబొట్టువాడు తన పని మరలా మొదలెట్టినాడు–
రెండు, మూడు సార్లు గుచ్చేసరికి సేవకుడు తట్టుకోలేకపోయినాడు.
–'ఆపు! ఆపు! ఇప్పుడే భాగం చిత్రిస్తున్నావు?'
పచ్చబొట్టువాడన్నాడు– 'సింహం చెవి'–
–'చెవులు లేకపోయినా సింహం సింహమే! చెవులు వదిలేయి!'
పచ్చబొట్టువాడు మరో భాగం చిత్రిద్దామని సూది గుచ్చినాడు.
సేవకుడు కెవ్వున కేకబెట్టి మొత్తుకున్నాడు.
–'ఇక్కడ ఏం చిత్రిద్దామనుకుంటున్నావు?' సేవకుడు.
'అయ్యా! సింహం పొట్టభాగం'– పచ్చబొట్టువాడు.
'పొట్ట లేకున్నా సింహం సింహమే! దాన్ని వదిలేయి'–
పచ్చబొట్టు వేసేవాడు అసహనంతో పళ్లు కొరుక్కున్నాడు.
కాసేపు ఊపిరి గట్టిగా పీల్చి, చేతిలో సూదిని పక్కనబెట్టాడు.
–'అయ్యా! తోక, చెవులు, పొట్ట లేని సింహమెక్కడన్నా ఉందా!
తమరు నెప్పిని ఓర్చుకోకపోతే ఈ ప్రయత్నం వృధా!'–

దైహిక బాధలను ఓర్చుకోవాలి! దైహిక వాంఛలను అదుపులో ఉంచాలి.
వీటి నుంచి తప్పించుకున్న వాళ్లకు సూర్యచంద్రులు,
ఆకాశం తలవంచి నమస్కరిస్తాయి.
ప్రేమ కాంతిని గ్రహించినవాడిని సూర్యకాంతి బాధించదు.

ముళ్లూ, గులాబి పూలలా మృదువుగా స్పర్శిస్తాయి.
నిన్ను నీవు ధూళిగా భావించుకో! మహోన్నతుడి వెలుగు అర్ధమవుతుంది.
నీవు పగలులా ప్రకాశించాలనుకుంటే, రాత్రిని (ఉనికి) కాల్చివేయి.
ద్రావకంలో కరిగిన రాగిలా, నీవూ కరిగి అదృశ్యమైపో!
నేను, మీరు భావనల ద్వైతాన్ని వదిలిపెట్టు.

సింహం, తోడేలు, నక్క
సింహం, తోడేలు, నక్క వేటకు వెళ్లాయి కలిసి,
ఆ రకంగా జంతువుల్ని అదుపులో ఉంచుకోవచ్చని.
మిగతా రెండిటికీ సింహం గౌరవాన్నిచ్చింది, ఇష్టం లేకున్నా!
రాజుకు సేవకుల్లా సింహానికి అవి తోడున్నాయి.
చంద్రుడికి తారల్లా సింహం వాటితో బయల్దేరింది.

ఒకే తూనికలో ఒక పక్క బంగారం, మరోపక్క బార్లీ గింజలు
దేహానికి ఆత్మ తోడు. కుక్క రాజభవనానికి కాపలా!

సింహానికిరువైపులా తోడేలు, నక్క గంభీరంగా నడుస్తున్నాయి.
దూరంగా అడవి ఎద్దు, మేకపోతు, కుందేలు కనిపించాయి.
మంచి వేటగాడి అనుచరులకు విందు భోజనం దొరుకుతుంది.
వేటాడి, వాటిని చంపి రక్తమోడుతున్న కళేబరాలను
కొండగుట్టల దగ్గర్నుంచి అడవిలోకి ఈడ్చుకువచ్చాయి.

తోడేలు, నక్క మనస్సులో ఎన్నో ఆలోచనలు.
సింహం వాటిని గ్రహించి, చిరునవ్వుతో ఊరుకున్నది.
వాటికి బుద్ధి చెప్పాలనుకుని తనలో ఇలా అన్నది–

–'తోడేలూ! నీ బుద్ధికుశలతకు ఇది పరీక్ష!
నా సంపదలను సక్రమంగా పంచే అధికారివి నీవు!'

తోడేలన్నది– 'ప్రభూ! బలిష్ఠమైన ఎద్దు నీకు.
మేకపోతు నాకు! నక్కకు కుందేలు!'

సింహం అన్నది ఆగ్రహంగా! 'నాముందే ఇది
నీభాగం, ఇది నా భాగం అని తప్పు చేసావు.
నీకు ఆ ఆలోచనే రాకూడదు. అనుభవించు శిక్ష!'
అని తోడేలును చీల్చి చంపివేసింది సింహం.
పరమాత్మ ముందు నీ, నా అనే ద్వంద్వ ప్రవృత్తి ఉండదు.
అతడి వదనం ముందు నీ ఉనికి ఉండబోదు.

## ఇంటిముందు స్నేహితుడు

ఒకతడు తన స్నేహితుని ఇంటి తలుపు తట్టినాడు.
లోపలి నుంచి మాట వినిపించింది– 'ఎవరక్కడ?'–
స్నేహితుడన్నాడు– 'నేనే! నేను!'
ఇంట్లో ఉన్నవాడన్నాడు– 'నీవు నీవయితే లోనికి రానక్కరలేదు.
భోజనపు బల్లమీద కోడి తినడానికి పనికిరాదు!'–
ఓ సంవత్సరం గడిచాక మరల అతడు మళ్లీ తలుపు తట్టినాడు.
లోపలి నుంచి మాట వినిపించింది– 'ఎవరక్కడ?'–
స్నేహితుడన్నాడు– 'నీవే! నీవే నేను!'–
ఇంట్లోవాడన్నాడు– 'లోపలికి రా, మిత్రమా!
ఈ ఇరుకు గదిలో ఇద్దరు 'నేను'లకు స్థానం లేదు'–

దారపు రెండు కొసలూ సూదికి చెందవు. ఒక కొసకే స్థానం.
సూది రంధ్రం దారాన్ని పోనిస్తుంది. ఒంటె దూరలేదు కదా!
ఒంటె దేహం సన్నబడాలంటే సత్కార్యాలు చేయాలి;
అందుకు దైవహస్తం, కరుణ కావాలి!
ఆ దైవ హస్తం అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది.
అంధుడైనా, అవిటివాడైనా దేవుడి కరుణ అతడికి సంపదలనిస్తుంది.
ఉనికి లేని దానికి ఉనికి నిస్తుంది.
అతడు ఒక సైన్యాన్ని మానవతెగ వృద్ధికి,
ఒకటి జీవజాలపు వృద్ధికి
మూడవదాన్ని మృత్యువు ఆవల ఉన్న లోకానికి పంపుతాడు.

అతడన్నాడు– 'రా! మిత్రమా! ముల్లుకు, గులాబీకి తేడాలేదు!
నీకు, నాకు తేడా లేదు. మనమిప్పుడు ఒకే దారం!'

పాదాలు రెండైనా, నాలుగైనా నడిచే దారి ఒక్కటే!
ఆ బట్టలుతికే వాళ్లను చూడు. ఒకడు బట్టల్ని తడుపుతున్నాడు.
మరొకడు వాటిని ఆరబెడ్తున్నాడు.
మొదటివాడు వాటిని మళ్లీ నీళ్లలో తడుపుతున్నాడు.
వాళ్లు దాని మురికిని వదిలించడానికి చేస్తున్న పని,
పైకి విభిన్నంగా కనిపించినా, అది ఒకే పని.

ప్రవక్తలు చెప్పే మార్గాలు చివరకు ఒకే దేవుడిని చేరుస్తాయి.
ప్రవక్తల వాక్యాలు గులాబీతోటను తడిపే ప్రవాహాలు.
పరిశుద్ధమైన ఆత్మలను ఆ మహోన్నతుడి వద్దకు చేర్చే మార్గాలు.
ఇంద్రియాతీతమైన ఆ పరమాత్మను చేరుకోవాలంటే
ఇంద్రియ భావనలను నిశ్శేషం చేసుకోవాలి.

## సింహం, నక్క

అరణ్యానికే రాజైన సింహం తోడేలుకు శిరచ్ఛేదం చేసింది.
అమీర్‌ను చూసి చావకుండా, భాగమడిగి చచ్చినట్లు.
మహాప్రభువు ముందు ఇది నీది, ఇది నాది అనేది లేదు.

సింహం ఇప్పుడు నక్కవేపు తిరిగి– 'భాగాలు చేయి!' అన్నది.
నక్క నమస్కరించి అన్నది– 'మహాప్రభూ! భాగాలు లేవు.
తమరి ఉదయ ఫలహారానికి ఎద్దు,
మధ్యాహ్న భోజనానికి మేక, సాయంకాలం కుందేలు'–
సింహం అన్నది– 'ఎక్కడ నేర్చుకున్నావు ఈ జ్ఞానాన్ని?'–
నక్క అన్నది– 'తోడేలుకేమయ్యిందో చూసాక నాకే వచ్చింది'–
సింహం అన్నది– 'నీ సేవకత్వం నిరూపించుకున్నావు. నీవు విశ్వాసివి.
ఆ మూడిటినీ నీవే తీసుకుపో!
ఇకనుంచి నేను వేటాడిన జంతువులు నీకు చెందుతాయి.

నీకు ఏడవ స్వర్గంలో స్థానం లభిస్తుంది.
తెలివిగలవాడు మృత్యుసన్నిధిలో కూడ రక్షింపబడతాడు'-

నక్క తనలో అనుకున్నది- 'ముందు తోడేలును పిలవడం మంచిదైంది!
నన్ను ముందు పిలిచినట్లయితే ఈపాటికి నా పని పూర్తయ్యేది!
తోడేలు నాకంటే పెద్దది. దాని అనుభవం నాకు పనికివచ్చింది.

అందుకే మనం నక్కల్లా పాత అనుభవాల్ని గుర్తుంచుకోవాలి.
తోడేలు చర్మాన్ని, ఎముకల్ని చూసి, దాని తొందరపాటును స్మరించాలి.
దేవుడి ముందు 'ఫారో' రాజులా తలెత్తి నశించిపోరాదు.
దారితప్పిన 'ఫారో' రాజు గతేమయ్యిందో మనందరికీ తెలుసు.

## నోవా

నోవా అన్నాడు- 'మూర్ఖులారా! నేను నేను కాదు.
నాలో ఇప్పుడు జంతు ఆత్మలేదు. పరమాత్మలో నేనున్నాను.
నాకీ ఇంద్రియాలతో నిమిత్తం లేదు. దేవుడే నా కళ్లూ, చెవులు.
నేను నేను కాదు కాబట్టి ఈ ఊపిరి నాది కాదు, అతడిదే!
ఎవడైనా ఇంకొక్కమాట మాట్లాడినాడా అతడు అవిశ్వాసే!

నక్కరూపంలో ఇప్పుడు సింహమున్నది మీ ఎదుట,
అర్థం చేసుకోండి! సింహగర్జన వినదలుచుకున్నారా?

నోవా సింహం లాంటివాడు, వందల, వేల సింహాలతడిలో ఉన్నాయి.
తనకు కప్పం చెల్లించని కుప్పపై అతడు అగ్నిని పంపుతున్నాడు.
అనవసరంగా నోరు పారేసుకున్నవాళ్లకు తోడేలు గతి పడ్తుంది.
సింహపు పంజా దెబ్బలు చవిచూసాక బతికేదెక్కడ?
నక్కజిత్తులు పనికిరావు. సంపూర్తిగా అతడి శరణుజొచ్చాలి.
నేను నీవు అనే మాట లేదు. ఇది అతడి రాజ్యం. అతడు ప్రభువు.
నీ ఆత్మ పరిశుద్ధపడినాక, సింహమూ, వేటా రెండూ నీకే!
అతడికి పైపై మెరుగులక్కరలేదు. అత్యంత ప్రకాశవంతుడతడు.
అతడి సేవకులకు చెందుతాయి ఈ ప్రపంచంలోని సంపదలు.

అంతరాత్మ ప్రబోధాలు, వేరు ఆలోచనలు, కామం ఇవన్నీ
పాలలో వెంట్రుకలలా వేరుగా కనిపిస్తాయి.
ఎవరి హృదయమైతే ఎటువంటి ప్రతిబింబాలు లేక నిర్మలంగా ఉందో
ఆ అద్దంలో ఆ అగోచరుడి భావాలు వ్యక్తమవుతాయి.
నిజమైన విశ్వాసి హృదయం స్పష్టమైన అద్దం.
మరకలున్న అద్దం మసక మసకగా కనిపిస్తుంది.
గీటురాయిపై మన ఆధ్యాత్మిక పేదరికాన్ని గీసి చూస్తాడతడు.
విశ్వాసానికి, సంశయానికి నీవెటువేపున్నావో తెలుసుకుంటాడు.
విశ్వాసం, వంచన – స్వర్ణనాణెం, దొంగనాణేల్లాంటివి.
పరీక్షలో బయటపడ్తుంది దేని విలువ ఏమిటో!

## రాజులు–సాధువులు

రాజుగారి సభలో ప్రత్యేక పద్ధతులున్నాయి.
పలాడిన్‌లు, పండితులు ఎడంవేపు– గుండె ఉన్నవేపున,
కోశాధికారి, అధికారులు కుడివేపు– రాతకోతలు కుడిచేత్తో కదా!
సూఫీలు, సాధువులు ఎదురుగా– వదనం వేపు అద్దంలా!
స్వచ్ఛమైన అద్దాల్లాంటి సాధువుల వదనాలలో
తమ ముఖ ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుందని.
అందమైన వారి ముఖం ముందు అద్దంలా,
సత్పురుషుల వదనాలు వారి ఆత్మల్లా అద్దంలా ఉంటాయి.

## జోసెఫ్ – అతిథి

సత్యశీలుడైన జోసెఫ్ వద్దకు ఓ అతిథి వచ్చినాడు.
అతడు జోసెఫ్‌కు చిన్ననాటి స్నేహితుడు.
జోసెఫ్‌కు అతడి సోదరుల అసూయ, కుట్రలను చెప్పినాడు.
జోసెఫ్ అన్నాడు– 'నిజమే! కాని వాళ్లు నా సోదరులు.
అసూయ అనేది గొలుసులాంటిది. నేను సింహాన్ని.
గొలుసు ఉన్నదని సింహం అవమాన పడదు.

దైవనిర్ణయాన్ని నేను ప్రశ్నించను.
మెడలో గొలుసున్న సింహం, గొలుసులు చేసేవాళ్ల అధినేత.

స్నేహితుడడిగాడు– 'నీ జైలు జీవితం ఎలా గడిచింది?'
జోసెఫ్ అన్నాడు– 'చంద్రకాంతిలో ఉన్నట్లే– కాకపోతే కృష్ణపక్షం!'–
నెలవంక ఎప్పటికైనా పూర్ణ చంద్రబింబం కావలసిందేగా!
మంచి ముత్యాన్ని రోటిలో దంచినా, ప్రకాశవంతమౌతుంది కదా!
గోధుమ ధాన్యపు గింజను నాటితే, అది మొలకెత్తి కంకినివ్వడంలేదా!
గోధుమలను తిరగలిలో పిండి చేస్తే, అది రొట్టెగా మారుతున్నదా!
ఆరగించబడిన రొట్టె జీర్ణమై శక్తిగా, మనస్సుగా ఆత్మగా మారడం లేదా?
ఆ ఆత్మ ప్రేమలో పడి మరల మొలకెత్తడం లేదా!
తన కథంతా చెప్పి జోసెఫ్ తన స్నేహితుడిని అడిగాడు–
–'నాకేమి కానుక తెచ్చావు నీవు?'–
స్నేహితుల దగ్గరకు ఖాళీ చేతుల్తో వెళ్లడం,
తిరగలి దగ్గరకు గోధుమలు లేకుండా పోవడం.

దేవుడడుగుతాడు పునరుత్థానం రోజున– 'ఏమి కానుక తెచ్చావు?'–
నేను నిన్ను ఎట్లా సృషించానో అలానే వచ్చావే!
మృతుల్లోంచి లేచి, నీవు తెచ్చిన కానుక ఏమిటి?
నీవు నరకాగ్నిలోనే ఉంటావా? నన్ను కలవడం వృధా ప్రయాసేనా?
సంశయవాదికి దేవుని వంటశాలలో బూడిదే దొరుకుతుంది.
విశ్వాసికి పంచభక్ష్య పరమాన్నాలు లభిస్తాయి.
నీవు విశ్వాసివే అయినట్లయితే, స్నేహితుడి లోగిలిలోకి ఏం తెచ్చావు?

కొంత నిద్ర, కొంత ఆహారాన్ని త్యాగం చేయి.
దేవుని ప్రార్థించేందుకు కాస్త సమయాన్ని కేటాయించు.
కడుపులో బిడ్డలా కాస్త కదులు. కాంతిని పొందు.
దేవుని హృదయం విశాలమైనది.
దానిలో ఖర్జూరపు తొలిశాఖలు వడిలిపోవు.
ఇంద్రియ భారంతో నీవు అలిసిపోయి ఉన్నావు.

నిద్రలో ఇవన్నీ మాయమై కొత్త జన్మనెత్తుతావు.
నీ నిద్రాస్థితిని సాధువులుండే స్థితిగా గ్రహించు.
గుహలోని మనుషుల్లా వారు నిద్రపోరు.
దేవుడు వారిని కుడి ఎడమలకు లాగుతాడు.
దైహిక వాంఛలు ఎడమవేపు, ఆత్మశోధన కుడివేపు.
సాధువులకు మంచి చెడులతో నిమిత్తం లేదు.
కొండకు తెలియకుండా వచ్చే ప్రతిధ్వనుల్లాంటివి.

స్నేహితుడు, జోసెఫ్‌తో అన్నాడు వలవల దుఃఖిస్తూ–
–'నీ అర్హతకు సరిపడే కానుక నాకేమీ కనిపించలేదు.
బంగారపు రేణువును బంగారపు గనికిచ్చినట్లు,
నీటి బిందువును సముద్రానికిచ్చినట్లు కాదా!
అందుకే నా హృదయాన్ని, ఆత్మను నీ కంకితం చేసాను.
అవి ప్రతిబింబించేలా నీకు 'అద్దాన్ని' కానుకగా తెచ్చాను.
అద్దంలో నీ వదనాన్ని చూసుకున్నపుడల్లా, నీకు, నేను గుర్తుకు వస్తాను.
ఓ కాంతిమంతుడా! ఇదుగో నా కానుక నీకు!'–
అంటూ స్నేహితుడు జోసెఫ్‌కు 'అద్దం' ఇచ్చినాడు.

ఈ అద్దమేమిటి? ఉన్నది ఉన్నట్లుగా చూపిస్తుంది.
అది ప్రతిబింబమే కనుక చూడటానికి మాత్రమే పనికొస్తుంది.
ప్రతిబింబపు ఉనికి, వస్తువుపై ఆధారపడి ఉన్నది.
వాస్తవానికి ప్రతిబింబాన్ని పట్టుకోలేవు. అంటే దానికి ఉనికి లేదు.
ఉనికి లేని దానిలోంచి ఉన్నదానిని చూడడానికి– అద్దం పనికివచ్చింది.
రొట్టెకు అద్దం ఆకలిగలవాడు,
చెకుముకి రాయికి అద్దం దాన్నుంచి వెలువడే నిప్పురవ్వ.

మంచి నాణ్యత కలిగి, ప్రశస్తంగా కుట్టబడిన వస్త్రానికి
దర్జీ తన నైపుణ్యాన్ని చూపించేదేముంటుంది?
కొమ్మలుంటేనే చెట్లు నరికేవాడికి
తన కౌశల్యం ప్రదర్శించేందుకు వీలుంటుంది!

ఎముకల్ని సరిగా అతికిస్తేనే వైద్యుడి గొప్పతనం బయటపడ్తుంది.
రోగాన్ని నయం చేసినప్పుడు మందు ప్రభావం తెలుస్తుంది.
ద్రావకం తీరుతెన్నులు తెలిసేది రాగిని కరిగించినప్పుడే కదా!
లోపాలే పరిపూర్ణతను తెలుపుతాయి అద్దంలా!
మోసకారితనం అద్దంలాంటిది అధికారానికి, కీర్తికి!
లోపాల్లేకపోవడం సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సూచిస్తున్నట్లు,
తేనె తీపిదనాన్ని వినిగార్‌తో పోల్చినట్లు
వ్యతిరేక ధర్మాల్ని వ్యతిరిక్త వస్తువుతో పోల్చి చూస్తాము.
తన తప్పుల్ని తెలుసుకుని సరిదిద్దుకునేవాడు సంపూర్ణుడౌతాడు.

సంపూర్ణత్వం ఉన్నదని భ్రమపడడాన్ని మించిన ఆత్మదోషం లేదు.
ఎంతో రక్తం కావాలి నీ హృదయం నుంచి, నీలో ఆ దోషం పోవడానికి.
'ఇబ్లిస్' దోషమంతా తనను తాను ఆదామ్‌కన్నా అధికుడిగా భావించడం.
ప్రతి మానవుడి హృదయంలోనూ ఆ దోషమున్నది;
పైకి స్వచ్ఛ జలం, లోన మురికి మట్టి ఉన్న కాలువలా!
'డెవిల్' నిన్ను ఉద్రేకపరచగానే మురికి బయటకు వస్తుంది.
సాధువుల జ్ఞానం సరైన దారిలోకి నడుపుతుంది.
మురికి నీరు తనలోని మురికిని వదిలించుకోగలదా?
సాధారణ జ్ఞానం మనిషిలోని ఇంద్రియజ్ఞానాన్ని వదిలించుకోగలదా?
కత్తి తన పిడిని తయారు చేసుకోగలదా?
గాయం నయం కావాలంటే వైద్యుడి దగ్గరకు వెళ్లు!
ప్రతి గాయంపైనా ఈగలు మూగుతాయి.
వైద్యుడు పట్టీ వేయగానే నెప్పి, బాధలు ఆగుతాయి.
చెడు ఆలోచనలూ అంతే! సాధువు బోధనలు వాటిని ఆపుతాయి.
పట్టీ వేయగానే గాయం మానదు.
మానడానికి లోన శక్తి, కొంత సమయం కావాలి!

## భవిష్యత్ వాణి కిరణాలు

ఉథమన్ కాలానికి ముందు ఓ వ్రాతగాడు ఉండేవాడు.
అతడు వ్రాతపనిలో బహు కుశలుడు.

ప్రవక్త చెప్పింది చెప్పినట్లు పత్రం మీద లిఖించేవాడు.
ఆ మాటల కిరణాలు అతడిపై పడి, అతడి జ్ఞానాన్ని పెంచాయి.
అయితే జ్ఞానంతో పాటు కించిత్ గర్వం పెరిగింది.
ప్రవక్తకు, మతానికి శత్రువై ప్రమాదకరంగా వ్యవహరించాడు.

ముస్తఫా అన్నాడు– 'కాంతి నీ నుంచి వచ్చినట్లయితే,
నీ ముఖం మీద ఆ నల్లని మసి ఏమిటి?
నీవే దివ్యజలధార అయినట్లయితే
ఎందుకు నీ నుంచి ఆ నల్లటి విషజలం వస్తున్నది?'–

వాడు మూర్ఖుడు. మారలేదు. దైవ ఖడ్గ ప్రహారానికి తల తెగింది.
లోహపు ఖడ్గ విసురుకు కారట్ దుంప ముక్కలైనట్లు.
గర్వం, అవిశ్వాసం అతడిని క్షమాభిక్ష అడగనివ్వలేదు.
దేవుడన్నాడు– "వీళ్ల తలలు పైకెత్తబడేలా సంకెళ్లు ఉంచాలి.
ఆ సంకెళ్లు బయటకు కనబడనివి.
వీళ్ల ముందు, వెనక అడ్డుగోడలుంచుదాము"–
ఆ అడ్డుగోడలే దైవగమ్య సరిహద్దులు.
మానవుడికి, దేవుడికి మధ్య అడ్డుగోడలు తొలగించేది ప్రేమ.
సాధువులు (పీర్) ఆ ప్రేమమార్గాన్ని బోధిస్తారు.

మతం కోసం అస్త్రులు చాచే అవిశ్వాసులున్నారు.
వారు పైకి విశ్వాసాన్ని ప్రకటించే గర్వపోతులు.
ఇనుప గొలుసులను ఛేదించవచ్చు. అది కనబడ్తుంది.
గర్వమనే గొలుసు మరింత దృఢమైనది, కనబడదు.
పదునైన గొడ్డలితో ఇనుప గొలుసు తెగుతుంది.
గర్వమనే కనబడని గొలుసునెలా తెగ్గొట్టగలం?
తేనెటీగ కుట్టినపుడు, కనిపించే ముల్లు తీసివేస్తాం.
ఉనికి వల్ల వచ్చే గాయపు బాధ ఎలా తగ్గుతుందో చెప్పగలవా?
దేవుడిని ప్రార్థించు– 'ఓ కరుణామయా! ఈ గాయాన్ని మాన్పు'–
ఆ వ్రాతగాడు గర్వపు గాయంతో నశించాడు.
అందుకే ఆత్మవంచన ఎవ్వరినైనా ధూళిగా మారుస్తుంది.

అబ్దాల్ నుంచి జ్ఞానం నీలోకి ప్రవహిస్తున్నది.
అదినీకు అరువు తెచ్చుకున్న వస్తువు లాంటిది.
నీ ఇంటిలో వెలుగున్నది, కాని అది పొరుగింటి దీపం వలన!
కృతజ్ఞతలు తెలుపు, వంచన చేయకు. నిరాశపడకు.
వంద దుఃఖాలు, వంద దయలు నీకీ స్థితిని కల్పించాయి.
మత విశ్వాసులను ఒకే గొడుగు కింద నిలిపి ఉంచినవి.
దేవునితో కలిసి కూర్చుని భుజించేవాడికి నేను సేవకుడిని.
దారి పక్కన ఉన్న సత్రాలను వదిలి ఇంటికి చేరుకోవాలి కదా!
కాలిన ఇనుము ఎర్రగా ఉంటుంది. అగ్నిజ్వాల దానికా రంగు నిచ్చింది.

ఎండలో ఇల్లు వెలుగుతో నిండి ఉన్నపుడు
గోడ, తలుపులు, కిటికీలు ఆ కాంతి తమ సహజ లక్షణమనుకున్నాయి.
సూర్యుడన్నాడు– 'అవునా! నేను అస్తమించాక ఆ మాట అనండి!'
మొక్కలనుకున్నాయి– 'మా ఆకుపచ్చదనం మా స్వంతం ఎంతో ఎత్తుకు ఎదిగాం!
వేసవి కాలం వచ్చేసరికి ఇంకెక్కడి ఆకుపచ్చదనం?

అందంతో మిడిసిపడుతున్న దేహంతో ఆత్మ అన్నది–
–'ఎందుకాగర్వం? నేను వెళ్లిపోయాక తెలుస్తుంది నీకు నిజం!'–
నిన్ను ప్రేమించినవాళ్లు నీకప్పుడు గొయ్యితవ్వి పాతిపెడ్తారు.
చీమలకు, చిన్న జంతువులకు ఆహారమై నశిస్తావు.
నీ పొందు కోసం రగిలినవాడు, నీ వాసనకు పారిపోతాడు.
మాట, చూపు, వినికిడి ఇంద్రియ కిరణాలు.
నీటిని సలసలా మరిగించేది అగ్ని కిరణాలు.

ఆత్మ కిరణాలు దేహంపై పడినట్లే
అబ్దాల్ కిరణాలు నా ఆత్మపై పడినాయి.
ఆత్మలకు ఆత్మ, ఆత్మ నుంచి విడిపోయినప్పుడు
ఆ ఆత్మ, ఆత్మలేని దేహంలా విలువలేనిదౌతుంది.

అందుకే నేను నా శిరస్సును నేలపై ఉంచి మొక్కుతున్నాను.
పునరుత్థానం రోజున, కంపించే భూమి సాక్షీభూతమవుతుంది.

వేదాంతులు నమ్మరు. తర్కించేవాళ్లను గోడకు తల కొట్టుకోమను.
నీరు, నేల, బురద మాట్లాడ్తాయి. హృదయముంటే అవి అర్థమవుతాయి.

దుఃఖించే స్తంభాన్ని నమ్మనివాడు సాధువులకు అపరిచితుడు.
అతడంటాడు– విచారపు కిరణాలు మనసును భ్రమింపచేస్తాయని.
కాని, వాడి వక్రబుద్ధి, అవిశ్వాసం వాడితో ఆ మాటలనిపిస్తున్నది.
అతడు డెవిల్‌ను నమ్మడు, కాని అతడిని డెవిల్ ఆవేశించి ఉంటుంది.
డెవిల్‌ను చూడలేదా, మంచిదే! కాని నీ నుదురు నీలంగా ఉన్నది.
సంశయమున్నవాడు తార్కికుడు. నమ్మనివాడు వేదాంతి.
వాడి నమ్మకం వాడిది. అదే వాడికి అపకీర్తి తెస్తుంది.
విశ్వాసీ! నీకా నీలి నాళం రాకుండా చూసుకో!
నీలో ఇరవై ఏడు భాగాలున్నాయి. అవి ఎప్పుడో ఓనాడు బయటపడ్తాయి.
అందుకే వంచకులు ఈ మతాన్ని నమ్మడానికి ఆకులా వణుకుతారు.

పైకి అందరూ బంగారు నాణాల్లా మెరుస్తారు.
గీటురాయితో గీస్తేనే అసలూ–నకిలీ బయటపడేది.
రాత్రి చీకటిలో అసలు, నకిలీ ఒక్కలానే ఉంటాయి.
పగటి వెలుగులో నకిలీ బండారం బయటపడ్తుంది.

లక్షలాది సంవత్సరాలు 'ఇబ్లిస్' విశ్వాసులలో యువరాజు.
గర్వం పెరిగి, ఆదాముతో తలపడి, అవమానం పాలైనాడు.

## బాలమ్ ప్రార్థన

జీసస్‌లానే బావుర్ కుమారుడు బాలమ్‌కు అనేకురు శిష్యులున్నారు.
అందరూ అతడిని పూజించేవారు, ఆశీస్సులందుకునేవారు.
గర్వం పెరిగి అతడు మోసెస్‌ను ఢీకొన్నాడు. సర్వనాశనమైనాడు.
ఈ ప్రపంచంలో ఇబ్లిస్, బాలమ్ లాంటివాళ్లు లక్షలమంది ఉన్నారు.
దేవుడు ఈ ఇద్దరు దొంగల్ని ఎత్తులో వేలాడదీసి జనాలకు హెచ్చరికనిచ్చాడు.
వీళ్లను జుట్టుపట్టుకుని లాక్కెళ్లి తల నరికాడు.
నీకున్న హద్దులో ఉండు. దాటకు సరిహద్దుల్ని.

నీకన్నా గొప్పవాడితో తగవు నిన్ను ఏడవ పాతాళంలో పడవేస్తుంది.
అద్, తాముద్‌ల కథలోలా, సాధువులు అవిశ్వాసులను తిరస్కరిస్తారు.
భూమికి నెర్రెలు పడడం, రాళ్లు పడడం, పిడుగులు ఇవి హెచ్చరికలు,
ఇవన్నీ దేవుడు మానవాళికి పంపుతున్న ప్రమాద సూచనలు.
మనషి కోసం జంతువుల్ని చంపు. సరైన కారణముంటే మనిషిని చంపు.
ఏమిటా కారణం? అది విశ్వవిజ్ఞానం! సత్యం!
మానవ జంతువుకు మిగతా జంతువులన్నీ విధేయులే!
మానవుడికి వ్యతిరేకంగా మారినందుకు అవి మూల్యాన్ని చెల్లిస్తున్నాయి.
నీవు అడవి గాడిదలా మారావనుకో నీకే శిక్ష పడ్తుందో తెలుసా?
పెంపుడు జంతువు చంపబడదు.
అదే ఎదురు తిరిగిందా ఉపేక్షింపబడదు.
గాడిదకు తాను మానవుడికి ఎదురు తిరిగానన్న విషయం తెలియకపోవచ్చు.
కాని, దేవుడు ఎదురు తిరిగిన గాడిదను క్షమించలేదు.
అటువంటప్పుడు, మానవుడు ఎదురు తిరిగితే సహిస్తాడా?
బాణాలతో, ఈటెలతో పొడిచి మరీ అవిశ్వాసిని చంపమంటాడు.
అవిశ్వాసుల సంపదలన్నీ విశ్వాసులను చేజిక్కించుకోమన్నాడు.

## హారుత్-మారుత్

పొగరు తలకెక్కేసరికి, వారిని దివ్యబాణం చావుదెబ్బ కొట్టింది.
వాళ్లకు వారి పవిత్రత మీద విశ్వాసం,
దున్నపోతులు నిర్ణయించుకుంటాయా సింహం చేసే పనిని?
కొమ్ములతో సింహాన్ని వందసార్లు నెట్టేసినా, చివరకు నేలకూలాల్సిందే!
ముళ్లపందిలా వళ్లంతా కొమ్ములున్నా, దున్నపోతుకు చావు తప్పదు.
చెట్లను పెల్లగించే 'సర్సర్' గాలి పచ్చగడ్డిని మెరిసేలా చేస్తుంది.
ఎప్పుడూ నీ గొప్పతనాన్ని పొగుడుకోకు. పరాజయం వేచి వుంది.
గొడ్డలికి కొమ్మ లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా లెక్కలేదు.
కాని, ఆకుమీద దాని విసురు పనిచేయదు.
ఆకువెనక ఏదైనా గట్టి కొయ్యలాంటిది ఉంటే తప్పు!
అసంఖ్యాకంగా ఉన్న కొయ్యదుంగల్ని చూసి అగ్ని జడుస్తుందా?

అపరిమితంగా ఉన్న గొర్రెల మందల్ని చూసి కసాయివాడు భయపడ్తాడా?
వాస్తవం ముందు భ్రమ ఎలాంటిది?
నింగిని బోలుగా తలకిందులుగా ఉంచేదే శక్తి?
ఖగోళమెలా భ్రమిస్తున్నది? దివ్యచక్రానికి ఆధారమేమిటి?
ఈ కవచం లాంటి శరీరాన్ని నడిపేది ఆత్మ, గుర్తుంచుకో!
ఏటి నీటిలో బందీ అయ్యే చక్రం గాలిలో తిరుగుతుంది.
ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు, ఈ జీవనపు ఆటుపోట్లకు ఎవరు కారణం?
అన్నిటికీ మూలం ఆ పరమాత్మ, ఆ కరుణామయుడే!
'సర్సార్' గాలిని, ప్రచండ వాయువులను అతడే నియంత్రిస్తాడు.
ఆ వాస్తవమే అల్లాహ్! అతడే సృష్టికర్త!
ఆ మహాసముద్రంలో ఈ భూమి, ఆకాశం గడ్డిపోచల్లాంటివి.
అలలకు అవి అటూ యిటూ లేచి పడ్తుంటాయి.
'సర్సార్' గాలికి గడ్డి మెరసినట్లు, అవీ అనంత సముద్రంలో మెరుస్తాయి.

స్వర్గపు స్ఫటిక గవాక్షం నుండి చూస్తున్నపుడు
ప్రజల పాపాలు దుష్కార్యాలు స్పష్టంగా కనిపిస్తాయి.
ఆగ్రహంతో వాళ్లు చేతులు కొరుక్కుంటున్నారు, కాని
వాళ్లు చేస్తున్న తప్పులను గమనించడం లేదు.
అనాకారి తన ముఖాన్ని అద్దంలో చూసుకుని కోపగించుకుంటాడు.
ఆత్మవంచనాపరుడు ఎవరైనా పాపం చేయడం చూస్తే,
ఇతడి మనసులో డెవిల్ నరకాగ్నిని ప్రవేశపెడ్తాడు.

అతడి దృష్టిలో తన కోపం మతం కోసమేనని,
అహంకారం తనలో పెరిగిందని గ్రహించడు.
దివ్యాగ్నిలో లోకం హరితమయమవుతుంది.
నరకాగ్నికి సమస్తం ధ్వంసమవుతుంది.
నీకు దివ్యజ్ఞానం కలిగిందని, అజ్ఞానులను ఈసడించుకోకు.
ఆ అహంకారం డెవిల్‌కు స్థానమైన నరకాగ్నిని సృష్టిస్తుంది.
గుర్తుందా! వ్రాతగాడు ప్రవక్త చెప్పినదంతా తనకు తెలుసనుకున్నాడు.

ఆ దివ్యకాంతి తనదేననుకున్నాడు.
దేవుడి పక్షులలో తాను ఒకడిననుకున్నాడు.
దివ్యగానానికి బదులు, ప్రతిధ్వనిలా 'ఈల' వినిపించిందని తెలుసుకోడు.
పక్షుల పాట ననుకరించేవాడు పక్షి సమానమేనా?
నైటింగేల్ గొంతుననుకరిస్తావు సరే, గులాబిపై దాని భావన తెలుసా?
చెవిటివాళ్లు పెదాల కదలికను చూసి ఇతరుల మాటలను అంచనా వేస్తారు.

## చెవిటివాడు - పొరిగింటివాడు

ఒక భాగ్యవంతుడు చెవిటివాడితో దారినే వెళ్తూ అన్నాడు–
–'నీ పొరుగింటి వాడికి జబ్బు చేసింది'–
బధిరుడనుకున్నాడు– 'నాకసలే చెవుడు! జబ్బుపడినవాడు ఏమంటాడో!
నాకేం వినబడ్తుందో! తప్పు మాట్లాడకుండా నేనేం చేయగలను?
సరే, అతడి పెదాల కదలికను చూసి అర్థం చేసుకుంటాను.
నేను వెళ్లి – 'ఎలా ఉన్నావు మిత్రమా?' అంటాను.
అతడంటాడు– 'ఫరవాలేదు. కాస్త కులాసాగానే ఉన్నాను.'
నేనంటాను– 'ఏం తాగుతున్నావు?'
అతడంటాడు– 'షర్బత్! రాజమా చారు!'–
నేనంటాను– 'నీ ఆరోగ్యం బాగుపడ్తుందిలే! వైద్యుడెవరు?'–
అతడు 'ఫలానా, ఫలానా...' అని చెబ్తాడు.
నేనంటాను– 'అతడే మంచి వైద్యుడు. నీ రోగాన్ని తగ్గిస్తాడు!'
ఇలా చాల పకడ్బందీగా ప్రణాళిక వేసుకుని పొరుగింటికి వెళ్లాడు.

'ఎలా ఉన్నావు మిత్రమా!' అడిగాడితగాడు.
'చావు బతుకుల్లో ఉన్నాను'– అన్నాడు జబ్బుపడ్డవాడు.
'దైవనిర్ణయం అది, మంచిదేలే' అన్నాడు అతగాడు.
జబ్బు పడ్డవాడికి కోపం వచ్చింది. ఇదా పరామర్శ?
'ఏం తాగుతున్నావు?' –అన్నాడు చెవిటివాడు.
'విషం' –అన్నాడు పొరుగింటివాడు.
'మంచిమందు! త్వరగా నీ ఆరోగ్యం బాగుపడ్తుందిలే'–అన్నాడు వాడు.

పొరుగింటివాడికి కోపం పెరుగుతున్నది.
'ఇంతకీ వైద్యుడెవరు?' అడిగాడు చెవిటివాడు.
'అజారెల్ (మృత్యుదేవత)' అన్నాడు పొరుగింటివాడు.
'అతడి హస్తవాసి మంచిది. సంతోషం!' అన్నాడు చెవిటివాడు.
–'నేను వెళ్లివస్తాను. సరేనా!'–
పొరుగింటివాడు పళ్లు పటపట కొరికాడు.
వీడు నా శత్రువు అనుకుని వంద తిట్లు తిట్టుకున్నాడు.

అన్నం అరగకపోతే వమనం అవుతుంది.
ఆగ్రహం తగ్గించుకో! తిట్లే దీవెనలవుతాయి.
పొరుగింటివాడికి ఓపిక లేదు. తిడ్తూనే ఉన్నాడు.
–'వాడొక వెధవ! పిచ్చికుక్క! నీరసంగా ఉన్నా గాబట్టి వదిలేసాను.
కాస్త శక్తి రానీ! గాడిదను చెడామడా తిట్టిపోస్తాను!
ఎవడైనా జబ్బుపడితే అనునయ వాక్యాలు చెబుతారా?
లేక, ఇలా శత్రువులా చావుమాటలు పలుకుతారా!'

వీడిలా బుసలు కొడ్తుంటే చెవిటివాడు అక్కడ అనుకుంటున్నాడు.
–'హమ్మయ్య! చాలామంచి పని చేసాను. అతడికి మనశ్శాంతినిచ్చాను!'
ద్వేషాగ్ని రగిల్చాడని, పాపం, ఇతడికి తెలీదు.
ప్రవక్త అరబ్బుకు చెప్పినట్లు– 'చేసే ప్రార్థనలో నిజాయితీ ఉండాలి!'
చెవిటివాడి నటన చేదుఫలాన్నిచ్చింది.
పదేళ్ల స్నేహం మట్టిపాలయ్యింది.

## ఇబ్లిస్ మాటలు – సాధువుల జ్ఞానం

'అగ్ని భూమికన్నా శక్తివంతమైనది. నేను అగ్నిని, ఆదాము మట్టి.
అతడు చిమ్మచీకటి, నేను ప్రకాశవంతమైన వెలుతురును– అన్నాడు ఇబ్లిస్.
ఇబ్లిస్‌కు పరాజయం తప్పలేదు.
దేవుడన్నాడు– 'ఐహిక బంధాలను త్యజించు. దైవమార్గాన్ని అనుసరించు'–
సాధు సన్యాసులు నడిచేది, కోరుకునేది ఆ మార్గాన్నే.
'బు'జాల్' కుమారుడు విశ్వాసి అయినాడు. నోవా కుమారుడు దారి తప్పినాడు.

ఆదాం పుత్రులు చంద్రుడిలా ప్రకాశించారు.
అగ్నిపుత్రులు నల్లగా మాడిన ముఖాలతో ఉంటారు.
సాధువులు తమ జ్ఞానాన్ని సత్యశోధనలో వినియోగిస్తారు.
సూర్యుడు, కాబా నీ ఎదుట ఉండగా ఇంకేమి శోధిస్తావు?
దివ్య పక్షి గానం వినబడ్తుందా! విని దానిలో లీనమైపో!
సాధువులు, ప్రవక్తల మాటలలో మార్మిక అర్థాలుంటాయి.
వాటిని సాధారణ శాస్త్రజ్ఞానంతో వ్యాఖ్యానించలేము.
నీవు పక్షుల గానాల్ని ధ్వని ద్వారా నేర్చుకున్నావు.
నూరు అనుకరణలను చేసి నూరు ఆనందాల్ని పొందినావు.
చెవిటివాడిలా నీవు సాధు హృదయాలను గాయపరచినావు.
అతడు గొప్ప పని చేసాననుకుని ఆనందపడినాడు.
వ్రాతగాడు పక్షిననుకరించి తానే పక్షిననుకున్నాడు.
దివ్యపక్షి రెక్కలల్లార్చగానే వాడు అంధుడైనాడు, నశించినాడు.
ఎంత జ్ఞానమున్నా నీవు దివ్యజ్ఞానం ముందు అల్పుడవే!
హారుత్, మారుత్‌లు మనకంటే గొప్పవాళ్లు కావచ్చు.
కాని, వాళ్ల అహంకారం వాళ్లను అల్పులుగా చేస్తుంది.
అహంకారానికి, ఆత్మవంచనకు లొంగకు.
వంచకుల వంచనలో కరుణను వెదుక్కో.
లేకుంటే దివ్యశక్తి నిన్ను అధఃపాతాళానికి అణగదొక్కుతుంది.

పైకి వాళ్లన్నారు– 'ప్రభూ! నీ ఆజ్ఞను మించినదేమున్నది?'
లోలోపల– 'మనకన్న ఉత్తములెవరున్నారు' అనుకుంటూ.
ఆలోచన వాళ్లను ఆత్మవంచనాపరులిగా చేసింది.
వాళ్లన్నారు దేవుడితో– 'జగత్కారకా! నాలుగు మూలకాలూ నీవే!
ఆకాశం నుండి కాంతి కిరణాల తెరలతో మేము భూమిని కప్పుతాం.
ఆ పందిరి క్రింద ప్రతి పగలూ ప్రార్థనలు చేసి రాత్రికి స్వర్గానికి వస్తాం.
ధర్మాన్ని నెలకొల్పి కాంతివంతమైన ఆత్మలుగా భూమిని రక్షిస్తాం'

ఒంటరిగా నివసించే హకీమ్ మాటలను విను.
మధువును తాగినచోటే నేలపై శిరసుంచి నిదురపో!

తాగి తూలుతూ నడిచేవాడిని చూసి చిన్నపిల్లలు నవ్వుతారు.
నడుస్తూ నడుస్తూ జారి బురదలో పడుతుంటే
ప్రతివాడూ అతడిని చూసి నవ్వుతుంటాడు.
తనను పిల్లలు వెంబడిస్తున్నారన్న జ్ఞానం అతడికుండదు.
దేవుని ప్రేమలో మునిగినవాడు తప్ప మిగతా అందరూ, చిన్నపిల్లలే!
ఇంద్రియ లోలత్వం నుంచి విముక్తి పొందినవాడే జ్ఞానవృద్ధుడు.
దేవుడన్నాడు– 'ఈ ప్రపంచమొక నాటకం, కాలక్షేపం; మీరు పసిపాపలు!
ఆత్మశుద్ధి నొందినవాడే తనను పెద్దవాడిగా భావించ అర్హుడు.
మానవుల కామం చిన్నపిల్లలాట! ఈ యుద్ధాలూ, గొడవలూ అంతే!
ఈ యుద్ధాలు కఱ్ఱ కత్తులతో చేయబడేవి. వాటికో గమ్యం లేదు.
కొయ్యగుఱ్ఱానెక్కి బురాక్ నెక్కినట్లు సంబరపడతారు వీళ్లు.
అర్థం చేసుకో! పరిశుద్ధమైన ఆత్మ వస్తుంటే స్వర్గం కూడా వణుకుతుంది.
ఆత్మ దేవునివేపు వెళ్లేప్పుడు నీ గుఱ్ఱాన్ని గట్టిగా పట్టుకో?
నీ ఆలోచనలు, వ్యాఖ్యానాలు, సారాంశాలూ కొయ్యగుఱ్ఱపు స్వారీ వంటివి.

సాధువులకు శాస్త్రాలు ఎగరడం నేర్పుతాయి. సామాన్యులకవే భారమౌతాయి.
హృదయగతజ్ఞానం సాయపడ్తుంది. దేహానికి తాకితే భారమౌతుంది.
గాడిదలాగా పుస్తకాలు మోస్తే జ్ఞానం రాదు. మనసుకెక్కాలి.
జ్ఞానభారాన్ని స్వార్థం కోసం మోయరాదు. మంచిగుఱ్ఱాన్ని కొనుక్కో!
గుణశీలాలు పుట్టుకతో వస్తాయి. అవే దైవమార్గాన్ని చూపుతాయి.
రహదారే లేనప్పుడు దారి పిశాచమెక్కడుంటుంది?
కారణం లేని కార్యముంటుందా?
గులాబీ అక్షరాలలో గులాబీకోసం వెదుకుతున్నావా?
నీటిలో చంద్రుడిని చూసి పట్టుకోబోతున్నావా?
శుద్ధి చేయబడిన ఇనుములా తుప్పును వదిలించుకో!
కళాయి పోని అద్దంలా స్పష్టంగా ప్రతిబింబించుకో!
అహంకారాన్ని విడనాడి పరిశుద్ధుడివికా!
ప్రవక్త వాక్యాలను త్రికరణశుద్ధిగా విశ్వసించు, ఆచరించు!

ప్రవక్త అన్నాడు– 'నా ప్రజల్లో కొందరు నా ఆశయాలను,
గుణాలను కలిగి ఉన్నారు. వారికి నాకున్న కాంతి లభిస్తుంది.
అర్థం చేసుకో– 'నేను పగలు కుర్దును, రాత్రి అరబ్బును' అంతే!

## గ్రీకులు - చైనీయులు

చైనా వాళ్లన్నారు– 'మేం గొప్ప కళాకారులం'
గ్రీకులన్నారు– 'మా శక్తిసామర్థ్యాలు ఇంకెవరికీ లేవు!'
సుల్తాను వాళ్లకు పరీక్ష పెట్టి ఋజువు చేయమన్నాడు.
వాదనలు మొదలైనాయి. గ్రీకులు ఓడిపోయి తప్పుకున్నారు.
చైనావాళ్లన్నారు– 'మాకు చెరొక గది ఇవ్వండి'
గ్రీకులకు, చైనావాళ్లకు ఎదురెదురు గదులివ్వబడినాయి.
చైనావాళ్లడిగారు– 'ప్రభూ! మాకు వంద రంగులిప్పించండి'–
గ్రీకులన్నారు– 'మాకు రంగులక్కరలేదు. తుప్పు వదిలిస్తాం మేము'–
చైనీయులు తమ గదిని వివిధ వర్ణాలతో అద్భుతంగా అలంకరించారు.
సుల్తాను ఆ గదిని చూసి విభ్రముడై మారు మాటాడలేదు.
గ్రీకుల గదిలోకి వెళ్లి చూసాడు. ఎక్కడా చిన్ని మరక కూడా లేదు.
పైపెచ్చు చేనీయుల గదిలోని వర్ణాలు ఈ గదిలో కనిపించాయి.
మరింత ప్రకాశవంతంగా, మరింత శోభాయమానంగా.

అనేక వర్ణాల నుంచి వర్ణరహిత స్థితికి రావడానికి మార్గమున్నది.
రంగు అనేది మబ్బుల్లాంటిది. ఆ రంగు నక్షత్రాల సూర్య, చంద్ర ప్రసాదలబ్ధం.
గ్రీకులు సూఫీ వేదాంతులు. వారు జ్ఞానచర్చలు చేయరు.
వారు తమ ఎద నుంచి కామక్రోధ లోభ మాత్సర్యాలను తొలగించారు.
అద్దం స్వచ్ఛంగా ఉన్నపుడే అది స్పష్టంగా అన్ని రంగులను ప్రతిబింబిస్తుంది.
మోసెస్ తన అద్దం లాంటి హృదయంలో అనంత శక్తిమంతుడి నుంచుకున్నాడు.
ఆ అనంతశక్తిని తనలో పట్టుకోగలిగిన కలశమెక్కడున్నది?
సంఖ్యలతో, పరిమాణంతో లెక్కించబడేవేవీ ఆ శక్తిని ఆపలేవు.
మోసెస్ హృదయమే అతడు. అతడే మోసెస్ హృదయం.
అందుకనే అతడి హృదయం అద్దంలా ప్రతిబింబిస్తుంది.

హృదయాన్ని పరిశుద్ధ పరచుకున్న వారు ధన్యులు.
వారు ఇంద్రియ వాసనలకు దూరంగా ఉంటారు.
ఆలోచనలు నశించి కాంతిని పొందుతారు.
సత్యాన్ని తెలుసుకుని జ్ఞానవంతులౌతారు.
మృత్యువంటే సాధారణులకు భయం. సూఫీలకు తిరస్కారం.
వారి హృదయాలనెవ్వరూ జయించలేరు. ముత్యానికి దెబ్బ తగలదు.
వ్యాకరణం, న్యాయాలతో పనిలేదు. ఆత్మ పేదరికాన్ని అవలంబిస్తారువాళ్లు.
ఎనిమిది స్వర్గాలు ఏర్పడినప్పటినుంచి వారి హృదయాలు ప్రేమను గ్రహిస్తాయి.
అంతరిక్షంలో అనేక రంగులున్నా సూఫీలు ఒకే వర్ణం 'ప్రేమను' స్వీకరించారు.

## ప్రవక్త - జ్యేదు

ప్రవక్త అడిగాడు– 'ఓ జ్యేదూ! సహచరుడా! ఎలా ఉన్నావు?'–
అతడన్నాడు– 'నేను దేవుడి సేవకుడిని!'
ప్రవక్త అన్నాడు– 'నీ విశ్వాస పుష్పము వికసించినదా?'
అతడన్నాడు– 'పగలు నాకు దాహం వేసింది. రాత్రి నిద్రపట్టలేదు.
దైవప్రేమ నా దుఃఖాల్ని కాల్చివేసింది.
నేను రేయింబవళ్లను, కవచాన్ని చీల్చిన బల్లెంలా దాటిపోయాను.
ఆ ప్రదేశంలో లక్షలాది సంవత్సరాలు ఒక గంటలా కానవస్తాయి'–
ప్రవక్త అడిగాడు– 'నీవిక్కడ నుంచి తీసుకుపోయే కానుక ఏమిటి?
ఈ ప్రయాణం నుంచి నీతో తెస్తున్న బహుమతి ఏది?'–
జ్యేదు అన్నాడు– 'అందరికీ ఆకాశం కనిపించేచోట
నాకు అష్టస్వర్గాలు, సప్త నరకాలు, అక్కడి నివాసులు కనిపిస్తారు.
వారిని ధాన్యపుగింజల్ని లెక్కించినట్లు స్పష్టంగా లెక్కించగలను'–
పాములకు చేపలకు తేడాను చెప్పగలుగుతున్నాను.
అనటోలియన్లు, ఇథియోపియన్లు, 'తెలుపా, నలుపా'– చూడగలుగుతున్నాను.
తల్లి గర్భంలో ఉన్న శిశువు ఈ ప్రజలకు దూరంగా ఉంటుంది.
దేవుని చిహ్నాలు ఆ శిశువుపై స్పష్టంగా ఉంటాయి.
ఆత్మలు వివిధ చోట్ల జన్మించడానికి సిద్ధంగా ఉంటాయి.
అన్ని రకాల మానవజాతులు ఆ శిశువులు తమవనుకుంటాయి.

ఇంద్రియకణం తెల్లగా ఉన్నా, శిశువు జన్మించాక రంగు బయటపడ్తుంది.
ఇథియోపియన్లకు, అనటోలియన్లకు తేడా తెలుస్తుంది.
పునరుత్థానం రోజున ఎవరి ముఖాన నలుపుంటుందో స్పష్టమౌతుంది.
హిందువులు, టర్కీవాళ్లు వారివారి ఆత్మలను బట్టి నిర్ణయింపబడతారు!'
జ్యేదు అడిగాడు– 'ఇంకా నేను చెప్పడానికి అనుమతి ఉన్నదా ప్రభూ!
లేక ఈ జ్ఞానాన్ని తెరదించి నాలో దాచుకోవలెనా?
ఖర్జూరానికి విల్లో చెట్టుకు, అసలు నకిలీ నాణేల తేడాను చెప్పనా!
ఎడమ పక్క ఉన్నవాళ్ల హస్తాలు నరికివేయబడతాయి.
వాళ్ల ముఖాలు నల్లగా మసి పూసినట్లుంటాయి.
ఆత్మవంచకుల సప్తదోషాలను, మచ్చలేని చంద్రుని కాంతిలో వివరించనా!
వెలివేయబడినవాళ్లను ప్రవక్తల భేరీనాదాల మధ్య ప్రకటించనా!
అవిశ్వాసులకు స్వర్గనరకాలను, వాటి మధ్య ప్రదేశాన్ని చూపించనా!
కాథర్ సముద్రాన్ని, అలలను, వాటి ఘోషను ప్రదర్శించనా!
దాహార్తితో ఆ సముద్రం వేపు పరిగెత్తుతున్నవారిని పిలువనా!
స్వర్గలోకపు జనులు ఆనందంతో కౌగిలించుకుంటున్నారు.
ఒకరినొకరు గౌరవించుకుంటున్నారు.
నరకలోకపు అగ్నిలో కాలుతున్న వారి కేకలవిగో!
నా చెవులు చిల్లులు పడ్తున్నాయి. వాళ్ల దుఃఖపు కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి.
ఇవన్నీ నేను గ్రహించిన విషయాలు!
దేవుని వార్తాహరుడైన ప్రవక్త నన్ను క్షమించునుగాక!'

అలా మత్తులో విశృంఖలంగా మాట్లాడబోతున్న జ్యేదును ప్రవక్త వారించాడు.
–'నీ గుర్రం కళ్లాలు బిగబట్టు! దేవుని కిరణాలకు అడ్డులేదు'–
అద్దం, తరాజు గీటురాళ్లవంటివి.
అద్దంలో ప్రతిబింబం, త్రాసులో ప్రవర్తన తూచబడతాయి.
అవి అసత్యాన్ని మాట్లాడవు. రెండు వందవేళ్లు నీ దగ్గరున్నా,
వాటిని, 'నా గొప్పతనాన్ని చూపించు, లోపాల్ని బహిర్గతం చేయకు'–
అంటే అవి నీ మాట వింటాయా? నీ గడ్డం, మీసాల్ని చూపిస్తాయవి!

జ్యేదు అన్నాడు– 'ఎందుకు సత్యమనే సూర్యుడిని, శాశ్వతుడిని దాచేయాలి? వాటిని దాచగల శక్తి ఎవరికీ లేదు కదా!'
ప్రవక్త అన్నాడు– నీ కంటి ముందు వేలినుంచు. అంతా చీకటే.
వేలి చివరతో సూర్యచంద్రుల కాంతుల్ని ఆపగలుగుతున్నావు.
సముద్రపు లోతును వీక్షించు. సల్సాబిల్, జంజాబిల్‌లు జలధారలు కదా!
వీటిని నియంత్రిస్తున్నదెవరు? స్వర్గపు నాలుగు నదుల కర్త ఎవరు?
ఆ నదులు, ఈ జలధారలు ఆ దివ్యశక్తిచే నియంత్రింపబడ్తున్నాయి.
వాటిని విషపూరితం చేసినా, అమృతతుల్యం చేసినా అది అతడి ఇష్టం.
పంచేంద్రియాలను హృదయం నియంత్రిస్తుంది.
మోసెస్ చేతిలోని కర్రలా కాళ్లూ చేతులు కదుల్తాయి.
చరణాలు కదుల్తాయి. హస్తాలు కవిత్వం లిఖిస్తాయి.
శత్రువుకు సర్పంలా కనిపిస్తుంది. స్నేహితునికి సాయమందిస్తుంది.
ఆహారాన్ని తినడానికి చెంచాగా, దెబ్బకొట్టే పిడికిలిగా మారుతుంది.
హృదయం ఏం చెబితే 'చేయి' అది చేస్తుంది. మిగతావీ అంతే!
హృదయంపై ఉన్నా సులేమాన్ ముద్ర ఇంద్రియాలను అదుపులో ఉంచుతుంది.
కర్మేంద్రియాలను అదుపులో ఉంచడం తేలికే, జ్ఞానేంద్రియాలకన్నా!
దశేంద్రియాలు, సప్తాంగాలు ఇంకా మిగతావి
ఇవన్నీ సులేమాను ముద్ర ఉన్న హృదయంచే అదుపులో ఉంటాయి.
ఇక్కడ వంచనకు తావులేదు. మూడు దెయ్యాలూ ఏం చెయ్యలేవు.
నీవు జగజ్జేతవవుతాయి. నీపేరు చిరస్థాయిగా నిలుస్తుంది.
అద్దం, తూనికలలో స్వచ్ఛంగా తూచుకో నిన్ను నీవు.

## లక్మన్–మిగతా సేవకులు

ఓ యజమానికి లక్మన్, మిగతా సేవకులుండేవారు.
తోటలోంచి పళ్లు తీసుకువచ్చి తాజాగా యజమానికిచ్చేవారు.
లక్మన్ అనేవాడు కారునలుపు. కాని వాడికి ఆత్మశోధన ఎక్కువ.
సేవకులు తోటలోని పళ్లన్నీ కోసుకుతిన్నారు.
తిని ఆ నేరాన్ని లక్మన్‌పైకి నెట్టారు.
యజమాని లక్మన్‌ను పిలిచి అడిగాడు. లక్మన్ అన్నాడు–

–'ప్రభూ! అవిశ్వాసుడైన సేవకుడు దేవుడిచే శిక్షింపబడతాడు.
మమ్మల్ని పరీక్ష చేయండి! తలకో గ్లాసెడు వేడినీళ్లిప్పించండి.
మేం తాగాక మైదానంలో పరుగెత్తుతాం.
మీరు గుర్రంపై మమ్మల్ని అనుసరించండి.
మీ కళ్లముందే దోషులెవరో బయటపడతారు'–
యజమానికి విశ్వాసం కలిగింది. అదే పని చేసాడు.
–పరిగెత్తుతున్న సేవకులకు తాగిన వేడినీళ్లు పనిచేసాయి.
వాళ్లు వాంతులు చేసుకున్నారు. పళ్లు బయటపడ్డాయి.
లక్మన్ వమనంలో స్వచ్ఛమైన నీరున్నది.
లక్మన్‌కే ఇంత జ్ఞానముంటే, సృష్టికర్త సంగతేమిటి?

## జ్యేదు - ప్రవక్త

జ్యేదూ, లే! నీ ఆత్మాగుర్రానికి జీనూ, కళ్లేన్ని వేయి!
నిగూఢత్వపు తెరల్ని తొలగించే ప్రయత్నం కాసేపు ఆపు.
దేవుడు కావాలనే ఆ తెరల్ని కొంతకాలముంచుతాడు.
ఎవరి నమ్మకాలు, ఆనందాలలో వాళ్లని కొంతసేపు ఓలలాడనీ!
నిరాశలో ఉన్నవాళ్లు కూడా తమ పూజలను మానరాదు.
గుర్తుంచుకో! దేవుడు అందరిపైనా తన కరుణను వర్షిస్తాడు.
విజేత, ఖైదీ, ప్రతి ఒక్కడికీ ఆశ, భయం ఉండాలని అనుకుంటాడు.
భయం, ఆశ అనేవే ఆ తెరల వెనక ఉండే నిగూఢ విషయాలు.
ఆ తెరను తొలగిస్తే అవింకెక్కడుంటాయి?

ఒక యువకుడు అటుగా వెళ్తూ నదీతీరాన ఓ మనిషిని చూసాడు.
–'ఇతడు మన సులేమాన్ కదా! ఇక్కడెందుకున్నాడు?
జాలరి వేషంలో ఉన్నాడే! మారువేషమా? కారణమేమిటి?
మరలా, సులేమాన్ ప్రభువయ్యేవరకూ అతడి సంశయం తీరలేదు.
అంతవరకూ సులేమాన్‌ను ఆవేశించిన భూతం తొలగింది.
అతడి అదృష్ట ఖడ్గం డెవిల్ రక్తాన్ని చవిచూసింది.
ఉంగరాన్ని తన వేలికి తొడుక్కోగానే దెయ్యాలు నిష్క్రమించాయి.

ఆ యువకుడికి సందేహం తీరింది. జాలరి గుప్పెట్లో ఉంగరం ఉంది.
ఉంగరాన్ని అన్వేషిస్తున్నవాడు జాలరి రూపంలో ఉన్న సులేమాన్!
గుప్పెట మూసి వున్నపుడు ఉద్వేగం ఉంటుంది.
కావాలసింది దొరికేంత వరకు అన్వేషణ సాగుతుంది.
ఆకాశంలో మేఘాలుంటేనే వర్షం కురుస్తుంది.
వర్షం కురిస్తేనే భూమి సస్యశ్యామలమవుతుంది.

దేవుడన్నాడు– 'వాళ్లకు నిగూఢ విషయాలపై మక్కువ.
అందుకే పరిగెత్తే ప్రపంచపు గవాక్షాన్ని మూసి ఉంచాను
వాళ్లు చీకట్లో సరైన దారి వెదుక్కోవాలి'–

ఒక్కోసారి పరిస్థితులు తారుమారవుతాయి.
దొంగ, న్యాయాధిపతిని ఉరికంబమెక్కిస్తాడు.
సుల్తాను సామాన్యుడికో, తన బానిసకో సేవకుడవుతాడు.
కనిపించని దేవుడిని అందుకే కనికరించమని వేడుకోవాలి.
ముఖస్తుతి చేసేవాడిని, సరైన సేవకుడిని ప్రభువు గమనిస్తాడు.

విశ్వాసి అయిన సామంతరాజు రాజుకు దూరంగా ఉన్నా ఏ ప్రలోభానికీ లొంగడు.
అతడు రాజుకు దగ్గరగా ఉన్న ఇతర అధికారులకన్నా మేలైనవాడు.
ఎదురుగా ఉండి చేసే లక్ష పొగడ్తలకన్నా దూరాన ఉండి చేసే ఒక్క పని చాలు.
అందుకే అతివాగుడు కన్నా నిశ్శబ్దం ఎప్పుడూ గొప్పదే!
సూర్యుడి కాంతి చాలదా దేవుడి గొప్పతనాన్ని చెప్పేందుకు?
దేవదూతలు, ప్రవక్తలు సత్యాన్ని ప్రవచిస్తున్నారు కాదా!
దేవుడే సత్యాన్ని వెల్లడించినపుడు, ఈ దేవదూతల అవసరమేమిటి?
సూర్యకిరణాల కాంతిని తట్టుకోలేని గబ్బిలాలకు ఆశ ఎక్కడిది?
దివాంధాలకు దారిచూపించేవాళ్లే సాధువులూ, దేవదూతలూ!
చంద్రుడి వివిధ దశల్లో కాంతిలా దేవదూతల శక్తిలో తేడాలుంటాయి.
వాటి రెక్కల కాంతుల్లో తేడాలుంటాయి.
మానవుడి తెలివితేటల్లో, జ్ఞానంలో తేడాలున్నట్లే అవీనూ!
చంద్రుడి కాంతిని కూడా భరించలేనివారికి తారాదీపాలున్నాయి.

## ప్రవక్త చెప్పిన మాటలు

ప్రవక్త అన్నాడు– నా సహచరులు నక్షత్రాలు.
బాటసారుల చేతిలోని దీపం వంటివారు. డెవిల్ పాలిటి తోకచుక్కలు.
సూర్యకాంతిని చూడగలిగినవారికి, వెన్నెల తారాదీపాల సాక్ష్యమక్కరలేదు.
చంద్రుడిలా ప్రవక్త నేలతో, మబ్బుతో, నీడతో అన్నాడు–
నేనూ మీలాంటివాడినే, ఈ కాంతి దేవుడి నుండి నాకు వచ్చింది.
నా నలుపుదనం పోయి నాకు ప్రకాశవంతమైన కాంతి కలిగింది.
సూర్యునితోపోలిస్తే నాకు మరకలున్నవి. మానవ ఆత్మలకన్నా మెరుగైన కాంతి ఉన్నది.
నా కిరణాలను మీరు ఓర్చుకోగలరు. సూర్యకిరణాలను భరించలేరు.
తేనె, నిమ్మరసం కలిసిన నేను హృయద వేదనను తొలగించగలను.
స్వస్థత చేకూరినాక నిమ్మరసాన్ని ఆపి, తేనెను తీసుకుంటూ ఉండు.
నీ హృదయ సింహాసనం పవిత్రంగా ఉంటే, దేవుడు దానిపై ఆసీనుడౌతాడు.
అప్పుడు నీకు మధ్యవర్తులతో పనిలేదు.

## జ్యేదు కథ

సూర్యుడు వచ్చినాక అదృశమైన నక్షత్రంలా జ్యేదు పారిపోయినాడు.
నీకేం కనిపిస్తాడు. అతడు అతడికే కనిపించనివాడైనాడు.
పాలపుంతలో నీక్కావల్సిన నక్షత్రాన్ని వెదకగలవా!
గడ్డివాములో సూది దొరుకుతుందా?

దైవజ్ఞానం ముందు మన ఇంద్రియజ్ఞానమేపాటిది?
సముద్రపుటలల ముందు కలశంలో నీళ్లజల్లులేపాటి?
రాత్రి రాగానే మరల నక్షత్రాలు రాజ్యమేలుతాయి.
ఇంద్రియాలు మేల్కొని దేవుని స్తుతిస్తాయి.
పునరుత్థాన దినం నాడు ధూళిలో కలిసినవారూ సజీవులౌతారు.
సమస్త ప్రజలూ ఉనికివేపు పరుగులు దీస్తారు.
ఆ ఉనికిలేని ప్రదేశం దేవుని అధీనంలో ఉన్నది.
డెవిల్ పెద్దపేగులను నీటిగొట్టాలుగా మారుస్తుంది.
దేవుడు ఆ భయాన్ని, నీటి వరదను తగ్గించి శక్తినిస్తాడు.

నీవు భయంతో వణుకుతున్నావు. ఆత్మవేదనతో కంపిస్తున్నావు.
ఆత్మవేదనంటే ఏమిటి? మృత్యువు వేపు నడక. జీవజలాన్ని కోల్పోవడం.

జనాల కళ్లు నేలపైన, మృత్యువుపైనా ఉంటాయి.
జీవజలంపై వాళ్లకు వంద సందేహాలుంటాయి.

అలసట వస్తే నిద్రపో! తెల్లారేసరికి సందేహాలు తగ్గుతాయి.
అలసట వస్తే నిద్రపో! తెల్లారేసరికి సందేహాలు తగ్గుతాయి.

రాత్రిపూట పగటి వెలుగుకై అన్వేషించు.
చీకటితో కలిసి జీవించేదే జీవజలం!

బద్ధకంగా నిద్రపోయేవాడినెలా మేలుకొలపడం?
గాఢనిద్ర, గట్టి భోజనం మంచి స్నేహితులు.
వ్యాపారి నిద్రపోతే దొంగకు పర్వదినం.
నీకు అయిదుగురు శత్రువులు. వారు అగ్నిసంభూతులు.

అగ్ని–జలానికి, దాని స్నేహితులకూ శత్రుత్వం.
కామాగ్ని పాపానికి, తప్పులకు మూలతత్వం.

బయట అగ్నిని నీళ్లతో చల్లార్చగలం.
కామాగ్ని నరకాగ్నిలో భాగం. దాని మంట భరించలేం.

కామం, కోరికల మంటలను చల్లార్చే జలమే దైవకాంతి.
అబ్రహాం వెలుగును నీ మార్గదర్శిగా ఎంచుకో!

ముస్లిముల కాంతి వెలుగులో అవిశ్వాసుల చీకటి తొలగాలి.
మీ దేహాలు పవిత్రమైన చిదుగుల్లాంటి సుగంధపూరితాలు
అవిశ్వాసుల దేహాలు దుర్గంధ భూయిష్టమైన మాంసశకలాలు.

కొయ్యముక్కల్లాంటి దేహాన్ని అగ్నిలో వేస్తున్నకొద్దీ అది మండుతూనే ఉంటుంది.
వెయ్యడం ఆపేయ్, అగ్ని దానంతటకదే చల్లారిపోతుంది.

దైవభీతిచే గులాబిరంగులో ఉన్న వదనాన్ని
ఏ అగ్నీ నల్లబరచలేదు.

## మదీనాలో అగ్నిప్రమాదం

ఉమర్ కాలంలో మదీనాలో తీవ్రమైన అగ్ని ప్రమాదం జరిగింది.
బండరాళ్లు కూడా ఎండుకొమ్మల్లా భగ్గున మండి మసైపోయాయి.
ఇళ్లు, భవనాలు, ఎత్తైన చెట్లపైన ఉన్న పక్షిగూళ్లపైకి కూడ అగ్ని ఎగసింది.
సగం నగరం కాలిపోయింది. ఎన్ని నీళ్లు కుమ్మరించినా అదుపులోకి రాలేదు.
కొందరు నీళ్ల తిత్తుల్ని, నిమ్మరసాన్ని మంటలపై జల్లినారు.
అనంతమైన ప్రచండాగ్నిలా ఆ అగ్ని మరింత విజృంభించింది.
వాళ్లు ఉమర్‌తో మొరపెట్టుకున్నారు– 'అగ్ని చల్లారడం లేదు!'–
ఉమర్ అన్నాడు– 'అది దేవుని హెచ్చరిక! మీ తప్పుల నుంచే పుట్టిందది!'
దయకలిగి ప్రవర్తించండి. లోభత్వాన్ని విడనాడండి!'–

వాళ్లన్నారు– మా తలుపులు అతిథి అభ్యాగతులకు తెరిచే ఉన్నాయి.
యాచకులకు రొట్టె, నీరు మేం ఇస్తూనే ఉన్నాం!'–

ఉమర్ అన్నాడు– 'ఆచారం కొద్దీ ఇస్తున్నారు. అంతేకాని,
మీ దాతృత్వంలో ఎక్కడా ప్రేమ, కరుణ లేవు కదా!
మీ పేరు ప్రతిష్ఠలు నిలబెట్టుకోడానికి మీరు దానధర్మాలు చేస్తున్నారు.
అంతేకాని, దైవభక్తితో, కరుణతో, దైవభీతితో చేయడం లేదు.
సంపదలనేవి ధాన్యపు విత్తనాలు, అర్హత లేనివారికి దానం చేయరాదు.
దొంగకు కత్తి ఇవ్వకూడదు. అవిశ్వాసులకు ధర్మం చేయకు.
మూర్ఖులు మూర్ఖులకు సాయం చేస్తారు. దానిని దానధర్మంగా లెక్కకడ్తారు.'

## అలీ – శత్రువు

దేవుని సింహం అలీ ఒకనాడు తన శత్రువును ఓడించాడు.
శత్రువు ఓడిపోతూ ఆలీ మొహంమీద ఉమ్మేసాడు.
ఎవరి వదనానికైతే చంద్రుడు కూడా నమస్కరిస్తాడో,
ఆ ముఖంమీద ఆ శత్రువు ఉమ్మివేసాడు ఛీత్కరించుకుంటూ!
అతడిని చంపబోతున్న ఆలీ తన ఖడ్గాన్ని పడవేసాడు.
శత్రువు ఆశ్చర్యంతో ఓ క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు.

శత్రువు అడిగాడు– ఎత్తిన కత్తిని నా గుండెలో దించకుండా ఎందుకు పడవేసావు?
దేన్ని చూసి నీవు నాపై యుద్ధాన్ని విరమించి, నా ప్రాణాన్ని కాపాడినావు?
ఎందుకు మెరుపులాంటి నీ ఆగ్రహం ఒక్కక్షణంలో చల్లారింది?
నా హృదయంలో వెలిగిన జ్యోతిని, కాంతిని నీవేమైనా చూసావా?
జీవితం కన్నా, ఉనికికన్నా, స్థలకాలాలకన్నా మించిన దానిని గమనించావా?
సావాసంలో దేవుడి సింహానివి. కరుణలో నీసాటి ఎవరు?
దానగుణంలో నీవు మోసెస్ మేఘానివి, ఎడారిలో విందునిచ్చినది.
మేఘాలు గోధుమలనిస్తాయి. మనిషి కష్టంతో అది రొట్టెగా మారుతుంది.
మోసెస్ మేఘం అటువంటి శ్రమలేకుండా పక్వాహారాన్నిచ్చింది.
నలభై ఏళ్లపాటు 'మన్నా' తిని వాళ్లలా జీవించారు.
వాళ్లలో వంచనా గుణం ఎక్కువైనాక, వాళ్లకు కాయగూరలపై ప్రీతి ఏర్పడింది.
వంచనకు వాళ్లు బానిసలు కాగానే 'మన్నా' రావడం ఆగిపోయింది.

ప్రవక్త 'నేను ప్రభువుతో ఉన్నాను' అన్నమాటలకర్థం
నాకు కావలసిన అన్నపానీయాలు అన్నీ ప్రభువు అందిస్తున్నాడని.
ఏ సందేహమూ లేక ఈ మాటలను విశ్వసించు,
పాలూ, తేనె ఏ కష్టం లేకుండా నీ నోటికందించబడ్తాయి.
వ్యాఖ్యానాలు చేయడం బహుమతిని తిరస్కరించడం లాంటిది,
ఎందుకంటే వ్యాఖ్యాతకు ఎక్కడో సంశయం ఉందన్నమాట.
సత్యం గింజలోన ఉన్న పప్పు. వ్యాఖ్యానంపైన ఉండే పెంకు.
ప్రవక్త మాటలను కాదు, నిన్ను మార్చుకో!
గులాబి తోటను కాదు నీ దృష్టిని సరిచేసుకో!

## శత్రువీరుడు - ఆలీ

శత్రువీరుడు 'ఆలీ'తో అన్నాడు– 'ఆలీ! ఏం చూసావు నీవు?'–
సహనమనే నీ ఖడ్గం నా ఆత్మకు రంధ్రం చేసింది.
నీ జ్ఞానజలం నా నేలను ఫలవంతం చేసింది.
ఇవి దేవుని రహస్య కార్యాలని తెలుసు. కత్తి లేకుండా చంపడం.
ఇంద్రియరహితుడిచ్చే కానుకలివి.

కళ్లూ చెవులూ గ్రహించలేని కోటి మధువులివి.
అంతరిక్షంలో విహరించే డేగా! నీవే అద్భుతాన్ని చూసావు?
నీ కళ్లు అపురూప విషయాల్ని చూస్తాయి. మావి మామూలువే చూడలేవు.
ఒకడు చంద్రుడి వెన్నెలను ఆనందిస్తాడు.
మరొకడికి లోకమే చీకటిగా కనిపిస్తుంది.
ఇంకొకడికి ముగ్గురు చంద్రుళ్లు కనిపిస్తారు.
ముగ్గురికీ కళ్లూ చెవులు సరిగానే పనిచేస్తున్నాయి.
కాని, వారికీ, వేర్వేరు భావనలెందుకు కలిగాయి?
ఇదేమైనా కనికట్టా? నిగూఢ రహస్యమా!
నీకు తోడేలు రూపం! నాకు జోసెఫ్ అందం!
పద్ధెనిమిది వందల ప్రపంచాలుంటే, ఎవరికి ఎన్ని తెలుస్తాయి?

ఆలీ! ఈ రహస్యాలను వివరించు! నీ శీతాంశువులను నాపై కురిపించు!
వెన్నెల మాట్లాడితే బాటసారులు సరైన దారిలో నడుస్తారు.
రాత్రి భూతాలు రహిస్తాయి. దారి స్పష్టంగా కనిపిస్తుంది.
మాటలు లేకుండానే చంద్రుడు మార్గదర్శకుడైనాడు.
మాట్లాడే వెన్నెలుంటే కాంతి ద్విగుణీకృతమవుతుంది కాదా?

నీవు జ్ఞాననగరపు ద్వారానివి. క్షమాసూర్యుడి కిరణానివి.
ద్వారాన్ని తెరచి ఆ మహాజ్ఞానాన్ని ఆవగింజంత మాకివ్వు.
సాటిలేని ఆ మహోన్నతుడి గది ముందు మమ్మల్ని నిలబడనీ.
ద్వారం తెరవబడినాకే లోనున్న అద్భుతాలు అవగతమవుతాయి.
అద్భుతాన్ని వీక్షించినాక ఆలోచనలకు రెక్కలు వస్తాయి.
ఒక్కసారి శిధిలాలలో నిధి దొరికితే, అతడు ఎప్పుడూ శిధిలాలను వెదుకుతూనే ఉంటాడు.

ఒక సాధువు దగ్గర ఆణిముత్యం లభించాక
సత్యాన్వేషి మిగతా సాధువుల దగ్గరకు పోయి శుశ్రూష చేస్తాడు.
ఎన్నో ఏళ్లు ఆలోచన తన పాదాలపైననే నడుస్తుంది.
ఏదో దివ్యసందేశం దానికి రెక్కలనిస్తుంది. ఆలోచన ఎగుర్తుంది.

## శత్రువీరుడు - ఆలీ సంభాషణ

‘ఓ దేవుని సింహమా? ఎందుకు నన్ను చంపకుండా వదిలేసావు?
వివరించు! నా ఆత్మను ఈ దేహంలో ఉత్తేజపరచు.
అంతరిక్షం నుంచి పిండంలోకి ప్రవేశించే ఆత్మను మేల్కొలుపు.
కాసింత జ్ఞానశక్తినివ్వు. సూర్యుని కిరణాలను సోకనివ్వు.
తారల నుంచి దానికి కాస్త మెలకువ కలిగింది; చంద్రుడి దీవెనలతో,
సూర్యుని నుంచి అద్భుత జ్ఞానమందనీ!
గర్భగుడిలోని పిండానికి సూర్యుని కిరణమెలా సోకుతుంది?
మన ఇంద్రియాలకందని ఆ రహస్యమేమిటి?
గనిలో స్వర్ణమెలా ఏర్పడింది?
కెంపుకు ఎరుపురంగు, గుర్రపునాడాకు విద్యుత్ మెరుపు ఎలా వచ్చాయి?
కాయ పండుగా మారడం, గుండె భయానికి లోను కావడం? ఎందుకు?
దైవ రహస్యం తెలిసినవాడా! నా ప్రశ్నలకు జవాబు చెప్పు!
‘అంఖా’ను వేటాడే మహాడేగా! శత్రుసైన్యాన్ని ఏకాకిగా ఓడించే వీరుడా!
నీవొక్కడివే సైన్యానివి. నీ డేగకు నీ బానిస లొంగిపోయినాడు.
అందుకే ప్రతీకారం స్థానంలో కరుణ ఉన్నది’-

## ఆలీ సమాధానం

నేను దేవుడి తరపున యుద్ధం చేస్తున్నాను.
నా దేహపు ఆజ్ఞలకు లోబడి కాదు.
నేను దేవుడి సింహాన్ని, ఉద్వేగపు సింహాన్ని కాదు.
యుద్ధంలో నేను దేవుడి ఖడ్గాన్ని! నేను నేను కాదు!

నాలోని నిన్ను తొలగించాను. నాలో ఉన్నది దేవుని శక్తి.
దేవుడు సూర్యుడు. నేను నీడ! నేను ప్రతీహారిని, తెరను కాదు.
నేను ముత్యాలు పొదిగిన ఖడ్గాన్ని! నేను చావును కాదు జీవనాన్నిస్తున్నాను.
దేవుని ప్రార్థించనివాడిని కామక్రోధ లోభ గాలులు ఈడ్చుకుపోతాయి.
నేను గడ్డిపరకను కాదు. క్షమాగుణమున్న పర్వతాన్ని.
ఎంత పెద్ద గాలైనా పర్వతం ముందు తలవంచుతుంది.

మామూలు గాలి కాస్త దుమ్మును తొలగిస్తుంది.
కామక్రోధ లోభపు గాలులు దుమ్మును తమతో మోసుకువస్తాయి.
నేను పర్వతంగా దేవుని లోగిల్లో ఉంటాను.
నేను గడ్డిపోచనైతే నేను దేవుని గడ్డివాములో భాగాన్ని.
నా నిరీక్షణ అతడికొరకే! నా నావకు కర్ణధారి అతడి ప్రేమ.

ఆగ్రహం రారాజు. కాని అది నాకు బానిస. నేను దానికి కళ్లేలు వేసాను.
క్షమాఖడ్గం నా ఆగ్రహపు మెడ నరికింది.
దేవుని ఆగ్రహం నాపై కరుణగా మారినది.
నా పైకప్పు చెదరి నాపై అద్భుత గులాబితోట వెల్లివిరిసింది.
ఏదో వేరే ఆలోచన నాలో ప్రవేశించగా, నా కత్తి ఒరలోకి వెళ్లినది.
నా పేరును అతడు ప్రేమిస్తాడు. నా కోరికను అతడు ద్వేషిస్తాడు.

నా దాతృత్వాన్ని అతడు అంగీకరిస్తాడు, నా ఉనికిని అతడు నిరాకరిస్తాడు.
నా లోభత్వం, దాతృత్వం అన్నీ దేవుడి కొరకే!
నేను దేవుడికే తక్క అన్యులకు చెందను.
నేనేదో ఆచారంలా దానిని చేయడం లేదు.
అది నాలో దానంతట అదే వెలువడిన భక్తిభావం.
శోధన నుంచి నాకు విముక్తి. దేవుని అంగీ నాకు ఆసరా!
ఎగిరేప్పుడు గమ్యంపైనే నా దృష్టి.
గుండ్రంగా తిరిగేప్పుడు అక్షంపైనే నా చూపు.
బరువును ఎక్కడకు, ఎంత మోస్తున్నానో నాకు తెలుసు.
నేను చంద్రుడినైతే ఆ సూర్యుడే నా మార్గపు వెలుగు.
ఇంతకన్నా ప్రజలకు చెప్పలేను. సముద్రపు నీరు నదిలో పట్టదు.

ఎదుటి వారి శక్తిమేరకు నేను జ్ఞానాన్ని వివరిస్తాను.
ప్రవక్త చేసింది కూడా అదే!
నేను స్వేచ్ఛాజీవిని. స్వేచ్ఛాప్రవర్తకుడి మాటలు స్వర్ణతుల్యం.
బానిస బోధనలు తాలు తప్ప గింజలకు సమానం.
మత న్యాయంలో బానిస సాక్ష్యానికి విలువలేదు.

వేలాదిమంది బానిసలు నీకు అనుకూలంగా చెప్పినా అది గడ్డిపోచ విలువ చేయదు.
కోరికకు, కామానికి బానిసైనవాడు, మామూలు బానిసలకన్నా అధముడు.
బానిస, యజమాని చెప్పే ఒక్క మాటతో విడుదలౌతాడు.
కామానికి బానిసైనవాడు సుఖాల్లో బతికి, కష్టాల్లో దుఃఖాల్లో చస్తాడు.
అటువంటి వాడిని రక్షించాలంటే దైవకృప ఒక్కటే మార్గం.
అడుగు లేని గోతిలో పడినవాడిని రక్షించగలవాడు దేవుడొక్కడే!
అంత దూరం వెళ్లే తాడు దొరుకుతందా మనకు?
ఈ వివరణకు హృదయాలే కాదు, శిలలు కూడా రక్తాన్ని స్రవిస్తాయి.
అవి రక్తాన్ని స్రవించలేదంటే అతడి మనసు ఇటులేదు.
ఆ శిలలు రక్తాన్ని కారేప్పుడు, రక్తం అవసరమే ఉండదు.
బానిసల సాక్ష్యమెలాగయితే అంగీకరించబడదో
ఇంద్రియాలకు బానిస కానివాడి సాక్ష్యం సత్యప్రమాణకమవుతుంది.
పవిత్ర గ్రంథంలో చెప్పబడింది– 'నిన్ను మేము సాక్షిగా పంపినాము'
అందుకే ప్రవక్త ఈ మానవ జీవితానికి భిన్నంగా ఉన్నాడు,
స్వేచ్ఛగా ఉన్నవాడిని ఆగ్రహమేంచేస్తుంది?
దివ్యభావం తప్ప ఇంకేమిటక్కడుంటుంది?
దేవుడి కరుణ నిన్ను పునీతుడిని చేసింది.
దివ్య ద్రావకం రాతిని రత్నంగా మార్చింది.
నీవిప్పుడు ముళ్ళపొదల్లోని అవిశ్వాస శిలవు కాదు.
దేవుడి సైప్రస్ వనంలో పూసిన గులాబీవి.
నీవే నేను. నేనే నీవు. 'ఆలీ'ని నేనెలా చంపగలుగుతాను?
నీవు చేసిన తప్పు అనేక పుణ్యకార్యాలకన్నా గొప్పది.
ఒక్కక్షణంలో నీవు స్వర్గ ద్వారాలవేపు దూసుకునిపోయావు.
నీవు చేసిన తప్పు ఒప్పైనది. ముళ్లనుంచి గులాబీ ఆకులున్నట్లు.
ఉమర్ లాంటి వీరులు తప్పుచేసినాకే, ఒప్పుకోబడినారు కదా!
మంత్రగాళ్ల మంత్రశక్తులను ఫారో రాజు నమ్మినాడు,
ఆధ్యాత్మిక శక్తిపై అతడికంత విశ్వాసం లేదు.
అందుకనే ఫారో ముందు మోసెస్ దైవశక్తిని చూపించినాడు.
మంత్రగాళ్ల కనికట్టు విద్యలను ధ్వంసం చేసినాడు.
నిరాశ నడుము విరగగొట్టి అవిధేయతను విధేయతగా మార్చినాడు.

ఆ విధంగా డెవిల్ కుతంత్రాలను సర్వనాశనం చేసినాడు.
డెవిల్ మన హృదయాలలో ప్రవేశబెట్టిన పాపాన్ని,
దేవుడు ప్రక్షాళన చేయగానే డెవిల్ పలాయనం చిత్తగిస్తాడు.
'రా! తలుపు తీయబడి ఉన్నది. నామీద ఉమ్మేయి! నీకు బహుమతి ఇస్తాను!
అవమానపడినా ఆగ్రహపడక క్షమించమనేది దేవుని వాక్యం.

## ప్రవక్త - ఆలీ

నా దయామకరందం ఆగ్రహం వలన విషపూరితం కాబోదు.
ప్రవక్త నా సేవకుడి చెవిలో చెప్పాడు- 'ఒకరోజున నీవు
'ఆలీ' తల నరికి చంపుతావని'-
అతడు వచ్చి నా కాళ్లపై పడి శరణు వేడినాడు- 'ప్రభూ! నన్ను చంపు!'
నేను ఈ పాపకార్యం చేయకమునుపే నా తల నరికివేయి'

నేనన్నాను- 'నీ వలన నాకు మృత్యువు రావాలని విధి నిర్ణయమైతే,
నేను నిన్నెలా శిక్షించగలను? దేవుని ఆజ్ఞనెలా వమ్ముచేయగలను?
అతడన్నాడు- 'నన్నిప్పుడే నరికి, నా ఆత్మకు నీ హత్యాదోషమంటనీకు!'
నేనన్నాను- 'దైవాజ్ఞ మీరరానిది. నిన్ను నేను నా శత్రువుగా భావించను.
నీవు దేవుడి చేతి కరవాలానివి. నేను దానినెలా వ్యతిరేకించగలను?'
అతడన్నాడు- 'ఈ ప్రతీకారం కూడా దైవేచ్ఛే కదా!'-
దేవుడి ప్రతీకారం నుంచి మంచి ప్రవహిస్తుంది.
ప్రతీకారం, ప్రేమ వంటి అంతిమ గమ్యం మంచివేపే!
అతని ఖడ్గం విరిగితే దానిని మరింత పదునుగా మలుస్తాడు.
న్యాయస్మృతులనుంచి తొలగించిన వాటిస్థానానే,
గడ్డిని తీసి గులాబీలు నాటినట్లు కొత్తన్యాయాలనిచ్చినాడు.
రాత్రి పోయి పగలు వస్తుంది. చీకటి స్థానానే వెలుగు.
నిద్ర, విశ్రాంతి రాత్రికి సంబంధించినవే అయినా జీవజలం లేదా!
ఆ చీకటిలో మనసు పునరుత్తేజాన్ని పొందడం లేదా?
వ్యతిరేకాలు, వ్యతిరేకాల వల్ల స్పష్టంగా కానవస్తాయి.
సుఖ దుఃఖాలు, వెలుగు చీకట్లు పరస్పర వ్యతిరేకాలు కదా!
ప్రవక్త యుద్ధాలు శాంతికి మూల బిందువులైనాయి.

వేలాది అవిశ్వాసులను చంపి కోట్లాది విశ్వాసులకు శాంతినిచ్చాడు.
కొమ్మలను ఛేదించి తోటమాలి ఖర్జూర వృక్షాన్ని క్రమపద్ధతిన పెంచుతాడు.
కలుపు మొక్కలను ఏరి తోట అందంగా ఉండేట్లు చూస్తాడు.

వైద్యుడు పుచ్చిన దంతాలను పెరికి నోటిని సంరక్షిస్తాడు.
లోపాలలో లాభాలున్నవి. మృత్యువులో జీవమున్నది.
వీరుడు మరణించి దేవుడి ఆశీస్సులను పొందుతాడు.
రొట్టె తినే నోరు, దైవానుగ్రహాన దివ్య షర్బత్ సేవిస్తుంది.
రొట్టెతో ఎన్నాళ్లు బతుకుతావు, తెలివిమాలినవాడా?
దేవుడిచ్చిన మధుర రసాన్ని సేవించు, స్వస్థపడు!
నీ దుస్తుల్ని ఉతుక్కునేప్పుడు, మరకల గురించి ఆందోళనేల!
రొట్టెను విరగగొట్టి ముక్కలుగా చేస్తావు. తిరిగి అతికించగలవా?
అతికించగలిగినవాడే విరగొట్టడానికి అర్హుడు.
కుట్టగలిగినవాడు చింపడానికి అర్హుడు.
చిందరవందరగా ఉన్న ఇంటిని చిటికెలో నివాసయోగ్యం చేస్తాడు.
ఒక తలను నరికి, లక్షలాది తలలను సృష్టిస్తాడు.
తప్పు చేసినవారిని శిక్షించడమే దేవుని ప్రతీకారం!
దైవాజ్ఞ పాటించేవారిపై కత్తి దూయగలవారెవ్వరు?
విధి నిర్ణయాన్ని గ్రహించినవాడు, తన శిశువుపైన కత్తిదూయగలడు.
వెళ్లు, క్రూరులతో స్నేహం తగదు. దివ్యాజ్ఞకు తలవంచు!

## ఆదాం - ఇబ్లిస్

ఆదాం ఇబ్లిస్ వంక తిరస్కారంగా చూసినాడు.
ఇబ్లిస్ దుస్థితిని చూసి నవ్వినాడు, హేళన చేసినాడు.
దివ్యాత్మ అన్నది– 'మానవుడా! దైవరహస్యాలు నీకు తెలియదు.
దేవుని కరుణ, ప్రతీకారాలు కంబళికి ఇరువేపులు.
అతడు అనుకుంటే క్షణంలో నూరు ఆదాములు, దయ్యాలు మారుతారు.'

ఆదాం అన్నాడు– 'నేనలా ఇంకెప్పుడూ చూడను!'–
ఆపదలో ఉన్నవాడికి సాయంచేసే ప్రభూ! నా తప్పును మన్నించు.

నీ కరుణ వలన సన్మార్గంలో నడుస్తున్న హృదయాన్ని ఆశీర్వదించు.
మమ్మల్ని నీ నుంచి దూరం చేయకు. నీ రక్షణ లేనిదే మా ఉనికి లేదు.
మా ఐహిక బంధాలు మా ఆధ్యాత్మిక బంధాలను దోచుకుంటున్నవి.
మా దేహాలు మా ఆత్మలపైని వస్త్రాల్ని చింపుతున్నవి.
నీ రక్షణ లేకుండా మా ఆత్మలనెలా రక్షించుకోగలం?
నీ ప్రేమను పొందని ఆత్మ బలహీనమై నశిస్తుంది కదా!
తన ఆత్మను రక్షించుకున్నవాడు కూడా నీ దర్శనం అలభ్యమైతే మృతసమానుడు.
నీ వాక్కు సత్యస్థాపితం. నీ మాట మాకు శిరోధార్యం.
సూర్యచంద్రులు పనికిరాని చెత్త అన్నా, శంకు వృక్షం వంపుగా ఉందన్నా,
అంతరిక్షం, ఆకాశం అందుకోగలమన్నా, గనులు, సముద్రంలో నిధులు లేవన్నా
నీ మాటలో అంతరార్థం ఉంటుంది. అవి వస్తులోపాన్ని తెలుపుతాయి.

అతడు సృష్టిస్తాడు, నశింపచేస్తాడు. వస్త్రాన్ని చింపి కుడతాడు.
వడిలిపోయిన చెట్లను మరల చిగురింపచేస్తాడు.
అంధుడైన నర్సిసస్‌కు చూపునిచ్చాడు, వెదురుకు పాటనిచ్చాడు.
మనం సృష్టికర్తలం కాదు. అందుకే వినయంగా ప్రవర్తించాలి.
మనం దేహవాంఛలకు లొంగినవాళ్లం. అరిమాన్ల సంతతి మనం.
గుడ్డివాడికి చేతికర్రలా, ప్రతి జీవికీ మార్గదర్శకుడివి.
నీవు తప్ప అన్యమంతా పాపభూయిష్టం. వినాశకరం, అగ్ని సమానం.
అగ్నిని ఆశ్రయించేవాడు మగ్లాన్, జొరాస్టర్ లాంటివాడు.
అల్లాహ్ ఒక్కడే దేవుడు. మిగతావాళ్లందరూ వంచక దేవుళ్లే.

## ఆలీ – శత్రువీరుడు

ప్రతిరోజూ రాత్రీ–పగలు నేను హంతకుడిని చూస్తున్నాను.
అతడిపై నాకు పగ లేదు. మృత్యువు నాకు 'మన్నా'తో సమానం.
నా మృత్యువు నాకు పునరుజ్జీవనాన్నిస్తుంది.
అమరత్వపు మరణం, పేదరికాన్నివ్వడం మనకు నచ్చుతాయి.
మృత్యువు బయట ఉండి, జీవనం లోన ఉంటే
బయటకు అది వ్యాధి; లోపల అది అనంత జీవనం.
గర్భస్థ శిశువుదొక జీవితం. బయటకు వచ్చాక మరో జీవితం.

నాకు మృత్యువంటే యిష్టం; అయినా అది నన్ను చేరేరోజు దానిష్టం.
తియ్యటి ఫలాన్ని తింటాం. పులుపుగా ఉంటే పారేస్తాం.
మృత్యువే నన్ను దేవుని చెంతకు చేరుస్తుంటే దుఃఖమెందుకు?
దేవుడి ఎడబాటుతోనే కదా ఈ ఆత్మ ఇంతగా కుములుతున్నది.

## ఆలీ - సేవకుడు

'ప్రభూ! నన్ను చంపివేయి! నా చేతిలో నీ మరణాన్ని రద్దుచేయి'-
అన్నాడు 'ఆలీ' సేవకుడు, తన చేతిలో 'ఆలీ'కి చావు నిర్ణయించబడిందని.
నేనన్నాను- 'ప్రతి అణువూ నిన్ను చురకత్తి బూని చంపివేస్తుంది.
కాని అలా వ్రాయబడలేదు. నీకెటువంటి హాని జరగదు!
నా గురించి దిగులు చెందకు. నేను దేహానికి బానిసను కాను.
నా దృష్టిలో దేహానికి విలువ లేదు. దేహం లేకుంటే నేను దైవకుమారుడను.
కత్తి, ఖడ్గం నాకు పూజనీయాలు. నాకు మృత్యుసమాగం విందుతో సమానం.

ఇటువంటి వ్యక్తులు పదవుల నాశించరు, అధికారాన్ని కాలదన్నుతారు.
అతడి పోరాటమంతా ఇతరులకు సాయం చేయడానికే!

## ప్రవక్త - మక్కా ఆక్రమణ

ఎవరైనా అడగవచ్చు- మక్కాపై దండెత్తినవాడు ప్రపంచాన్నెలా ప్రేమిస్తాడు?
విచారణ రోజున అతడు సప్తస్వర్గాలను గమనించడు.
సప్తస్వర్గాలు దివ్య గణాలతో నిండి అతడిని చూస్తున్నపుడు
అతడు వాటి వేపు చూడడు! దేవుడి వేపే అతడి చూపులు.
దేవుని ప్రకాశంతో నిమగ్నుడైన వాడికి ఇంకేమీ కనుపించదు.

మన మధ్య ప్రవక్త, దేవదూతలకు స్థానం లేదు.
మన కళ్లు చలించవు. కాకుల్లా దేహాల కోసం చూడము!
పూలకు రంగులద్దిన ఆ మహా చిత్రకారుడిపైనే మన చూపులు.
అంతరిక్ష గ్రహాల కాంతులతో నిండిన ప్రవక్త కనులకు
సాధారణ తెలివితేటలు గడ్డిపోచల్లా కనిపిస్తాయి.
మక్కా, సిరియా, ఇరాక్‌లను వశపరచుకోడానికి,

పోరాటం, ఘర్షణ ఏం అవసరం, అటువంటివాడికి?
ఈ అనుమానాలన్నీ అవిశ్వాసులైన వంచకులవి.
వాళ్లు తమ కళ్లతో ప్రవక్తను అంచనా వేయచూస్తారు.
ఏ రంగు అద్దంలోంచి చూస్తే ప్రపంచం ఆ రంగులో కనిపిస్తుంది.
రంగు అద్దాలను పగలగొట్టు. దుమ్మును, దుమ్ములో కప్పబడ్డ మనిషిని గమనించు.

ఇబ్లిస్ మట్టిని చూసాడు– 'ఈ దుమ్మునుంచే కదా ఆదాము పుట్టింది.
అగ్నిజ్వాలల్లాంటి కనుబొమలతో ఉండే నాకూ, ఆదాముకూ పోలికా?'
ఇటువంటి భావనలు నీకూ వస్తే నీవు ఇబ్లిస్ సంతానానివే!
దేవుని సేవకుడు సింహం లాంటివాడు. ఇబ్లిస్ బానిసకుక్క లాంటివాడు.
సింహం ఆహారాన్ని, నీడను కోరుతుంది.
దైవసింహం స్వేచ్ఛను, మృత్యువును అభిలషిస్తుంది.
మృత్యువులో అతడు నూరు జీవనాల్ని చూస్తాడు.
ఆ అగ్నిలో శలభంలా తన ఉనికినే కాల్చివేస్తాడు.
మృత్యువాంఛ యూదులకు పరీక్ష వంటిది.
దేవుడు అన్నాడు– 'యూదు ప్రజలారా! మృత్యువనేది నిధి'–
జీవనం గొప్పదే, మృత్యువు మరింత గొప్పది.
'మరణం ఒక గౌరవం, దానిని సదా స్మరించండి!'
మహమ్మద్ ఆ మాట అనగానే యూదులెవ్వరూ ప్రతిస్పందించలేదు.
ఆ మాట అనగలిగిన యూదుడొక్కడూ లేడు.
నీవు నా ముఖం మీద ఉమిసినావు. నాలోని మానవత్వాన్ని మేల్కొల్పినావు.
అది దేహంపైని ప్రేమ! నా దైవతత్త్వం దెబ్బతిన్నది.
నాకర్థమయ్యింది నా పోరాటంలో సగభాగం దైవకార్యానికి,
సగభాగం నా వీరత్వాన్ని, శౌర్యాన్ని ఋజువు పరచుకోడానికని!
దైవకార్యంలో వాటాలుండవు. వాటా దారులుండరు.
నీవు దేవుడిచే తయారుచేయబడినావు. నేను నీ సృష్టికర్తను కాను.
దేవుడు చిత్రించిన రూపాన్ని దేవుడి ఆజ్ఞతోనే చెరిపివేయాలి.
దేవుడి అద్దాన్ని పగలగొట్టాలంటే దేవుడి చేతి రాయి తగలాలి.'–
జొరాస్ట్రియన్ వీరుడు ఆ మాటలను విన్నాడు.
అతడు అగ్ని ఆరాధకుడు. వెంటనే తన పవిత్ర జంధ్యాన్ని తెగ్గోసినాడు.

అతడన్నాడు–'నేను తప్పు విత్తనాలు జల్లుతూ
నీవే తప్పు చేస్తున్నావని నేను అనుకున్నాను.
ఏకేశ్వరోపాసనను నీవు నమ్మినావు.
అందుకే సమతుల్యతను పాటించగలిగినావు.
నీవు మా జాతివాడివే! నా మతపు నేత్రానివి.
నేను నీ దీపపు కాంతిని కనుగొన్నాను. నీకు బానిసనైనాను.
నేను జ్ఞాన సముద్రపు వెలుగులో ముత్యాన్ని చూడగలిగాను.
నాకు పవిత్ర మతాన్ని బోధించు. నీ శిష్యుడిగా చేసుకో!

దాదాపు యాభైమంది స్వీకరించారానాడు ముస్లిం మతాన్ని.
అలా అనేకమందిని 'ఆలీ' కాపాడినాడు మరణాన్నుంచి.

క్షమాఖడ్గం లోహఖడ్గం కన్నా పదునైనది.
నూరు సైనిక పటాలాల కన్నా శక్తివంతమైనది.
ఒక గోధుమగింజ ఆదాము సూర్యుడిని మసకబార్చినది.
ఒక కేతువు, రాహువు చంద్రగ్రహణానికి కారకులైనవి.
హృదయ సౌందర్యాన్ని చూడు; చంద్రకాంతి తారల వెలుగును మసకబార్చింది.
రొట్టె రొట్టెగా ఉన్నపుడు అనుమానాన్ని రేకెత్తిస్తుంది.
అదే శక్తిగా మారితే ఉత్తేజాన్నిస్తుంది.
లేత ముళ్లను ఒంటె తిన్నపుడు అవి శక్తిగా మారుతాయి.
అవే ఎండితే ఆ ముళ్లజోలికి ఎవరూ పోలేరు.
అవి ఒంటె గొంతుకకు, నాలుకకు గాయం చేస్తాయి.
అందుకే ఓ లొట్టిపిట్టా! ఎండుముళ్ల, ఆకుల జోలికి పోకు!
ఈ మాటలు మట్టికొట్టుకుని ఉన్నాయి. నీరు బురదగా ఉన్నది.
దేవుడు వాటిని శుద్ధి పరచగలడు.
నీటిని బురదగా చేసినవాడే, మరల స్వచ్ఛ జలంగా మార్చగలడు.
సహనం నీకు కావాల్సిన దానిని తెస్తుంది. తొందరపాటు అనవసరం.
ఓపికతో వేచిచూడు! దేవుడికి తెలుసు ఏది మంచిదో!

**(ప్రథమ భాగం సంపూర్ణం)**

✤✤✤✤✤



# మౌలానా జలాలుద్దీన్ రూమి

## (30-9-1207 - 17-12-1273)

## (The Greatest Mystical Poet)

| | | |
|---|---|---|
| పేరు | : | జలాలుద్దీన్ మహమ్మద్ రూమి |
| పుట్టిన తేది | : | 30 సెప్టెంబరు 1207 - బాల్క్ (ఆఫ్ఘనిస్తాన్)లో |
| కన్ను మూసినది | : | 17 డిశంబరు 1273 - కొన్యా (టర్కీ)లో |
| జాతి | : | పర్షియన్ |
| కాలం | : | మధ్యయుగం |
| ప్రాంతం | : | ఖ్వారజ్మియాన్ రాజ్యం (బాల్క్ 1212; సమర్‌ఖండ్ 1213-17)<br>సెల్జుక్ సుల్తానేట్ ఆఫ్ రమ్ (1217-73)<br>- మలత్యా (1217-19)<br>- అక్‌శెహిర్ (1219-22)<br>- లారెండె (1222-1228)<br>- కొన్యా (1228-1273) |
| తెగ | : | హనాఫీ, సూఫియిజం, మెల్లెవి ఆర్డర్<br>అతడి అనుచరులు - Dancing dervishes |
| రచనలు | : | మస్నవి, దివాన్-ఎ-షామ్స్‌ఎ; తబ్రిజి, ఫిహి-మ-ఫిహి. |
| గురువులు | : | బహాయుద్దిన్ జక్రియా, అత్తర్, సనాయి,<br>అబుసయ్యద్ అబుల్ అయ్యర్, అరఖాని,<br>బయాజిద్ బిస్తమి, సమ్‌సె తబ్రిజి |
| ప్రభావితులు | : | షా అబ్దుల్ లలిఫ్ భిట్టాయి, కాజి నస్రుల్ ఇస్లామ్<br>అబ్దుల్ కరీమ్ సొరొయుష్. |

<u>**Rumi - Most Popular and selling Poet in America)**</u>

**మథ్నవి (మధ్నవి, మస్నవి - పర్షియన్ - అలౌకిక ద్విపదలు)**

- 25,577 ద్విపదలు (51,154 పంక్తులు)

**దివాన్-ఐ-షామ్స్-ఐ-తబ్రిజి (44292 పంక్తులు)**

- 3229 గజల్స్, క్వాసిడాలు (34,662 పంక్తులు)
- 1983 రుబాయత్‌లు (7932 పంక్తులు)
- 44 తర్జి-బంద్‌లు (1698 పంక్తులు)

**పిహి-మా-ఫిహి (What is in it is limit) - 72 బోధనలు**

**మకతిబ్ (ఉత్తరాలు) - 144 ఉత్తరాలు**

**మజాలిస్-ఐ-సబా - (Seven Sessions) - ఏడు ఉపన్యాసాలు.**

# టర్కీ యాత్ర

'అయినను పోయిరావలెయు టర్కీకి' – అనుకుని తొమ్మిది జంటలు– పద్ధెనిమిది మందిమి దేశ విదేశాల నుండి బయల్దేరి 'ఇస్తాంబుల్' (కాన్‌స్టాంట్ నోపుల్, బైజాంటియమ్ అనేవి పాత పేర్లు) పట్టణానికి చేరుకున్నాము.

That is no country for old men (అది వృద్ధులు ఉండదగిన రాజ్యం కాదు) అని ఈట్స్ మహాకవి (W.B. Yeats) తన 'Sailing to Byzantium' కవితలో అమరత్వపు అన్వేషణలో మానవుని ప్రయాణాన్ని అద్భుతంగా కవిత్వీకరించాడు. ప్రపంచంలో రెండు ఖండాలపై నిర్మించబడిన ఏకైక నగరం ఇస్తాంబుల్. ఈ అద్భుత నగరం గురించిన కొన్ని విశేషాలివి.

ఏడు కొండలపై ఉన్న నగరాలు మూడు: 1. తిరుపతి, 2. రోమ్, మూడవది– ఇస్తాంబుల్. ఆసియా, ఐరోపాలను కలిపే వంతెన ఈ నగరం. రోమన్, బైజాంటియన్, లాటిన్, ఆటొమన్ సామ్రాజ్యాలకు రాజధానిగా ఉన్న ఈ నగరం నవటర్కీ రాజధాని కాకపోవడం విచిత్రం కాదా! (అంకారా ఇప్పుడు టర్కీ రాజధాని) బెల్జియం దేశమంత పెద్దదీ ఇస్తాంబుల్ నగరం. పదిహేను మిలియన్ల జనాభాతో జన ప్రవాహంతో పొంగిపొరలుతూ ఉంటుంది. 'ఇస్తాంబుల్ రాయీ, మట్టీ స్వర్ణమే!' అన్న నానుడి ఇంత జనసమ్మర్ధానికి కారణమంటారు.

అగాథాక్రిస్టీ తన "Murder on the Orient Express" నవలను ఇస్తాంబుల్‌లోని పెరాపలాస్ హోటల్‌లో ఉన్నప్పుడు వ్రాసిందట. అది సినిమాగా వచ్చింది. జేమ్స్‌బాండ్ సిన్మాలు– "From Russia with love", "Skyfall", "The World is not enough" ఇస్తాంబుల్‌లో కొంత తీసారు. Taken, Net, Topkapi, Hamam, Istanbul కూడా పేరు తెచ్చుకున్న సిన్మాలు. ఈమధ్య 'మగధీర', 'దూకుడు' వచ్చినప్పటి నుంచి తెలుగువాళ్ళు, ధూమ్–3 లాంటి సిన్మాలలో హిందీవాళ్ళు టర్కీని సిన్మా షూటింగులకు అనువైన ప్రాంతంగా ఆరాధిస్తున్నారు.

ఇస్తాంబుల్‌లో ఉన్న సబ్‌వే 1875 నాటిది. మొదటిది లండన్‌లో (1863), రెండవది న్యూయార్క్ (1868)లో ఉన్నాయి. ఇస్తాంబుల్ లోని

గ్రాండ్‌బజార్ ప్రపంచంలోనే పెద్దది. దాదాపు 4000 షాపులు ఒకే పైకప్పు కింద ఉన్నాయి.

మొదటిరోజు మేమున్న వింథామ్ హోటల్ నుంచి బయల్దేరి Spice Bazar కు వెళ్లాం. అక్కడి రకరకాల సుగంధ ద్రవ్యాలను, ఎండుపళ్లను, టర్కిష్ స్వీట్స్‌ను చూసి, రుచిచూసి ఆనందించాము. రెండవరోజు ఉదయం 'ప్రిన్సెస్' ద్వీపానికి నౌకాయానం. యూరప్ తీరాన్నుంచి ఆసియా తీరం వేపు వెళ్లి నౌక గమ్యానికి చేరుకుటుంది. ప్రిన్సెస్ ద్వీపంలో గుర్రపు బగ్గీలలో విహారయాత్రానంతరం, నచ్చినవాళ్లు 'సీఫుడ్'ను ఆనందించగా, ఆనక టర్కిష్ ఐస్‌క్రీమ్‌ను ఆస్వాదించారందరూ.

సాయంకాలం గ్రాండ్ బజార్‌కు వెళ్లాం. గ్రాండ్‌బజారు పైకప్పు పైనే Skyfall సిన్మాలో జేమ్స్‌బాండ్ మోటార్‌సైకిల్‌పై శత్రువును వెంటాడుతాడు. సిరామిక్స్, కార్పెట్స్ నుంచి బంగారు బిస్కట్ల వరకూ అన్నీ లభించే ఆ గ్రాండ్ బజార్‌లో షాపింగ్ చేయడం ఓ మజా! లోకల్ ట్రామ్స్‌లో ప్రయాణం అదో కొత్త అనుభవం.

ఇస్తాంబుల్ నగరాన్ని రెండుగా విడదీసేది బోస్ఫొరస్ (Bosphorus - The Pass of Ox – ఆవు ఈదిన దారి) అఖాతం– ఇది Black Sea ని Sea of Marmara తో కలుపుతుంది. మర్మరా సముద్రం ప్రపంచంలోని అతి చిన్న సముద్రం. టర్కిష్ ప్రజలు దీనిని 'తియ్యసముద్రం' అని పిలుస్తారు ప్రేమగా. ఒకసారి ఆ నీళ్లు తాగినవారికి దప్పిక తీరదంటారు నమ్మకంగా!

ఆ రాత్రి మేము క్రూయిజ్‌లో బోస్ఫొరస్ వంతెన రంగులు వెదజల్లడాన్ని తన్మయంగా వీక్షించాము. క్రూయిజ్‌పై టర్కిష్ బెల్లీడాన్సు, జానపద నృత్యాల్ని తిలకించడం ఓ మరపురాని అనుభూతి. మూడవరోజు ఉదయం 'సుల్తాన్ అహమద్ కామి' అని పిలువబడే ప్రసిద్ధ నీలిమసీదు (Blue Mosque)ను సందర్శించాము. ప్రపంచంలో ఎక్కడా లేని ఆరు గోపురాలు (మినారెట్లు)న్న మసీదు, 1609–1616 మధ్యకాలంలో 'మెహమత్ ఆగా' శిల్పి పర్యవేక్షణలో నిర్మించబడింది. వెలుతురు ప్రవహించే 260 కిటికీలు, గోడలకు ఇజ్నిక్ నుంచి తెప్పించిన ఇరవై వేల నీలి ఆకుపచ్చ రంగు ఫలకాలు ఈ మసీదుకు 'నీలిమసీదు' అనే నామాన్ని సార్థకం చేసాయి. సుల్తాన్ అహమద్–1 దీనిని నిర్మించాడు గనుక సుల్తాన్ అహమద్ మసీదుగా పిలువబడ్తున్నది.

అక్కడి నుంచి టాప్‌కాపి మ్యూజియం చేరుకున్నాము. (Topkapi అంటే Cannon gate - ఫిరంగి ద్వారం) రెండవ మహమద్ క్రీస్తుశకం 1462లో కట్టించాడు. ఆనాటి రాజప్రసాదమైన ఈ భవనం నేడు మ్యూజియంగా అలరారుతున్నది. ఇస్మాయెల్ సింహాసనం (పర్షియా నుంచి కొల్లగొట్టినది); Spoon merchant's diamond; టాప్‌కాపి బాకు (టర్కీ సింబల్ – Topcapi dagger - మూడు అత్యంత పెద్ద మరకతాలు – ఎమరాల్డ్స్ పొదిగినది) 250 కిలోగ్రాముల స్వర్ణ సింహాసనం; రాజోచిత దుస్తులు ఇవన్నీ ఈ మ్యూజియంలో చూడవచ్చు. ఈ భవనంలో రాజమాత నివాసం, అంతఃపురస్త్రీల మందిరాలు, సుల్తాను శయనాగారం, శయ్య ఇవన్నీ చూసి విభ్రములమయ్యాము.

ఈ భవనంలో మరోచోట పవిత్రస్థలంలో మహమ్మదు ప్రవక్త వాడిన ధనుస్సు, ఖడ్గాల్ని, అతడి అనుచరుల ఆయుధాలను, దుస్తుల్ని దర్శించాము. ప్రవక్త స్పర్శతో పునీతమైన మందసాల్ని వీక్షించి జన్మ ధన్యమైనదిగా భావించాము. అక్కడే ప్రవక్త దంతం, శిరోజాలు భద్రపరచబడిన చిన్నిచిన్ని పెట్టెలున్నాయి. ఈ భవనంలోనే ఆనాటి పవిత్ర గ్రంథపు వ్రాత ప్రతులు, విలువైన దుస్తులు భద్రపరచబడి ఉన్నాయి.

నీలిమసీదు, హగియాసోఫియాల మధ్యన హిప్పొడ్రోమ్ ఉన్నది. అక్కడ గుర్రపుస్వారీ, రథాల పోటీలు (బెన్‌హర్ సిన్మాలో లాంటిది) జరిగేవట. అనేక తిరుగుబాట్లు జరిగిన ప్రదేశమిది. రెండు ఎత్తైన శిలాస్తంభాలు, (క్రీస్తుపూర్వం 1490 నాటి ఈజిప్షియన్ ఒబిలిస్ – ఏకశిలాస్తంభం – ఒకటి; మరొకటి కాన్‌స్టాంటైన్ కాలమ్ – రెండిటిమధ్య సర్ప స్తంభం – పర్షియన్లపై గ్రీకుల విజయాన్ని సూచిస్తూ నిర్మించబడినది.

మధ్యాహ్నం హగియా సోఫియా (బైజాంటైన్) (ఆయా సోఫియా (ముస్లిములు); శాంటాసోఫియా (ఇతరులు) పిలుచుకునే ప్రపంచ ప్రసిద్ధికెక్కిన జ్ఞానమందిరం తొలుత చర్చిగా, తరువాత మసీదుగా, ఇప్పుడు మ్యూజియంగా విలసిల్లుతున్న దానిని దర్శించాము. బైజాంటియన్ కళానైపుణ్యానికి ప్రతీకగా, జస్టినియన్ చక్రవర్తిచే నిర్మించబడిన అద్భుత కళాఖండమిది. ఆరేళ్లపాటు పదివేలమంది శ్రామికులు, వందమంది శిల్పులు అత్యంత విలువైన నిర్మాణ సామాగ్రిని వాడి, కట్టిన నిర్మాణమిది. లోపల క్రీస్తు, వర్జిన్ మేరీల స్వర్ణ మొజాయిక్ చిత్రాలు చూపరులను కట్టిపడేస్తాయి. క్రీస్తుశకం 560లో నిర్మించబడిన ఈ

భవనం 1453లో రెండవ సుల్తాన్ అహమద్‌చే మసీదుగా మార్చబడి, 1936లో ప్రెసిడెంట్ కెమాల్ అలాటుర్క్ ఆజ్ఞచే మ్యూజియంగా రూపునందుకున్నది.

టర్కీ (టుర్కిస్థాన్)లో చలామణీ అయ్యే ద్రవ్యం టుర్కిష్ లీరా (TL). ఒక లీరా దాదాపు 28 రూపాయలకు సమానం. ఒక డాలర్ (అమెరికా)కు 2.14 లీరాలు; 1 యూరోకు 2.89 లీరాలు వస్తాయి. డాలర్, యూరోలుంటే ఇబ్బందుండదు. మనీ ఎక్స్‌ఛేంజ్ సెంటర్లలో లీరాలకు మార్చుకోవచ్చు. టర్కీకోడి అని మనం పిలిస్తే, కోడిని అక్కడ 'హింద్' అని పిలుస్తారు. అలా మనకోడి పక్కోడి టర్కీ దేశంలో దేశపక్షి అయ్యిందన్నమాట. జనాభాలో ఎక్కువ శాతం ముస్లిములే అయినా లిబరలిజం ఎక్కువ. ప్రజలు చాలా కలుపుగోలుగా ఉంటారు. మనవాళ్లు రంగురంగుల చీరలు ధరించి బయటకు రాగానే అక్కడివాళ్లు ఫోటోలకోసం ఎగబడడం ఎంతో సరదాగా అనిపించింది. అక్కడి జనులు భోజనప్రియులు. టర్కిష్ కబాబ్‌లు, డిలైట్‌లు, మొక్కజొన్న పొత్తులు ఉడకబెట్టినవి, బంగారు రంగు ఆరెంజ్ జ్యూస్, పుచ్చకాయలు, ఛెర్రీ, ఆల్మండ్, పీఛ్ ఫలాలు, వెజిటబుల్ సలాడ్‌లు, తియ్యని మజ్జిగ, రకరకాల బ్రెడ్‌లు జిహ్వానూరిస్తాయి.

**కప్పడోకియా**

ఇంకా టర్కీలో చూడాల్సినవేమున్నాయంటారా! మేం నాల్గవరోజున కప్పడోకియా (Cappadocia) యాత్రకు బయల్దేరాం. ఇస్తాంబుల్ నుంచి బయల్దేరి కెసరి (Kayseri) ఎయిర్‌పోర్టులో దిగాం. అక్కడి నుంచి లగ్జరీబస్సులో ఎవనాస్ (Avanos)కు సహజరాతి చిమ్నీల నగరం 'గొరిమి' (Goreme) మీదుగా, ఎర్రనది (Red River) దాటి ఎవనాస్ పట్టణంలోని హిల్టన్ డబుల్‌ట్రీ హోటల్‌లో బస చేసాం.

అయిదవ రోజు ఉదయం హాట్ ఎయిర్ బెలూన్‌లో ఆకాశంలో 800 మీటర్ల ఎత్తు నుంచి సూర్యోదయాన్ని చూడడం ఓ అద్భుతమైన అనుభూతి. ఎటు చూసినా బెలూన్లు, క్రింద గొరిమి ఓపెన్ ఎయిర్ మ్యూజియం, ఫెయిరీ చిమ్నీలు, కొండలు, ద్రాక్షతోటలు, మైదానాలు, బార్లీ గోధుమ పొలాలు. వాహ్! వారెవ్వా!

కప్పడోకియా ప్రాంతం టర్కీకి గుండెకాయలాంటిది. అగ్నిపర్వతపు లావా గడ్డకట్టి, ప్రకృతి సహజసిద్ధమైన వాన, గాలి, ఎండ, మంచులకు కరిగి

ఏర్పడిన సహజ శిలారూపాలలో మనం ఒంటెలను, చిమ్నీలను రకరకాల రూపాలను దర్శిస్తాము. ఉలి అలికిడి విన్నంతనే గలగలమని కరిగిపోవు ఈ తెల్లని కొండరాళ్లను తొలిచి క్రైస్తవులు, తమను తరుముకు వస్తున్న అరబ్ సైనికుల బారి నుంచి తప్పించుకోవడానికి ఈ కొండల్లో పట్టణాలను, చర్చిలతో సహా నిర్మించుకున్నారు. 'కప్పడోకియా' అనే పదం 'కట్ పక్ టుక్యా' అనే పర్షియన్ పదం– అందమైన గుర్రాలుండే ప్రాంతం– అని దీని అర్థం. అయిదువేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణముండే కప్పడోకియాలో 'గొరిమి' (నీవు చూడలేవు –అని అర్థం) ప్రాంతం శిలారూపాలకు ప్రసిద్ధి కాగా కప్పడోకియా ప్రాంతం సిల్కురోడు కాలం నుంచి ప్రశస్తమైన రగ్గులకు, ప్రాచీనమైన టొకాలి చర్చికి, భూమిపైన కొండలలో, భూగర్భంలో నిర్మించిన అండర్‌గ్రౌండ్ సిటీలతో, మొజాయిక్ పెయింటింగ్‌లు, కుడ్యచిత్రాలతో ప్రసిద్ధికెక్కింది.

కొండగుహల పట్టణాలు చూసాక ఆ మధ్యాహ్నం అండర్‌గ్రౌండ్ సిటీ చూడడానికి వెళ్లాము. క్రీస్తుపూర్వమే నిర్మించారని చెప్పబడ్తున్న ఈ భూగర్భ నగరాలు ప్రపంచంలో తొమ్మిదవ వింతగా (9th Wonder) పేర్కొనబడ్తున్నాయి. (ఎనిమిదవ వింత చైనాలోని టెర్రకొట్టా వీరుల ప్రాంతం). క్రైస్తవులు పవిత్రంగా భావించే అనేక చర్చిలు ఇక్కడ ఉన్నాయి. సెయింట్ పాల్ ఆశీస్సులందుకున్న ప్రాంతం 'గొరిమి'. అనేక కుడ్య వర్ణచిత్రాలున్న ఎప్సిలార్, డార్క్, ఏపిల్, స్నేక్, మదర్ మేరీ చర్చిలను ప్రార్థనామందిరాలను దర్శించి, డెరింకుయు (Derinkuyu) (మెలగొబియా) భూగర్భనగరాన్ని చేరుకున్నాము. కప్పడోకియాలో ఉన్న 36 భూగర్భ నగరాలలో డెరింకుయు ప్రసిద్ధమైనది. దాదాపు భూమి అడుగున 20 అంతస్థులున్న ఈ నగరంలో ప్రస్తుతం ఎనిమిదవ అంతస్థు వరకు వెళ్లే వీలున్నా సందర్శకులను నాల్గవ అంతస్తు వరకే పోనిస్తున్నారు. నాలుగు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దాదాపు రెండు వేల కుటుంబాలు ఇక్కడ పిల్లాజెల్లా, పశువులతో జీవించేవంటే అంతులేని ఆశ్చర్యం కలుగుతుంది. శత్రువలకు దొరకకుండా ఒక లెవెల్ నుంచి మరొక లెవెల్‌కు వెళ్లే మార్గాలను మూసివేయడానికి గుండ్రటి రాతి ద్వారాలు, భూగర్భ నది నుంచి నీళ్లు తోడుకునే సదుపాయాలు, గాలి వచ్చిపోయే దారులు, లోపల ధాన్యాగారాలు, ద్రాక్షసారా, గోధుమ, యవ ధాన్యాల నుంచి, పిండి, రొట్టెలు చేసుకోడానికి వంటగదులు, ప్రార్థనా మందిరాలు, భోజనశాలలు, సమాధులు అన్నీ భూగర్భంలోనే. దాదాపు తొమ్మిది కిలోమీటర్లుండే సొరంగ మార్గం మరో భూగర్భ నగరాన్ని కలుపుతున్న దానిని ఈమధ్య

కనుగొన్నారు. ఈజిప్టు పిరమిడ్ల నిర్మాణానికి లక్షమంది అనేక ఏళ్లు శ్రమిస్తే ఈ భూగర్భ నగర నిర్మాణాలను చేసిన కూలీలెందరో? ఊహకందేనా?

రెడ్ రివర్ (ఎర్రనది)లో గొండోలా పడవ ప్రయాణం గాలి ఎక్కువగా ఉండడం వలన విరమించుకున్నాము. ఆ ఎర్రనది మట్టితోనే ప్రసిద్ధికెక్కిన సిరామిక్ టైల్స్ తయారుచేస్తారు. వివిధ మృణ్మయ పాత్రలను అక్కడి వారు సాంప్రదాయకంగా చేసే విధానాల్ని చూసాము. అవనాస్ (Avanas) ప్రాంతం సిరామిక్స్‌కు, కార్పెట్లకు ప్రసిద్ధి.

టర్కిష్ కార్పెట్లకు ప్రపంచంలో పెద్ద గిరాకీ ఉన్నది. కార్పెట్‌ను తొలుదొల్త తయారుచేసింది తామే అని టర్కీ ప్రజలు భావిస్తారు. ఎరుపు రంగు ధనానికి, ఆకుపచ్చ స్వర్గానికి, నీలిరంగు ఉన్నతికి, రాజరికానికి ప్రతీకలు. పసుపురంగు దురదృష్టం నుంచి కాపాడ్తుందని, నలుపు అధిగమించిన కష్టనష్టాల్ని సమస్యలను తెలుపుతుందంటారు. గొర్రెలు, మేకలు, ఒంటెల ఉన్నితో, పత్తి నూలుతో చేసిన కార్పెట్లు – టర్కిష్ ముడి – Double Knot - Chiordes తో నేయబడ్తాయి. గత 9000 సంవత్సరాలుగా టర్కిష్ స్త్రీలు తమ నైపుణ్యాన్ని తరతరాలుగా తమ బిడ్డలకు అందిస్తున్నారు. చదరపు మీటరుకు మిలియన్ ముడులుండే బుర్సా కార్పెట్లు, కేసెరి, కొన్యా, బెర్గామ్ కార్పెట్లు ఖరీదైనవి. ముడులులేని కిలిమ్ కార్పెట్లకు దేవతల కార్పెట్లు (Carpets of the gods) అంటారు.

అవనాస్ (కప్పడోకియా) నుంచి 'పాముక్కలే' కు తొమ్మిది గంటల ప్రయాణం. కాశీమజిలీ కథల్లోలా మధ్యమధ్య మజిలీలు. మొదటి మజిలీ– టర్కీ ధాన్యాగారమైన కొన్యా (Konya). మానవ నాగరికతలో తొలిగ్రామం 'సటల్ హుయక్' దీనికి దగ్గరే. ఇక్కడి ప్రజలు పవిత్ర ఖురాన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తారు. అందుకే దీనిని 'పవిత్ర నగరం' Holy City అని పిలుస్తారు. హిట్టైట్లు, ఫ్రిజియన్లు, అస్సిరియన్లు, లిడియన్లు, పర్షియన్లు, రోమన్లు, సెల్యూసిడ్లు, అరబ్బులు, సెల్జుక్లు చివరగా అటొమన్ నాగరికతలు ప్రభవించిన పట్టణమిది. ఇక్కడే సూఫీయిజమ్ (Sufism) ను ప్రబోధించిన పర్షియన్ కవి మెల్వానా జలాలుద్దీన్ రూమి జీవించాడు. అతడి అనుయాయులను Dancing Dervishes (గుండ్రంగా తిరుగుతూ భగవంతుని ప్రార్థించేవారు) అంటారు. అక్కడ మేము మెల్వానా మ్యూజియాన్ని చూసాము. కాసేపు వర్షంలో తడిచి హర్షపులకాంకితులమైనాము. మెల్వానా అంటే గురువు. జీవితాన్ని దైవానికి,

దైవప్రేమకు అంకితం చేసినవాడు. అతని అనుయాయులైన Dancing Dervishes చేసే అలౌకిక నృత్యంలో మూడు దశలుంటాయి. మొదటిది దైవజ్ఞానం; రెండవది దైవదర్శనం; మూడవదశ దేవునిలో లీనం చెందడం. వారు ధరించే పొడుగాటి శ్వేతవస్త్రాలు దేహంపై కప్పిన వస్త్రాన్ని; నల్లని కోటు సమాధిని, ఎర్రటి టోపీ సమాధి ఫలకాన్ని సూచిస్తాయి. గుండ్రంగా, వేగంగా తిరుగుతూ వాళ్లు మూడవ ప్రదక్షిణలో నల్లకోటు (ప్రాపంచిక బంధనాల్ని)ను విడిచి, వేగంగా తిరుగుతూ హస్తముద్రలతో భగవానుని అర్చిస్తూ తురీయానందాన్ని పొందుతారు.

కోన్యా నుంచి అక్షెహర్ (Aksehar - white city) కి ప్రయాణం. ఎటు చూసినా ఛెర్రీ పండ్లవనాలే! తినడానికి ఒకటి అడిగితే దోసిలినిండా పోసాడు అక్కడి వ్యాపారి. ఈ పట్టణంలోనే తన హాస్య, చతురోక్తులతో ప్రపంచాన్ని మురిపించిన నసిరుద్దీన్ హోజా (Nasruddin Hodja) నివసించాడు. అతడి కథల్ని గుర్తు చేసుకుంటూ రాత్రి ఎనిమిదిన్నరకు పాముక్కలె (Cotton Castle = పత్తికోట = Pamukkale) చేరుకుని సహజ వేడినీటి స్విమ్మింగ్‌పూల్ ఉన్న డోగా (Doga) హోటల్‌లో దిగాము.

**పాముక్కలే**

వందమీటర్ల ఎత్తుండి, నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణంతో, అంచెలంచెల సహజ ఈతకొలనులతో, సున్నపురాయి తెల్లగా పాల నురగలా మెరుస్తుంటే ఎటుచూసినా దూసిపోసిన పత్తిపూల గుట్టలా కళ్లు చెదిరేలా ఉండే ప్రదేశం పాముక్కలే. అందుకే దానిని Cotton Castle అన్నారు. ఆ నీటికి కీళ్లనెప్పులు, అస్తమా వ్యాధులను తగ్గించే గుణముందని ప్రాచీన కాలం నుంచి పేరున్నది. ఎక్కడ చూసినా ఆ గోరువెచ్చటి నీటిలో స్నానం చేస్తూ కనిపించే యాత్రికులే! ప్రకృతి అందాలలోని శ్వేతవర్ణం ఇక్కడ అద్భుతంగా గోచరిస్తుంది. భూమిపొరలలోని నెర్రెల నుంచి పైకుబికిన వేడినీటిలో ఉన్న కాల్షియం కార్బనేటు ఘనీభవించి కొండపై మందమైన పొరగా ఏర్పడి ఈ అద్భుతాన్ని మనకిచ్చింది.

నీటిలోని కాల్షియం ఆక్సైడ్ ఆ పత్తికొండపై పూలరేకుల్లాంటి ముత్యపు చిప్పల్లాంటి నీటి మడుగుల్ని సృష్టించగా వాటి అందాల్ని చూడటానికి రెండు కళ్లూ చాలవు. నీటిలో కాసింత గంధకం (సల్ఫర్), ఇనుము (ఐరన్ ఆక్సైడ్)

కూడా ఉంటే తెల్లకొండపై పసుపు, ఎరుపు, ఆకుపచ్చ చారలేర్పడి మనోహరా కృతులనిస్తాయి. కరహాయిత్ గ్రామంలో వీటిని చూడవచ్చును.

ఈ శ్వేతపర్వతం ఎగువనే పవిత్ర నగరంగా పేరుబడిన హీరాపొలిస్ (Hierapolis) శిథిలాలున్నాయి. పెర్గామస్ రాజు రెండవ యుమెనిస్ దీనిని క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దిలో నిర్మించాడు. పక్కనే ఉన్న నెక్రొపొలిస్‌లో వేలాది సమాధులు కనిపిస్తాయి. దగ్గర్లోనే ఆనాటి రోమన్ల స్నానాల గదులు, అపొలో దేవాలయపు శిథిలాలు, పదివేల మంది కూర్చోగలిగిన థియేటర్ ఉన్నాయి. హీరాపొలిస్‌లోనే పన్నెండుమంది అపొస్తలులలో ఒకడైన సెయింట్ ఫిలిప్ వీర స్వర్గాన్నలంకరించాడు.

**కుశాదాసి**

పాముక్కలే నుంచి పక్షుల ద్వీపమైన కుశాదాసి (Kusadasi) చేరుకునే సరికి సాయంకాలమైంది. అక్కడి సూర్యాస్తమయం చూచి తీరవలసిందే. సముద్రంలోకి సాయంకాల సూర్యుడు అస్తమిస్తుంటే క్షణక్షణానికి ఆకాశంలో, సముద్రంలో మారే వర్ణాలను వర్ణించడం అంత సులువుకాదు. మేమున్న సముద్రతీరపు హోటల్ పేరు “లెబ్లా హోటల్’. ఆ హోటల్‌కు దగ్గర్లోనే ఉన్న బీచ్‌పేరు ‘లేడీస్ బీచ్’. 52 కిలోమీటర్ల పొడువునా చక్కని రిసార్ట్‌లతో, స్ఫటికమంత స్వచ్ఛమైన సముద్ర జలాలతో ఉన్న ఎగియన్ సముద్రతీరంలో Kadinlar Denizi (Women's Sea), Night Beach, కాలామాకి ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతం అండర్ వాటర్ పారడైజ్‌గా ప్రసిద్ధికెక్కింది.

మరుసటిరోజు ఉదయం మా ప్రయాణం పాత ప్రపంచపు ఏడు వింతలలో [Seven Old World Wonders - (1) కైరోలోని ఖుపు పిరమిడ్, (2) బాబిలోన్ లోని హాంగింగ్ గార్డెన్స్, (3) ఒలింపియాలోని జ్యూస్ విగ్రహం, (4) రోడ్స్ ద్వీపంలోని కలొసస్ విగ్రహం, (5) అలెగ్జాండ్రియాలోని ఫారో లైట్ హవుస్, (6) టర్కీలో హాలికార్నసస్ మౌసోలియం, (7) టర్కీలోని ఎఫిసస్ వద్ద ఉండిన ఆర్టెమిస్ దేవాలయం) ఒకటైన ఆర్టెమిస్ దేవాలయం వేపు సాగింది. అదే ఎఫిసస్ (ఎఫాజ్–Ephesus)].

ఎఫిసస్ (Ephesus) అనటోలియాలోని యవనుల కట్టడాలలో ముఖ్యమైనది. సెయింట్ పాల్ (54 A.D.) ఇక్కడ మూడున్నరేళ్లు కాలం గడిపాడు.

సెయింట్ జాన్ తన గోస్పెల్ వ్రాసిందిక్కడే. మేరీమాత తన చివరిరోజులు గడిపినదీ ప్రాంతంలోనే. భూకంపాలవల్ల, దండయాత్రల వలన ఈ ప్రాంతమంతా నేడు శిథిలాల గుట్టలా కనిపించినా ఆనాటి ప్రజల జీవన విధానాల్ని తెలుసుకోడానికి ఎంతో ఉపయుక్తమవుతుంది. 25000 మంది కూర్చోగలిగిన గ్రేట్ థియేటర్, మార్బుల్ స్ట్రీట్, సెల్సస్ లైబ్రరీ, హడ్రియన్ దేవాలయం, ట్రాజాన్ ఫౌంటెన్, ఇవన్నీ మహాద్భుత నిర్మాణాలుగా మనసును కట్టి పడేస్తాయి.

పాత ప్రపంచపు ఏడు వింతలలో ఒకటిగా పేర్కొన్న ఆర్టెమిస్ దేవాలయ ప్రాంతానికి వెళ్లాము. ప్రస్తుతం ఒకటే శిలాస్తంభం ఉన్న అక్కడి శిథిలాలు ఒకప్పటి ఆ దేవాలయపు ప్రఖ్యాతిని చూచాయగా తెలియజేస్తున్నాయి. ఎఫిసస్ మ్యూజియంలో ఆర్టెమిస్ అమ్మతల్లి విగ్రహం నకళ్లను చూడవచ్చును.

అక్కడి నుంచి మేము వర్జిన్ మేరీ నివసించినట్లు చెప్పబడ్తున్న ప్రాంతానికి వెళ్లాము. క్రైస్తవులు, ముస్లిములు ఆరాధించే మేరీమాతకు ఇక్కడ ప్రతిరోజూ అయిదుసార్లు ప్రార్థనలు జరగడం విశేషం. ఆమెకు మొక్కుకుని అక్కడ ఉన్న జలధారలలోని నీటిని రుచిచూసి, మా కోర్కెలను ఓ కాగితంపై వ్రాసి మేరీమాతకు నివేదించాము.

మరుసటిరోజు కుశాదాసి నుంచి ఇజ్మీర్ (Izmir) బస్సులో, ఇజ్మీర్ విమానాశ్రయం నుండి ఇస్తాంబుల్‌కు, ఇస్తాంబుల్ నుంచి ముంబాయికి ముంబాయి నుంచి హైదరాబాదుకు అక్కడ నుండి వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం ప్రాంతాలకు ఎవరింటికి వారు చేరుకున్నాము. (16 జూన్ 2014 – 25 జూన్ 2014)

ముగింపు– Sailing to Byzantium - విలియం బట్లర్ ఈట్స్ – మాటల్లోనే…

అక్కడే సంగీత పాఠశాల లేదు. కానీ దివ్యమైన
ఆ స్మృతి చిహ్నాలను సందర్శించడానికే
నేను ఉప్పొంగే సముద్రాలను దాటి
పవిత్ర బైజాంటియమ్ నగరానికి వచ్చాను.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# టర్కీ గురించి మరిన్ని విశేషాలు :-

1) పశ్చిమ టర్కీలోని ట్రాయ్ వద్ద ట్రోజన్ యుద్ధం జరిగింది. (క్రీస్తుపూర్వం 13వ శతాబ్దంలో)

2) మానవుడి తొలి స్థిర నివాసం – సటల్ హుయక్ (క్రీస్తుపూర్వం 7000 సంవత్సరాలు)

3) పాత ఏడు వింతలు (Seven Word Wonders) లో రెండు టర్కీలోని ఎఫిసస్, హాలికార్నసస్‌లో ఉన్నాయి.

4) మానవ నిర్మిత మొదటి చర్చి సెయింట్ పీటర్ చర్చి – ఏంటక్యా – టర్కీలో ఉన్నది.

5) శాంతాక్లాజ్ (సెయింట్ నికొలాస్) పుట్టింది టర్కీలోని పటారా.

6) నోవాస్ ఆర్క్ తూర్పు టర్కీలోని అరారత్ పర్వతం దగ్గర ఆగింది.

7) నోవాస్ ఆర్క్‌లో ఆరగించిన ఆఖరి విందు పదార్థం లాంటిదే ఇప్పుడూ లభ్యమవుతుంది.

8) టర్కీ నుంచే కాఫీ, చెర్రీపండ్లు యూరప్‌లోకి ప్రవేశించాయి.

9) టర్కీనుంచే టులిప్ పూలు హాలండ్‌కు వెళ్లాయి.

10) 'అతిథిదేవోభవ' God's Guest - టర్కీలో కొత్తవారిని అతిథులుగా గౌరవించే సంప్రదాయమున్నది.

11) రెండు ఖండాలపై ఉన్న ఏకైక నగరం ప్రపంచంలో – ఇస్తాంబుల్.

12) ఇస్తాంబుల్‌నే కాన్‌స్టాంట్ నోపుల్ అనీ, బైజాంటియమ్ అనీ పిలుస్తారు.

13) క్రీస్తుపూర్వం 1950లో వ్రాయబడిన మట్టిబిళ్లలు టర్కీలో దొరికాయి.

14) ప్రాచీన అనటోలియాలోనే వ్రాయడం (Writing) మొదలైంది.

15) కుడ్యచిత్రాలు, టిన్ గనులు మొదట టర్కీలోనే కనుగొన్నారు.

16) హోమర్, మిడాస్ రాజు, హెరొడొటస్, సెయింట్ పాల్‌ల జన్మస్థానం అనటోలియా.

17) జూలియస్ సీజర్ – వెని, విడి, విసి – I came, I saw, I conquered అన్నది టర్కీ లోనే.

18) అమ్మతల్లి కైబిలీ (Cybelee) ఆరాధనలు అనటోలియాలోనే మొదలయ్యాయి.

19) ఎలక్ట్రమ్‌తో చేసిన నాణెములను టర్కీలోని సార్డిస్‌లో ప్రవేశపెట్టారు.

20) అలెగ్జాండర్ కత్తితో గార్డియన్ ముడిని నరికింది 'అంకారా' సమీపంలో.

21) టర్కిష్ రగ్గులలో వాడే డబుల్ ముడిని గార్డియన్ నాట్ అంటారు.

22) బైబిల్‌లో వర్ణించబడిన నదుల జన్మస్థానం (డిక్లె, ఫిరాత్) – టర్కీ తూర్పుకొండలు.

23) ఎపొకాలిప్స్ ఏడు చర్చిలు – టర్కీలోనే ఉన్నాయి.

24) King of trains and train of kings - ఓరియంట్ ఎక్స్‌ప్రెస్ – పారిస్ ఇస్తాంబుల్‌ల మధ్య పయనించేది (1883–1977). ప్రముఖ నవలా రచయిత్రి అగాథాక్రిస్టీ ఈ రైలులో ప్రయాణించింది.

25) 9000 రకాల పుష్పాలు, 450 రకాల పక్షులున్న ఏకైక దేశం టర్కీ.

26) ప్రవక్త అబ్రహాం టర్కీలోని సాన్లియుర్ఫాలో జన్మించాడు.

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's narration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్థానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book that has reached many places. (Sankaracharya's mystic poems explained and translated in modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam in simple, lucid English. The second revised edition with commentary is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

**<u>బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:</u>**

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బున్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు–మని–షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్–గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడినది..

36. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

37. **కుయ్యోమొర్రో శతకం** (ఛందోబంధ రహితం)

38. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

39. **భైరవ శతకం** (విభజనానంతర కవిత్వం)

40. **Bouquet of Telugu Songs and Lyrics (Telugu Learning Kit)**

41. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

42. **మణిమేఖల** – 'శిలప్పదికారం' తరువాత ఘట్టం. శాత్తనార్ రచనకు తెలుగు అనువాదం.

## త్వరలో...

**43.** **కలలు-విశ్లేషణ - స్వప్నశాస్త్రం రెండవభాగం (త్వరలో)**

**44.** **క్రీస్తు నడచిన దారి -** కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం. **(త్వరలో)**

**45.** **The Poems of Kuppam -** సీతారాం రచనకు ఇంగ్లీషు అనువాదం- **'Montages'.**

**46.** **దళిత వ్యాకరణం (The broken grammar) -** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**47.** **మాకూ ఓ భాష కావాలి (We need a language)-** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**48.** **అగ్నివృక్షం (The tree of Fire)-** ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య రచనకు ఇంగ్లీషు అనువాదం.

**49.** **రక్తకాసారం (The Blood Pond)-** అంపశయ్య నవీన్ ప్రఖ్యాత నవలకు ఇంగ్లీషు అనువాదం.

**50.** **Eighteen English Poets** - తెలుగులో **(త్వరలో)**

**51.** **మస్నవి -** మౌలానా జలాలుద్దీన్ రూమి అలౌకిక ద్విపదలు- తెలుగులో (త్వరలో)

**52.** **This is no streaking -** K.K. Menon Stories into English.

**53.** **రసధుని -** మూడు శతాబ్దాల, రెండువందల సంవత్సరాల (1770-1970) రష్యన్ కవిత్వ ప్రవాహం.

**54.** **కాయగూర శతకం -** 'తినబోతూ రుచి అడగనేల'


**55.** **అయ్యబాబోయ్ శతకం -** వర్తమాన రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాలు.

ప్రపంచ సాహిత్యం-20

మౌలానా జలాలుద్దీన్ రూమి

# మస్నవి

(అలౌకిక ద్విపదలు - మొదటి భాగం)



డాక్టర్ లంకా శివరామప్రసాద్